
గ్రామనామాలు

(ఆంధ్రప్రదేశ్)



రచన, సేకరణ :

వాండ్రంగి కొండలరావు



గ్రామనామాలు

(ఆంధ్రప్రదేశ్)



రచన, సేకరణ :

వాండ్రంగి కొండలరావు

నామ విజ్ఞానవేత్త, వరిష్ఠ పాత్రికేయుడు

గ్రామనామాలు

© వాండ్రంగి కొండలరావు

ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 2022
ప్రతులు : 1000
అక్షరాలంకరణ : చందన రవీంద్ర
ముఖచిత్రం : మణిపాత్రుని నాగేశ్వరరావు
వెల : 200 /-
పుటలు : 216

ప్రతులకు :
వాండ్రంగి రమాదేవి
w/o. కొండలరావు
పోస్టాఫీసు వీధి, పొందూరు
శ్రీకాకుళం జిల్లా - 532 168
సెల్ : 94905 28730

టైటిల్ సెట్టింగ్ :
స్వర్ణాక్షరి గ్రాఫిక్స్
విజయవాడ, సెల్ : 98486 71569

ప్రింటింగ్ :
వనజా ఆఫ్‌సెట్, విజయవాడ
ISBN 978-93-5578-788-0



అవధాన సరస్వతీ పీఠం

అవధాన సమాస్రఫటి - బృహత్ ద్విసహస్రావధాని



ఆశీరభినందనమ్

శ్రీ వాండ్రంగి కొండలరావు గారు నిరంతరం ఏదో ఒక క్రొత్తదనం తన రచనలలో చూపించాలి అన్న తపన కలిగిన పాత్రికేయులు. ఆయన ఇంతకుమునుపు **"ఊరు - పేరు"** అన్న పుస్తకం రచించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో దానిని ప్రకటించారు.

ఇప్పుడు **"గ్రామనామాలు"** అన్న పుస్తకం రచించారు. దాదాపు రెండువందలకు పైగా పుటలు కల ఈ పుస్తకంలో *బాలనీమ, పాంచాలి, పెండ్లిమర్రి, చోద్యం, కామధేనువు, వానపాముల, సంక్రాంతిపల్లి* - ఇలాంటి వందలకొలది ఊళ్ళపేర్లు - ఏలా ఏర్పడ్డాయి వాటి నేపథ్యం ఏమిటి అన్న విషయాలు సాధికారకంగా రాశారు. ఇందులో **"కడవకొలను (కడవకల్లు)"** అన్న మా ఊరు కూడా ఉంది.

గ్రామనామాలను ఆయన వివరించిన తీరు దాదాపుగా సమన్వయంగానూ, సమంజసంగానూ బుద్ధికి అనిపిస్తున్నాయి. ఒక్కొక్క ఊరిపేరు విన్నప్పుడు లేదా ఆ ఊరిపై ప్రయాణం చేస్తున్నప్పుడు, ఆ పేరు చదివినప్పుడు ఈ ఊరికి ఈ పేరు ఎందుకొచ్చిందో అని సహజంగానే అనిపిస్తుంది. అలాంటి సందేహాలకు సమాధానంగా, పరిశోధనాత్మకంగా వీలైనంత ఔచిత్యం ఉండేటట్లుగా, వివరణాత్మకంగా ఈ పుస్తకం రచించినందుకు **శ్రీ వాండ్రంగి కొండలరావు** గారిని నేను ఆశీర్వదిస్తున్నాను.

తేదీ : 22-02-2022

ఆశీర్వచనములతో
మాడుగుల నాగఫణి శర్మ

ప్లాట్ నెం. 42, శారదాబాద్, (ఎన్.ఎ.సి.), సైనిక్ పురి రోడ్, హైదరాబాద్ - 500 084, తెలంగాణ, ఇండియా.
ఫోన్: 040- 2311 6277, 2311 6499, సెల్: 9849744556, 9989773849.
E-mail: nagaphanisarmamadugula@gmail.com, Web: www.avadhanasaraswathipeetham.com




డా॥ దీర్ఘాశి విజయభాస్కర్
కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత,
పూర్వ సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ,
ఆంధ్రప్రదేశ్

అనితర సాధ్యమైన కృషి

మిత్రుడు వాండ్రంగి కొండలరావు చేసిన కృషి అనితర సాధ్యమైంది. ఒక మనిషి గురించి చెప్పాలంటేనే చాలా కష్టం. అలాంటిది ఒక గ్రామం గురించి అందులోనూ ఆ ఊరికి ఆ పేరు ఎలా వచ్చింది ఎన్ని మార్పులకు గురయ్యిందో చెప్పడం ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకు ఎంతో పరిశోధన కావాలి. ఆ పని పట్ల పూర్తి అంకితభావం ఉండాలి. కొండలరావు గారు ఈ లక్షణాలన్నీ సంపూర్ణంగా కలిగిన వ్యక్తి. అందుకే ఇంతకు ముందు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ గ్రామాలకు సంబంధించిన చారిత్రక అంశాలతో 'ఊరు-పేరు' అనే గ్రంథాన్ని వెలువరించారు. ఆ గ్రంథానికి నిర్విరామ కృషి, పట్టుదల, విషయ సేకరణ అవిశ్రాంతంగా సాగింది. ఇప్పుడు 'గ్రామ నామాలు' (ఆంధ్రప్రదేశ్) పేరుతో మరో గ్రంథాన్ని సిద్ధం చేసారు. ఇదొక ప్రయాణం, అంతర్గత గమనం. ఏ ఊరు ఎలా పుట్టిందో దాని మూలాలు, సాంస్కృతిక బీజాలు కలిపి ప్రపంచానికి తెలియజెప్పారు. భారత దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ చరిత్ర అంతర్లీనంగా ఉంది. సుదీర్ఘమైన కాలగమనంలో అనేక పాలనా, సాంస్కృతిక మార్పులకు లోనైంది మన రాష్ట్రం. వీటి ప్రభావం మనకు గ్రామనామాల మీద స్పష్టంగా కనిపిస్తుంది. వాటిని

ఎంతో సమర్థవంతంగా వెలికి తీసారు. కొన్ని పేర్లు సాంస్కృతిక పేర్లతో ఏర్పడ్డాయి. వాటిని క్షుణ్ణంగా అర్థం చేసుకొని విడమరచి చెప్పారు. సరిహద్దు గ్రామాలపై పక్క రాష్ట్ర భాషల ప్రభావం పడుతుంది. తెలుగు పదం సమీప రాష్ట్ర భాషా ప్రభావానికి లోనవుతుంది. ఆ ప్రభావాన్ని వివరించడంలో ఎంతో ప్రతిభ చూపించారు. చరిత్రలో జరిగిన కొన్ని

అనుకోని సంఘటనల వల్ల కొన్ని పేర్లు వచ్చాయి. పండుగలు, పర్వదినాలను పురస్కరించుకొని మరికొన్ని పేర్లు వచ్చాయి. వాటన్నింటినీ ఎంతో చాకచక్యంగా విపులీకరించారు రచయిత. భాషా శాస్త్రం, సాంస్కృతిక నేపథ్యం, చారిత్రక అవగాహన, విషయ పరిజ్ఞానం, సమ్యక్ పరిశీలనం మెండుగా ఉన్నాయి ఈ రచయితలో. అందుకే ఎవరూ పట్టించుకోని అంశాన్ని చాలా కష్టతరమైన విషయాన్ని భుజానకెత్తుకొని ఈ రాష్ట్రంలోని తన ఊరెలా పుట్టిందో ? ఏ రాజకీయ సాంస్కృతిక నేపథ్యంలో ఆ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో సహేతుకంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పౌరుడు తన గ్రామ స్వరూప జ్ఞానాన్ని పొందే అవకాశం కొండలరావు కలిగించారు. ఇదొక అద్భుతమైన ప్రయత్నం, అనితర సాధ్యమైన కృషి.





డా॥ దామెర వెంకట సూర్యారావు

ఎం.ఏ, పిహెచ్.డి

పూర్వ తెలుగు శాఖాధిపతి, బి.వి.కె కళాశాల

విశాఖపట్నం

గ్రామం ఆయన జీవన వేదం

ఊరు చక్కని అచ్చ తెనుగు మాట. ఏ ఊరి జనాన్ని పలకరించినా ఎన్నో ఊసులు. ఆ ఊరి చరిత్ర కథలు, గాథలు వినిపిస్తాయి. ఇంటింటి కథ లాగూ ఊరుఊరుకీ చరిత్ర ఉంటుంది. ఆ చరిత్రను అందుబాటులో ఉన్న వనరుల నుండి వెలికితీసి తెలుగు పాఠకులకు, పుస్తక ప్రియులకు రుచివంతంగా అందించడంలోసిద్ధహస్తుడిగా ఇప్పటికేనిరూపించుకున్న పరిశోధకుడు కొండలరావు. అన్ని జిల్లాల గ్రామనామాలపై కొందరు పరిశోధనతో డిగ్రీలు పుచ్చుకుంటే, కొండలరావు మాత్రం తన అన్వేషణతో మొత్తం ఆంధ్రప్రదేశ్ గ్రామనామాలనే చుట్టుముట్టి ఊరి పేరు వెనుక మూలాల్ని భాషా శాస్త్రీయ పద్ధతుల్లోంచి, జనం మాటల్లోంచి, పెద్దల అభిప్రాయాల్లోంచి ఇతరత్రా వెలికితీసి ముచ్చటగా అందించారు. మాన్యులు, సామాన్యులు మెచ్చుకోదగిన విశిష్ట రచన. ఈ ప్రయత్నాన్ని ప్రజలు, విశ్వవిద్యాలయాలు గుర్తించవలసిన అవసరం ఉంది. ఈ పొత్తం జనామోదం పొందగలదని ఆశిస్తూ...



పరిమి శ్రీవల్లి

గ్రంథ పాలకురాలు,

సారస్వత నికేతనము (గ్రంథాలయం)

వేటపాలెం, ప్రకాశం జిల్లా,

సెల్ : 99630 31913

రమణీయం - గ్రామాయణం

నామ విజ్ఞానంలో ముఖ్య విభాగమైన స్థలనామ విజ్ఞానాన్ని (టోపోనమి) అవుపోశన పట్టిన నామవిజ్ఞానవేత్త, పత్రికారచయిత వాండ్రంగి కొండలరావు కృషి అభినందనీయం. రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకొని ''గ్రామనామాలు'' పేరుతో ఓ పుస్తకాన్ని తీసుకొని రావడం విశేషం. గతంలో ''ఊరు - పేరు'' గ్రంథాన్ని రాసి ఆంధ్రప్రవాసాంధ్ర ప్రాంతాల్లో ఆయన గుర్తింపు పొందారు. రచయిత ఊహాలోకాల్లో విహరించకుండా జనవాహిని మనోగతానికి అక్షర రూపం ఇచ్చారు. తదనుగుణంగా గ్రామాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో రాశారు. మరో పక్క కైఫియత్తులు, పరిష్కరించిన శాసనాలను, ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేసినట్టు స్పష్టమవుతోంది. వందలాది గ్రామాల పేర్ల వెనుక గల పూర్వ రంగాన్ని వెలుగులోకి తేవడం గొప్ప విశేషం. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడంలో రచయిత చేసిన కృషి మెచ్చదగినది. ఆకాశంలో నక్షత్రాలు లెక్కపెట్టే సాహసం చేశారేమో అనిపిస్తుంది. అయితే పుష్పక విమానంలో ఎంత మంది కూర్చున్న ఇంకా ఖాళీ ఉంటుందనేది వేరే విషయం. ఈ రచయిత సాహసాన్ని త్రికరణ శుద్ధిగా అభినందిస్తున్నాను.

విషయ సూచిక

1)	పల్లెలే మల్లెలై	...	9
2)	నామ విజ్ఞాన పరిమళం	...	10 - 11
3)	గాంధీజీ అభిమతంలో	...	12
4)	వందన సమర్పణ	...	13 - 14
5)	ఒడిషా భాషా ప్రభావంతో 'ఆం'	...	15
6)	సంక్రాంతి పేరుతో	...	16 - 17
7)	ఉత్తరాంధ్రకే పరిమితం వలస పల్లెలు	...	18
8)	సముద్రం పేరుతో	...	19
9)	ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా	...	20 - 48
10)	ఉమ్మడి విజయనగరం జిల్లా	...	49 - 59
11)	ఉమ్మడి విశాఖపట్నం జిల్లా	...	60 - 76
12)	ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా	...	77 - 87
13)	ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా	...	88 - 96
14)	ఉమ్మడి కృష్ణా జిల్లా	...	97 - 113
15)	ఉమ్మడి గుంటూరు జిల్లా	...	114 - 127
16)	ఉమ్మడి ప్రకాశం జిల్లా	...	128 - 139
17)	ఉమ్మడి నెల్లూరు జిల్లా	...	140 - 148
18)	ఉమ్మడి చిత్తూరు జిల్లా	...	149 - 161
19)	ఉమ్మడి కర్నూలు జిల్లా	...	162 - 178
20)	ఉమ్మడి కడప జిల్లా	...	179 - 198
21)	ఉమ్మడి అనంతపురం జిల్లా	...	199 - 213
22)	పరిశీలించిన గ్రంథాలు	...	214
23)	రచయిత పరిచయం	...	215 - 216



వాండ్రంగి కొండలరావు

రచయిత

పల్లెలే మల్లెలై ... బస్తీలే బంతి పూలై....

పల్లెలే మల్లెలై....బస్తీలే బంతిపూలై.....నగరాలే.... నవపారిజాతాలై .... పరిమళించాలని నా అభిలాష.... నిజానికి ఇవన్నీ జాతికి పట్టుకొమ్మలు... సంస్కృతికి నజరానాలు. సంప్రదాయాలకు దిక్సూచిగా నిలుస్తాయి. ప్రాచీన, నవీన నాగరికతలకు వారధిగా ఉంటున్నాయి. ఓ దేశ ప్రగతి లేదా రాష్ట్ర ప్రగతి వీటిపై ఆధారపడి ఉంటాయనేది అక్షర సత్యం.

ప్రతి వ్యక్తి ఏదో ఓ గ్రామంలో పుట్టక తప్పదు. పెరగక తప్పదు. తన చుట్టూ ఉన్నవారితో బంధాలు, అనుబంధాలు తప్పవు. కొన్ని సందర్భాల్లో విభేదాలు తప్పదు. అంచేత ఊరు అనేది ప్రకృతి అందాలను మన కళ్ల ముందుంచే ఓ రమణీమ దృశ్యం. బాలసారె నుంచి అంతిమ శ్వాస విడిచే వరకూ గ్రామంతో అనుబంధం కొనసాగుతుంది. కన్నతల్లి లాంటి ఊరిలో గల బాంధవ్యాలు మరపురానివి. ఉద్యోగ, ఉపాధి కోసం దూరప్రాంతాలకు, చివరకు విదేశాల్లో స్థిరపడిన వారు పండగలకు శుభకార్యాలకు, అశుభకార్యాలకు సొంత ఊరు వస్తున్న వైనం తెలిసిందే. సొంత ఊరిలో సంబంధం ఎలా ఉంటుందో చెప్పడానికి ఉదాహరణలు కోకొల్లలుగా ఉంటాయి.

జన్మనిచ్చిన అమ్మ, నడిపించిన నాన్న, పుట్టిన ఊరు తిరిగిన ప్రదేశాలు జీవితంలో ఎన్నో మధుర స్మృతులుగా ఉంటాయి.

నామ విజ్ఞాన పరిమళం

నామ విజ్ఞానం నేడు ఎంతో ప్రజాదరణ పొందుతోంది. దీన్ని ఆంగ్లంలో 'ఓనమాస్టిక్స్' అంటారు. అందులో వ్యక్తి నామ విజ్ఞానాన్ని 'ఆంత్రోపొనమీ' అని పేర్కొంటారు. కాగా స్థల నామ విజ్ఞానాన్ని 'టోపోనమీ' అని అంటారు. ఈ అంశం అత్యంత క్లిష్టతరమైనది. అయితే క్లిష్టతను ఇష్టంగా మార్చుకొని నవీనోత్సాహంతో గ్రామ నామాలు అనే పుస్తకాన్ని ఏళ్ల తరబడి శ్రమించి పూర్తి చేశాను. 'ఆకాశానికి నిచ్చెన వేయద్దని పలువురు సాహితీ మిత్రులు సున్నితంగా హెచ్చరించినప్పటికీ ప్రయత్నాన్ని విరమించకుండా ఎంతో కొంత సాహసం చేశాను. తొలుత ''ఊరు - పేరు'' (ఆంధ్రప్రదేశ్) పుస్తకాన్ని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 2017లో విడుదల చేశాను. ఈ పుస్తకానికి పాఠకుల నుంచి అనూహ్యంగా స్పందన వచ్చింది. ఈ స్ఫూర్తితోనే 'గ్రామ నామాలు' అనే పుస్తకాన్ని మీ ముందుంచుతున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకొని అన్ని జిల్లాల్లో ఎంపిక చేసుకున్న పల్లెలకు, బస్తీలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో సంక్షిప్తంగా వివరించాను. ఈ ప్రయత్నంలో కార్యసిద్ధికి గాను అన్ని జిల్లాలల రచయితలు, అధికారులు, ఉద్యోగులు, సామాజిక వేత్తలు తమ నిండయిన సహకారం అందించారు. వరిష్ఠ పాత్రికేయునిగా, పుస్తక రచయతగా, వ్యాస రచయితగా ఉన్న నేను కమ్యూనికేషన్ సామర్థ్యాలను పెంచుకొని సమాచారాన్ని సేకరించాను. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందనే సూక్తిని ఆచరణలో పెట్టినందున నేను విజయపథంలో నా లక్ష్యాన్ని సింహభాగం పూర్తి చేసిననట్టు భావిస్తున్నాను.

ఒక గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే సమాచారం సేకరించడానికి ఆనేక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. భాషా సాహిత్యాలపై పట్టు ఉండాలి. నిరంతర అధ్యయనం వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలి. చరిత్ర, సంస్కృతి అవుపోశన పట్టాలి. అన్నింటికి మించి క్షేత్ర పర్యటనలు చేయాలి. వ్యక్తులు, వృక్ష జంతువులను బట్టి, నేలల తీరును అనుసరించి, పంటలు కొండల పేరిట కోటలు, దేవాలయాలు, గ్రామ దేవతలు, వృత్తులు, నక్షత్రాలు, పశువులు, పక్షులు, మృగాలు, పండుగలు, పబ్బాలు, ఇంటి పేరు మతాలు, వంశాలు, కొలనులు, కాలువలు, వంశ నామాదులను అనుసరించి గ్రామాల పేర్లు వస్తుంటాయి. సంస్థానాధీశులు, రాజరికం, ఇతిహాసాలు తదితర విషయాలను బట్టి కూడా గ్రామాలకు పేర్లు వస్తుంటాయి. అలాగే కొన్ని గ్రామాలకు కాలానుగుణంగా పేర్లు మారుతుంటాయి. వలసలు తదితర కారణాల వల్ల ఒక పేరుతో రెండు మూడు లేదా అంతకంటే ఎక్కువ గ్రామాలు రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు కొత్తూరు అనే పేరుతో లెక్కలేనన్ని గ్రామాలున్నాయి. ఒకే పదంతో ఉన్న గ్రామాల, రెండు పదాలతో, మూడు పదాలతో, నాలుగు పదాలతో ఉన్న గ్రామాలు దర్శనమిస్తున్నాయి. పూండీ, దర్శి, ఛత్రం తదితర గ్రామలు ఏకపదంతో ఉన్నాయి. రెండు పదాలతో ఉన్న గ్రామాల్లో చిలకలపల్లి, రెంటచింతల, పర్వతాలపేట తదితరమైనవి. మూడు పదాలతో ఉన్న గ్రామాల్లో భావదేవరపల్లి, సఖినేటిపల్లి, కుక్కరాజుపల్లి, గూడేంకొత్తవీధి, నాలుగు పదాలతో ఉన్న గ్రామాల్లో వీరకుమారయాచ సముద్రం, గుళ్లసీతారామపురం తదితరమైనవి. కాగా చిత్తూరు జిల్లాలో నగరి మండలంలో ఆరు పదాలతో ఉన్న గ్రామం ఉంది. అదే వెంకట నరసింహరాజువారిపేట. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 28,123 గ్రామాలున్నాయి.

గాంధీజీ అభిమతంలో..

గ్రామాలు భారతదేశానికి ఆత్మవంటివని జాతిపిత గాంధీజీ అభివర్ణించేవారు. అన్ని దేశాలలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉంటాయి కదా. అయితే భారతీయ గ్రామానికి ఒక ప్రత్యేకత ఉన్నది. అది జాతీయ సంస్కృతికి కేంద్ర బిందువుగా నిలిచింది. ప్రతీ గ్రామానికి కొన్ని వందల వేల సంవత్సరాల చరిత్ర ఉన్నది. మన వేద సాహిత్యంలో ఇతిహాసాల్లో, ప్రబంధాల్లో గ్రామాల ప్రసక్తి ప్రముఖంగా ఉంది. తొలి నాళ్లలో గ్రామాన్ని జానపదం అనేవారు. అందులో నివశించేవారిని జానపదులని వ్యవహరించేవారు. కౌటిల్యుని అర్థ శాస్త్రంలో గ్రామ పాలన గూరించి సమగ్రమైన సమాచారం ఉందనే విషయం తెలిసిందే. మహాత్ముడు కలలుగన్న మరో ప్రపంచమే గ్రామ స్వరాజ్యం. గ్రామాలు స్వయం పోషకత్వం పొందిననాడే జాతి సుసంపన్నమవుతుందని ఆయన భావించేవారు. ఈ విషయాన్ని తన ఆధ్వర్యంలోని 'యంగ్ ఇండియా' పత్రికలో పలు కథనాలను రాశారు. 14వ శతాబ్దానికి చెందిన ప్రబంధ పరమేశ్వరుడైన ఎర్రన , పాకనాటి సీమలోని స్వగ్రామమైన గుడ్లూరులోనే (ప్రకాశం జిల్లా) జన్మించినట్టు తాను రాసిన అరణ్యపర్వ శేషాన్ని పూర్తిచేస్తూ ఈ గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామిని కీర్తించాడు. అలాగే 'ఆంధ్రవిష్ణు పురాణం' రాసిన వెన్నెలకంటి సూరన స్వగ్రామం గూరించి ప్రస్తావించాడు. ఇలా ఎందరో నాటి మహా రచయితలు తమ ఊరి పేర్లను ప్రస్తావించి సంగతి గుర్తుంచుకోవలసిందే. వారి గ్రామం పట్ల తమకున్న మమకారాన్ని చాటుకున్నారు.



వందన సమర్పణ



నేను రాసిన ''గ్రామనామాలు (ఆంధ్రప్రదేశ్) పుస్తకంపై తమ అమూల్యమైన అభిప్రాయాలను రాసి ఆశీర్వదించిన ద్విసహస్రావధాని, అవధాన సరస్వతి డా॥ మాడుగుల నాగఫణిశర్మ గారికి, కేంద్ర సంగీత, నాటక అకాడెమి పురస్కార గ్రహీత, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక పూర్వ సంచాలకులు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ గారికి, విశాఖ బి.వి. కె.కళాశాల తెలుగు శాఖ పూర్వ అధిపతి డా॥ డి.వి. సూర్యారావు గారికి, వేటపాలెం సారస్వత నికేతనం గ్రంథ పాలకురాలు శ్రీమతి పరిమి శ్రీవల్లి గారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు సమర్పిస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తూ గత మూడేళ్లుగా నేను రాసిన ఊరిపేర్లపై ధారావాహికంగా ప్రచురిస్తున్న విశాఖ సంస్కృతి సంపాదకులు శ్రీ శీరేల సన్యాసిరావు గారికి ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు అందజేస్తున్నాను.

శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, కడప జిల్లా సింహాద్రిపురం తహశీల్దార్ షేక్ మహబూబ్‌భాషా, శ్రీకాకుళం సమాచార, పౌర సంబంధాల శాఖ ఎ.డి ఎల్.రమేష్, పెండ్లిమర్రి ఎ.ఎస్.వో ఎం.వి.రమేష్ కుమార్, సాహితీ బంధువు ఎన్.ఎన్.రావు (చిన ఓరంపాడు) కంకిపాడు పంచాయితీ కార్యదర్శి దర్శి శివకుమార్, కర్నూలు ఐ.సి.డి.ఎస్ పి.డి. కొండా ప్రవీణ, నెల్లూరు ఐ.సి.డి.ఎస్ పి.డి రోజ్‌మెండ్, ఎ.పి వె.పా నెల్లూరు జిల్లా శాఖ ఉపాధ్యక్షులు బూదాటి బాలకోటీశ్వరరావు (కోటిబాబు), కొయిలకుంట్ల ఎ.సి.డి.పి ఎడ్ల పద్మావతి, కొలిమికుంట్ల ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ నివర్తి శ్రీవాణి, రాయల చెరువు వి.ఆర్.వో ఎం. కలువాయప్ప, శ్రీకాకుళం జిల్లా

సీతంపేట ఎన్.ఆర్.ఇ, జి.ఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పాడి వరప్రసాదరావు, కర్నూలు జిల్లా లద్దగిరి కార్యదర్శి బి.వేంకటేశ్వర్లు, ద్వారరా తిరుమల దేవస్థానం ఛైర్మన్, మైలవరం జమీందారు, యస్.వి. సుధాకరరావు, గణేష్ బెహరా (సర్వశిక్షా - విజయవాడ), ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌లు దాసరి ఆళ్వారస్వామి (కృష్ణా), దాసరి కృష్ణారెడ్డి (చిత్తూరు), విశ్రాంత ఉపన్యాసకులు డా|| బీరం సుందరరావు, యార్లగడ్డ వెంకటరమణ, దొరసానిపల్లి వాణిజ్యవేత్త గుంగల వెంకటకొండారెడ్డి, , శ్రీకాకుళం డా|| బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంటు ప్రొఫెసర్ జి.వి. లీలాప్రసాదరావు, సీనియర్ పాత్రికేయులు వి.శశిభూషణరావు, శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక అధ్యక్ష:, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి గార్లకు, పి.శివాజీ పట్నాయక్, సి.ఆర్.పిలు మజ్జి గణపతి(వంగర), బండి రాజశేఖర్ (బండి ఆత్మకూరు), వై.నారాయణస్వామి (పుట్లూరు), బి. శివరామకృష్ణ భరత్ కుమార్ (తుని), గ్రామ కార్యదర్శులు ఎ.జె.ల్ నరసింహారావు (వానపాముల), పెంట తిరుపతిరావు (నిడగల్లు), కోల శ్రీను (వసంత), వి.ఆర్.ఓలు జి.జాన్సీ (కాకులపాడు), రామాంజనేయులు (హోలహర్వి), యాడికి ఎమ్మార్సీ ఉద్యోగి మతకాల విశ్వనాథ్, మహానంది ఐ.సి.డిఎస్ సూపర్ వైజర్ యు.సుగుణమ్మ, వాసాపరమేశ్వరి (కన్నెమడుగు), పుస్తక ముఖచిత్రం అందించిన ప్రముఖ చిత్రకారుడు మణిపాత్రుని నాగేశ్వరరావు గారికి, అక్షరాలంకరణ చేసిన చందన రవీంద్రకు, రాష్ట్ర గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డబ్బీరు గోవిందరావు, పుస్తకాన్ని అందంగా ముస్తాబు చేసిన ''స్వర్ణాక్షరి'' గ్రాఫిక్స్ వారికి, చక్కగా ముద్రించిన వనజ ఆఫ్‌సెట్ (విజయవాడ) వారికి ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. ■

వాండ్రంగి కొండలరావు

ఒడిషా భాషా ప్రభావంతో... 'ఆం'

ఒడిశా భాషా ప్రభావం శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రామ నామాలపై ఉందని చెప్పడానికి ''ఆం'' శబ్దం ఓ పెద్ద ఉదాహరణ. 1950 ఆగస్టు 15 శ్రీకాకుళం జిల్లా అవతరించింది. ఒడిశా గంజాం జిల్లా నుంచి 6 తాలూకా కేంద్రాలు విశాఖపట్నం జిల్లా ఉత్తర భాగంలో అయిదు తాలూకాలను ఇందులో విలీనం చేసిన సంగతి తెలిసిందే. సహజంగానే ఒడిశా భాషా ప్రభావం ఈ జిల్లాలోని గ్రామనామాలపై పడింది. అయితే ముఖ్యంగా 'ఆం' అనే శబ్దం జిల్లాలోని గ్రామనామాలకు చివరిన చేరింది. ఒడిశాలోని గంజాం (గంజాం మాండలికం) ప్రభావం ఉతరాంధ్ర జిల్లాలో ఎక్కువ. గంజాం అనే పదం గంజ్-ఎ.-ఆం పర్షియన్ భాష నుండి వచ్చింది. 'ఆం' అంటే ప్రదేశం అని అర్థం. అలాగే గంజాం మాండలికంతో శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం, నడగాం, మడపాం, రాజాం, లంకాం, నివగాం, తండ్యాం, జర్జాం, అలికాం, కొయ్యాం, పాతకుంకాం, కొత్తకుంకాం, గుమడాం, కర్లాం, కంచరాం, బొద్దాం, సుసరాం, బెలమాం, బురిడికంచరాం, ఆగూరు కంచరాం, యరగాం, లయిదాం, తొగరాం, కప్పరాం, గుమడాం, పర్లాం, కిల్లాం, కరగాం, కొవిలాం, సిద్దాంతం, తులసిగాం, తలగాం, దేరసాం, లాభాం, బాణాం, హొంజరాం, గురవాం, జి.సిగడాం, కమ్మసిగడాం, నిద్దాం, బడగాం, నందిగాం, అంబుగాం, నౌగాం, కొలిగాం ఇలా వందలాది గ్రామాలు దర్శనమిస్తాయి. పొరుగున ఉన్న విజయనగరం జిల్లాలో తెర్లాం, కర్లాం, కుమరాం, శివరాం, దువ్వాం వంటి గ్రామాలున్నాయి. ■

సంక్రాంతి పేరుతో

సంక్రాంతి పండుగ తెలుగు వారికి అతి ముఖ్యమైనది. హరిదాసుల సంకీర్తనలతో, గంగిరెద్దుల వాళ్లతో పల్లెలు, బస్తీలు కళకళలాడతాయి. దేశ, విదేశాల్లో ఉన్నవారు సైతం సొంత ఊరికి చేరుకొని ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడం తెలిసిందే. ఈ పెద్ద పండుగపై ఉన్న మక్కువతో మన రాష్ట్రంలో కొన్ని పల్లెల సంక్రాంతి పేరు కలిసొచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవడం విశేషం. ఆ పల్లెల పేర్ల వెనుక గల నేపథ్యం గూర్చి గ్రహిద్దాం.

1. సంక్రాంతిపల్లి (చిత్తూరు జిల్లా)

సంక్రాంతిపల్లి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో ఉంది. జనాభా 1900. సంక్రాంతి పండగపై ఉన్న మమకారంతో తమ పల్లెకు నాటి పెద్దలు ఈ పేరును పెట్టుకొన్నారు. ఈ గ్రామంలోని వినాయక, శ్రీరామ, శ్రీకృష్ణ, గంగమ్మ, ద్రౌపది అమ్మ ఆలయాల్లో సంక్రాంతి తదితర పర్వదినాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. తమ ఊరికి ఇంత మంచి పేరు ఉండడం గర్వకారణంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. సంక్రాంతినాడే పల్లె ఏర్పాటైందంటారు ఆ గ్రామ వాసులు.

2. సంక్రాంతిపల్లి (నెల్లూరు జిల్లా)

సంక్రాంతి పేరుతోనే నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో మరో గ్రామం ఉంది. పురోహితుల సలహా మేరకు తమ గ్రామానికి సంక్రాంతిపల్లి అనే పేరును ఆనాటి పెద్దలు ఖరారు చేశారు. ఇలా తమ పల్లెకు సంక్రాంతిపల్లి పేరు వచ్చిందని అక్కడి పెద్దలు లేదా వృద్ధులు రచయితకు వివరించారు. గ్రామ జనాభా 300. చెన్ను బాలకృష్ణారెడ్డి

(బెంగళూరు) కుటుంబికులు సొంత ఊరిపై మక్కువతో సంక్రాంతి నాడు భారీ ఎత్తున సంక్రాంతిపల్లితో సహా మరో రెండు గ్రామాల్లో వస్త్రాలను పంపిణీ చేస్తుంటారు.

3. సంక్రాంతిపాడు (గుంటూరు జిల్లా)

సంక్రాంతిపాడు గుంటూరుజిల్లా నాదెండ్ల మండలంలోని ఓ ఊరు. జనాభా 2786. ఈ పల్లెకూడా సంక్రాంతి రోజునే ఆవతరించిందని స్థానికులు పేర్కొన్నారు. వినాయక, రామమందిరం, ఆంజనేయ ఆలయాల్లో ఆరాధనలు జరుపుతారు. పాటి నేలలు, గరుగు నేలలతో ఈ గ్రామం ఉంటుంది. అంచేత ఊరి పేరు చివరి పదంగా 'పాడు' చేరింది. ఒకప్పుడు జైనులు ఈ పల్లెలో కొన్నాళ్లు నివాసం ఉన్నందున 'పాడు' అనే పదం చేరినట్లు మరికొందరు వివరించారు. జైనుల నివాసం ఉన్న అనేక ఊళ్లకు ఉత్తర పదంగా పాడు ఉంటుందని భాషా శాస్త్రవేత్తల మనోగతం. సంక్రాంతి పాడును సంకురాతత్రిపాడు అని కూడా పిలుస్తారు.

భోగి పండుగ పేరుతో

భోగి అంటే భోగ, భాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం. పాడి పంటలు సమృద్ధిగా ఇండ్లకు వచ్చే శుభ తరుణం. 'భోగి' పండగ పేరు కలిసొచ్చే విధంగా విజయనగరం జిల్లా సీతానగరం మండలంలో ఊరు పేర్లు దర్శనమిస్తాయి. పెద్ద భోగిలి, చిన భోగిలి గ్రామాలు సువర్ణముఖి నదీ తీరంలో ఇరుగు, పొరుగు పల్లెలుగా ఉన్నాయి. ఈ రెండు పల్లెలు ఏటికి ఇరువైపులా ఉన్నాయి. ఈ రెండు పంచాయితీ కేంద్రాలే. పెద్ద భోగిలి జనాభా 10 వేలు, కాగా చిన భోగిలి జనాభా 2,500. ఈ రెండు గ్రామాల్లోని ఆలయాల్లో భోగి పండగనాడు పూజలు నిర్వహిస్తారు. ■

ఉత్తరాంధ్రకే పరిమితం వలస పల్లెలు

ఉన్న ఊరు విడిచి, నురో చోట స్థిరపడటాన్ని వలస అంటారు. తాము నివాసం ఏర్పాటు చేసుకున్న పల్లెలకు చివరి పదంగా వలస అని పేరు పెట్టుకున్నట్టు స్పష్టమౌతోంది. అయితే వలసలకు పేదరికం, ఉపాధి, లేమి వాతావరణ పరిస్థితులు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. విశేషమేమిటంటే వలసలు ఉత్తర పదంగా కనిపించే గ్రామాలు కేవలం ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో మాత్రమే ఉన్నాయి. వందలాది గ్రామాలు వలసల పేరుతోనే దర్శనమిస్తాయి.

శ్రీకాకుళం జిల్లాలో ఆముదాలవలస, దేవరవలస, వెదుళ్లవలస, తండేవ వలస, కొత్తవలస, వెన్నెలవలస, కొండవలస, వత్సవలస, దళ్లవలస, పనసలవలస, మడ్డువలస, బొడ్డవలస, మొదలవలస, గరిమెళ్ల వలస, కొత్తవలస, బాలకవివలస తదితర గ్రామాలున్నాయి.

విజయనగరం జిల్లాలో కొత్తవలస, చీడివలస, గుజ్జంగివలస, చెల్లయ్యమ్మవలస, గజరాయునివలస, మెట్టవలస, రాముడువలస, అప్పన్నవలస, నిమ్మలవలస, రావివలస, పత్తికాయలవలస, వేటగాని వలస, సరాయివలస, పనుకువలస తదితర గ్రామాలు కనిపిస్తాయి.

విశాఖపట్టణం జిల్లాలో వేములవలస, తగరపువలస, తునివలస, తాళ్లవలస, నేరేళ్లవలస, మజ్జివలస, ఉగ్గినవలస వంటి గ్రామాలు ఉన్నాయి. ■

సముద్రం పేరుతో ఎన్నో పల్లెలు

రాష్ట్రంలో అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సముద్రం ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు ఎన్నో కనిపిస్తాయి. ఈ ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెరువులను సముద్రంగా పిలిచే సంప్రదాయం ఉంది. అనంతపురం జిల్లాలో బ్రహ్మసముద్రం, బుక్కరాయసముద్రం, పాల సముద్రం, కాళసముద్రం, భూపసముద్రం, మణిసముద్రం వంటి ఎన్నో గ్రామాలు దర్శనమిస్తాయి.

చిత్తూరు జిల్లాలో పెదతిమ్మ సముద్రం (పి.టి.ఎం), చినతిప్ప సముద్రం (సి.టి.ఎం), రామసముద్రం ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో త్రిపురాంతక మండలంలో రామసముద్రం, నెల్లూరు జిల్లాలో అనువసముద్రంపేట, యాచసముద్రం గ్రామాలు ఉన్నాయి. కాగా కండ్రిగలు పేరుతో చిత్తూరు, నెల్లూరు జిల్లాలో పలు గ్రామాలు కనిపిస్తాయి. శ్రీకాకుళం, విశాఖ జిల్లాలో పుట్టి పేరుతో పలు గ్రామాలు ఉన్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో పుట్టుగ కలిసివచ్చే విధంగా అనేక గ్రామాలున్నాయి. విజయనగరం జిల్లాకు సంబంధించి ఉత్తర పదంగా రేగ పేరుతో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ■

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా

బృందావనం

బృందావనం పేరు వినగానే మదిలో ఎన్నో మధురానుభూతులు మొదులుతాయి. ఈ పేరుతో ఓ పల్లె ఉంది. ఈ గ్రామం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాడు పంచాయితీ పరిధిలో ఉంది. బృందావనం కేవలం 73 ఇళ్లున్న జానపదం ఇది. యాదవ సామాజిక వర్గీయులే హెచ్చు సంఖ్యలో ఉన్నారు. యాదవులంతా శ్రీకృష్ణుని భక్తులే. అంచేత కృష్ణునిపై గల ఆరాధన భావంతో తమ ఊరికి బృందావనం అని నామకరణం చేసుకున్నారు. శ్రీ కృష్ణుడు బృందావనం విహారి కదా. ఈ పల్లె శివార్లలో గల తోటలో వీరు తరచూ సమావేశమై తమ సాధక బాధకాలను చర్చించుకుంటారు. శుభకార్యాలను నిర్వహిస్తుంటారు. వేడుకలకు ఇది వేదికగా నిలుస్తోంది. ఏమైనప్పటికీ ఇంత అందమైన పేరును ఈ గ్రామానికి పెట్టిన నాటి పెద్దలను తలుచుకుంటూ స్థానికులు మురిసిపోతుంటారు.

బాలసీమ

కళింగసీమ, రాయలసీమలానే శ్రీకాకుళం జిల్లాలో సీమ చివరి పదంగా ఉన్న ఓ పల్లె ఉంది. అదే బాలసీమ. ఈ గ్రామం నరసన్నపేట మండలంలో ఉంది. తొలుత ఈ గ్రామాన్ని పాలసీమ అని పిలిచేవారు. అయితే కాలక్రమంలో పాలసీమ, బాలసీమగా మారింది. ఆవుల సంఖ్య హెచ్చుగా ఉండటం వల్ల పాల దిగుబడి ఎక్కువగా ఉండేది. దీంతో తమ

పల్లెకు పాలసీమ అని పేరు పెట్టారు. సీమ అంటే ప్రాంతం లేదా హద్దు అని అర్థం. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. వంశధార నది పరీవాహక ప్రాంతం సరిహద్దుల్లో ఈ పల్లె ఉంది. వరి, పెసర, మినుము తదితర పంటలు పండిస్తారు. ఈ గ్రామానికి అనుబంధంగా బసివలస అనే పల్లె ఉంది.

ఉప్పినివలస

ఉప్పినివలస బూర్జ మండలంలోని ఓ పల్లె. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే .... ఉప్పు నీరుతో ఉన్నందున ఆ పేరు వచ్చింది. వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొందరు ఈ పల్లెను ఏర్పాటు చేసుకున్నారు. అందుకే వలస అనేది ఉత్తర పదంగా చేరింది. గ్రామంలో ఉప్పునీటి సమస్యకు పరిష్కారంగా ఊరి బయట రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. కుళాయిలు ద్వారా తాగునీరు అందుతోంది. ఈ పల్లెలో మల్లికార్జున చేనేత సహకార సంఘం ఉంది. మాస్టర్ వీవర్లు కూడా ఉన్నారు. ఎ.ఎన్.ఆర్ అంచు పంచెలు, జమధానీ చీరలు నేస్తుంటారు. మొత్తం 60 చేనేత కటుంబాలు ఉన్నాయని చేనేత సంఘం మాజీ అధ్యక్షులు నల్ల సోమేశ్వరరావు తెలిపారు.

సుమంతపురం

సుమంతపురం ఎల్.ఎన్.పేట మండలంలో ఉంది. ఈ గ్రామం తొలిపేరు పొదుగుపాడు. వంశధార నదికి ఆనుకొని ఉండేది. గతంలో ఈ ఊరికి వానలు, వరదలు. నదీ ప్రవాహ ఉద్ధృతికి కొన్ని నివాసాలను ఖాళీ చేయించి కొంచెం దూరం జరిపారు. ఈ ప్రాంతంలో ఉండే గ్రామ దేవత పేరు సుమంతమ్మతల్లి . ఈ దేవత పేరుతో ప్రజలు తమ ఊరికి సుమంతపురం అని పేరు పెట్టారు.

బద్రి

బద్రి సారవకోట మండలంలో ఉంది. దీని తొలి పేరు బదరీ. అయితే లోక వ్యవహారంలో క్రమేపీ బద్రిగా మారింది. తొలినాళ్లలో ఈ ప్రాంతంలో బదరీ (రేగు) చెట్లు ఎక్కువగా ఉండేవి. బదరీ ఫలాలను ఈ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం రేగు చెట్టు కాగడా పెట్టి వెతికినా దొరకవు. ఈ గ్రామ జనాభా 1675. కాగా బద్రి ఇంటి పేరుగల కుటుంబాలు యాదవ సామాజిక వర్గంలో ఉన్నాయి.

రంగోయి

రంగోయి గ్రామం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం మామిడిమెట్ట పంచాయితీ పరిధిలో తలదాచుకొంటోంది. ఎంతో చైతన్య వంతమైన పల్లెగా వాసి గాంచింది. రంగోయి గ్రామం పేరు వెనుక గల నేపథ్యం ఇది.... స్వాతంత్ర్యం రాక ముందు ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు హెచ్చు సంఖ్యలో రంగూన్ వెళ్లేవారు. అక్కడ ఉపాధి పనులు చేసుకొనే వారు. ఈ కూలీలు రంగూన్‌లో కొన్నాళ్లు తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు కూడా. తిరిగొచ్చాక ఈ ప్రాంతంలో ఓ గ్రామాన్ని నిర్మించుకున్నారు. తమకు ఉపాధి కల్పించి ఆదుకున్న రంగూన్ పేరు కలిసొచ్చే విధంగా రంగోయి అని నామకరణం చేశారు. తొలుత రంగువాయి అని పిలిచేవారు. జనవ్యవహారంలో క్రమంగా 'రంగోయి'గా స్థిరపడిరది. ఈ పల్లె మొదట్లో మందస ఎస్టేటు పరిధిలో ఉండేది. గ్రామ జనాభా 1500. ప్రముఖ జానపద సాహితీవేత్త బద్రి కూర్మారావు ఈ గ్రామానికి చెందిన వారే. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటైన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం విశిష్ట

సేవలందిస్తోంది. ప్రతి ఏటా జనవరి 12, 13 తేదిల్లో ఉత్తరాంధ్ర జానపద కళా రూపాల ప్రదర్శనను ఏర్పాటు చేసి కళాకారులను ప్రోత్సహిస్తోంది. 2004 నుంచి ఈ బృహత్తర కార్యక్రమం నీరాటంకంగా కొనసాగుతోంది.

తలతంపర

వాడుకలో తామరతంపర అనే మాట బహుళ ప్రాచుర్యంలో ఉంది. తంపర అంటే ఎక్కువగా నీరు ఇచ్చేదని అర్థం. ఏటి ఒడ్డు ప్రాంతంలోని భూమిని తంపరగా వ్యవహరిస్తారు. ఈ పదం కలిసొచ్చే విధంగా ఉన్న గ్రామం సంతకవిటి మండలంలో ఉంది. అయితే ఈ గ్రామం పూర్వ పదంగా 'తల' ఉంది. ఏటి ఒడ్డున గల గ్రామాలలో ప్రధానమైనవాటిలో ఇదొకటి అని గ్రహించాలి. తల అంటే తలమానికం అనే అర్థంలో భావించాలి. ఈ పల్లె నాగావళి నది నారాయణపురం కాలువ తీరంలో ఉంది. గ్రామ జనాభా 1055 తలతంపర పేరుతోనే ఇదే జిల్లా కంచిలి మండలంలో ఓ గ్రామం ఉంది. ఈ గ్రామ జనాభా 4416.

రుషింగి

శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలోని ఓ కుగ్రామం రుషింగి. విలక్షణమైన ఈ పల్లె పేరు వెనుక గల కథనం ఇది. నాడు ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండేది. పైగా ఇది నాగావళి నదీ తీరంలో వెలసి ఉంది. ప్రశాంతతకు మారు పేరుగా ఉండేది. అంచేత ఋషులు, యోగులు, మునులు ఇక్కడే నివశించే వారని, వీరిలో కొందరు తపోదీక్షలో ఉండే వారని స్థానికుల కథనం వల్ల తెలుస్తోంది. ఈ అంశాన్ని గమనంలోకి తీసుకొని ఈ గ్రామంలో ఏర్పాటు చేసుకున్న గృహసముదాయాలకు 'రుషింగి' అనే పేరు పెట్టినట్లు తాత ముత్తాతల నుంచి పేర్కొన్న

సమాచారం పల్ల స్పష్టమైందని గ్రామానికి చెందిన ఎల్లుమహంతి దుర్గారావు చెప్పారు. ఈ పల్లె జనాభా వెయ్యి. ఋషులు నాడు వెలసిన ప్రాంతమైనందున ఈ పల్లె ఆధ్యాత్మికతకు అగ్రతాంబూలమిస్తోంది. దుర్గాదేవి, షిరిడీసాయి, శ్రీరామ, ఆంజనేయ, సత్యన్నారాయణ స్వామి ఆలయాలు ఉన్నాయి.

పంతులపేట

మన రాష్ట్రంలో అతి చిన్న గ్రామం పంతులపేట. శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలంలో ఉంది. ఈ గ్రామంలో మూడు ఇళ్లు మాత్రమే ఉన్నాయి. జనాభా కేవలం అయిదే మాత్రమే. 16వ నెంబరు జాతీయ రహదారికి 1కి.మీ దూరంలో ఉంది. తురకలకోటకు సమీపంలో ఉంది. పంతులపేటకు ఈ పేరు ఎలా వచ్చిందంటే.... ఓ బడి పంతులు నిర్ణయించిన ముహూర్తంలో ఈ పల్లెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భాన్ని గుర్తుచేసుకునే విధంగా పంతులపేట అని నామకరణం చేసుకున్నారు. సంక్రాంతి పండగ సమయానికి మాత్రం 30 మంది వరకూ వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబికులు వస్తుంటారని గ్రామ పెద్ద రామయ్య పేర్కొన్నారు.

ఇప్పిలి

ఇప్పిలి శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. ఇప్పిలి పేరు వెనుక గల అంశాన్ని పరిశీలిస్తే.... పిప్పలి అంటే రావి చెట్టు లేదా రావిపండు అని అర్థం. అప్పట్లో రావిచెట్లు ఇక్కడ ఎక్కువగా ఉండేవి. అంచేత పిప్పలి కాలక్రమంలో ఇప్పిలిగా మారిందని స్థానికులు పేర్కొన్నారు.

మకరజోల

మందస మండలంలో ఉంది. ఈ ఊరి చుట్టూ వృక్ష సంపద ఎక్కువగా ఉంది. ఊరిలోని చెరువుల్లో మకరాలు (మొసళ్లు) ఎక్కువగా ఉండేవి. మకరాల దాడులతో ప్రాణ నష్టం జరిగేది. వీటిని పాలదోలేందుకు అగ్ని దివిటీలను (జ్వాల) గ్రామీణులు వాడేవారు. అలా మకరాలను జ్వాలలతో తరిమేవారు. దీంతో ఈ పల్లెకు మకరజ్వాల అని నామకరణం చేశారు. జనవ్యవహారంలో మకరజ్వాల క్రమంగా మకరజోలగా మారింది. ఈ పల్లెలోని సంకుజోడి చెరువు అతి పెద్దది. చెరువు గర్భం వంద ఎకరాలకు మేర ఉంది. వందలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. గ్రామ జనాభా 707గా నమోదైంది. 82.49 శాతం అక్షరాస్యత ఉన్నట్టు 2011 జానాభా లెక్కలు పేర్కొంటున్నాయి. ఈ గ్రామానికి చెందిన పి.శివాజీ పట్నాయక్ (సింహాచలం) ఉత్తరాంధ్రకే వన్నె తెచ్చిన ప్రముఖ రచయిత.

నగరంపల్లి

నగరంపల్లి శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ పల్లె. నగర అంటే ఓ రకమైన గడ్డి జాతి రకం. అంచేతనే ఈ పల్లెకు నగరం పల్లి అనే పేరు వచ్చింది. అప్పట్లో ఈ రకమైన గడ్డి జాతి మొక్కలు అక్కడ ఎక్కువగా ఉండేవి. ఇది సాగరతీరానికి 5కి.మీ దూరంలో ఉంది. ఇదే పేరుతో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో కూడా ఓ పల్లె ఉంది. ఇది తర్లవాడ పంచాయితీ పరిధిలో ఉంది.

పట్టువర్ధనం

పట్టువర్ధనం అనే ఈ పల్లె శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలో ఉంది. ఈ ఊరి పేరు వెనుక గల చరిత్ర ఎంతో వైవిధ్యంగా ఉంటుంది.

తొలుత పట్టు వస్త్రాలు నేసే కొన్ని కుటుంబాలు వారు ఈ ప్రాంతానికి వలస వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. పురోహితులు సూచనల మేరకు తమ గ్రామానికి పట్టువర్ధనం అని నామకరణం చేశారు. పేరుకు తగ్గట్టుగా ఇక్కడ పట్టు పరిశ్రమ వర్ధిల్లుతోంది. ఈ పల్లెలో మొత్తం 20 మగ్గాలు ఉన్నాయి. వీరు నేసే పట్టు వస్త్రాలను గుంటూరు జిల్లా, మంగళగిరి, శ్రీకాకుళంకు ఎగుమతి చేస్తున్నారు. గొర్లె శ్రీరాములు నాయుడు జలాశయం (మడ్డువలస) నిర్మాణంలో పలువురు భూములను కోల్పోయారు. దీంతో సగం మంది పట్టు కార్మికులు సుదూర ప్రాంతాలకు వలసపోయారు. ఫలితంగా గ్రామ జనాభా బాగా తగ్గిపోయింది. ప్రస్తుత జనాభా 800 మాత్రమే. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా ఈ పల్లెకు సరైన రహదారి లేదు. ప్రస్తుతం సగం గ్రామం రిజర్వాయరు నీటిలోనూ, మిగిలినది ఒడ్డున ఉంది.

గార

గార శ్రీకాకుళం జిల్లాలోని ఓ మండల కేంద్రం. ఒకప్పుడు సమితి కేంద్రం కూడా. పేరు వెనుక గల నేపథ్యం ఇది. ఆ రోజుల్లో గార చెట్లు ఇక్కడ ఎక్కువగా ఉండేవి. ఇవి పొలాలు చెరువు గట్ల మీద ఉండేవి. ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నాయి. ఈ చెట్టుకొమ్మలను, మండలను ముక్కలుముక్కలుగా చేసి ఇంటి ముందు పెడతారు. ముఖ్యంగా పిల్లలు పుట్టేటప్పుడు ఊయల లేదా మంచం మీద వీటిని ఉంచుతారు. దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయి. ఎలాంటి క్రిములను రానివ్వదు. పిల్లలకు దిష్టి తగలకుండా ఉండేందుకుగానూ దీన్ని ఉపయోగిస్తారు. ఇలా గార చెట్ల వల్ల ఈ గ్రామానికి గార అనే పేరు వచ్చింది. దీని జనాభా సుమారు 5వేలు.

భరణికాం

భరణి నక్షత్రం పేరుతో పలు గ్రామాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఉన్నాయి. లావేరు మండలంలోని భరణికాం, మెళియాపుట్టి మండలంలోని భరణికోట, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో, విశాఖ జిల్లా పరవాడ మండలంలో ఇదే పేరుతో గ్రామాలున్నాయి.

బలివాడ

బలివాడ శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని ఓ పల్లె, ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే... భిల్లుడు అనే రాజు పాలనలో ఈ గ్రామం కొన్నేళ్లు ఉండేడ. ఆయన పేరుతోనే భిల్లువాడగా ఏర్పడింది. లోక వ్యవహారంలో బలివాడగా మారింది. ఈ విషయాన్ని ఆ పల్లెకు చెందిన మాజీ సర్పంచి బలిహాడ సావిత్రమ్మ, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ అర్చకులు గుంపా వాసుదేవ స్వామి తెలిపారు. శివలింగానికి 2500 సంవత్సరాల చరిత్ర ఉంది.

పొన్నాడ

పొన్నాడ ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామం. ఇది వృక్ష సంబంధమైన గ్రామం పేరు. 'పొన్న చెట్ల వల్ల పొన్నాడ అయింది. ఆడ అంటే జనావాసం అని అర్థం. పొన్నాడ వంగ పంటకు ప్రసిద్ధి.

పితాపురం

పితాపురం గ్రామం అనగానే అందరికీ గుర్తుకువచ్చేది తూర్పు గోదావరి జిల్లాలోని పితాపురం అయితే శ్రీకాకుళం జిల్లా టెక్కలి

పంచాయితీలో పిఠాపురం పేరుతో ఓ పల్లె ఉంది. టెక్కలి పట్టణానికి 3 కి.మీ దూరంలో ఉంది. గ్రామ జనాభా వందమంది. గ్రామ దేవత వేపపోలమ్మ. పిఠాపురం జమిందారులు కొన్ని ఎకరాల భూమిని ఉదారంగా ఇక్కడ ఇవ్వడంతో పల్లెకు పిఠాపురం అని పేరు పెట్టారు. ఆ తరువాత ఈ పల్లెకు సంపతిరావుపేట అని పేరు పెట్టారు. సంపతిరావు ఇంటి పేరుగల వారు ఎక్కువగా ఉండటంతో ఈ పేరు పెట్టారు. కొన్నాళ్లకు గడిచిన తరువాత ప్రజలు పునరాలోచన చేసి తిరిగి పిఠాపురం అని పేరు పెట్టారు. రికార్డులలో పిఠాపురం అని నమోదు అయింది. ఈ గ్రామానికి చెందిన పముఖ రచయిత బొంగు సూర్య నారాయణ 'సూర్య రాయ సూక్తి' మాట, సూర్య వంశం సుప్రభాత శతకం , శ్రీ శివ క్షేత్ర మహత్యం, శ్రీ మధుకేశ్వర క్షేత్ర మహత్యం తదితర రచనలు చేసిన చేశారు.

మొగిలివలస

మొగిలివలస గ్రామం రాజాం మండలంలో ఉంది. ఊరి పేరుకు తగినట్టుగానే ఈ గ్రామానికి వెళ్లే దారిలో మొగలి పొదలు దర్శనమిస్తాయి. ఈ పొదలు ఉండడంతో పాములు సంచారం కూడా ఉంటోంది. గతంలో ఈ గ్రామానికి కొందరు వలస రావడంతో ఉత్తర పదంగా వలస వచ్చింది. కాల గమనంలో మొగిలివలసగా రూపాంతరం చెందింది. ప్రముఖ సాహితీ బంధువు డా॥ ఆల్తి మోహనరావు ఈ గ్రామానికి చెందిన వారే.

అంబఖండి

అంబఖండి గ్రామం రేగిడి ఆముదాలవలస మండలంలో ఉంది. ఈ గ్రామం పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.. ఆరోజుల్లో ఈ

ప్రాంతంలో లక్ష్మి అనే పేరు గల గొప్ప పతివ్రత ఉండేది. అందరూ ఆమెను అమ్మా అని గౌరవంగా పిలిచేవారు. ఆమె నాటి పద్ధతుల ప్రభావంతో సతీసహగమనానికి పాల్పడిరది. ఆమె పేరుతోనే లక్ష్మీ పేరంటాలు ఆలయం ఇక్కడ వెలసింది. ఆమెను అందరూ అమ్మా అని పిలిచేవారు కావడంతో ఆ గ్రామానికి అమ్మ ఖండిక అనే పేరు పెట్టినట్టు స్థానికుల కథనం. అమ్మ ప్రకృతి పదం కాగా అంబ వికృతి రూపం. ఖండిక అంటే చిన్న గ్రామం. మొత్తం మీద జనవ్యవహారంలో అంబఖండిగా మారింది. ఇక్కడి ప్రజలు అంబఖండేశ్వరాలయాన్ని నిర్మించారు. ఈ గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త పరిశోధకులు డా॥ వెల్చేరు నారాయణరావు అమెరికాలోని విస్కాన్సిను విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పని చేశారు.

బి.గొనపుట్టుగ

బి.గొనపుట్టుగ గ్రామం కవిటి మండలంలో ఉంది. గొనప అనే ఇంటి పేరు గల సంపన్న కుటుంబికులు ఓ పెద్ద బావిని నిర్మించి తాగునీటి కష్టాలను నివారించారు. దీంతో ఈ ఊరికి గొనప పుట్టుగ అనే పేరు వచ్చింది. పుట్టుగ అంటే చిన్న ఊరు అని అర్థం. బొరివంకను సమీపంలో ఈ పల్లె ఉండడంతో బి.గొనపుట్టుగ అనే పేరు వచ్చింది. ఉద్దానం సీమలో ఈ గ్రామం పేరు తెలియని వారుండరు.

పూండీ

ఉద్దాన సీమలో ఈ గ్రామం పూండీ ప్రముఖ గ్రామం. పూడి అంటే జల సూచి. ఇందుకు నిదర్శనంగా ఇక్కడ గల పెద్ద చెరువును ఉదాహరించవచ్చు. పూడి జనవ్యవహారంలో పూండీగా మారింది. పూండీ పేరుతోనే తమిళనాడు తిరువళ్లూరు జిల్లాలో పూండి పేరుతో ఓ గ్రామం ఉంది. ఈ గ్రామానికి దగ్గరలో మంచి నీటి సరస్సు ఉంది.

తర్లాకోట

తర్లాకోట శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని ఓ జానపదం. ఈ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.. 'తల్వారి' అనే పదం నుంచి తర్లా అని వచ్చినట్టు స్థానికుల కథనం. తల్వారి అంటే ఖడ్గం. కాగా ఖడ్గం రౌద్రానికి, పౌరుషానికి ప్రతీక. ఇక్కడ కోట ఎంతో ప్రాచీనమైనది. దీంతో ఈ గ్రామానికి 'తర్లాకోట' అనే పేరు వచ్చిందని సుస్పష్టం. ఇక్కడి సంస్థానాధీశులు నిర్మించు కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. కోట నేడు పూర్తిగా శిథిలమైంది. ఈ సంస్థానాన్ని సుమారు వెయ్యేళ్ల పాటు సురో (సూర్య) వంశీయులు పరిపాలించారు. 11వ శతాబ్దం నుంచి ఈ సంస్థానం ప్రస్థానం ప్రారంభమైంది. నాగసురో అనే సంస్థానాధీశుని నుంచి పాలన ప్రారంభమైంది. బరదరాజుసురో చివరి పాలకుడు 1949లో జమీందారీ వ్యవస్థ రద్దు కావడంతో సంస్థానం చరిత్ర ముగిసింది. అయినప్పటికీ ఇక్కడ ప్రతిఏటా ఆషాఢమాసంలో నిర్వహించే రథయాత్ర అత్యంత వైభవంగా సాగుతుంది. గతంలో వలె కాకుండా దసరా ఉత్సవాలు నిరాడంబరంగా జరుగుతున్నాయి. మరో విశేషమేమిటంటే తర్లాకోట పేరుతోనే ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా ఓ గ్రామం ఉంది.

చలివేంద్రి

పేరుకు తగిన ఊరు చలివేంద్రి. ఇంత అందమైన పేరు గల చలివేంద్రి వీరఘట్టం మండలంలో ఉంది. పేరు వెనుక గల చరిత్రలోకి వెళితే పూర్వం వీరఘట్టం ప్రాంతంలో అచ్చపువలస దొరలు, కురుపాం, మేరంగి రాజులు గుర్రాలపై గ్రామాల్లో పర్యటించేవారు. ప్రజా సమస్యలను తెలుసుకునేవారు. వీరఘట్టం ప్రాంతంలోని ఓ చోట

నెలకొని ఉన్న తోటల మధ్యలో డజను తాటాకుల ఇళ్లు ఉన్న దగ్గర విశ్రమించేవారు. ఈ జనావాసం చల్లని గాలితో కూడిన వాతావరణం ఉండేది. అక్కడ తాగునీళ్లు కూడా చల్లగా ఉండేది. చల్లదనానికి కేంద్రంగా ఉండేది. పడమటి వైపున రావాడ వట్టిగెడ్డ ప్రవహించడం వల్ల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది. సారవంతమైన నేల తదిత కారణాల వల్ల ఈ కుగ్రామనికి చలివేంద్రి అనే పేరు వచ్చింది. నాడు ఈ పల్లెలో పనిచేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కుదమ తిరుమలరావు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

చండి పుట్టుగ

చండి పుట్టుగ కవిటి మండలంలో ఉన్న చిన్న గ్రామం. రాజపురం పంచాయితీలో ఉంది. రాజపురం పంచాయితీ పరిధిలో వింజగిరి, చండిపుట్టుగ అనే పల్లెలున్నాయి. వింజగిరిలోని కొటారి చండి అమ్మవారు గొప్ప మహిమలున్న దేవతగా పేర్కొంటారు. ఈ కారణంగా ఈ పల్లెకు చండిపుట్టుగ అని పేరు పెట్టారు. పుట్టుగ అంటే మాండలికం ప్రకారం పరిమిత సంఖ్యలో నివశించే కుటుంబాల సముదాయం అని అర్థం. ఇలా చండి పదం తరువాత పదంగా పుట్టుగ చేరింది.

సుందరాపురం

పేరుకు తగిన ఊరు సుందరపాలెం. అంచేతనే దీనికి సుందరపాలెం అనే పేరు వచ్చింది. ఈ గ్రామం పేరు కేవలం శ్రీకాకుళం జిల్లా వాసులకే కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల రచయితలందరికీ సుపరిచితమైన పేరు. కథా నిలయం (శ్రీకాకుళం) వ్యవస్థాపకులు ప్రఖ్యాత రచయిత దివంగత కాళీపట్నం రామారావుకు అత్యంత గుర్తింపు తెచ్చిన 'యజ్ఞం' కథలో ఈ ఊరి పేరును ప్రారంభంలోనే ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ఊరి

వేదికగానే కథను నడిపించారు. ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ ఊరు రణస్థలం మండలంలో సముద్ర తీరంలో ఉంది. ఊరంతా కొబ్బరి చెట్లతో నిండి ఉంది. ఇక్కడ భద్రకాళి అమ్మవారి ఆలయం ప్రసిద్ధి చెందింది. సంక్రాంతి మూడు రోజులు భారీ ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి.

బంటుకొత్తూరు

బంటుకొత్తూరు ఓ కుగ్రామం. ఇది పలాస మండలంలో ఉంది. ఒకప్పుడు గ్రామ సరిహద్దుల్లో ఉన్న కర్రి కొండ మార్గంలో ఎలుగు బంట్లు విచ్చలవిడిగా ఈ నిర్జన ప్రదేశంలో తిరిగేవి. అయితే ఈ ప్రాంతంలో కొన్ని కుటుంబాల వాళ్లు వివిధ ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. అదో గ్రామంగా రూపుదిద్దుకుంది. కొత్తగా ఏర్పాటైన ఈ పల్లెకు బంటుకొత్తూరు పేరు వచ్చింది. ప్రస్తుతం పంచాయితీ కేంద్రంగా ఉంది. దీని జనాభా 450. ఈ పల్లెలో గ్రామ సచివాలయం, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన డా॥ గుంట శాంతారాం రాష్ట్ర వైద్య డైరెక్టరుగా సేవలందించారు. అతని సోదరుడు గుంట తులసీరావు డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) లో ఆచార్యులుగా పని చేశారు.

కూర్మ

ఆధ్యాత్మికతకు సనాతన ధర్మాలకు ప్రతీక కూర్మ గ్రామం. ఇది హిరమండలం మండలం అంతకాపల్లి పంచాయితీ ఉంది. హరే రామ హరే కృష్ణ భక్తులు అరవై ఎకరాల విస్తీర్ణంలో ఈ గ్రామాన్ని నిర్మించుకున్నారు. 2019లో ఈ పల్లె ఏర్పాటైంది. దీనికి ఆ పేరు

ఎలా వచ్చిందంటే జిల్లాలో శ్రీకూర్మం క్షేత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని 'కూర్మ' అనే పేరు పెట్టారు. కూర్మం అంటే తాబేలు. ఈ ఉభయచరం ఎంతో నిదానంగా ఉంటుంది కదా, పల్లె వాసులు కూడా నిదానంతో వ్యవహరించగలమన్న ఆత్మ విశ్వాసంతో కూడా ఈ పేరును ఖరారు చేసుకున్నారు. ఇక్కడ పిల్లలు వేద విజ్ఞానాన్ని భగవద్గీత సారాన్ని నేర్చుతున్నారు. హరే రామ హరే కృష్ణ నామ స్మరణతో ఈ పల్లె ప్రతి ధ్వనిస్తుంది. కేవలం వ్యవసాయం, పశు సంపద ఆధారంగా పల్లె వాసులు జీవన గమనం సాగిస్తున్నారు.

కామధేనువు

కామధేనువు నందిగాం మండలంలో ఓ కుగ్రామం. ఇది పాడిపంటలకు నిలయం. అయితే ఇక్కడ పాడికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తుంటారు. అంచేత గోసంపద ఎక్కువగా ఉంది. కోరిన కోర్కెలు తీర్చే ధేనువు (దేవతల ఆవు) గా భావించి కామధేనువు అని ఈ పల్లెకు పేరు పెట్టారు. ఆవుల సంఖ్య మూడు వందలకి పైగా ఉంటాయి. గేదెలు కూడా ఉన్నాయి. పాలు వెన్న నెయ్యి అమ్ముతుంటారు. చుట్టు పక్కల పల్లెల నుంచి కూడా ప్రజలు వచ్చి వీటిని కొనుగోలు చేస్తుంటారు. అన్ని రకాల పంటలను ఇక్కడ పండిస్తుంటారు. ప్రతి ఇంటి నుంచి ఓ ఉద్యోగి ఉండడం మరో విశేషం. రామాలయం, శివాలయం ఉన్నాయి. గ్రామ జనాభా 480.

మేఘవరం

మేఘవరం టెక్కలి మండలంలోని ఓ పంచాయితీ కేంద్రం. మేఘాలు దయచూపితేనే వానలు పడతాయి. వానలు పడితే పంటలు పండుతాయి. సాగు నీరు, త్రాగునీరు అతి ముఖ్యం కదా. ఆ మేఘాలు

అనుకూలంగా వరమిస్తే అంతా మంచి జరుగుతుంది. ఆ ఉద్దేశంతోనే నాటి పెద్దలు ఈ గ్రామానికి ఆ పేరు పెట్టారు. ఈ పంచాయితీ పరిధిలో బొరిగిపేటతో సహా మొత్తం 11 శివారు గ్రామాలు ఉన్నాయి. జనాభా 2,300. ఈ ప్రాంతంలో వానలు అనుకూలంగానే ఉంటున్నాయి.

కిన్నెరవాడ

ఇతిహాసాలలో కిన్నెరలు, కింపురుషులకు గల స్థానం వర్ణనాతీతం. కిన్నెర మహిళలు అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. వీరు దేవతలతో కలిసి గగనయానం చేస్తుంటారని పేర్కొన్నారు. కిన్నెరసాని గోదావరి నదికి ఉపనదిగా ఉంది. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు' ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. ఇంత అందమైన పేరు కలిగిన గ్రామం కిన్నెరవాడ. ఇది సారవకోట మండలంలో ఉంది. ఒకప్పుడు ఇది బ్రాహ్మణ అగ్రహారం. 375 ఎకరాలను మాన్యంగా పొందారు. అయితే ఇప్పుడు అక్కడ బ్రాహ్మణులు లేరు. వారంతా వలస పోయారు. కాగా వేద పండితులైన బ్రాహ్మణులు ఈ గ్రామం నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విలసిల్లాలలని ఆకాంక్షిస్తూ కలిసొచ్చే విధంగా కిన్నెరవాడ అని పేరు పెట్టారు. ఇందుకు తగ్గట్టుగానే ఒకప్పుడు బుర్రకథ, కోయ నృత్య కళాకారులు ఉండేవారు. కాలక్రమంలో ఈ కళలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రస్తుతం కోలాటం, భజన బృందాలు కొనసాగుతున్నాయని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ నిర్వాహకులు కొరపాక సిద్ధయ్య స్వామి తెలిపారు. త్రినాథస్వామి, శివాలయం ఉన్నాయి. గ్రామ దేవత అసిరితల్లి. పల్లె జనాభా దాదాపు 2500 మేరకు ఉంటుంది.

హంస

ఇది కొత్తూరు మండలంలోని ఓ అందమైన గ్రామం. అప్పట్లో బ్రాహ్మణ సామాజిక వర్గం ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా పల్లెకు శుభాలు, సుఖాలు కలగాలని కోరుతూ హంస అని పేరు పెట్టారు. హంస పవిత్రతకు, న్యాయానికి మారు పేరుగా వాడుతుంటారు. పాలు, నీరు కలిపి ఉన్న ఈ రెండింటినీ వేరు చేసే గొప్పతనం హంసకే ఉంది. హిమాలయ శిఖరాల్లో ఒకదాని పేరు హంసకోట. బ్రహ్మ, సరస్వతి దేవిల వాహనం హంస కావడం మరో విశేషం. అందుకే నాటి పెద్దలు తమ గ్రామానికి ఈ పేరు పెట్టారని స్థానికులు పేర్కొన్నారు. ఈ గ్రామ జనాభా 726. వంశధారనదీ తీరంలో ఈ పల్లె నెలకొని ఉంది.

పులిపుట్టి

ఇది సీతంపేట మండలంలోని ఓ గిరిజన గ్రామం. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో పులుల సంచారం ఎక్కువగా ఉండేది. దాంతో ఈ గ్రామానికి పులిపుట్టి అనే పేరు పెట్టారు. పుట్టి అంటే చిన్న పల్లె అని అర్థం.

లయిదాం

లయిదాం పొందూరు మండలంలో గొప్ప దివ్యక్షేత్రం. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... దీని తొలి పేరు లయ ధామం. లయ అంటే లయకారకుడైన పరమేశ్వరుడు. ధామం అంటే స్థానం. ఇక్కడ ఆనాటి పెద్దలు, ప్రజలు పరమేశ్వరుడని భక్తులు. అందువల్ల శివుని పేరు అంతర్లీనంగా కలిసొచ్చే విధంగా ఈ పేరు పెట్టారు. ధామం అంటే స్థానం అని అర్థం. ఇక్కడ గల శివానంద ధర్మక్షేత్రం ఎంతో పేరు

పొందింది. ఈ క్షేత్రం పక్కనే రామధామం ఉంది. వీటి స్థాపకులైన దివంగత రామయోగి చిరస్మరణీయులు. గ్రామ జనాభా 1456.

మొగిలివలస

ఇది రాజాం మండలంలోని ఓ చిన్న గ్రామం. రాజాం పొందూరు మార్గంలో ప్రధాన రహదారికి అర కి.మీ దూరంలో లోపలికి ఈ ఊరు ఉంటుంది. ఈ దారికి రెండు పక్కలా పెద్దపెద్ద తాటిచెట్లు, మొగలిపొదలు ఉంటాయి. మొగలి వాసనలను ప్రజలు నిత్యం ఆస్వాదిస్తుంటారు. మొగలి పేరుతోనే మొగలివలస అనే పేరు వచ్చింది. వేరే ప్రాంతాల నుంచి కొందరు వలస వచ్చి పల్లెను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా మొగలివలస ఏర్పాటైంది. అయితే జనవ్యవహారంలో మొగిలివలసగా స్థిరపడింది.

బ్రాహ్మణతర్ల

బ్రాహ్మణతర్ల పలాస మండలంలో ఉంది. దీని తొలి పేరు బ్రాహ్మణ శాసనం. ఒరియా బ్రాహ్మణులు ఏర్పాటు చేసుకున్న గ్రామం కావడంతో బ్రాహ్మణతర్ల అనే పేరు వచ్చింది. తర్లకోట సమీపంలో ఉండడంతో ఉత్తర పదంగా తర్ల ఏర్పడిరది. ఇక్కడ కోటకు సమీపంలో గొప్పిలికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే కొలువై ఉన్న కాటమ్మతల్లి తర్లా సంస్థానాధీశు ఆడపడుచు. ఆమె అత్తవారు బ్రాహ్మణతర్ల. మహాష్టమి ముందురోజు పోలాల అమావాస్య రోజున కాటమ్మ పేరంటాలు బ్రాహ్మణతర్ల నుంచి తర్లా కోటకు వచ్చి కొన్ని రోజులు గడిపి తిరిగి వెళ్లిపోతుందని భక్తుల విశ్వాసం. ఇందుకు ఉదాహరణగా బ్రాహ్మణతర్లాలో కూడా కాటమ్మ ఆలయం ఉంది.

భానూజీరావుపేట

భానూజీరావుపేట జమీందారీ వ్యవస్థలో ఏర్పాటైన ఓ విశిష్ట గ్రామం. ఇది ఎచ్చెర్ల మండలంలోని ఓ కుగ్రామం. ఎస్.ఎం పురం పంచాయితీ పరిధిలో ఉంది. ఈ పల్లె గురించి ఏ గడపను పలకరించిన నాటి ఎచ్చెర్ల జమీందారు అంకితం వెంకట జగ్గారావు అతని కుమారుడు భానూజీరావు పేర్లను విధిగా చెబుతుంటారు. 1951లో జమీందారి వ్యవస్థ రద్దు చట్టం రాక ముందే ఇక్కడకు వలస వచ్చిన కుటుంబాలకు భానూజీరావు ఇళ్ల స్థలాలను, సాగు భూమిని ఉదారంగా అందజేసారు. దీంతో కృతజ్ఞతాపూర్వకంగా ఈ గ్రామానికి భానూజీరావుపేట అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని సీనియర్ రెవెన్యూ అధికారి జె.వి. ఆర్.నాయుడు తెలిపారు.

సానివాడ

సానివాడ గ్రామం శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. ఈ పల్లె పేరు వినడానికి చదవడానికి కాస్త ఇబ్బందిగానే ఉంటుంది మరి. ఇంతకీ ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఆ రోజుల్లో ఇక్కడ సంగీత ప్రియులు ఉండేవారు. 'సరిగమపదని' సప్త స్వరాలు. వీటిలో తొలి అక్షరం 'స' చివరి అక్షరం 'ని' కలిపి సనివాడ గా ఈ గ్రామానికి పేరు పెట్టారు. అయితే అంతవరకూ బాగానే ఉంది. అయితే కాలక్రమంలో సనివాడ పేరును సరిగా పలుకలేక సానివాడ అని పిలిచేవారు. అదే పేరు నిలిచిపోయింది. పంచాయితీ, అంగన్ వాడీ, తపాలా శాఖ రికార్డుల్లో కూడా ఇలానే ఉంది. అయితే నేటి తరం వారు తమ అనుభవాలను గమనం లోనికి తీసుకొని జీర్ణించుకోలేక శ్రీపురం అనే పేరును పెట్టాలని గత కొన్నాళ్లుగా కోరుతున్నారు. గ్రామ పొలి

మేరల్లో శ్రీపురం (సానివాడ) అనే బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. గ్రామ జనాభా 2వేలు.

బొప్పాయిపురం

బొప్పాయిపురం టెక్కలి మండలంలో ఉంది. ఇకప్పుడు ఇక్కడ బొప్పాయి తోటలు ఎక్కువగా ఉండేవి. దీంతో ఆ పల్లెకు బొప్పాయి పురం అనేపేరు పెట్టారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ కనుమరుగయ్యాయి. అయినప్పటికీ ఈ పేరు శాశ్వతంగా నిలిచిపోయింది. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. గ్రామ దేవత బంగారు పోలమ్మ, గ్రామ జనాభా 620 మేరకు ఉంది.

శోభ

శోభ పేరుతో గ్రామం లేనప్పటికీ పలు గ్రామాల సముదాయంతో ఏర్పాటైన పంచాయితీకి 'శోభ' అనే పేరు పెట్టారు. శోభ అంటే వన్నె ఈ గ్రామాలు సముదాయం అందమైన కొండలు, గుట్టలతో అటవీ ప్రాంతంలో శోభాయమానంగా ఉంటుంది. అంచేత ఈ సముదాయానికి 'శోభ' అని నామకరణం చేశారు. ఈ గ్రామ సముదాయం పాతపట్నం మండలంలో ఉంది. ఒకప్పుడు సేంద్రీయ వ్యవసాయానికి ఆటపట్టుగా ఉండేది. శోభ పంచాయితీలో బూర్జ గూడ, రేంగూడ, కొలింగూడ, కొమలగూడ, కొర్రెంగూడ, బెన్నెర గూడ, లచ్చిం గూడ, కొమలగూడ, కరడ సింగూడ, చింతగూడ వంటి అతి చిన్న పల్లెలున్నాయి. ఒక్కో పల్లెలో 10 ఇళ్లకు మించి లేవు. తమ పంచాయితి నాటి పెద్దలు 'శోభ' అనే పేరు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందని సామాజిక కార్యకర్త బొబ్బిలి ధర్మారావు పేర్కొన్నారు. పంచాయితీ జనాభా 2 వేలు.

వారాల పేరుతో ....

వారాల పేరుతో కూడా కొన్ని గ్రామాలు శ్రీకాకుళం, విశాఖ పట్నం, పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్నాయి. శ్రీకాకుళం నగర పాలక సంస్థ నరసన్నపేట మేజర్ పంచాయితీలో ఆదివారం పేట పేరుతో జనావాసాలున్నాయి. ఇచ్ఛాపురంలో నగర పంచాయితీలో మంగళవారంపేట పేరుతో ఓ గ్రామం ఉంది. విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి మండలంలో అంజలి శనివారం, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలో శుక్రవారపుపేట ఇదే జిల్లా ఏలూరు పట్టణంలో శనివారపుపేట జానపదాలున్నాయి. ఈ గ్రామాలన్నీ ఆయా రోజుల్లో ఆవిర్భవించినట్టు స్థానికులు కథనాల వల్ల స్పష్టమౌతోంది.

జామితోట

జామి తోట గ్రామం సీతంపేట మండలంలో ఉంది. ఇక్కడ జామి తోటలు ఎక్కువగా ఉన్నందున జామితోట అనే పేరు ఈ పల్లెకు వచ్చింది. ప్రస్తుతం కూడా పరిమితంగానే జామి చెట్లు ఉన్నాయి. 35 ఇళ్లు మాత్రమే ఉన్నాయి. గ్రామ జనాభా 140.

వావిలిపల్లిపేట

వావిలిపల్లిపేట గ్రామం పొందూరు మండలంలో రాపాక పంచాయితీ పరిధిలో ఉంది. ఈ పల్లె తొలిపేరు యరుగోడిపేట. అయితే వావిలిపల్లి ఇంటి పేరు గల కుటుంబాలు 90 శాతం మేరకు ఉండడంతో ఈ పల్లెకు వావిలిపల్లిపేట అనే పేరు వచ్చింది. కాగా వావిలి మెక్కలు ఎక్కువగా ఉన్నందున ఈ దీనికి వావిలిపల్లిపేట అనే పేరు వచ్చిందని

మరికొందరి అభిప్రాయం. ఈ విషయాన్ని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వావిలిపల్లి రాజారావు ఈ రచయితకు తెలిపారు.

రిట్టపాడు

రిట్టపాడు వజ్రపుకొత్తూరు మండలంలో గల చరిత్ర ప్రసిద్ధి గల గ్రామం. రిట్టపాడుకు ఆ పేరు వెనుక గల నేపథ్యం ఇది. వృక్షాల పేర్లతో వచ్చిన గ్రామాల్లో ఇదొకటి. రిట్ట(కుంకుడు) చెట్లు ఎక్కువగా ఉన్నందున రిట్టపాడు అనే పేరు వచ్చింది. చివరి పదం పాడు ఎలా వచ్చిందంటే బౌద్ధ, జైన మతం విలసిల్లింది. ఇందుకు సాక్ష్యంగా ఇక్కడి ఓ చెరువు పేరు అమరావతి కావడం. ప్రముఖ పుస్తక రచయిత బమ్మిడి సుబ్బారావు సొంత ఊరు ఇదే. ఇంకా చరిత్ర పుటలు తిరగేస్తే... ప్రముఖ నక్సలైట్ నాయకుడు, ఉపాధ్యాయుడు పైల వాసుదేవరావు స్వగ్రామం ఇదే కావడం విశేషం.

గుళ్లలపాడు

గుళ్లలపాడు గ్రామం వజ్రపుకొత్తూరు మండలంలో ఉంది. గొల్లలు (యాదవులు) ఏర్పాటు చేసుకున్న గ్రామం కావడంతో గొల్లలపాడు అయింది. జనవ్యవహారంలో గుళ్లలపాడుగా మారింది. ఇక్కడ కూడా చివరి పదంగా పాడు వచ్చింది.

కవిటి

కవిటి మండల కేంద్రం. ఉద్దాన సీమలో ఉంది. గ్రామ జనాభా 12వేలు. ఇంటిపేర్లతో వచ్చిన గ్రామాల్లో ఇదొకటి. కవిటి ఇంటి పేర్లతో ఉన్న బూరాగాన సామాజిక వర్గం వారిచే ఏర్పాటైన కేంద్రం ఇది. కవిటి బీచ్ ప్రసిద్ధి పొందింది. ఇక్కడి చింతామణి అమ్మవారి ఆలయం, శ్రీ సీతారామ స్వామి ఆలయం దర్శించదగినవి.

పెసరపాడు

పెసరపాడు పలాస మండలంలో ఉంది. పెసరపంట పేరుతో పెసరపాడు అయింది. ఇక్కడ మాత్రం జైనమతం ఉండేది. అంచేత ఉత్తర పదంగా 'పాడు' చేరింది. కంచిలి మఠం శాఖ కూడా ఉండేది. సన్యాసులు పెద్ద ఎత్తున ఉండేవారు. కాగా ఇక్కడ జోగినుల (కళావంతుల) వంశీయులున్నారు.

రూపాయి / మేకవే

రూపాయి, మేకవే అనేవి జంట గ్రామాలు. ఇవి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలో ఉన్నాయి. ఈ జంట పల్లెలకు విడదీయరాని అనుబంధం ఉంది. ఆ పల్లెలకు ఈ పేర్లు ఎలా వచ్చాయంటే. మేకవ గ్రామీణులకు మేకల పెంపకం ముఖ్య వృత్తి. ఇవన్నీ ఉదయం పూట మేతకు వెళ్లేవి. సాయంత్రానికి పల్లెకు వచ్చేవి. అయితే దాదాపు ప్రతీరోజూ ఒక్కో మేక గల్లంతయ్యేది. దీంతో యజమానులు ఆందోళనకు గురయ్యేవారు. దీనికి రూపాయి గ్రామ ప్రజలే కారణమని అనుమానించేవారు. ఈ విషయాన్ని వారినడిగితే ఏమనుకుంటారో, సత్సంబంధాలు చెడి పోతాయేమోనని మౌనం వహించారు. చివరకు మేకవ గ్రామస్తుల్లో ఒకరు చొరవ తీసుకొని రూపాయిపల్లెకు చెందిన ఓ వ్యక్తిని మేకల ఆచూకీ గూర్చి అడగ్గా ఆందోళన చెందవద్దు. మేకలు పోతున్నాయి కదా... రూపాయికి ఓ మేకవంతున చెల్లించేందుకు ఇరు గ్రామాల ప్రజలు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకూ రూపాయి మేక ఊళ్ల మధ్య మంచి సంబంధాలే కొనసాగడం కొసమెరుపు. తొలుత మేక గ్రామంగా పిలిచేవారు. అయితే కాలక్రమంలో ఇవి మేకవేగా మారిందని గ్రహించాలి.

గొప్పిలి

గొప్పిలి మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రామం. మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రామం. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులలోని పల్లె ఇది. ఈ ఊరిపేరు వెనుక గల నేపథ్యం ఇది..... దీని తొలిపేరు గోవుపురి. ఆవుల మందలు ఎక్కువగా ఉన్నందున ఆ పేరు వచ్చింది. అయితే ఆంగ్లేయుల పాలనా కాలంలో గొప్పిలిగా మారింది. అదే పేరు స్థిరపడిరది. పర్లాఖిముండి రాజుల పాలనలో ఒకప్పుడు ఉండేది. వారి పక్షాన నారాయణ దొర, సత్యన్నారాయణ దొర జమీందార్లగా ఉండేవారు. జమీందారీ వ్యవస్థ కనుమరుగైనప్పటికీ వారి వారసులైన బాలకృష్ణ దొర మార్కండేయ దొరలకు మంచి పేరు ఉంది. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో ఉన్న గొప్పిలి శ్రీ రాధాకాంతస్వామి వారి ఆలయం ప్రసిద్ధి చెందింది.

ఆడవరం

ఆడవరం గార మండలంలో ఓ గ్రామం. ఈ జానపదానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ గ్రామంలో జుంబూ అనే వాయిద్య పరికరాన్ని ఉపయోగించి ఎానపద గీతాలను పాడుతూ ఉండేవారు. ఈ వాయిద్య పరికరంతో హార్మోనియం వాయిస్తూ ఆడేవారు. ఇలా గ్రామానికి ఆడవరం అనే పేరు వచ్చింది. జంగమ సామాజిక వర్గం వారు ఈ ప్రదర్శనలిచ్చేవారు. అయితే కాలగమనంలో ఈ జానపదకళ కనుమరుగైందని స్థానిక ప్రముఖ రచయిత ఉపాధ్యాయుడు బోగెల ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ జంబూ వాయిద్య పరికరాన్ని పాత సినిమాల్లో ఎక్కువగా ఉపయోగించేవారు. ఈ పల్లె జనాభా 2300. ఆడవరం పేరుతో ఇదే జిల్లాలో రేగిడి మండలంలో మరో పల్లె ఉంది.

కపాసుకుద్ది

కపాసుకుద్ది కవిటి మండలంలో ఉంది. జై భరతమాత ఆలయం ఇక్కడ ఉండడంతో ఈ పల్లె పేరు దశదిశలా వ్యాపించింది. గ్రామం ఏర్పాటయ్యే తొలినాళ్లలో ఓ ఉదంతం జరిగింది. ఓ బ్రిటిషు అధికారి గ్రామ సందర్శనకు వచ్చినపుడు ఓ దృశ్యం ఎదురైంది. పత్తి పంటపై కోకొల్లలుగా పక్షులు విహరిస్తున్నాయి. వెంటనే ఆ ఘటన తన కెమెరాలో బంధించారు. 'కపాసు కుట్టే' అని వాఖ్యానించారు. కపాసు అంటే హిందీలో పత్తి, కుద్దే అంటే వృక్షాల సమూహం. ఇలా ఆ ఊరికి ఈ పేరు వచ్చింది. మత్స్యకారులు హెచ్చు సంఖ్యలో ఇక్కడ ఉన్నారు. ఈ విషయాన్ని స్థానికుడు బడే జాగ్గారావు తెలిపారు.

బాతువ

బాతువ జి.సిగడాం మండలంలోని ఓ గ్రామం. గతంలో ఈ పల్లెలో బాతుల పెంపకం ఎక్కువగా ఉండేది. దీంతో ఈ పల్లెకు బాతు అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో బాతువగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. ఇక్కడ రైల్వే హాల్టు, ఎస్.బి.ఐ, జడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఇక ఇదే మండలంలో ఆబోతులపేట, గేదెలపేట, నక్కపేట పేర్లతో పల్లెలున్నాయి.

కోడిశ

కోడిశ పేరుతో శ్రీకాకుళం జిల్లాలో రెండు పల్లెలున్నాయి. రేగిడి మండలం, సీతంపేట మండలాల్లో కోడిశ పేరుతో గ్రామాలున్నాయి. కేవలం అప్పట్లో కోళ్ల పెంపకం హెచ్చుగా ఉన్నందున కోడిశ అని ప్రజలు తమ పల్లెలకు నామకరణం చేసుకున్నారు.

కేదారిపురం

కేదారిపురం శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో ఓ గ్రామం. కేదారం అంటే వరి పండించే పొలం. మనిషికి జీవనాధారమైన వరి పంటను ప్రాణ ప్రదంగా భావించి ఈ పల్లెకు కేదారిపురం అనే పేరు పెట్టుకున్నారు. ఈ గ్రామం విశేషమేమిటంటే గాంధీజీని శక్తి స్వరూపంగా భావించి కొలుస్తున్న ఏకైక గ్రామం ఇది. 1927 డిసెంబరు నెలలో బాపూజీ ఈ పల్లెను సందర్శించినప్పటి నుంచి ప్రతి ఏటా గాంధెమ్మ సంబరాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను జరిపిన తరువాతనే పొలాల్లోకి అడుగు పెడతారు. ఊరి వారంతా ఓ చోట చేరి గాంధీజీ చిత్రపటానికి పూజలు చేస్తారు. ఆ మహాత్ముని దివ్య ఆశీస్సులతోనే పంటలు బాగా పండుతున్నాయని పల్లెవాసుల విశ్వాసం.

గాడిదపాయి

గాడిదపాయి సీతంపేట మండలంలోని కిల్లాడ పంచాయితీ పరిధిలో ఉంది. ఈ పల్లె కొండలమీద ఉంది. చుట్టూ అరణ్యం ఉంది. కొండలపై నుంచి వచ్చే నీరు కొండ కింద భాగంలో వాగులు, వంకలు, పాయలుగా ఏర్పడ్డాయి. గ్రామంలో గిరిజనులు తమ వ్యవసాయ ఉత్పత్తులను వేరే ప్రాంతాలకు రవాణా చేసేటప్పుడు గాడిదల సేవలను అప్పట్లో వినియోగించేవారు. ఈ నేపథ్యంలో ఆ పల్లెకి గాడిదపాయి అనే పేరు పెట్టారు. ప్రాథమిక పాఠశాల, ఆంగన్‌వాడీ కేంద్రం ఇక్కడ ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన కూరంగి ముఖలింగం ఏజెన్సీ గిరిజనోద్యమంలో కీలక పాత్ర పోషించారు.

కునుకుపేట

ఈ పల్లె శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని కిల్లిపాలెం పంచాయితీ పరిధిలో ఉంది. కునుకు అంటే చిన్న నిద్ర అని మనం అనుకోవచ్చు. అయితే ఈ సందర్భంలో ఆ అర్థం వర్తించదు. కునుకు ఇంటి పేరుతో ఏర్పాటైన పల్లె ఇది. జనాభా 300. ఇందులో సగం మంది ఇంటి పేర్లు కునుకు పేరుతో ఉన్నాయి. అందుకే ఈ పల్లెకు కునుకుపేట అనే పేరు వచ్చింది. ఈ విషయాన్ని జిల్లా తెరవే కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి, ఉపాధ్యాయుని లలితారెడ్డి పేర్కొన్నారు.

కొరసవాడ

కొరసవాడ పాతపట్నం మండలంలోని ఓ గ్రామం. చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... కోరా అనే పదం నుంచి కొరస వచ్చింది. కోరా అంటే చలువ (కుంభీ) చేయని వస్త్రం, విశేష వస్త్రం అని కూడా గ్రహించవచ్చు. వాడ అంటే ప్రాంతం. ఇలా కొరసవాడకు ఆ పేరు వచ్చిందని స్థానిక రచయిత పూతి చంద్రభూషణం తెలిపారు. మగ్గాల శబ్దాలతో ఈ పల్లె ప్రతిధ్వనిస్తుంది. గాంధీ, వివేకానందుని విగ్రహాలు ఉన్నాయి.

కుప్పిలి

కుప్పిలి ఎచ్చెర్ల మండలంఓని ఓ తీర ప్రాంత గ్రామం. ఈ పల్లెకు ఆ పేరు ఎల వచ్చిందంటే... చాలా కాలం కితం ఇక్కడి శివలింగం భూమి దిగువ భాగం నుంచి సుమారు 30 అడుగుల ఎత్తు కలిగి ఉండేది. శివలింగం శిఖర భాగాన పూజించాలని మట్టిని కుప్పగా లింగంపై ఎత్తు వరకూ వేసినందున కుప్పేశ్వరస్వామిగా పేరు వచ్చింది. స్వామి వారి పేరు

కలిసొచ్చే విధంగా కుప్పిలిగా తమ పల్లెకు పేరు పెట్టారు. గోనగన్నారెడ్డి వంశపు ఆడపడుచు కుప్పాంచిక పేరు మీదుగా కూడా కుప్పిలి అనే పేరు వచ్చినట్టుగా రెడ్డి రాజుల చరిత్ర అగ్యయనవేత్త అలపాన త్రినాథరెడ్డి పేర్కొన్నారు. ఈ పల్లెకు చెందిన దివంగత బల్లాడ ఎర్రయ్య రెడ్డి అపర దానకర్ణునిగా ఎనలేని కీర్తిని పొందారు. అతని కుమారుడు హరప్పలరెడ్డి ఎచ్చెర్ల శాసనసభ్యునిగా రెండు సార్లు ఎన్నికయ్యారు. అతని కుమారుడు బి.వి.రమణారెడ్డి రెండుసార్లు ఎచ్చెర్ల ఎం.పి.పిగా ఎన్నికయ్యారు. ఇదే కుటుంబానికి చెందిన బల్లాడ జనార్ధనరెడ్డి, అతని భార్య హేమమాలిని రెడ్డి ఇదే మండలం నుంచి ఎం.పి.పిగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం డా||బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఉపకులపతిగా ఆచార్య నిమ్మ వెంకటరావు స్వగ్రామం ఇదే. కాగా హేమమాలినిరెడ్డి రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పోరేషన్ అధ్యక్షురాలిగా, అలపాన త్రినాథరెడ్డి నెడ్‌క్యాప్ డైరెక్టర్‌గా 2021లో నియమితులయ్యారు.

కునుకుపేట

కునుకుపేట శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని కిల్లిపాలె పంచాయితీ పరిధిలో ఉంది. జనాభా 300. ఇంటి పేరుతో ఏర్పాటై పల్లె ఇది. జనాభాలో సగం మంది ఇంటి పేర్లు కునుకు పేరుతో ఉన్నాయి. అందుకే ఈ పల్లెకు కునుకు పేట అనే పేరు వచ్చింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు ఆర్.వి.రమణమూర్తి, లలితారెడ్డి రచయితతో మాట్లాడుతూ అన్నారు. కాగా కునుకు అంటే చిన్న నిద్రలో తూగిపడటం. అయితే ఈ సందర్భంలో ఆ విధంగా గ్రహించకూడదు.

పొత్తంగి

పొత్తంగి గ్రామం మందస మండలంలోని ఓ మారుమూల గ్రామం. ఈ ఊరిలోని పొట్టీశ్వర (పొత్తీశ్వరుడు) ఆలయం పేరుతోనే పొత్తంగి అనే పేరు వచ్చింది. ఇది మందస పట్టణానికి 7 కి.మీ దూరంలో ఉంది. క్రీ.శ 11వ శతాబ్దం నుంచి ఈ గ్రామం ఉనికిలో ఉన్నది. మహేంద్రతనయ నది ఒడ్డున ఉన్న ఈ గ్రామానికి పొట్టీశ్వర ఆలయం వల్లనే మంచి గుర్తింపు వచ్చింది. ఆలయంలోని పొట్టీశ్వరుని శివలింగం గర్భగుడిలో చాలా లోతు ఉంటుంది. మెట్లు దిగుతూ కిందకు వెళ్లాలి. ఈ శివలింగాన్ని చేతితో తాకితే పొట్ట (కడుపు) భాగంలా తగులుతుంది.

మతలబుపేట

మతలబుపేట సరుబుజ్జిలి మండలంలోని ఓ గ్రామం. ఆ ఊరికి ఈ పేరు ఎలా వచ్చిందంటే.... తొలుత ఈ గ్రామం పేరు 'గజదేవపురం'. ఇలా ఉండగా అప్పట్లో ఈ పల్లెలో మతలబు చేసే వ్యక్తులు కొందరు ఉండేవారు. మతలబు అంటే విషయం ఒకటైతే దాన్ని తారుమారు చేసి చెప్పడం. అలాంటి వ్యక్తుల కారణంగా ఈ గ్రామానికి మతలబుపేట అనే పేరు వచ్చినట్టు స్పష్టమైంది. ఇక్కడ చెవిటిపోలమ్మ నీలమ్మతల్లి, శ్రీరామాలయం ఉన్నాయి. ఈ పంచాయితీ పరిధిలోనే చినమతలబుపేట అనే పల్లె కూడా ఉన్నది.

గోకర్ణపురం

కంచిలి, మెళియాపుట్టి మండలాల్లో గోకర్ణపురం పేరుతో గ్రామాలు ఉన్నాయి. పూర్వగాంగుల ఇష్ట దైవం గోకర్ణేశ్వరస్వామి. గోకర్ణేశ్వరస్వామి ఆలయం ఆంధ్రా - ఒడిషా సరిహద్దుల్లోని మహేంద్ర గిరిపై ఉంది. గాంగ వంశ రాజులు తొలుత మైసూరు నుంచి వలస వచ్చి

గోకర్ణేశ్వరుని పూజించి ఆలయ అనుగ్రహంతో కళింగ దేశాన గాంగ రాజ్యాన్ని స్థాపించారు. ఆ దేవుని పేరుతోనే ఈ గ్రామాలు ఏర్పడినట్టు చరిత్ర చెబుతోంది. అలాగే పొందూరు మండలంలో గోకర్ణపల్లి అనే పేరుతో ఓ గ్రామం వెలసింది.

గంగువాడ

ఈ గ్రామం పాతపట్నం మండలంలో ఉంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... గంగ వంశ రాజుల పాలనా ప్రభావంతో ఆ పేరు వచ్చినట్టు చారిత్రక కథనం. ■



నాగావళి నాట్య తరంగిణి–శ్రీకాకుళం

ఉమ్మడి విజయనగరం జిల్లా

పత్తికాయవలస

పత్తికాయవలస ఓ కుగ్రామం. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో ఉంది. ఈ ఊరి పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ఈ ప్రాంతంలో ఓ దశాబ్ద కాలం క్రితం వరకూ కొండపత్తిని విస్తారంగా పండిరచేవారు. అంచేతనే ఊరికి తగ్గట్టుగానే రెవెన్యూ పంచాయితీ రికార్డుల ప్రకారం పత్తికాయవలస అనే పేరు ఉంది. ఇందులో సందేహం లేదు. అయితే ఈ గ్రామాన్ని ఆనుకొని పాలవలస అనే పల్లె కూడా ఉంది. ఇతర ప్రాంతాల వరికి సైతం స్పష్టంగా అర్థమయ్యేందుకు జన వ్యవహారంలో పత్తికాయ పాలవలస అని పిలుస్తారు. స్థానిక యువజనులు ఈ విషయాన్ని రచయితకు తెలిపారు.

పాంచాలి

పాంచాలి పల్లె విజయనగరం జిల్లాలోని పాచిపెంట మండలంలో ఉంది. పాంచాలి పేరు వెనుక గల చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చరిత్రకు ఇతిహాస పరంగా ఓ కథనం. శాస్త్రీయపరంగా మరో కథనం వినిపిస్తోంది. ఇక వివరాల్లోకి వెళితే ఇతిహాసపరంగా పంచపాండవులు ధర్మపత్ని ద్రౌపదితో సహా వనవాసకాలంలో ఈ ప్రాంతంలో కొన్నాళ్లు గడిపినట్లు చెబుతారు. ఇతిహాసంపై ఉన్న అపార విశ్వాసంతో తమ జనావాసానికి 'పాంచాలి' అనే పేరు పెట్టినట్టు పేర్కొన్నారు. ఒకప్పుడు

ఈ ప్రాంతం నందపుర రాజుల పాలనలో ఉండేదని ప్రముఖ సాహితీ బంధువు జె.బి.తిరుమలాచార్యులు వివరించారు. శాస్త్రీయ పరంగా కొండ పక్కన ఉన్న ప్రదేశాలకు 'పంచ' అనే పదం కొన్ని చోట్ల చేరుతుంది. 'ఆలి' అంటే భార్య అనే అర్థంతో పాటు భూమి అనే అర్థం కూడా ఉంది. ఇలా పాంచాలి అయింది.

చెల్లంనాయుడు వలస

ఇది విజయనగరం జిల్లా సీతానగరం మండలంలో సువర్ణముఖి నది తీరాన ఉంది. చెల్లంనాయుడు అనే వ్యక్తి తన కుటుంబంతో ఇక్కడికి వచ్చి ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. జీవనోపాధి కోసం ఈ ప్రాంతానికి వలస వచ్చాడు. ఆయన పేరుతో ఈ పల్లెకు చెల్లంనాయుడు వలస అనే పేరు వచ్చినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామ జనాభా వెయ్యి లోపు మాత్రమే. ఇక్కడి చింత చెట్లపైకి వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సైబీరియా పక్షులు వలస వస్తుంటాయి.

రావుపల్లి

రావుపల్లి గరుగుబిల్లి మండలంలోని పెద్ద గ్రామాల్లో రెండవది. జనాభా 3500 వేలు. ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే శిష్ట కరణ సామాజిక వర్గానికి చెందిన రావుపల్లి వంశీయులు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ పల్లెకు రావుపల్లి అనే పేరు వచ్చింది. అయితే ఆ కుటుంబాలన్నీ వలస పోయాయి. సత్యసాయి, సంతోషిమాత ఆలయాలున్నాయి. ఉత్తర దిశలో నాగావళి, పశ్చిమ దిశలో తోటపల్లి జలాశయం కాలువ ఉంది.

రావివలస

ఇది వృక్ష సంబంధమైన పేరు. చెట్టు వల్ల కొన్ని గ్రామాలకు తొలి పదంగా ఇది చేరింది. రావివలస పేరుతో పలు పల్లెలున్నాయి. విజయనగరం జిల్లా గరుగుబిల్లి, గంట్యాడ, మెరకముడిదాం, అలాగే శ్రీకాకుళం జిల్లా టెక్కలి, రణస్థలం మండలాల్లో ఇదే పేరుతో గ్రామాలున్నాయి.

లక్కవరపుకోట

లక్కవరపుకోట మండల కేంద్రం. విశాఖపట్నం - అరకు మార్గంలో ఉన్నది. ఆ పేరు వెనుక గల చరిత్రను గమనిస్తే.... అప్పట్లో లక్కమాంబ అనే దేవత ఆలయం ఈ ప్రాంతంలో ఉండేది. ఈ ఆలయం ఎదుట చిన్న తులసికోట కూడా ఉంది. ఇలా ఆ గ్రామానికి ఆ పేరు వచ్చింది. అయితే ఈ ఆలయం కాల గర్భంలో కలిసిపోయింది. ఏమైనప్పటికీ ఈ గ్రామానికి లక్కవరపుకోట అనే పేరు వచ్చింది. బ్రిటిషు వారి గెజిట్‌లో కూడా ఈ పేరు ప్రస్తావన ఉంది. దీన్ని 'ల' కారపు కోట అని కూడా పిలుస్తారని ప్రముఖ సాహితీ బంధువు, రచయిత కందాళ రామకృష్ణ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. గ్రామంలోని నాగేశ్వరాలయంలో పురాతన లిపితో ఓ శిలాశాసనం ఉంది. మసీదు, చర్చి కూడా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు ఎంతో సమైక్యతతో ఉంటారు. కులమతాలకు అతీతంగా జీవనం సాగిస్తుంటారు. అక్షరాస్యత శాతం బాగా పెరుగుతోంది.

కొత్తవలస

కొత్తవలస విజయనగరం జిల్లాలోని ఓ ముఖ్య కేంద్రం. మండల కేంద్రం. రైల్వే కూడలి కూడా. ఓ పక్క హౌరా-చెన్నై రైల్వే మార్గానికి మరో పక్క అరకు, కిరండోలు మార్గానికి కూడలిగా ఉంది. ఈ గ్రామ జనాభా 14,321. ఈ గ్రామం పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు గుర్తుకువస్తాయి. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా 1942 ఏప్రిల్ 26న ఉదయం జపాన్ దేశం విశాఖపట్నం సాగరతీరంలో యుద్ధ విమానాలు నుంచి ప్రత్యర్థి శిబిరానికి చెందిన యుద్ధ నౌకపై బాంబులు వేసేందుకు ప్రయత్నించింది. అయినా ఆ బాంబులు గురి తప్పడంతో వెనుదిరిగారు. బాంబులు శబ్దానికి విశాఖపట్నం ప్రజలు భయభ్రాంతులయ్యారు. భవిష్యత్తులో బాంబు దాడులు జరుగుతాయన్న ముందు చూపుతో పలువురు ప్రజలు ఈ ప్రాంతానికి 30 కి.మీ దూరంలో ఉన్న ఓ చోటుకి కుటుంబాలతో సహా వలస వచ్చారు. తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న గ్రామంలో స్థిరపడ్డారు. దీనికి కొత్తవలస అని నామకరణం చేసుకున్నారు. ఈ విషయాన్ని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త బి.వి. అప్పారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వడ్లమాని శ్రీనివాసరావు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. విశాఖపట్నం పాత పోస్టాఫీసు సమీపంలోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో దశాబ్దం క్రితం నిర్మాణ పనులు చేపడుతున్నప్పుడు, అప్పట్లో జపనీయులు తీసుకువచ్చిన బాంబు ఒకటి బయటపడింది. కాగా 1942 బాంబు దాడి ప్రభావం వల్ల ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కొన్ని తరగతులను ముందు జాగ్రత్తగా గుంటూరుకు తరలించినట్లు చరిత్ర చెబుతోంది.

నెల్లిమర్ల

నెల్లిమర్ల ఓ మండల కేంద్రం. నెల్లి అంటే ఉసిరి చెట్టు. ఆ రోజుల్లో గ్రామం ఏర్పాటు చేసినపుడు ఈ ప్రాంతంలో ఉసిరి చెట్లు ఎక్కువగా ఉండేవి. ఇక్కడకు సమీపంలో కొండలుండేవి. దీంతో తమ గ్రామానికి నెల్లిమరువు అని పేరు పెట్టారు. కాలగమనంలో, జనవ్యవహారంలో మరువు కాస్త మర్లగా మారి నెల్లిమర్లగా స్థిరపడింది.

తంగుడుబిల్లి

తంగుడుబిల్లి విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలో నెలకొని ఉంది. తంగేడు చెట్లు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండడంతో దీనికి తొలుత తంగేడుపల్లి అనే పేరు వచ్చింది. లోక వ్యవహారంలో తంగుడుబిల్లిగా స్థిరపడిరది. తంగేడు పూలంటే వినాయకునికి ఎంతో ప్రీతి పాత్రమైనవి. ఈ చెట్ల పేరుతోనే తమ గ్రామానికి తంగుడుబిల్లి అని పేరు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పట్నాయకుని రామానుజం ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

తాటిపూడి

తాటిపూడి అనగానే మనకు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చేది రిజర్వాయర్. తాటిపూడి విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలో ఉంది. ఈ గ్రామ జనాభా వెయ్యి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో తాటిచెట్లు విపరీతంగా ఉండేవి. సమీపంలోనే గోస్తనీ నది పై ఓ జలాశయాన్ని నిర్మించారు. ఇలా గ్రామానికి తాటిపూడి అనే పేరు వచ్చింది. పూడి అంటే జల సూచిక అనే అని అర్థం.

సతివాడ

సతివాడ నెల్లిమర్ల మండలంలోని ఓ గ్రామం. ఇక్కడ తపాలా శాఖ కార్యాలయం, ఉన్నత పాఠశాల ఉన్నాయి. అయితే సతివాడ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే..... సతి అంటే పతివ్రత అని అర్థం. ఉదాహరణకు సతీ అనసూయ, సతీ సావిత్రి అనే ప్రయోగాల నుంచి ఉదాహరించవచ్చు. తమ పల్లె కూడా సతి అనే మంచి విశేషణంతో వర్థిల్లాలని అప్పట్లో పెద్దలు ఈ పల్లెకు ఆ పేరు పెట్టారని స్థానికుల కథనాల వల్ల తెలుస్తోంది. నెల్లిమర్ల మండలం సతివాడ పేరుతో గతంలో అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఉండేది. ఇక్కడ ఓ బాలయోగి కొన్నేళ్ల పాటు తపస్సు చేసిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో సతివాడ పేరుతో ఓ గ్రామం ఉంది.

వెల్దాం

వెల్దాం గ్రామం వేపాడ మండలం, వీలుపర్తి పంచాయితీ పరిధిలో ఉంది. వేపాడకు 4కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామ జనాభా 540. మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉంది. ఇంతకీ ఆ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే..... 'ఆం' పదాంత గ్రామ నామం ఒరియా సంస్కృతికి చెందిన గ్రామ దేవత వెల్లమ్మ అనే పేరుతో ఈ గ్రామానికి ఆ పేరు వచ్చి ఉండొచ్చని తెలియ వచ్చింది. అయితే ఈ గ్రామ దేవత ఆచూకీ లేదు.

గుజ్జంగివలస

గుజ్జంగి అనే ఓ వృక్షం. వృక్ష ప్రాతిపదికన ఏర్పడిన గ్రామం. గుజ్జంగి జాతి మెక్కలు పేరుతో ఈపల్లె ఏర్పాటైంది. ఇది గుర్ల మండలంలో ఉంది. గ్రామ జనాభా 1292. ఇది పంచాయితీ కేంద్రం కూడా.

వసంత

వసంత అనే పేరుతో గల గ్రామం విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలో ఉంది. ఈ పల్లె జనాభా 2483. వసంత అనే ఇంటి పేరు గల కొన్ని కుటుంబాల వారు ఇక్కడ ఓ పల్లెను ఏర్పాటు చేసుకున్నారు. తమ ఇంటి పేరుతోనే ఈ పల్లెకు వసంత అని నామకరణం చేశారు. ఇంతటి అందమైన, అరుదైన పేరు తమ గ్రామానికి ఉండడం ఎంతో సంతోషంగా ఉందని స్థానికులు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. ఈ గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామీణ పశువుల అసుపత్రి ఉన్నాయి.

ఆలపర్తి

ఆలపర్తి గ్రామం గంట్యాడ మండలంలోని దిగువ కొండపర్తి పంచాయితీలో ఉంది. జనాభా సుమారు 50 మంది. ఆల అంటే ఆవులు అని అర్థం. పర్తి అంటే ఎత్తయిన ప్రాంతం. ఈ పల్లె ఎత్తయిన ప్రాంతంలో ఉంది. ఈ పల్లెలో ఒకప్పుడు ఆవుల సంఖ్య ఎక్కువగా ఉండేది. అయితే ప్రస్తుతం అయిదు మాత్రమే ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రామ వాలంటీర్ ఎస్.వరలక్ష్మి ఈ రచయితకు తెలిపారు. ఆలపర్తి పేరుతో పలువురి ఇంటి

పేర్లు కూడా ఉన్నాయి. ప్రముఖ రచయిత పిచ్చయ్య చౌదరి ఇంటి పేరు ఆలపర్తి.

యాటగానివలస

యాటగానివలస గ్రామం విజయనగరం జిల్లా పాచిపెంట మండలంలోని గొట్టూరు పంచాయితీలో ఉంది. పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.. ఓ వేటగాడు వేరే ప్రాంతాల్లో ఉపాధి దొరకకపోవడంతో ప్రత్నమ్నాయం లేక ఈ ప్రాంతంలోని ఓ నిర్జన ప్రదేశంలో తాటాకుల ఇళ్లు కట్టుకున్నాడు. క్రమేపీ అది ఓ పల్లెగా రూపుదిద్దుకుంది. ఈ పల్లెకు ఆద్యుడైన వేటగాని పేరు కలిసొచ్చే విధంగా వేటగానివలస అయింది. క్రమంగా జనవ్యవహారంలో యాటగానివలస అయిందని కథనం. ఈ పల్లె జనాభా 360 మాత్రమే. 95 శాతం మంది గిరిజనులే ఉన్నారు. గిరిజన గురుకుల పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం ఇక్కడ ఉన్నాయి.

జమ్ము

జమ్ము అనగానే అకస్మాత్తుగా గుర్తుకువచ్చేది జమ్ము, కాశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతాలు. అయితే జమ్ము పేరుతో విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని జమ్ము శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం జమ్ము పేరుతో గ్రామాలు ఉండడం విశేషం. జమ్ము తొలి రూపం జమ్మి. జమ్మి వృక్ష సూచి అప్పట్లో ఇక్కడ జమ్మి చెట్లు ఉన్నందున జమ్మి అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో జమ్ముగా మారింది. గ్రామ జనాభా 1417 మంది. కాగా ప్రస్తుతం రెండు పల్లెల్లో కూడా జమ్మి చెట్లు అంతరించిపోయాయి.

కొండబారిడి

శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటం ప్రకృతి వ్యవసాయం అనే అంశాలను ప్రస్తావించినపుడు కొండబారిడి గ్రామం విధిగా గుర్తుకు రాక మానదు. అంతటి విశిష్టమైన గ్రామం కొండబారిడి. ఈ గ్రామం విజయనగరం జిల్లా కురుపాం మండలంలో ఉంది. ఈ పల్లె కీర్తి కిరణాలు జాతీయ స్థాయిలో సైతం ప్రసరిస్తున్నాయి. ఈ పల్లె చుట్టూ కొండలు విస్తరించి ఉన్నాయి. గిరిజన తెగల వారి జీవన విధానం కొండలతోనే ముడిపడి ఉంది. ఈ ప్రాంత సమీపంలోని 'శబర' జాతి తెగల వారిలో కొందరు కొండ బారెడు దూరంలోనే కదా.. ఉంది అక్కడ ఆవాసాలు ఏర్పాటై చేసుకుందామని భావించి ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. కొండ బారెడు దూరంలో ఉందనే వారి అంతరంగాన్ని ఆవిష్కరించుకోవడంతో ఈ పల్లెకు కొండబారెడు అని నామకరణం చేసుకున్నారు. జన వ్యవహారంలో కొండ బారెడు క్రమంగా కొండబారిడిగా స్థిరపడిరది. గ్రామ జనాభా 400 మాత్రమే. ఈ గ్రామ రాష్ట్రంలోనే తొలి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా అవతరించింది. ఇద్దరు ఉపాధ్యాయుల వల్ల ఈ గిరిజన గ్రామానికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎనలేని గుర్తింపు వచ్చింది. ఒకరు వెంపటాపు సత్యం మరొకరు డి.పారినాయుడు. 1962-63ల్లో వెంపటాపు సత్యం అనే ఉపాధ్యాయుడు గిరిజన రైతాంగ ఉద్యమానికి ఊపిరి పోశారు. కొండబారిడి దళం కూడా ఏర్పాటైంది. నక్సల్ గ్రామంగా ముద్రపడిరది. ప్రస్తుతం ఈ ఊరు శతశాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తొలి గ్రామంగా నిలిచింది. జట్టు ట్రస్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు ఈ ప్రక్రియకు ఆద్యులు. ఇంకా మరో 93 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కొనసాగుతోంది. యు.ఎన్.ఓ వారు

అసిస్టెంటు జనరల్ సత్యపాలే త్రిపాఠి, ఎ.పి రైతు సాధికారిక సంస్థ వైస్. చైర్మన్ టి.విజయకుమార్ ఈ గ్రామాన్ని సందర్శించిన ప్రముఖుల్లో ఉన్నారు.

చిలకలపల్లి

చిలకలపల్లి విజయనగరం జిల్లా బలిజిపేట మండలంలోని పెద్ద గ్రామాల్లో ఒకటి. అప్పట్లో ఇక్కడ మామిడి తోటలు చాలా ఎక్కువగా ఉండేవి. దీంతో ఈ చెట్ల పై అసంఖ్యాకంగా చిలుకలు ఉండేవి. దీంతో ఈ జాన పదానికి చిలకలపల్లి అనే పేరు వచ్చింది. ప్రస్తుతం తోటల సంఖ్య తగ్గి పోయింది. ఫలితంగా చిలకల రాక మందగించింది. ఇక్కడి గాంధీ మెమోరియల్ లెప్రసీ ఫౌండేషన్ (1953) అందిస్తున్న సేవలు మరపురానివి. చిలకలపల్లి ఇంటి పేరుగా గలిగిన సామాజిక వర్గాల్లో శిష్టకరణాలు, రజకులు ఉన్నారు. ఫౌండేషన్ స్థాపనలో నాటి సర్పంచ్ దేవులపల్లి కొండలరావు కీలక పాత్ర పోషించారు.

ఎల్విన్‌పేట... జి.ఎల్.పురం.... భద్రగిరి

ఎల్విన్‌పేట, జి.ఎల్.పురం, భద్రగిరి గ్రామాలు కలసి ఉంటాయి. ఇది విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఉన్నాయి. ఆంగ్లేయుల పాలనా కాలంలో బ్రిటిష్ ఉన్నతాధికారి ఎల్విన్ ఓ రోజున గిరిజన గ్రామాలను పర్యటిస్తూ ఈ ప్రాంతంలో కొన్ని రోజులు పాటు విడిది చేసినందున ఎల్విన్ పేట అనే పేరు వచ్చింది. గుమ్మలక్ష్మీపురం (జి.ఎల్.పురం) లక్ష్మీదేవి పేరుతో ఏర్పాటైంది. లక్ష్మీపురంలో అనేక గ్రామాలున్నందున గుమ్మ సమీపంలోనే ఉన్న ఈ గ్రామానికి గుమ్మలక్ష్మీపురం అనే పేరు వచ్చింది. కాగా భద్రగిరికి సంబంధించి

ఇక్కడ గల కొండను భద్రగిరిగా పిలుస్తారు. భద్ర అంటే గోవు, గిరి అంటే కొండ. గిరి సమీపంలో గోవులు పెద్ద సంఖ్యలో మేతకు వచ్చేవి. దీంతో భద్రగిరి అనే పేరు వచ్చింది. ఈ గిరిపై ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. మరో విశేషమేమిటంటే ఒకప్పుడు ఇది పంచాయితీ సమితి కేంద్రం.

నిడగల్లు

నిడగల్లు గ్రామం సీతానగరం మండలంలో ఉన్నది. పేరుకు తగిన ఊరు ఇది. నిడగల్లు అంటే దీర్ఘమైన కొండ అని అర్థం. నిడు అంటే పొడవైనది. కల్లు అంటే రాయి లేదా కొండ అని భావం. లోకవ్యవహారంలో నిడగల్లుగా మారింది. ఇది ఊరికి ఆనుకొని ఉంది. పాపమ్మ వలసనుంచి ఒకటున్నర కి.మి దూరంలో గల ఈ గ్రామం వరకూ విస్తరించి ఉన్నది. సర్వే నెంబరు ఒకటిలో ఉన్న ఈ కొండ విస్తీర్ణం 600 ఎకరాలు. కొండ దిగువ భాగంలో జీడి, టేకు పంటలు పండిస్తున్నారు. గ్రామ జనాభా 3376. ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయం ఉన్నాయి. ■



ఉమ్మడి విశాఖపట్నం జిల్లా

దిమిలి

దిమిలి గ్రామం విశాఖపట్నం జిల్లా రాంబిల్లి మండలంలో ఉంది. యలమంచిలికి 6 కి.మీ దూరంలో ఉంది. దిమిలి తొలి పేరు దివ్వెలపురం. ఇది సాగర తీరానికి సమీపంలో ఉంది. నౌకలకు సూచికంగా ఎత్తయిన దీపస్తంభం (లైటు హౌసు) పై దివ్వెలను వెలిగించేవారు. అందుచేత తొలుత ఈ ప్రదేశానికి దివ్వెలపురం అనే పేరు వచ్చింది. కాల గమనంలో దివ్వెలపురం దిమిలిగా రూపాంతరం చెందింది. అయితే నేడు ఈ దీప స్తంభ ఆనవాళ్లు గాని, అవశేషాలు గాని కాగడా పెట్టి వెతికినా కనిపించవు. స్వాతంత్ర్య సమరంలో ఈ ప్రాంతంలో సహాయ నిరాకరణ ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వాతంత్ర్య రజోత్సవాలను పురస్కరించుకొని 1972లో ఓ స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. ఈ గ్రామ జనాభా ఎనిమిది వేలు. గ్రామంలోని నగ్నలింగేశ్వరస్వామి ఆలయం అత్యంత ప్రాచీనమైనది, 13వ శతాబ్దం నాటిది. ఈ పవిత్ర దేవాలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ గ్రామ చరిత్ర గురించి పలువురు పరిశోధనలు జరపడం విశేషమని స్థానిక సీనియర్ పాత్రికేయుడు బుదిరెడ్డి అప్పారావు ఈ రచయితకు తెలిపారు. చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పాలించడంతో ఈ గ్రామానికి చారిత్రక ప్రాధాన్యం ఏర్పడిరదని పేర్కొన్నారు.

కాన్వెంటు జంక్షన్ (విశాఖ)

ఓ ప్రసిద్ధ కాన్వెంటు పేరుతో ఏర్పాటైన కాన్వెంటు జంక్షన్ విశాఖ పట్నంలోని ఓ ముఖ్యమైన ప్రాంతం. ఇక్కడ ఫ్లై ఓవర్ కూడా ఉంది. అయితే దీని తొలిపేరు తుమ్మెదల మెట్ట అయితే దీనికి అప్పట్లో ఈ పేరు ఎలా వచ్చిందంటే.... విశాఖపట్నం పరిధిలోని సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలోకి 1750లో తురుష్కులు చొరబడి శిల్పాలను ధ్వంసం చేశారు. మిగిలిన సంపదను కూడా దోచుకోడానికి సిద్ధమవుతున్న తరుణంలో గోగులపాటి కూర్మనాథకవి ఆలయ గర్భగుడి తులుపులు మూసివేసి వెంటనే సింహాద్రిఅప్పన్నపై ఓ శతకం చెప్పారు. 68 పద్యాలు పూర్తికాగానే కంచు ముక్కులు గల తుమ్మెదలు దండుగా వచ్చి వారిని తుమ్మెదల మెట్ట (ప్రస్తుతం కాన్వెంటు జంక్షన్) వరకూ తరిమికొట్టాయి. దీంతో ఈ ప్రాంతాన్ని తుమ్మెదల మెట్టగా పిలిచేవారు. అయితే కాలక్రమంలో ఈ ప్రాంతాన్ని కాన్వెంటు జంక్షనుగా పిలుస్తున్నారు.

దువ్వాడ

దువ్వాడ విశాఖపట్నం జి.వి.ఎం.పి పరిధిలో ఉంది. గాజువాక రెవెన్యూ మండలంలో ఉంది. దువ్వాడ తొలిపేరు ద్విపాడ. ద్విపాడ అంటే రెండు వాడలు అని అర్థం. గ్రామం తొలుత రెండు వరుసల ఇళ్లతో ఏర్పాటైంది. దీంతో నాటి పెద్దలు ద్విపాడ అని పేరు పెట్టారు. జనవ్యవహారంలో దువ్వాడగా మారింది. ఇక్కడి రైల్వే స్టేషన్ ప్రసిద్ధి చెందింది.

ఖారవేల నగర్

ఖారవేల నగర్ విశాఖపట్నం జి.వి.ఎం.సి పరిధిలో సింహాచలం రైల్వే స్టేషనుకు కూతవేటు దూరంలో ఉంది. జి.వి.ఎం.సి 66వ డివిజనులో ఇది నెలకొంది. 1990లో ఖారవేల నగరనగా ఆవిర్భవించింది. ఈ ప్రాంతానికి దివంగత విశ్రాంత రైల్వే ఉద్యోగి సనపల ప్రకాశరావు నామకరణం చేశారు. కళింగ దేశాన్ని పరిపాలించిన రాజులలో తొలి కళింగ చక్రవర్తిగా ఖారవేలుడు సుప్రసిద్ధుడు. క్రీ.పూ 183 సంవత్సరంలో తన 24వ ఏట రాజుగా పట్టాభిషక్తుడయ్యాడు. ఆయన తన 14వ ఏటనే పరిపాలనా సంవత్సరంలో ఒడిశాలోని ఖండగిరి గుహల్లో హథీగుంఫ శాసనం వేయించాడు. ఉత్తరాన మగధ రాజులను జయించి గంగానది వరకు తన సామ్రాజ్యం విస్తరించినాడు. దక్షిణాన శాతవాహన రాజులను జయించి కృష్ణా నది వరకు తన ప్రాభవం ప్రసరించాడు. స్వతంత్ర కళింగ సామ్రాజ్యం నిర్మించి ప్రాచీన చరిత్రలో స్వర్ణయుగం సృష్టించిన ఘనత ఖారవేలునికి దక్కుతుంది. ఆ మహానుభావుని గుర్తుగా కళింగమైత్రి సామాజిక వర్గం వారు తమ ప్రాంతానికి ఖారవేల నగర్ అని పేరు పెట్టుకున్నారు.

పొట్నూరు

ఇది విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండల కేంద్రం. శ్రీ కృష్ణ దేవరాయలు తూర్పు దిగ్విజయ యాత్రలో భాగంగా పొట్నూరు గ్రామంలో క్రీ.శ1516లో తన విజయాలకు సంకేతంగా విజయస్థూపాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం అప్పట్లో ప్రతాప రుద్ర గజపతి ఏలుబడిలో

ఉండేది. రాయలు తన శౌర్య, పరాక్రమాలతో గజపతిని ఓడించాడు. అయితే గజపతి తన కుమార్తెను రాయలకిచ్చి పెళ్ళి చేయించాడు. ఈ విధంగా సంధి చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ గ్రామంలో ఉన్న విజయ స్థూపానికి చుట్టూ ప్రభుత్వం ప్రహరీ గోడ నిర్మించింది. పొట్నూరు ఇంటి పేరు గల వారు ఈ పల్లెను ఏర్పాటు చేశారు.

ఏటికొప్పాక

ఏటికొప్పాక అనగానే జాతీయ ప్రసిద్ధి చెందిన కొయ్య బొమ్మలు గుర్తుకువస్తాయి. ఈ గ్రామం పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.... ఈ గ్రామం విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి మండలంలో ఉంది. ఎలమంచిలికి 20 కి.మీ దూరంలో ఉన్న ఈ ఊరు వరాహనదీ తీరంలో ఉంది. క్రీ.శ 1300-1600 మధ్య తూర్పు చాళుక్య వంశానికి చెందిన కొప్పా రాజనారాయణ పేరు కలిసొచ్చే విధంగా ఈ ఊరి పేరులో చివరి పదంగా కొప్పాక చేరింది. తొలి పదంగా ఏరు చేరింది. ఊరు అనే పదానికి విభక్తి 'టి' చేరడంతో ఏటి అయింది. ఇలా ఏటికొప్పాకగా మారింది. అంకుడు కర్రను ఉపయోగించి కళాకృతులను రూపొందిస్తుంటారు. రంగురంగుల పిల్లల ఆట వస్తువులు, కొండగలు, చిలుకలు, కుందేళ్లు వంటి చూడముచ్చట గొలిపే కళారూపాలు, వినాయక, వెంకటేశ్వరస్వామి వంటి దేవతా ప్రతిమలను రూపొందిస్తుంటారు. ఈ హస్త కళల పరిశ్రమకు రెండు శతాబ్దాల చరిత్ర ఉంది. దేశ వ్యాప్తంగా జరిగే ప్రదర్శనల్లో ఇక్కడి కళాకృతులను విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

గోపాలపట్నం

గోపాలపట్నం విశాఖపట్నం జి.వి.ఎం.సి పరిధిలో ఉంది. గోపాల రాజు అనే వ్యక్తి పేరు మీదుగా దీనికి గోపాలపట్నం పేరు వచ్చింది. ఆయన లోగడ కోటగుత్తా, ఏనుగుల ద్వారం, గుర్రాల చెరువు, తాటిపెండు ప్రాంతాలను పాలించారు. తరువాత కాలక్రమంలో ఈ ప్రాంతాలన్నీ ఐక్యమై గోపాలపట్నంగా స్థిరపడిరది. సింహాచలం సౌత్ పేరుతో ఇక్కడ రైలు నిలయం ఉంది. ఇది మండల కేంద్రం కూడా.

చినముషిడివాడ

చినముషిడివాడ, పెదముషిడివాడ విశాఖపట్నం జిల్లాలోని రెండు గ్రామాలు. ముషిడి చెట్ల పేర్లతో ఈ జాన పదాలు ఏర్పడ్డాయి. ముషిడి చెట్ల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. దీనికి కాయలు ఉంటాయి. ఆ కాయలు నుంచి పిక్కలు తీసి ఆ పిక్కలను కన్నం పెట్టి పశువులకు మెడలో వేస్తారు. దీని వల్ల దోషం తగలదని చెబుతారు. ముషిడి చెట్లు కొమ్మలను పశువులు శాలలో పై కప్పుకు పెడతారు. ముఖ్యంగా చిన ముషిడివాడలోని శారదపీఠం పేరు పొందింది. ఇందులో స్వరూపానందస్వామి పీఠాధిపతిగా ఉన్నారు. రాజాశ్యామలాదేవి అమ్మవారిని భక్తులు దర్శించి తరిస్తుంటారు, కాగా పెద ముషిడివాడ, పరవాడ మండలంలో ఉంది.

హనుమంతవాక (విశాఖ)

తూర్పు కనుమల్లో పుట్టిన నీటి గెడ్డలు ఒకప్పుడు రెండు పెద్ద ఏటి ప్రవాహాలుగా విశాఖపట్నం మీదుగా ప్రవహించేవి. ఇందులో ఒకటి

హనుమంతవాగు. ఇది సింహాచలం కొండల్లో పుట్టిన గెడ్డల నుంచి ముడుసర్లోవ మీదుగా 15 కి.మీ దూరం ప్రవహించి లానన్స్ బే వద్ద సముద్రంలో కలిసేది. 1902లో ముడుసర్లోవ పార్కు జలాశయం నిర్మించిన తరువాత ఈ ఏరు కనుమరుగైంది. ఇప్పటి హనుమంతవాక జంక్షన్ ఆ వాగు పేరుతో వచ్చింది.

షీలానగర్ (విశాఖ)

షీలానగర్ విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకటి. భారత్ హేవీప్లేట్స్ అండ్ వెసెల్స్ (బి.హెచ్.పి.వి.) ఉద్యోగ సహకార సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అతి పెద్ద కాలనీల్లో ఇదొకటి. బి.హెచ్.పి.వికి 2 కి.మీ దూరంలో నిర్మించారు. సంస్థ అప్పటి సి.ఎం.డి కృషి ఫలితంగా దీన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ సంఘం ఇతని సతీమణి షీలా పేరుతో ఈ కాలనీ నిర్మించారు. ఈ విషయాన్ని విశ్రాంత ఉద్యోగి పల్లి ఇమాన్యూల్ తెలిపారు.

సిద్ధార్థ నగర్

సిద్ధార్థనగర్ విశాఖపట్నం గాజువాక ప్రాంతంలోని కణితి కాలనీల వద్ద ఉంది. ఇక్కడ బి.హెచ్.పి.వి. దిగువ శ్రేణి ఉద్యోగుల కోసం నిర్మించిన కాలనీల్లో ఇదొకటి. ఉద్యోగుల సహకార సంఘం అధ్వర్యంలో నిర్మించారు. గౌతమ బుద్ధుని పేరు మీదుగా సిద్ధార్థ నగర్ అని పేరు పెట్టారు. బుద్ధుని విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కాలనీకి ఆనుకొని మరికొన్ని ఆవాస ప్రాంతాలు కూడా వెలిశాయి.

సుజాతనగర్

విశాఖపట్నం పెందుర్తి ప్రాంతంలో బి.హెచ్.సి.వి. ఉద్యోగుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మితమైన అతిపెద్ద కాలనీ. ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడిన ఆ సంస్థ ఉన్నతాధికారి సతీమణి సుజాత పేరుతో సుజాత నగర్ కాలనీ ఏర్పాటు చేశారు. విశాఖపట్నం జి.వి.ఎం.సి పరిధిలో నిర్మించిన కాలనీల్లో ఇదొకటి. ఈ కాలనీ ప్రాంతంలోనే మరెన్నో ఆవాసాలు ఉన్నాయి.

కాకరపాడు

కాకరపాడు పేరుతో వివిధ గ్రామాలు విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో అప్పట్లో కాకర పాదులు గ్రామ శివార్లలో ఎక్కువగా ఉన్నందున కాకర్ల పాడు అనే పేరు వచ్చింది. పాడు అంటే పాటి నేలయని గ్రహించాలి. అనంతగిరి, గూడెం కొత్త వీధి, కొయ్యూరు మండలాల్లో ఈ పేరుతో గ్రామాలు వెలిశాయి. ఇక కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలంలో కూడా కాకరవాడ పేరుతో ఓ గ్రామం ఉంది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో కూడా కాకరాపల్లి పేరుతో ఓ పల్లె ఉంది.

లంబసింగి

ఆంధ్రా కాశ్మీరుగా ప్రసిద్ధి చెందిన లంబసింగి గ్రామం చింతపల్లి మండలంలో ఉంది. తూర్పు కనుమల్లో నర్సీపట్నం నుంచి సీలేరు వెళ్లే మార్గంలో ఉంది. లంబసింగి గ్రామానికి ఆ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. గ్రామం ఏర్పాటుకు తొలినాళ్లలో

బాగా పొడవుగా (లంబ) - లంబాడీ తెగకు చెందిన సింగన్న అనే దొంగ ఓ ఇంట్లో చోరీకి పాల్పడి దొరికిపోయాడు. గ్రామీణులంతా సింగన్నకు దేహశుద్ధి చేసారు. తరువాత ఆరు బయట చెట్టుకు కట్టేశారు. తెల్లవారే సరికి చూస్తే కొర్రులా మారిపోయి మరణించాడు. తమ ఊరిలో పొడవాటి ఆజానుబాహుడైన (లంబ) సింగన్న పేరు కలిసొచ్చే విధంగా లంబసింగి అని నామకరణం చేశారు. ఈ పల్లెకు కొర్రుబయలు అని కూడా పిలుస్తారు. సముద్రమట్టానికి 3600 అడుగుల ఎత్తున ఉన్న ఈ గ్రామం అన్ని కాలాల్లోను చల్లగా ఉంటుంది. నవంబరు నుండి ఫిబ్రవరి చివరి వరకే విపరీతమైన చలి ఉంటుంది. వేసవి కాలంలో సాధారణంగా ఉంటుంది.

మంగవరం

మంగవరం పాయకరావుపేట మండలంలో ఉంది. తాండవ నదీ తీరంలో వెలసి ఉంది. ఈ పల్లెలో ఒకప్పుడు గిరిజనులు హెచ్చు సంఖ్యలో ఉండేవారు. మంగి అనే గిరిజన స్త్రీ గొప్ప పతివ్రత. చనిపోయిన తరువాత పేరంటాలు అయింది. ఆమెను దేవతగా భావించి తమ ఊరికి తొలుత ఉన్న పేరును తొలగించి మంగి వరంగా పేరు పెట్టారు. జనవ్యవహారంలో మంగవరంగా మారింది. గ్రామ జానాభా 4830. ప్రముఖ పద్యకవి, నాటకకర్త విశ్రాంత తేజోమూర్తుల వెంకటేశ్వరరావు 'మంగవరం వైభవం' అనే పరిశోధన గ్రంథాన్ని రాశారు.

పెద్దిపాలెం

పెద్దిపాలెం పాయకరావుపేట మండలంలో ఉంది. ఈ పల్లెలో గుడివాడకు చెందిన పేరిచర్ల పెద్దిరాజు అనే దాత కొందరు రైతులకు ఇళ్ల

భూములను దానం చేశారు. ఆయన పేరుతోనే ప్రజలు తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న గ్రామానికి పెద్దిరాజుపాలెం అని నామకరణం చేశారు. లోక వ్యవహారంలో పెద్దిపాలెంగా మారింది. కాగా పాలెం అనే పేరు పల్లెకు రూపాంతరమని గ్రహించాలి. ఈ గ్రామ పొలాల్లో ఈశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. గ్రామీణులు ఈ మేరకు ఈశ్వరునికి ఆలయాన్ని నిర్మించారు.

గుంటపల్లి

గుంటపల్లి పాయకరావుపేట మండలంలో తాండవ నదీ తీరాన ఉంది. రైతులు పొలాల్లోకి నీరు వెళ్లడానికి వీలుగా గుంటలు (కాలువలు) తవ్వారు. ఆ ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించారు. గుంటలు కలిసొచ్చే విధంగా తమ గ్రామానికి గుంటపల్లి అని పేరు వచ్చినట్టు ప్రముఖ సాహితీ వేత్త తేజోమూర్తుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

ముత్యాలమ్మపాలెం

ముత్యాలమ్మపాలెం విశాఖపట్నం జిల్లా పరవాడ మండలంలో ఉంది. పరవాడకు 10కి.మీ దూరంలో నెలకొని ఉంది. మత్స్యకారులుండే గ్రామం. మత్స్యకారులు లేదా పాళెగాళ్లు పాలనలో ఏర్పాటైన గ్రామాలకు చివరి పదం సాధారణంగా పాలెం అని ఉంటుంది. కాగా ఇక్కడి ప్రజలు జనావాసంలోని ముత్యాలమ్మ గ్రామదేవత పేరుతో తమ పల్లెకు ముత్యాలమ్మపాలెం అని నామకరణం చేసినట్టు రచయిత్రి బోర భారతమ్మ ఈ రచయితకు తెలిపారు. ఈ పల్లెలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడ ముత్యాలమ్మకు ప్రతి ఏటా మే-జూన్ నెలల్లో పండుగను జరుపుతారు. ఇక్కడ పలు సినిమాల చిత్రీకరణ కూడా జరిగింది. ఇక్కడ బీచ్ ప్రసిద్ధమైంది.

కృష్ణదేవిపేట (కె.డి.పేట)

కృష్ణదేవిపేట తొలిపేరు కె.డి.పేట విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితంలో ఉన్న ముఖ్య గ్రామాల్లో ఒకటి. గోలుగొండ మండలంలో ఉంది. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య సాధన కోసం తుది రక్తం చిందించే వరకూ పోరాడిన సంగతి తెలిసిందే. లూథర్ ఫర్డు అనే ఆంగ్లేయ దొర అహంకారంతో అల్లూరిని కె.డి. అని పేర్కొనేవాడు. దీంతో ఈ పల్లెకు కె.డి.పేట అనే పేరు వచ్చింది. కాలక్రమంలో విజయనగరం సంస్థానాధీశులు ఈ పేరు ఘోరంగా ఉందని భావించారు. చొరవ తీసుకొని సంక్షిప్తీకరణకు అనుగుణంగా కృష్ణదేవిపేటగా మార్చారు. ఇక్కడ పోలీస్ స్టేషన్‌పై అల్లూరి 1922లో మెరుపుదాడి జరిపారు. 1924 మే 7న ముంప గ్రామం వద్ద ఓ కొలనులో స్నానం చేస్తుండగా ఆంగ్లేయ సాయుధులకు దొరికిపోయాడు. అల్లూరిని చెట్టుకు కట్టి కాల్చి చంపారు. మర్నాడు సమీపంలోనే ఉన్న కె.డి.పేటలో అంత్యక్రియలు జరిగాయి. ఇక్కడే అల్లూరి పేరుతో ఓ స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆవరణలోనే అల్లూరి, గంటం దొరలు సమాధులను నిర్మించారు.

మహాసాహెబ్‌పేట

మహాసాహోబ్ పేట పాయకరావుపేట మండలంలో ఉంది. ఒకప్పుడు గోల్కొండ నవాబుల పాలనలో ఉండేది. ఈ సమయంలో కొన్ని ముస్లిం కుటుంబాలు ఒక్కడ స్థిరపడ్డాయి. అప్పట్లో మహాసాహెబ్ అనే ముస్లిం పెద్ద ఇక్కడ ఉండేవారు. ఆయన పేరు కలిసొచ్చే విధంగా ఈ పల్లెకు మహాసాహెబ్ పేట అని నామకరణం చేశారు. అయితే ఇక్కడ

నుంచి ముస్లింలు ఈ పల్లె నుంచి వేర్వేరు ప్రాంతాలకు వలస పోయారు. అయినప్పటికీ ఈ గ్రామం పేరు అలాగే కొనసాగుతోంది. పల్లె జనాభా 2157.

పెంటకోట

పెంటకోట పాయకరావుపేట మండలంలో సముద్రతీరంలో నెలకొని ఉంది. ఈ ప్రాంతంలోని ప్రజలు చెత్త, చెదారాలను ఈ తీర ప్రాంతంలో వేసేవారు. ఇవన్నీ కుప్పలు, తెప్పలుగా ఉండేవి. కుప్పలను జనవ్యవహారంలో పెంటలని పిలుస్తారు. జాలర్లు ఈ ప్రాంతంలోనే ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్ల సముదాయం పరిసరాల్లో తులసి కోటలు నిర్మించుకునేవారు. అలాగే ఆ రోజుల్లో కొందరు రాజులు, జమీందారులు చిన్న చిన్న కోటలు కూడా నిర్మించేవారు. ఇలా ఆ గ్రామానికి పెంటకోట అని నామకరణం చేశారు. ఉదాహరణకు ఈ గ్రామం సమీపంలో ఉన్న అరట్లకోట, సత్యం, వరంకోట గ్రామాలున్నాయి.

చోద్యం

చోద్యం అంటే వింత ఆశ్చర్యం అనే అర్థాలున్న సంగతి తెలిసిందే. అయితే చోద్యం పేరుతోనే ఓ గ్రామం వెలిసింది. ఈ పల్లె విశాఖపట్నం జిల్లా గోలుగొండ మండలంలో నెలకొని ఉంది. ఈ గ్రామం పేరు వెనుక గల చరిత్ర ఎంతో ఆసక్తికరంగా ఉంది. ఆంగ్లేయుల పాలనలో భీమునిపట్నం నుంచి చోడవరం మీదుగా దేవీపట్నం వరకూ రోడ్డు మార్గంలో నిత్యం సరుకులు రవాణా చేస్తుండేవారు. బ్రిటిషు సైనికులు, దొరలు రాత్రిపూట ఈ ప్రాంతంలో బస చేసేవారు. విద్యుత్తు సౌకర్యం లేని రోజులవి. పైగా దట్టమైన అడవులు, వన్యప్రాణుల సంచారం

ఎక్కువగా ఉండేది. వన్య మృగాల నుంచి తమకు అలాగే పంటలకు రక్షణ కోసం రైతులు తెల్లవారు జామున కిరోసిను లాంతర్లను పట్టుకొని చేతికర్రలపైన మువ్వలు కట్టి శబ్దం చేసుకుంటూ పల్లె నుంచి కల్లాల్లోకి వెళ్లేవారు. ఒకరోజున ఈ గ్రామంలో బసచేసిన తెల్లదొర ఈ శబ్దాలు విని ఆశ్చర్య పోయారు. తరువాత ఇదంతా చోద్యంగా ఉందని వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి ఈ పల్లెకు చోద్యం అని గ్రామీణులు నామకరణం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ప్రముఖులు మిడతాన రాంబాబు, రామచంద్రరావు నాయుడు తెలిపారు. గ్రామ జనాభా 5వేలు. గ్రామ సచివాలయం, ఉన్నత పాఠశాల ఉన్నాయి.

అడ్డసరం

అడ్డసరం రోలుగుంట మండలంలోని ఓ కుగ్రామం. అడ్డసరం మొక్కలు ఎక్కువగా ఉన్నందున ఈ ఊరికి ఆ పేరు వచ్చింది. పొలంగట్ల మీద 1 నుంచి 4 మీటర్ల ఎత్తు వరకు పెరిగే బహువార్షిక పొద. ఈ మొక్కలోని భాగాలను ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు. దగ్గు, ఆయాసం, నివారణకు వాడతారు. ఈ గ్రామానికి తొలుత భీమునిపట్నంగా ఆ తరువాత దిబ్బలపాలెంగా పిలిచేవారు. కొండలపై కొందరు అడ్డసరం పేరుతో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ కలసి రాకపోవడంతో కొండలపై ఉన్నవారు దిగువ ప్రాంతానికి తరలివచ్చి స్థిరపడ్డారు. ఇదీ అడ్డసరం పేరు వెనుకగల చరిత్ర.

సింధియా (విశాఖ)

సింధియా నగర తీర ప్రాంతంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతం. నగరం లోని ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకటి. ఈ ప్రాంతానికి

సింధియా స్టీం నావిగేషన్ కంపెని లిమిటెడ్ వల్ల ఆ పేరు వచ్చింది. ఇదొక నౌకా నిర్మాణ కేంద్రం. 1941లో దీన్ని సేథ్ వాల్‌చంద్, హిరాచాంద్ స్థాపించారు. ఈ సంస్థ నగర పారిశ్రామిక రంగ చరిత్రను మార్చేసింది. సింధియా , గాజువాక , కూర్మన్నపాలెం, గోపాలపట్నం, పెందుర్తి , కొత్తవలస ప్రాంతాల్లో అనుసంధానమై ఉంది.

మద్ది

మద్ది గ్రామం పద్మనాభం మండలంలోని ఓ గ్రామం: మద్ది చెట్లు అప్పట్లో ఎక్కువగా ఉండడంతో ఈ పేరు వచ్చింది. అలాగే శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలో మద్దివలస, మద్దివలస సీతారాంపురం అనే గ్రామాలున్నాయి. మద్ది బెరడు కషాయంతో గుండె , అధిక రక్తపోటు నివారణకు ఉపయోగపడుతుంది.

సంపంగిపుట్టు

సంపంగిపుట్టు జి.మాడుగుల మండలంలోని ఓ కుగ్రామం. ఇక్కడ ఉన్నవారంతా గిరిజనులే. ఈ పల్లె ఏర్పాటైనప్పుడు సంపంగి చెట్లు ఎక్కువగా ఉండేవి. దీంతో ఈ పల్లెకు సంపంగిపుట్టు అనే పేరు వచ్చింది. పుట్టు అనే పదం పల్లెను సూచిస్తుంది. సంపంగి ఘుమఘుమలను ఇక్కడివారు ఆస్వాదించేవారు. అయితే కాలక్రమంలో సంపంగి చెట్లు నరికి భవన నిర్మాణాలకు కలపగాను విక్రయించేవారు. దీంతో సంపంగి చెట్లు అంతరించి పోయాయి. సంపంగి అనే పేరు మాత్రం అలాగే ఉంది. ఇక్కడి వారంతా కోండు, తెలుగు భాషలు మాట్లాడుతారు.

పెద్దబయలు

పెద్దబయలు విశాఖపట్నం జిల్లాలోని ఓ మండల కేంద్రం అనకాపల్లి నుంచి 130 కి.మి దూరంలో ఉంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.. పెద్ద బయలు అంటే పశువులను మేతకు వదిలే విశాలమైన ప్రదేశం అని అర్థం. ఇక్కడ గల భైరవేశ్వరి జలపాతం ప్రసిద్ధి చెందింది. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి.

పాడేరు

పాడేరు విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ, రెవెన్యూ డివిజన్ కేంద్రం. ఈ గిరిజన ప్రాంతాలకు కూడలిగా ఉంది. పేరు వెనుక గల ముఖ చిత్రాన్ని పరిశీలిస్తే.... ఈ ప్రాంతంలో సమాంతరంగా ప్రవహించే సెలయేళ్ల వల్ల దానికి ఆ పేరు వచ్చింది. ఈ ప్రాంతంలో చిలకలగడ్డ, మత్స్యగడ్డ అనే రెండు ఏర్లు ప్రవహిస్తున్నాయి. అప్పట్లో ఈ రెండు ఏర్ల మధ్య సారవంతమైన భూములుండేవి. ఆ రెండు ఏర్ల మధ్య ఉన్న ప్రాంత పాడియూరు అనే వారు. పాడి అంటే ఇక్కడ సమానం అనే అర్థాన్ని గ్రహించాలి. అదే జనవ్యవహారంలో పాడేరుగా మారింది. పాడేరులోని మోదకొండమ్మ ఆలయం అత్యంత ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ఐ.టి.డి.ఏ గిరిజనాభివృద్ధికి సేవలందిస్తోంది. కాఫీ తోటలు పెంపకం కొనసాగుతోంది.

పెందుర్తి

పెందుర్తి విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. అప్పట్లో పందుల పెంపకం విస్తారంగా ఉండేది. దీంతో దీనికి తొలుత

పందులూరు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో పెందుర్తిగా మారింది. ఆ పేరు స్థిరపడిరది. ఇది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం కూడా. హౌరా - చెన్నై మార్గంలోని రైల్వే స్టేషన్‌లో ఉంది.

పాండ్రంగి

పాండ్రంగి విశాఖ పట్నం జిల్లా పద్మనాభం మండలంలోని ఓ గ్రామం. ఈ గ్రామంలోని విప్లవ సింహం అల్లూరి సీతారామరాజు జన్మించారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే .... క్రీ.శ 9వ శతాబ్దానికి చెందిన గుణ విజయాదిత్యుని సేనాని పండరంగడు కళింగపై విజయయాత్ర చేసిన సంగతి తెలిసిందే. పండరంగని పేరు కలిసొచ్చే విధంగా పాండ్రంగి గ్రామానికి ఆపేరు వచ్చినట్లు స్థానికుల ఉవాచ. మరో కథనం ప్రకారం పాంగ్రంగి ఇంటి పేరుతో ఏర్పాటైన గ్రామమిది. ఈ ఇంటి పేరుతో ఉన్న ఎన్నో కుటుంబాలు ఇక్కడ ఉన్నాయి. గోస్తనీ నదీ తీరంలో ఉంది. అల్లూరు సీతారామరాజు నివశించిన ఇంటిని స్మారక చిహ్నంగా అభివృద్ధి చేశారు. గ్రామం ప్రారంభంలో అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

గూడెం కొత్త వీధి

సాధారణంగా వీధిని గ్రామంలో ఓ భాగంగా వ్యవహరిస్తారు. అయితే విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గ్రామానికి నామాంతరంగా వీధిగా పేర్కొంటున్న కొన్ని గ్రామాలున్నాయి. గూడెం కొత్తవీధి (జి. కె.వీధి) పేరుతో ఓ మండల కేంద్రం కూడా ఉంది. గూడెం అంటే వృక్ష సంపద ఎక్కువగా ఉన్న ప్రాంత గ్రామాలకు 'గూడెం' అని పదం చేరుతుంది.

చినకూర్మం

చినకూర్మం మాడుగుల మండలంలోని ఓ చిన్న గ్రామం. శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మం నుంచి ఈ ప్రాంతానికి వచ్చి స్థిరపడినవారు ఇక్కడ ఉన్నారు. అసలు ఊరిపై ఉన్న మమకారంతో తమ పల్లెకు చినకూర్మం అని పేరు పెట్టుకున్నారు.

రామయోగి అగ్రహారం

రామయోగి అగ్రహారం కె.కోటపాడు మండలంలోని ఓ గ్రామం. ఇక్కడ నివశించిన సనాతన ధర్మ ప్రచారకులు రామయోగి సారధ్యంలో ఈ పల్లె ఏర్పాటైంది. ఈ గ్రామాన్ని విజయనగర పూసపాటి వంశీయులు బ్రాహ్మణులకు దానమిచ్చారు. ఈ పల్లెకు చివరి అగ్రహారం అనే పదం చేరింది. రాజులు, సంస్థానాధీశులు బ్రాహ్మణులకు ఇచ్చే భూములను లేదా గ్రామాలను అగ్రహారం గా పేర్కొంటారు. ఈ గ్రామంలో ఒకప్పుడు హెచ్చు సంఖ్యలో బ్రాహ్మణులుండేవారు. ప్రస్తుతం 12 కుటుంబాలే ఉన్నాయి. మిగిలిన వారంతా ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోయారని స్థానిక డి.సి.సి.బి డైరెక్టర్ చల్లా సత్యన్నారాయణ తెలిపారు. కాగా భీమిలి మండలంలో కూడా ఇదే పేరుతో ఓ గ్రామం ఉంది.

గంభీరం

గంభీరం గ్రామం పేరు ఎంత అందంగా ఉందో. పేరుకు తగిన ఊరు ఇది. ఈ గ్రామం ఆనందపురం మండలం బోయపాలెం సమీపంలో ఉంది. ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ గ్రామం

పందులూరు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో పెందుర్తిగా మారింది. ఆ పేరు స్థిరపడిరది. ఇది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం కూడా. హౌరా - చెన్నై మార్గంలోని రైల్వే స్టేషన్‌లో ఉంది.

పాండ్రంగి

పాండ్రంగి విశాఖ పట్నం జిల్లా పద్మనాభం మండలంలోని ఓ గ్రామం. ఈ గ్రామంలోని విప్లవ సింహం అల్లూరి సీతారామరాజు జన్మించారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే .... క్రీ.శ 9వ శతాబ్దానికి చెందిన గుణ విజయాదిత్యుని సేనాని పండరంగడు కళింగపై విజయయాత్ర చేసిన సంగతి తెలిసిందే. పండరంగని పేరు కలిసొచ్చే విధంగా పాండ్రంగి గ్రామానికి ఆపేరు వచ్చినట్లు స్థానికుల ఉవాచ. మరో కథనం ప్రకారం పాంగ్రంగి ఇంటి పేరుతో ఏర్పాటైన గ్రామమిది. ఈ ఇంటి పేరుతో ఉన్న ఎన్నో కుటుంబాలు ఇక్కడ ఉన్నాయి. గోస్తనీ నదీ తీరంలో ఉంది. అల్లూరు సీతారామరాజు నివశించిన ఇంటిని స్మారక చిహ్నంగా అభివృద్ధి చేశారు. గ్రామం ప్రారంభంలో అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

గూడెం కొత్త వీధి

సాధారణంగా వీధిని గ్రామంలో ఓ భాగంగా వ్యవహరిస్తారు. అయితే విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గ్రామానికి నామాంతరంగా వీధిగా పేర్కొంటున్న కొన్ని గ్రామాలున్నాయి. గూడెం కొత్తవీధి (జి. కె.వీధి) పేరుతో ఓ మండల కేంద్రం కూడా ఉంది. గూడెం అంటే వృక్ష సంపద ఎక్కువగా ఉన్న ప్రాంత గ్రామాలకు 'గూడెం' అని పదం చేరుతుంది.

చినకూర్మం

చినకూర్మం మాడుగుల మండలంలోని ఓ చిన్న గ్రామం. శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మం నుంచి ఈ ప్రాంతానికి వచ్చి స్థిరపడినవారు ఇక్కడ ఉన్నారు. అసలు ఊరిపై ఉన్న మమకారంతో తమ పల్లెకు చినకూర్మం అని పేరు పెట్టుకున్నారు.

రామయోగి అగ్రహారం

రామయోగి అగ్రహారం కె.కోటపాడు మండలంలోని ఓ గ్రామం. ఇక్కడ నివశించిన సనాతన ధర్మ ప్రచారకులు రామయోగి సారధ్యంలో ఈ పల్లె ఏర్పాటైంది. ఈ గ్రామాన్ని విజయనగర పూసపాటి వంశీయులు బ్రాహ్మణులకు దానమిచ్చారు. ఈ పల్లెకు చివరి అగ్రహారం అనే పదం చేరింది. రాజులు, సంస్థానాధీశులు బ్రాహ్మణులకు ఇచ్చే భూములను లేదా గ్రామాలను అగ్రహారం గా పేర్కొంటారు. ఈ గ్రామంలో ఒకప్పుడు హెచ్చు సంఖ్యలో బ్రాహ్మణులుండేవారు. ప్రస్తుతం 12 కుటుంబాలే ఉన్నాయి. మిగిలిన వారంతా ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోయారని స్థానిక డి.సి.సి.బి డైరెక్టర్ చల్లా సత్యన్నారాయణ తెలిపారు. కాగా భీమిలి మండలంలో కూడా ఇదే పేరుతో ఓ గ్రామం ఉంది.

గంభీరం

గంభీరం గ్రామం పేరు ఎంత అందంగా ఉందో. పేరుకు తగిన ఊరు ఇది. ఈ గ్రామం ఆనందపురం మండలం బోయపాలెం సమీపంలో ఉంది. ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ గ్రామం

కంబాల కొండ రిజర్వు ఫారెస్టులో ఉంది. ఇక్కడి గెడ్డ వర్షాకాలంలో గాంభీర్యంతో పొంగి పొరలుతుంది. దీనిపై నిర్మించిన జలాశయం కూడా ఆకట్టుకునే శబ్దాలతో కనిపిస్తుంది. అంచేత ఈ పల్లెకు గంభీరం అనే పేరు వచ్చింది. అప్పట్లో ఈ పల్లెలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లన్నీ కాలిపోయాయి. ఆ తరువాత ఈ గ్రామాన్ని జాతీయ రహదారికి సమీపంలో నిర్మించుకున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐ.ఐ.టి), పారిశ్రామికవాడ, రొయ్యలు, చేపల తనిఖీ ప్రయోగశాల, ఎగుమతుల సంస్థ, సమీప సంస్థలు ఉన్నాయి. అరటి, బొప్పాయి తోటలు ఎక్కువగా ఉన్నాయి.

నక్కపల్లి

నక్కసల్లి విశాఖపట్నం జిల్లాలో మండల కేంద్రం. రాష్ట్రంలో జంతువులు, క్రూరమృగాలు, పేరుతో కొన్ని గ్రామాలు వెలిశాయి. ఇందులో నక్కపల్లి కూడా ఒకటి. అప్పట్లో ఈ ప్రాంతంలో నక్కల సంచారం ఎక్కువగా ఉండేది. దీంతో ఈ ఊరికి నక్కపల్లి అనే పేరు వచ్చింది. ఇక్కడకు సమీపంలో ఉన్న ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నక్కపల్లిలోని పారిశ్రామికవాడ ప్రాచుర్యం పొందింది.

త్యాడ

త్యాడ గ్రామం విశాఖపట్నం నుంచి అరకు వెళ్లే మార్గంలో ఉన్నది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... త్యాడ అంటే ఒకరకమైన మొక్కగా గ్రహించాలి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో త్యాడ మొక్కలు ఉన్న కారణంగా త్యాడగా పిలిచేవారు. ఇక్కడ రైల్వేస్టేన్ కూడా ఉంది. ■

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

కొమరగిరిపట్నం

అనేక ప్రత్యేకతలతో అలరారుతున్న గ్రామం కొమరగిరిపట్నం. ఈ జానపదం తూర్పు గోదావరి జిల్లా అల్లవరం మండలంలో ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 13,197 మంది. అక్షరాస్యత శాతం 78.69. ఈ గ్రామ పంచాయితీ పరిధిలోనే నక్క రామేశ్వరం అనే పల్లె ఉన్నది.

కొమరగిరిపట్నం పేరు వెనుక గల చరిత్రలోకి వెళితే..... ఈ గ్రామం చివరి పదం పట్నం. సాధారణంగా సాగర, నదీతీరాల్లో ఏర్పాటైన పల్లెలకు, బస్తీలకు చివరిపదం పట్నంగా ఉంటుందని నామ విజ్ఞాన శాస్త్రం పేర్కొంటోంది. కొమరగిరిపట్నం సాగరతీరానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే కొమరగిరి విషయానికి వస్తే కాటమవేమారెడ్డి తన బావ కుమారగిరిరెడ్డి (1986-1402) అనే కొండవీడు పాలకుని పేరుతో ఈ గ్రామం ఏర్పాటైంది. కాలప్రవాహంలో కుమారగిరి కొమరగిరిగా మారినట్టు స్పష్టమౌతోంది. ఇలా కొమరగిరిపట్నం రూపుదిద్దుకుంది. ఆంధ్ర భీష్మగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ది హిందూ ఆంగ్ల దినపత్రిక వ్యవస్థాపకులు న్యాపతి సుబ్బారావు ఈ గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు గానూ ఎనిమిది ఎకరాల భూమిని ఉదారంగా అందజేశారు.

ప్రభుత్వం ఆయన పేరుతోనూ న్యాపతి సుబ్బారావు జడ్పీ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇక ప్రఖ్యాత జర్నలిస్టు నడిరపల్లి సీతారామరాజు స్వగ్రామంపై ఉన్న మమకారంతో రూ.కోటి వ్యయంతో పంచాలయ సముదాయాన్ని నిర్మింప జేసారు. ఇంకా ఈ గ్రామంలో బాల త్రిపుర సుందరి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం కూడా ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామంలో జన్మించడం పుణ్య ఫలంగా భావిస్తున్నట్టు స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగళంపల్లి సత్యన్నారాయణమూర్తి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

బురదపేట (బురదకోట)

బురదకోట గిరిజన గ్రామం తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలంలో ఉంది. ఈ గ్రామానికి సమీపంలోని కొండపై బురదతో నిర్మించిన చిన్న కోట ఉంది. దీంతో ఇక్కడ ఏర్పాటైన పల్లెకు బురదకోట అనే పేరు వచ్చింది. అయితే ప్రస్తుతం కోట నేలమట్టమైంది. అయితే అవశేషాలు మిగిలి ఉన్నాయి. ఈ పల్లె పంచాయితీ కేంద్రం. ఈ పంచాయితీ పరిధిలో మొత్తం 7 చిన్న గ్రామాలున్నాయి. బురద కోట జనాభా 300 మాత్రమే. రంపచోడవరం ఐ.టి.డి.ఎ పరిధిలో ఉన్న ఈ గ్రామాన్ని ఉప ప్రణాళిక కింద అభివృద్ధి చేస్తున్నారు.

తుని

తుని మున్సిపాలిటీ, మండల కేంద్రం. అతి తక్కువ అక్షరాలు గల ఊరి పేర్లలో తుని ఒకటి. దేశంలో కూడా పరిమిత అక్షరాలున్న రైల్వే స్టేషనులలో తుని ఒకటి. ఇంతకీ ఈ పట్టణానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే తూనిక అనే పేరు నుంచి తుని వచ్చిందని స్థానికులు

పేర్కొన్నారు. ఆ రోజుల్లో కొందరు వ్యాపారులు తూకం జరిపేటప్పుడు తప్పుడు పద్ధతులను అనుసరిస్తే జుల్మానా విధించేవారు. దినుసులు బరువును తూచే త్రాసు(తక్కెడ) ధర్మబద్ధంగా ఉండాలనే లక్ష్యంతో తమ గ్రామానికి తూనిక అని తొలుత పేరు పెట్టారు. జనవ్యవహారంలో తూనిక కాస్త తునిగా రూపాంతరం చెందింది. నాడు తునిని పాలించిన రాజులలో వత్సవాయి వంశానికి చెందిన క్షత్రియులు ప్రసిద్ధి చెందారు. దీనికి సమీపంలో తాండవ నది ఉన్నది. ఏనుగుల వీరాస్వామి తన కాశీయాత్ర చరిత్రలో తుని ప్రస్తావన ఉన్నది. కాగా తుని తగువు అనే నానుడి జనవ్యవహారంలో ప్రాచుర్యం పొందింది. అప్పట్లో పెద్దలు పాము చావనట్టు, కర్ర విరగనట్టు తీర్పులు చెప్పేవారని గ్రహించాలి.

మోరి

మోరి తూర్పు గోదావరి జిల్లా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సఖినేటిపల్లి మండలంలో ఉంది. ఊరి పేరు వెనుక చరిత్రను పరిశీలిస్తే... మోరి అనే పదం ఉర్దూ భాషకు చెందింది. మోరి అంటే మురుగునీరు పోయే కాలువ అని అర్థం. వేరే ప్రాంతాల నుంచి ఈ ప్రదేశానికి వలసవచ్చి కొన్ని కుటుంబాలు మురికినీరు పోయే కాలువ ప్రక్కన తొలుత ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ ప్రాంతానికి మోరి అని పేరు పెట్టుకున్నట్టు గ్రామానికి చెందిన భాషా శాస్త్రవేత్త డా||ఎల్. కె.మల్లేశ్వరరావు తెలిపారు. ఉర్దూ మాతృభాషగా కలిగిన ముస్లిం వ్యాపారులు ఆనాడు ఈ ప్రాంతానికి వచ్చి వర్తకం జరిపేవారు. వారి మాతృభాషా ప్రభావం వల్ల ఉర్దూ పదమైన 'మోరి'ని తమ పల్లెకు నామకరణం చేసినట్టు స్పష్టమవుతోంది. హైదరాబాదులో మురుగునీరు పారే కాలువను మోరీలని పిలవడం తెలిసిందే.

పులిదిండి

పులిదిండి ఆత్రేయపురం మండలంలో ఉంది. వశిష్ట గోదావరి కాలువ ఒడ్డున నెలకొని ఉంది. సుందర, ఆహ్లాదకర వాతావరణంలో ఈ పల్లె దర్శనమిస్తుంది. గ్రామ జనాభా 1400. పులిదిండి వంశీయులు ఆధ్వర్యంలో ఈ పల్లె ఏర్పాటైంది. ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయం సుప్రసిద్ధమైనది. ఈ దేవాలయంలో శ్రీకృష్ణుని విగ్రహానికి మీసాలు ఉండటం విశేషం. ఈ సుందరమైన పల్లె అంద చందాలను దృష్టిలో ఉంచుకొని 1967లో బాపు 'సాక్షి' చలన చిత్రాన్ని, 1975లో ముత్యాల ముగ్గు సినిమాను నిర్మించారు.

ఏనుగుల మహల్

ఏనుగుల మహల్ గ్రామం కొత్తపేట మండలంలో ఉంది. ఈ పల్లె చిన గోదావరి ముక్తేశ్వరం కాలువ తీరంలో ఉంది. ఈ తీరం ఎంతో అనుకూలంగా ఉండడంతో మావటి వారు ఈ తీరాన్ని ఏనుగులతో నీటిని తాగించడం, స్నానం చేయించడం జరిపేవారు. ఈ ప్రదేశంలోనే మావటివారు విశ్రాంతి తీసుకొనేందుకు ఓ చిన్న భవనాన్ని నిర్మించుకున్నారు. దీనికి ఏనుగుల మహల్ అని పిలిచేవారు. ఈ పేరుతోనే ఇక్కడ ఏర్పాటు చేసుకున్న గ్రామానికి ఏనుగుల మహల్ అని పేరు పెట్టారు. ప్రస్తుతం గ్రామ జనాభా వెయ్యి మంది మాత్రమే. ఈ విషయాన్ని ఈ గ్రామానికి చెందిన సి.ఆర్.పి వెంకటేశ్వరరావు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

రంపచోడవరం

రంపచోడవరం తూర్పుగోదావరి జిల్లాలోని ఓ గ్రామం. చోడవరం పేరుతో రాష్ట్రంలో అనేక గ్రామాలున్నాయి. అంచేత రంప గ్రామం సమీపంలో ఈ చోడవరం ఉన్నందున రంపచోడవరం గా నామకరణం చేశారు. చోళ రాజుల కాలంలో ఏర్పాటైన గ్రామం ఇది. రంప అనేది ఓ చెట్టు పేరు. నాడు చోళ రాజులచే దానంగా ఇచ్చిన గ్రామమైనందున వరం అనే పదం చేరింది. రంప చోడవరంలోని ఐ.టి.డి.ఏ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. కాగా చోడవరం పేరుతో గ్రామాలు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా ఉన్నాయి.

వేమగిరి

వేమగిరి కడియం మండలంలోని ఓ గ్రామం. రాజమహేంద్రవరం నుంచి 10కి.మీ దూరంలో ఉంది. దీని తొలిపేరు హేమగిరి. హేమం అంటే బంగారం, గిరి అంటే కొండ. అప్పట్లో ఈ గిరిపై బంగారం దొరికేది. దీంతో ఈ గిరిని ఇక్కడి గ్రామానికి వేమగిరి అనే పేరు వచ్చింది. కాలక్రమంలో వేమగిరిగా మారింది. వేమగిరిని పెద్దన కనకగిరిగా అభివర్ణించారు. గోదావరి పరీవాహక ప్రాంతమిది. కాటన్ దొర ధవళేశ్వరం ఆనకట్టను నిర్మించిన సమయంలో ఇక్కడే నివశించారు. రాజమహేంద్రవరం ప్రాంతంలోని పంచ గిరులలో ఇదొకటి.

ఆదుర్రు

ఆదుర్రు తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండలంలో ఉన్నది. వైనతేయనదీ తీరంలో వెలసి ఉంది. ఇక్కడి వేద స్థూపం ఎంతో

చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉంది. దీంతో ఆదుర్రు గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. భారత పురావస్తు శాఖ నివేదిక మేరకు ఇక్కడి మహా స్థూపానికి ఆశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర శంకుస్థాపన చేసింది. దుబ్బరాజు దిబ్బపై ఈ స్థూపాన్ని నిర్మించారు. 1923లో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో ఇది వెలుగులోకి వచ్చింది. కోనసీమలో అత్యంత ప్రాచీనమైన గ్రామం ఇది. ఆదిగా ఏర్పాటైన ఊరు. లోక వ్యవహారంలో ఆదుర్రుగా మారిందని స్థానికుల ఉవాచ.

కడియం

కడియం మండల కేంద్రం. కడియం నర్సరీలకు దేశంలో మంచి పేరుంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసుకొనేందుకు ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవు. అయితే దీనికి సంబంధించి ఓ ఇతిహాస కథ ప్రచారంలో ఉంది. రామాయణ కాలంలో సీతాదేవి అపహరించినప్పుడు ఆమె చేతికున్న కంకణం (కడియం) ఈ ప్రాంతంలో జారిపడిరది. అందుకే తమ గ్రామానికి కడియం అనే పేరు వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు.

జగ్గంపేట

జగ్గంపేట ఓ మండల కేంద్రం. జగ్గమ్మ అనే మహిళ ఇక్కడ ఓ పెద్ద చెరువును నిర్మించింది. వ్యవసాయ, ఇతర అవసరాలకు చెరువు ఉపయోగపడడంతో ఈ ప్రాంతీయులు తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న గ్రామానికి జగ్గంపేటయని కృతజ్ఞతా పూర్వకంగా పేరు పెట్టినట్టు స్థానికులు పేర్కొన్నారు. చుట్టూ పచ్చని పంటపొలాలతో ఈ ఊరు ఆహ్లాదభరితంగా ఉంటుంది. వశిష్ట గోదావరి తీరంలో వెలసింది

ఈ గ్రామం. ఏజెన్సీ ప్రాంతానికి ముఖ ద్వారంగా ఉంది. గ్రామ జనాభా 18,779.

రాజపూడి

రాజపూడి గ్రామం జగ్గంపేట మండలంలో ఉంది. సిద్ధప్ప మహారాజు వంశానికి చెందిన వారు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానిక ప్రముఖ రచయిత్రి మంచాల శ్రీలక్ష్మి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. పూడి అంటే జలసూచి అని అర్థం. ఇందుకు అనుగుణంగా అయిదారు పెద్ద చెరువులు ఉన్నాయి. ఇలా ఈ గ్రామానికి రాజపూడి అనే పేరు వచ్చింది. ఈ గ్రామ జనాభా 9267.

శంకరగుప్తం

శంకరగుప్తం గ్రామం మల్కిపురం మండలంలో నెలకొని ఉంది. ప్రఖ్యాత సంగీత పద్మ విభూషణ్ విద్వాంసుడు మంగళంపల్లి బాలకృష్ణ జన్మించింది ఇక్కడే. గ్రామ జనాభా 12వేలు. ఈ గ్రామానికి పేరు వెనుక గల ఇతిహాసాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. భస్మాసురుని బారి నుంచి తప్పించుకొనేందుకు పరమశివుడు ఇక్కడే దాక్కున్నాడని (గుప్తం) భక్తుల విశ్వాసం. దీంతో ఈ గ్రామానికి శంకర గుప్తం అనే పేరు వచ్చింది. నిజానికి భస్మాసురుడు శంకరుని వరం వల్లనే అజేయుడుగా నిలిచిన సంగతిని గుర్తుంచుకోవాలి.

ఉప్పాడ

ఉప్పాడ సాగరతీరంలో ఉంది. ఉప్పుడు నీళ్లు కలిగి ఉండే కొన్ని వాడలకు స్థానికులు ఉప్పాడ అనే పేరు పెట్టుకుంటారు..

తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపల్లి మండలంలో ఉన్న ఉప్పాడ, అలాగే విశాఖపట్నం జి.వి.ఎం.సి పరిధిలోని పెద కాపులుప్పాడ, చినకాపులుప్పాడ, చేపలుప్పాడ గ్రామాలను ఉదహరించవచ్చు. వివిధ తాగు నీటి పథకాల ఏర్పాటు వల్ల ఈ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు లభిస్తుంది. తూ.గో జిల్లాలోని ఉప్పాడ జమధానీ చీరలకు ప్రసిద్ధి.

వజ్రకూటం

వజ్రకూటం గ్రామం శంఖవరం మండలంలో ఉంది. దీనితొలి పేరు వజ్రపుకోట. ఈ ప్రాంతంలో పెద్దకోట ఉండేది. ఈ పరిసరాల్లో జరిపిన తవ్వకాల్లో బంగారు నాణేలు వజ్రాలు లభించాయి. తెలుగు శాసనాలు కూడా లభించాయి. కోట పరిసరాల్లో వజ్రాలు లభించినందున ఈ గ్రామానికి వజ్రపుకోట అనే పేరు వచ్చింది. కాలక్రమంలో వజ్రకూటంగా మారింది.

పేరూరు

పేరూరు పేరుకు తగ్గట్టుగానే మంచి పేరున్న గ్రామం ఇది. ఈ గ్రామం అమలాపురం మండలంలో ఉంది. అమలాపురానికి 5 కి.మీ దూరంలో ఉంది. తమిళనాడులోని పిర్యావూరు నుంచి పెద్ద ద్రావిడ బ్రాహ్మణ శాఖ దేవ పండితులు క్రీ.శ 11వ శతాబ్దంలో ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. పిర్యావూరు పేరు కలిసొచ్చే విధంగా పేరూరు అని ఈ గ్రామానికి నామకరణం చేశారు. అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ప్రతి ఏటా జరిగే మాఘశుద్ధ సప్తమి నుంచి 9 రోజులు పాటు జరిగే కళ్యాణ మహోత్సవాలలో కీలక పాత్ర పోషిస్తుంటారు. ఇక పేరూరు

సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. 90 శాతం మేరకు పెంకుటిల్లు ఉంటాయి. ఇక్కడ గల వీధుల్లో వరుసకు అయిదిళ్లు మాత్రమే ఉంటాయి. ఇక్కడి లక్ష్మీ నరసింహస్వామి, ఉమామహేశ్వర మదన గోపాల, భేతాళ స్వామి ఆలయాలు, గ్రామ దేవతలు రాజరాజేశ్వరి, పాపమ్మతల్లి, దానా సత్తెమ్మతల్లి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. సిన్మాల చిత్రీకరణ జరుగుతుంది. కోనసీమ అందాలకు ప్రతి రూపంగా ఉంటుంది.

నరేంద్రపురం

కోనసీమ ప్రకృతి సోయగాలకు ఆటపట్టయిన ఊరు నరేంద్రపురం మంచి చారిత్రక నేపథ్యం ఉన్న జానపదం ఇది. ఈ ఊరు పి.గన్నవరం మండలంలో ఉంది. పల్లె చుట్టూ పచ్చని పైరు పొలాలు, కొంగు బంగారంగా ఉన్న కొబ్బరి తోటల నడుమ అందంగా కనిపిస్తుంది. రాజమహేంద్రవరం కేంద్రంగా చేసుకొని పరిపాలించిన రాజరాజ నరేంద్రుని (క్రీ.శ 1022-1061) కాలం నుంచి నరేంద్రపురం మనుగడలో ఉంది. ఆదికవి నన్నయను ఆదరించిన రాజరాజ నరేంద్రుని పేరు కలిసొచ్చే విధంగా తమ గ్రామానికి నరేంద్రపురం అనే పేరు పెట్టినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పల్లె జనాభా 6 వేలు. గ్రామంలో గురుకుల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితరమైనవి ఉన్నాయి.

మరో నరేంద్రపురం

విశేషమేమిటంటే ఇదే జిల్లాలో రాజనగరం మండలంలో నరేంద్రపురం పేరుతో మరో గ్రామం ఉంది. ఈ గ్రామాలు రాజరాజ నరేంద్రుని ప్రాభవానికి నిదర్శనంగా నిలుస్తోంది.

వెదిరేశ్వరం

వెదిరేశ్వరం తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం మండలంలోని ఓ గ్రామం. జనాభా 6944. అక్షరాస్యత 77 శాతంగా ఉంది. మహాభారతంలో విదురుని పాత్ర అందరికీ తెలిసిందే. నీతి శాస్త్రంలో మరెవ్వరికీ సాటిలేని విదురుని పేరుతో అప్పట్లో ఇక్కడ ఆశ్రమం నెలకొని ఉండేది. ఆ పేరుతోనే విదురేశ్వరం చివరకు వెదిరేశ్వరం అయింది. ఇక్కడి గ్రామ దేవత కాయితాలమ్మ కోనసీమ అందాలకు పుట్టినిల్లుగా ఉంటుందని స్థానిక విద్యావేత్త కోనుపూడి కిరణ్‌బాబు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

పుణ్యక్షేత్రం

పుణ్యక్షేత్రం పేరుతో ఓ గ్రామం ఉండడం గొప్ప విశేషమే. ఇంతకీ ఈ ఊరు ఎక్కడ ఉందంటే... తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో ఈ గ్రామం వెలసింది. ఈ పల్లెకు శతాబ్దాల చరిత్ర ఉన్నది. దీనికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... పక్షి తీర్థంలా కనిపిస్తుంది ఈ పుణ్యక్షేత్రం గ్రామం. సైబీరియా దేశం నుంచి వేలకొలదీ కి.మీ దూరం ప్రయాణించి ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న ఊర చెరువు చుట్టూ గల తూర్పు చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి, గుడ్లు పొదుగుతాయి. వాటి నుంచి పిల్లలు బయలుదేరిన తరువాత తిరిగి సైబీరియా వెళ్లిపోతాయి. ప్రతి ఏటా జూన్ నెలలో ఇక్కడికి వచ్చి సంతానోత్పత్తి పూర్తి చేసుకొని తిరిగి డిశంబరు లేదా జనవరి నెలలో స్వస్థలాలకు వెళ్తుంటాయి. వీటి రాకను స్థానికులు శుభప్రదం భావిస్తుంటారు. ప్రియమైన అతిథులు ఆచరిస్తుంటారు. ఈ పక్షులు

రాకను దృష్టిలో ఉంచుకొని పుణ్యక్షేత్రంగా భావించి ఇదే పేరును తమ పల్లెకు నామకరణం చేసుకున్నారు. గ్రామ జనాభా 3500.

ముంగండ

ముంగండ పి.గన్నవరం మండలంలోని విశిష్ట గ్రామం. అమలాపురం నుంచి 10కి.మీ దూరంలో ఉన్నది. ముంగండకు ఆ పేరు ఎలా వచ్చిందంటే .. పూర్వకాలంలో ఈ ప్రాంతంలో తపస్సు చేసుకొనేవారు అంచేత ఈ ప్రాంతానికి తొలుత ముని ఖండవరం అనే పేరు వచ్చింది. అయితే కాలగమనంలో జనం వాడుకలో ముంగండగా మారింది. ప్రఖ్యాత రచయిత మహీధర రామ్మోహనరావు తాను రాసిన నవలలన్నింటికీ ముంగండనే నేపథ్యంలో స్వీకరించారు. క్రీ.శ 17వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ సంస్కృత అలంకారికుడు జగన్నాథ పండిత రాయలు స్వగ్రామం ఇదే. దిల్లీ పాదుషా షాజహాన్ ఆస్థాన పండితునిగా పనిచేసిన గౌరవం ఆయనకు దక్కింది. 1857 ప్రథమ భారత సంగ్రామంలో ముంగండ వాసులు పాల్గొన్నారు. ఇది అగ్రహారం కూడా. ■



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

జంగారెడ్డిగూడెం

జంగారెడ్డి గూడెం పశ్చిమ గోదావరి జిల్లాలోని ముఖ్య పట్నం. జనాభా 48,994. నగర పంచాయితీగా, రెవెన్యూ డివిజను కేంద్రంగా ఉంది. పట్టణం పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే..... తెలంగాణ ప్రాంతంలోని జంగారెడ్డి అనే వ్యక్తి కుటుంబం సమేతంగా ఇక్కడకు వలస వచ్చి తొలుత ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆయన పేరుతోనే జంగారెడ్డిగూడెం వెలసింది. గూడెం ఎలా చేరిందంటే... చెట్లు, అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటైన గ్రామాల పేర్లకు ఉత్తర పదంగా గూడెం అనే మాట చేరుతుంది. ఈ ప్రాంతం అడవులకు సమీపంలో ఉన్నందున గూడెం అనే పదం చేరింది. ఇలా జంగారెడ్డి గూడెం ఏర్పాటైంది. వ్యక్తి ప్రాబల్యంతో ఏర్పాటైన బస్తీ ఇది. స్థానికంగా ఉన్న గంగానమ్మ ఆలయం, మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, గోకుల పారిజాత గిరిపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. నాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరుతో ఓ జూనియర్ కళాశాల అలాగే ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి డిగ్రీ కళాశాల ఇక్కడ ఉన్నాయి.

కాకరపర్రు

పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలంలో ఉంది. ఆ పల్లెకు ఆ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.. ఈ పల్లె తొలి పేరు పండిత అగ్రహారం. అయిదో శతాబ్ది నుంచి ఈ జనావాసం మనుగడలో ఉంది. క..కా అంటే సరస్వతి అనే అర్థం సూచిస్తుంది. ఆకారం అంటే నిలయం. సరస్వతిదేవి నిలయమని గ్రహించాలి. 'పర్రు అంటే నీట ప్రవాహానికి కాస్త దూరంలో ఉన్న, వరద తాకిడి తగలనంత ఎత్తులో ఉన్న ఊరి పేర్లకు చివరిపదంగా 'పర్రు' చేరుతుంది. గోదావరి కూడా కాలువకు కిలోమీటరు దూరంలో ఈ పల్లె ఉంది. ఇది 'కాకరపర్రు'గా మారినట్టు చెబుతారు. ఊరి పేరుకు తగ్గట్టుగానే ప్రతిభామూర్తులకు ఇది ఆటపట్టుగా నిలుస్తోంది. నాటి సాహితీ పరిమళాలు ఒకవైపు, బంతి, చామంతి, గులాబీ, లిల్లీ కనకాంబరం తదితర పూలవనాల సువాసలతో ఈ పల్లె గొప్ప మధురానుభూతిని కలిగిస్తుంది. 200 ఎకరాల్లో పూలతోటలు ఉన్నాయి. గ్రామ జనాభా 5,000. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం ఆకట్టుకుంటోంది. పద్మవిభూషణ్, కళాప్రపూర్ణ, ప్రఖ్యాత సంస్కృతాంధ్ర రచయిత చర్ల గణపతిశాస్త్రి స్వగ్రామం ఇదే. కాకరపర్రు గ్రామంపై ప్రముఖ రచయిత కానూరి బదరీనాథ్ గొప్ప గ్రంథం రాశారు.

సిద్ధాంతం

సిద్ధాంతం గ్రామం పెనుగొండ మండలంలోని పెద్ద గ్రామాల్లో ఒకటి. గ్రామ జనాభా 13,188. ఎన్నో శివలింగాలు ఇక్కడనే బయట పడడంతో దీన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందనే విషయమై ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవు. అయితే

ఇతిహాసపరంగా ఓ కథనం బహుళ ప్రచారంలో ఉంది. సీతాదేవి భూమాత ఒడిలో అంతర్లీనమైన ప్రాంతంగా భావించి సీతాంతం అనే పేరును పెట్టుకున్నారు. వ్యవహారంలో సీతాంతం, సిద్ధాంతంగా రూపుదిద్దుకుంది. అదే పేరు స్థిరపడినట్లు స్థానికులు పేర్కొన్నారు. వశిష్ట గోదావరి ఒడ్డున ఈ గ్రామం ఉంది.

రాయలం

రాయలం భీమవరం మండలంలో ఉంది. ఈ గ్రామానికి ఆ పేరెలా వచ్చిందంటే శ్రీ కృష్ణదేవరాయలు కళింగ జైత్రయాత్రలో భాగంగా అటు వైపు వెళ్తూ ఈ ప్రాంతంలో బస చేశారు. ఈ నేపథ్యంలో స్థానికులు తమ గ్రామానికి కృష్ణదేవరాయలు పేరు కలిసొచ్చే విధంగా రాయలం అని పేరు పెట్టారు. ఈ విషయాన్ని గ్రామీణులు తెలియజేశారు. పేరుకే ఇది గ్రామమైనా పట్టణ ఛాయలు కనిపిస్తాయి.

రాయభూపాలపట్నం

రాయభూపాలపట్నం పెద్దాపురం మండలంలోని ఓ అందమైన గ్రామం. పెద్దాపురం నుంచి 8 కి.మీ దూరంలో ఉంది. పెద్దాపురం సంస్థాన వారసుడైన వత్సవాయి బలభద్రరాజు కుమారుడైన రెండవ రాయపరాజు పేరుతో రాయభూపాలపట్నం ఏర్పాటైంది. ఇక్కడి ముఖ్యమైన పంటలు వరి, చెరకు పండిస్తున్నారు.

పవర్‌పేట

పవర్‌పేట ఏలూరు నగరంలోని ముఖ్యమైన ప్రాంతం. పవర్ పేటలో రైల్వేస్టేషన్ ఉన్న సంగతి తెలిసిందే. పవర్‌పేటకు ఆ పేరు

ఎలా వచ్చిందంటే. స్వాతంత్ర్యం రాక ముందు అప్పటి బ్రిటిష్ రైల్వే ఇంజనీరు సర్ పవర్ పేరుతో ఇది ఏర్పాటైంది. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. అతని జ్ఞాపకార్థం పవర్‌పేట అని ఈ ప్రాంతానికి నామకరణం చేశారు. ఇది తమ్మిలూరు నది సమీపంలో ఉంది. ఇక్కడ అంబికా అగర్‌బత్తి పరిశ్రమ ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇది 1946లో ఏర్పాటైంది. వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది.

పోడూరు

పోడూరు ఓ మండల కేంద్రం. తొలుత ఈ ప్రదేశంలో అడవి ఉండేది. అడవిని నరకి చదునుచేసి పోడు వ్యవసాయం చేస్తున్న ఈ ప్రాంతాన్ని పోడు అని పిలిచేవారు. కాలక్రమంలో మరికొంత భాగాన్ని చదును చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇలా ఓ గ్రామం ఏర్పాటైంది. పల్లె పెరిగిన తరువాత 'పోడు' కు ఊరు చేర్చి పోడు ఊరుగా పిలిచేవారు. క్రమంగా పోడూరుగా మారింది. ఇక్కడ లభ్యమైన కొన్ని జైన విగ్రహాలలో పెద్దదైన దానిని ఊరి కచేరి చావడి వద్ద ప్రతిష్ఠించారు. ప్రముఖ కవి వేదం వెంకటరాయ శాస్త్రి ఈ గ్రామానికి చెందిన వారే. 1870లో ఇక్కడ ఏర్పాటైన రామచంద్ర గ్రంథాలయం ఉంది.

నరసాపురం

నరసాపురం లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గం కేంద్రం. ఇది పశ్చిమగోదావరి జిల్లాలో ఉంది. వశిష్ట గోదావరి నది తీరంలో ఉంది. జనాభా 65 వేలు. నరసింహ స్వామి పేరుతో నరసింహపురంగా ఏర్పడిరది. కాలక్రమంలో నరసింహపురంగా మారింది. ఇదే పేరు స్థిరపడిరది. క్రీ.శ 1173 నాటికే ఇది మనుగడలో ఉంది.

మిలట్రీ మాధవరం

మిలట్రీ మాధవరం తాడేపల్లిగూడెం మండలంలో ఉన్న ప్రసిద్ధ గ్రామం. ఘనమైన గత చరిత్ర ఈ గ్రామం సొంతం. ఆంగ్లేయుల పాలనలోనే ఈ గ్రామం నుంచి అనేక మంది యువత సైన్యంలో పాల్గొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం(1939-45)లో కూడా విధులు నిర్వహించారు. వీరిలో కొందరు అమరులయ్యారు. వీరి సంస్మరణార్థం గ్రామంలో ఓ స్థూపం ఏర్పాటైంది. ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరైనా మిలట్రీలో ఉంటారు. 17వ శతాబ్దంలో గ్రామం ఏర్పాటైంది. గజపతి వంశానికి చెందిన పూసపాటి మాధవవర్మబ్రహ్మ, 6కి.మీ దూరంలో అరుగొలను గ్రామంలో కోటను నిర్మించారు. ఉత్తరాంధ్ర సైన్యాన్ని ఇక్కడకు రప్పించారు. వారికి సాగుభూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ సైనికులు మాధవవర్మ పేరు కలిసొచ్చే విధంగా మాధవరం అని పేరు పెట్టారు. మిలట్రీ వారు ఎక్కువగా ఉన్నందున మిలట్రీ మాధవరం అనే పేరు వచ్చింది. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ ఈ గ్రామాన్ని సందర్శించారు. గ్రామదేవత పోలేరమ్మ జాతరను నిర్వహిస్తుంటారు. గ్రామ జనాభా 7వేలు.

తంగెళ్లమూడి

తంగెళ్లమూడి ఏలూరు సమీపలోని ఉంది. తంగేడు చెట్లు అప్పట్లో ఈ ప్రాంతంలో ఓ వనంలా విస్తరించి ఉండేది. తంగేడు పూల నుంచి తీసిన రంగులను ఇక్కడ తివాచీలు తయారీలో వాడుతున్నారు. తంగేడు చెట్ల పేరుతోనే ఈ గ్రామానికి తంగేడు అనే పేరు వచ్చింది. తరువాత తంగెళ్లగా మారింది. చివరి పదంగా తొలుత పూడి చేరింది. జనవ్యవహారంలో పూడి, మూడిగా మారింది. పూడి అంటే

జలప్రవాహాలకు సమీపంలో ఊళ్లకు 'పూడి' అని చేరుతుంది. ఈ గ్రామం మీదుగా తమ్మిలేరు వాగు ప్రవహిస్తోంది. మగ్గాలపై సహజ సిద్ద రంగులతో రూపొందించే తివాచీల తయారీకి ఈ గ్రామం ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ మండల కేంద్రం. తణుకు పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉంది. ఉండిరాజవరం ఉండ్రాజవరం అయింది. ఉండి ప్రాంతాన్ని పరిపాలించిన రాజులను ఉండేశులని పేర్కొనేవారు. వారు ఏర్పాటు చేసుకున్న గ్రామమే ఉండ్రాజవరం. 14వ శతాబ్దంలో ఈ జానపదం ఏర్పడినట్టు సాధికారికంగా కూడా చెప్పవచ్చు. 1304 నాటి శాసనం (సి.పి.నెం 116 - 1917) లో హరితస గోత్రీయులైన , సూర్యవంశస్థుడైన రెండో ఉండి రాజు బ్రాహ్మణులకు రావులూరి గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చినట్టు స్పష్టంగా ఉంది. 1304 మాఘ శుద్ధ మాసంలో గురువారం నాడు (దుందుభి) దానం ఇచ్చినట్టు ఉంది. గ్రామ జనాభా 15 వేలు. రాష్ట్రంలో అత్యంత భాగ్యవంతమైన గ్రామం ఇది. ఇక్కడ తోటలు కనువిందు చేస్తాయి. అరటి, కొబ్బరి, చెరకు, వరి పంటలు పండిస్తారు. కోళ్ల పెంపకానికి ప్రసిద్ధి చెందాయి. సుబ్రమణ్యేశ్వర షష్ఠి తీర్థం ఘనంగా జరుపుతారు. ఒక్కడ బౌద్ధ పీఠం కూడా ఉంది.

బోయపాలెం

బోయపాలెం పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలంలో ఉంది. తొలుత బోయ వృత్తి సామాజిక వర్గంవారు ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకున్నారు. అంచేత బోయగూడెం అనే పేరు వచ్చింది.

ఇది చింతలపూడి గ్రామంలో కలిసి ఉంటుంది. మామిడి తోటలు, వరి పొలాల చుట్టూ ఉన్న అందమైన గ్రామాల్లో ఇది ఒకటి.

వేగేశ్వరపురం

వేగేశ్వరపురం పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో ఓ గ్రామం. పూర్వం ఈ ప్రాంతంలోని అడవుల్లో యోగులు, సన్యాసులు తపస్సు చేసేవారు. అంచేత ఈ పల్లెకు యోగీశ్వరపురం అనే పేరు వచ్చింది. లోక వ్యవహారంలో వేగేశ్వరపురంగా స్థిరపడిరది. గోదావరి నదీ ప్రాంతంలో వెలసి ఉన్న ఈ పల్లె సస్యశ్యామలంగా పాడిపంటలతో తులతూగుతోంది. మరిడి మహాలక్ష్మమ్మ, తుమ్మలమ్మ, ధనమ్మ గ్రామ దేవతలుగా ఉన్నారు. గ్రామ జనాభా 5601.

పెనుగొండ

పెనుగొండ పేరుతోనే రెండు ప్రసిద్ధ పట్టణాలున్న సంగతి తెలిసిందే. వీటిలో ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ దీన్నే వాసవి పెనుగొండ అని జనం వ్యవహరిస్తుంటారు. కాగా అనంతపురం జిల్లలోని పెనుగొండను రాయల పెనుగొండగా పేర్కొంటారు. ప.గో జిల్లాలోని మండల కేంద్రమైన పెనుగొండకు ఆ పేరు ఎలా వచ్చిందో గ్రహిద్దాం. పెనుగొండ అంటే ఈ సందర్భంలో పెనుగొండను పెద్దకొండ (ఘనగిరి) అనుకుంటే పొరపాటు అవుతుంది. అయితేదీని తొలిపేరు వెనుక గల విశేషాన్ని ముచ్చటిస్తే... పెనుగొండ తొలిపేరు పెనుమండం. అయితే జనవ్యవహారంలో పెనుగొండగా మారింది. ఎలా అంటే ఒకసారి ఉత్తరాది నుంచి దక్షిణాదికి జైత్రయాత్ర చేస్తూ విష్ణువర్ధన మహారాజు మర్గమధ్యంలో ఈ ప్రాంతంలో వాసవీ కన్యకా పరమేశ్వరిని పెళ్లి చేసుకోవాలని భావించాడు. అయితే ఈ పెళ్లికి వాసవి నిరాకరించింది. ఈ

సందర్భంగా ఆమె పెనుగుండాన్ని ఏర్పాటు చేయించి అందులో కన్యక దూకింది. ఆమెతో పాటు 102 గోత్రాల వారు ఇంటి కొకరు వంతున పడి ఆత్మబలిదానం చేసుకున్నారు. వాసవి మహాశక్తిగా రూపుదాల్చింది. ఆ తరువాత నగరం సరిహద్దులలోకి రాజు ప్రవేశించాడు. రాజును వాసవి మాత సంహరించింది. ఆమె తన బలిదానానికి వినియోగించిన పెను గుండమే పెనుగొండగా మారింది. ముఖ్యంగా ఆర్యవైశ్యులు ఆరాధించే వాసవిమాత ఆలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. సతీదేవి(పార్వతీదేవి) అవతారమే కన్యకా పరమేశ్వరి. ఈ క్షేత్రానికి సమీపంలో గల నగరేశ్వరస్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంత సంస్థానాధీశుడైన లక్ష్మయ్య నాయరు గొప్పకవి, పండితుడు. సాహిత్య సమ్మేళనాలు జరిపేవారు. మొత్తం 25 గ్రంథాలను అంకితం పొందిన మహానుభావుడు.


అయితంపూడి

అయితంపూడి ఇరగవరం మండలంలో ఉంది. సాహిత్య పరిమళాలలో విరాజిల్లుతోంది. ఈ పల్లెకు ఆ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే... అయితం అంటే ఓ రకమైన గడ్డి జాతి మొక్క ఆ మొక్క పేరుతో ఈ పేరు వచ్చిందనే వాదన ఉంది. మరో వాదన ఏమిటంటే రెడ్డి రాజుల కాలంలో అయితమ్మ అనే బ్రాహ్మణ మహిళకు ఈ పల్లెను అగ్రహారంగా ఇచ్చారు. ఈ రెండు కారణాల వల్ల పల్లెకు ఈ పేరు వచ్చింది. ఇందులో ఉత్తర పదంగా పూడి ఎలా వచ్చిందంటే వశిష్ట గోదావరి పాయ అలాగే కాటన్ దొర నిర్మించిన కాలువ ఉన్న వలనే, జల ప్రవాహాలు సమీపంలోని ఉన్న పల్లెలకు చివరి పదంగా పూడి చేరుతుంది. ఇక్కడ శ్రీ శరభ మల్లేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి గాంచింది. ఈ పల్లెలో ఉన్న మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ (1989) అనే సాహిత్య సంస్థను

ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు స్థాపించారు. ఈ సంస్థ క్రమం తప్పకుండా అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే అంతర్జాతీయ అంతర్జాల సదస్సులను కూడా జరుపుతోంది. ప్రఖ్యాత సాహితీ వేత్తలు బాలంగాధర్ తిలక్ డా|| ఉమర్ ఆలీషా తదితరులపై నిర్వహించిన ఈ సమ్మేళనాలు ఈ సంస్థ కీర్తిని ఇనుడిరప చేసాయి. ప్రముఖ భాషా శాస్త్రవేత్త బూదరాజు రాధాకృష్ణ ఈ పల్లెను సందర్శించిన వారిలో ఉన్నారు.

పెండ్యాల

పెండ్యాల పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు మండలంలో ఉంది. ఈ ఊరిపేరు వెనుక ఇతిహాస కథనం ప్రచారంలో ఉంది. సీతా దేవిని రావణుడు అపహరించుకొని లంకకు తీసుకొని వెళ్తుండగా జటాయువు అడ్డగించింది. అప్పుడు రావణుడు పక్షి రెక్కలను నరికాడు. జటాయువు కొన ఊపిరితో ఉండగా శ్రీరాముడు అక్కడికి వచ్చి సమీపంలో ఉన్న గోదావరి తీర ప్రాంతంలోని ఓ రేవులో పిండ ప్రదానం చేస్తాడు. పిండప్రదానం చేసిన ప్రాంతం కావడంతో దీనికి పెండ్యాల అనే పేరు వచ్చిందని స్థానికుల విశ్వాసం.



ఉమ్మడి కృష్ణా జిల్లా

కొడాలి

కొడాలి కృష్ణా జిల్లాలోని ఘంటశాల మండలంలో ఉంది. అవనిగడ్డ అసెంబ్లీ, మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. కొడాలి గ్రామానికి ఆ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే దీని తొలి పేరు కూడలి. విశేషమేమిటంటే ఇది నాలుగు ముఖ్య ప్రాంతాలకు కూడలిగా ఉంది. తూర్పు దిశలో ఘంటశాల ప్రాచీన బౌద్ధారామం, పశ్చిమ దిశలో శ్రీకాకుళంలోని ఆంధ్రమహా విష్ణువు ఆలయం ఉంది. ఉత్తర దిక్కున ప్రముఖ కూచిపూడి నృత్య కళాక్షేత్రం ఉంది. దక్షిణ దిశగా క్రీ.శ 1576లో నిర్మించిన చల్లపల్లి జమీందారుల కోట వైభవంగా దర్శనమిస్తాయి. ఇంతటి ప్రసిద్ధ ప్రాంతాలకు నడుమ ఈ గ్రామం ఉండడంతో దీనికి కూడలి అనే పేరు వచ్చింది. కాలగమనంలో కూడలి కాస్తా కొడాలిగా మారింది. ఈ విషయాన్ని కొడాలి గ్రామానికి చెందిన దిల్లీ యూనివర్సిటీ విశ్రాంత సహాయాచార్యులు డా|| బొల్లా వెంకట గురునాథరావు ఈ రచయితతో మాట్లడుతూ అన్నారు. కాగా కొడాలి ఇంటి పేరును కలిగిన వారు ఎందరో ఉండడం మరో విశేషమని ఉపాధ్యాయుడు కోడూరు గిరిధర సుబ్బారావు పేర్కొన్నారు. 2011 జానాభా లెక్కల ప్రకారం ఇక్కడ 947 కుటుంబాలున్నాయి.

తెలుగురావుపాలెం

తెలుగుదనం, తెలుగు భాష పరిమళం ఉట్టిపడే అందమైన గ్రామం ఇది. తెలుగు వారంతా గర్వపడే నామధేయంగా నిలుస్తుంది. తెలుగురావుపాలెం కృష్ణా జిల్లాలోని ఘంటశాల మండలంలో ఉంది. శ్రీకాకుళాంధ్ర దేవుడు వెలసిన శ్రీకాకుళం గ్రామానికి కేవలం కిలో మీటరు దూరంలో ఉంది. ఈ అందమైన పేరు వెనుక చరిత్ర ఇలా ఉంది. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన తెలుగురావు అనే పేరు గల వ్యక్తి ఈ ప్రాంతానికి కుటుంబ సమేతంగా వచ్చి ఓ జానపదాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ పల్లెకు తన పేరునే పెట్టుకున్నారు. అది తెలుగురావుపాలెం అయింది. సాధారణంగా అతి చిన్న గ్రామాలకు ఉత్తర పదంగా పాలెం చేరుతుంది. ఇలా తెలుగురావు పాలెం అయిందని గ్రహించాలి. ఇంత వైవిధ్యమైన పేరు గల గ్రామంలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు స్థానిక ఆర్.సి.ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

కోలవెన్ను

కోలవెన్ను గ్రామం కంకిపాడు మండలంలో ఉంది. కోలవెన్ను ఓ విశిష్ట గ్రామం. ఈ గ్రామానికి ఆ పేరు వెనుక గల చరిత్ర ఆసక్తిదాయకంగా ఉంటుంది. 'కో' అంటే కోటీశ్వరులు, 'ల' లక్షాధికారులు, 'వే' అంటే వేలాదికారులు, 'ను' అంటే నూర్లు (వందలాదికారులు) ఇలా నాలుగు వర్ణాల ప్రజలు ఇక్కడ ఉండడంతో ఈ గ్రామానికి కోలవెన్ను అనే పేరు వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు. మరో కథనం ప్రకారం గ్రామం ఏర్పాటైన తొలినాళ్లలో ఇక్కడ 'కోలాటం' జానపద బృందం ఉండేది.

ఆ రోజుల్లో కోలాటం కళ కొందరికి వెన్నుదన్నుగా ఉండేది. ఇలా తమ ఊరికి ఆ పేరు వచ్చినట్టు మరికొందరు వివరించారు. ఏమైనప్పటికీ ఈ రెండు కథనాలు వాస్తవమేనని గ్రామ ప్రముఖులు పేర్కొన్నారు. గ్రామ జనాభా 5600. వినాయక గుడి, చెన్నకేశవస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. ప్రముఖ సినీ దర్శకులు కె.రాఘవేంద్రరావు, కె.బాపయ్య ఈ గ్రామానికి చెందిన వారే కావడం విశేషం. గ్రామం నడిబొడ్డున గల మంటపం సెంటర్ వద్ద గతంలో సినిమా షూటింగులు జరిగాయి.

కుందేరు

కుందేరు కృష్ణాజిల్లా కంకిపాడు మండంలో ఉంది. కృష్ణా నది రైడస్ కాలువ తీరంలో నెలకొని ఉంది. కుందేరుకు ఆ పేరు ఎలా వచ్చిందంటే కర్నూలు జిల్లా కుందునది ప్రాంతానికి చెందిన కొందరు ఈ ప్రాంతానికి వలస వచ్చి గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ నదిపై ఉన్న మమకారంతో ఈ పేరు పెట్టుకున్నారు. ప్రముఖ సీనియర్ జర్నలిస్టు , ప్రసిద్ధ రచయిత దాసరి ఆళ్వారస్వామి ఈ గ్రామానికి చెందినవారే కావడం విశేషం.

ఐతవరం

ఐతవరం కృష్ణా జిల్లాలోని నందిగామ మండలంలో జాతీయ రహదారి పక్కన గల ఓ గ్రామం. గ్రామ జనాభా 2800. పల్లె చిన్నదే కావచ్చు. ఇక్కడ ఎనిమిది సామాజిక వర్గాల వారున్నారు. వీరంతా కలసి మెలసి ఆప్యాయత, అనురాగాలు, పరస్పర సహాయంతో జీవనయానం సాగిస్తున్నారు. ఈ ఊరి విశేషమేమిటంటే అందరూ ఒకర్ని ఒకరు అమ్మా, పిన్నీ, అక్కయ్య, చెల్లెమ్మ, నాన్న, తాతయ్య, అన్నయ్య,

తమ్ముడు అని పిలుచుకుంటారు. ఏ ఒక్కరూ పేర్లు పెట్టి పిలువరు. ఈ గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ఘనత స్థానికులైన రాష్ట్ర మాజీమంత్రి వసంత నాగేశ్వరరావుకు దక్కుతుంది. గ్రామంలో ఎవరు ఏ సామాజికవర్గం వారు తెలియని పరిస్థితి ఉంది. పాలు, నీరులా అంతా కలిసే ఉంటామని వసంత ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. 1970 నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోందని వివరించారు. మాజీ మంత్రి కుమారుడు వసంత కృష్ణ ప్రసాద్ మైలవరం శాసనసభ సభ్యుడుగా 2014లో ఎన్నికయ్యారు. ఇంతకీ ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే .. అయితే అంటే ఓ రకమైన గడ్డి జాతి మొక్క. దీని పేరుతో అయితవరం అయింది. జనవ్యవహారంలో ఐతవరంగా మారింది.

ఆకునూరు

ఆకునూరు ఉయ్యూరు మండలంలోని ఓ గ్రామం. గ్రామ జనాభా 3243. ఈ గ్రామం పేరు వెనుక గల విశేషాలను పరిశీలిస్తే.... పురోహితుల సూచనల మేరకు ఈ పల్లె ఏర్పాటైయ్యేటప్పుడు శత పత్రాలతో, పూజాదికాలు జరిపారు. శత పత్రాలు సంస్కృతీకరణ కాగా దాన్ని ఆకునూరుగా తేట తెలుగులో నామకరణం చేశారు. ఈ గ్రామానికి ఆకునూరుపాడు అని కూడా వ్యవహరించే వారని వాస్తు, జ్యోతిష్య నిష్ణాతులు మైనేపల్లి సుబ్రమణ్యం తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ మంత్రి కాకాని వెంకట రత్నంగారి స్వగ్రామం ఇదే. ఆయన కృషి వల్లనే ఇక్కడ ప్రభుత్వ జూనియరు కళాశాల ఏర్పాటైంది. 1972 జై ఆంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కాకాని నిలువెత్తు శిలా విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ గల రామాలయం, శివాలయం ప్రసిద్ధి చెందాయి.

బుద్ధవరం

బుద్ధవరం పేరుకు తగిన ఊరు. ఇది గన్నవరం మండలంలో ఉంది. ఈ జానపదం ఏర్పాటైన తొలి నాళ్లలోనే బౌద్ధ భిక్షువులు ఈ మత ధర్మం గూర్చి హెచ్చుగా ప్రచారం చేశారు. దీంతో ఈ పల్లెకు బుద్ధవరం అని నామకరణం చేశారు. గన్నవరం నుంచి 4 కి.మీ దూరంలో ఉంది. గ్రామ జనాభా 8763.

ముదినేపల్లి

ముదినేపల్లి ఓ మండల కేంద్రం. దీని తొలి పేరు ముదినాగులపల్లి. ముది అంటే పాత లేదా ముసలి అని అర్థం నాగ అంటే పాము, పల్లి అంటే గ్రామం అని అర్థం. ముదినాగులపల్లి క్రమంగా ముదినేపల్లిగా స్థిరపడిరది. ఆ రోజుల్లో నాగుల సంచారం ఇక్కడ ఎక్కువగా ఉండేది. దీంతో ముదినాగులపల్లి అని పేరు వచ్చింది. గ్రామ జనాభా 6463. పేరుకు తగ్గట్టుగానే ఇక్కడ నాగేంద్రస్వామి ఆలయం ఉంది.

సంగమేశ్వరం

సంగమేశ్వరం నాగాయలంక మండలంలో ఉంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... పడమటి కనుమలలో మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌కు ఉత్తరంగా మహాదేవ్ పర్వతశ్రేణిలో చిన్న ధారగా పుట్టిన కృష్ణానది ఇక్కడకు చేరుకునే సరికి రెండు పాయలుగా చీలింది. అందులో ఒకటి సముద్రంలో కలుస్తుంది. ఆ పవిత్ర ప్రదేశమే సంగమేశ్వరం. పరమేశ్వరుడు స్వయంభువుగా ఇక్కడ వెలిశాడు. సాగర తీరాన గంగా-పార్వతీ సమేతంగా దర్శనమిచ్చే గొప్ప క్షేత్రమిది.

దీనికి కొన్ని శతాబ్దాల చరిత్ర ఉంది. క్రీ.శ 1108-1206 మధ్య కాలంలో తీరాంధ్ర దేశాన్ని పాలించిన వెలనాటి దుర్జయ వంశస్థులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ గ్రామం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నది. పల్లె చుట్టూ చెరువులు, సముద్రం ఉంటుంది.

కొండపల్లి

కొండపల్లి కృష్ణా జిల్లాలోని కొత్తగా ఏర్పాటైన పురపాలక కేంద్రం. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఎత్తయిన కొండను ఆనుకొని ఈ పల్లె ఏర్పాటుకావడంతో దీనికి కొండపల్లి అని పేరు వచ్చింది. ఈ కొండపై ఏర్పాటు చేసిన కోటను క్రీ.శ 1360లో కొండవీడు రాజ్యాన్ని పరిపాలించిన రెడ్డి రాజులు నిర్మించారు. ఈ గ్రామంలో రూపొందించిన చెక్క బొమ్మలు అత్యంత సుందరంగా ఉంటాయి. వీటి కోసం స్థానికంగా లభించే పొనికి చెక్కను వాడుతారు. వీటికి వేసే సహజమైన రంగులు కూడా స్థానిక కళాకారులే తయారు చేస్తారు. ప్రస్తుతం 85 కుటుంబాలకు చెందిన 250 మంది కళాకారులు ఈ బొమ్మలను తయారుచేస్తున్నారని ఉదయగిరి వెంకటరమణ దుర్గాప్రసాద్ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. 400 సంవత్సరాల నుండి ఇక్కడ కొమ్మ బొమ్మలు రూపొందిస్తున్నారు.

అయ్యంకి

అయ్యంకి గ్రామం మొవ్వ మండలంలో ఉంది. మండల కేంద్రం నుండి 8 కి.మీ దూరంలో ఉంది. గ్రామ జనాభా 4వేలు. ఇంటి పేరుతో ఏర్పాటైన గ్రామాల్లో ఇది ఒకటి. గ్రంథాలయ ఉద్యమ నిర్మాత అయ్యంకి వెంకటరమణయ్య తాత, ముత్తాతలు నివశించిన గ్రామం ఇది. వారి

ఇంటి పేరైన అయ్యంకి పేరుతో ఈ గ్రామం ఏర్పాటైంది. అయితే అయ్యంకి వెంకటరమణయ్య పూర్వీకులు ఆ పల్లె నుంచి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం ప్రాంతంలోని కొంకుడూరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

విద్యాధరపురం

విద్యాధరపురం విజయవాడ నగర పాలికలోని ఓ ముఖ్యమైన ప్రాంతం. విద్యాధర గజపతి (ఒడిశా) అప్పట్లో దీన్ని నిర్మించారు. దీంతో ఈ ప్రాంతానికి విద్యాధరపురం అనే పేరు వచ్చింది. క్రీ.శ 16వ శతాబ్దంలో ఇది ఏర్పాటైంది. విద్యాధర గజపతి కొండపల్లి వద్ద జలాశయాన్ని ఏర్పాటు చేశారు.

బీసెంటు రోడ్డు (విజయవాడ)

బీసెంటురోడ్డు విజయవాడలోని ముఖ్యమైన వాణిజ్య ప్రాంతం. వస్త్ర వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతుంది. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలిగా థియోసాఫికల్ సొసైటీ నిస్తరణకు ఎనలేని కృషి చేసిన అనిబిసెంటు పేరుతో ఈ రోడ్డుకు ఈ పేరు వచ్చింది. దివ్యజ్ఞానాన్ని అంతర్జాతీయ స్థాయిలో కూడా వ్యాప్తి చేసిన ఘనత ఆమెకు దక్కుతుంది.

కాళేశ్వరం మార్కెట్ (విజయవాడ)

కాళేశ్వరం మార్కెట్టు కూడా ఓ ప్రధాన వ్యాపార కేంద్రమే. సమైక్య ఆంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు గౌరవార్థం ఈ మార్కెట్టుకు కాళేశ్వరరావు మార్కెట్టుగా పిలుస్తున్నారు.

గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు కృష్ణా జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో ఒకటి, మండల కేంద్రం. పేరు వెనుక గల చరిత్రలోకి తొంగిచూస్తే గుడులు ఎక్కువగా ఉన్న ప్రాంతం అని అర్థం. గుడ్ల అనే శబ్దం నుంచి గుడులు వచ్చింది. ఈ పట్టణ జనాభా 15వేలు. గుడులకు సంబంధించి శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ కన్యకాపరమేశ్వరి, శ్రీ సాయిబాబా ఆలయం, కృష్ణ, శ్రీరామ ఆలయం, గంగన్నమ్మ, వీరమ్మ, సుబ్రమణ్యేశ్వర తదితర ఆలయాలు ఉన్నాయి. ఈ కారణంగా గడ్లవల్లేరు పేరు వచ్చింది.

నందిగామ

నందిగామ ఓ మండల కేంద్రం. నందిగామలోని గొప్ప శివాలయాన్ని రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు నిర్మించారు. ఈ శివాలయంలోని నందీశ్వరుని ప్రాధాన్యత వల్ల 'నందిగ్రామం' గా తొలుత పిలిచేవారు. జనవ్యవహారంలో నందిగామగా స్థిరపడింది. అదే పేరు కొనసాగుతోంది.

చల్లపల్లి

చల్లపల్లి పాడిపంటలకు ఆటపట్టు. కృష్ణా జిల్లాలోని ఓ జమీందారి రాజధాని, మండల కేంద్రం. చల్ల అంటే మజ్జిగ (చల్లనిది) అని అర్థం. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలోని యాదవులు పాడి పశువులను ఎక్కువగా పెంచేవారు. పాలు, పెరుగు, చల్లను విక్రయించే వారు. అయితే తమ జనావాసం చల్లగా ఉండాలని కోరుకుంటూ ఈ పల్లెకు ''చల్ల'' అనే పదం కలిసొచ్చే విధంగా చల్లపల్లి అనే పేరు పెట్టుకున్నారు. ఈ విషయాన్ని ప్రముఖ సాహితీవేత్త, శాసనసభ మాజీ ఉపసభాపతి

మండలి బుద్ధ ప్రసాద్ ధ్రువీకరించారు. చల్లపల్లికి 4 శతాబ్దాల చరిత్ర ఉంది. దేవరకోట రాజ్యాన్ని యార్లగడ్డ వంశీయులు పాలించారు. చల్లపల్లిని రాజధానిగా ఏర్పాటు చేసుకున్నారు. క్రీ.శ 1576లో యార్లగడ్డ గురువారాముడు ఈ రాజ్యాన్ని నిర్మించారు. చల్లపల్లి జమీందారి పాలన ఏర్పాటు అంతమైంది. రాజావారు ఓ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక జమీందారీ వ్యవస్థ రద్దయింది. రెండు దశాబ్దాల కితం రెండు ఎకరాల్లో మంచి ఉద్యానవనం ఏర్పాటైంది. ఇక్కడి మోపిదేవి శ్రీవల్లీ దేవ సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది.

గుణదల

గుణదల విజయవాడ ఎన్నదగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. దీని తొలి పేరు గుణందల. ఇది వృక్ష సంబంధమైన పేరు. గుణందల జనవ్యవహారంలో గుణదలగా మారింది. గుణదల పర్వత శ్రేణిలో ఉన్న మేరీ మాతను ముఖ్యంగా కేథలిక్ క్రైస్తవులు ఆరాధిస్తుంటారు. ప్రతీ ఏటా ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు జరిగే మేరీమాత ఉత్సవాల్లో 10 లక్షల మంది పాల్గొంటారు.

గాంధీపర్వతం

విజయవాడ రైల్వేస్టేషను వెనుక గల తారాపేటలో గాంధీ పర్వతం ప్రసిద్ధి చెందింది. ఈ కొండను గతంలో ఒ.ఆర్.ఆర్‌గా పిలిచేవారు. ఇక్కడి గాంధీ స్మారక స్థూపం, ప్లానిటోరియం , ఏడు పొడవైన స్తంభాలు ఉన్నాయి. గాంధీజీ స్వాతంత్ర్య సమరంలో భాగంగా విజయవాడ పర్యటించారు.

చలివేంద్రపాలెం

చలివేంద్రపాలెం పేరుకు తగిన ఊరు. ప్రతి ఇంట పూల మొక్కలు, పండ్ల మొక్కలు దర్శనమిస్తాయి. వాన నీటిని ఒడిసి పట్టేందుకు గానూ దాదాపు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంటలు కనబడతాయి. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో ఈ పల్లె ఉంది. ఇంతకీ ఆ పల్లెకు ఈ పేరు ఎలా వచ్చిందంటే. ఈ జనావాసం ఏర్పాటైన తొలినాళ్ళలో చలువ పందిళ్లు ఎక్కువగా ఉండేవి. దాన్నే చలివేంద్రంగా పిలుస్తారు. బాటసారులకు చల్లటి మజ్జిగలాగా నీళ్లు ఇచ్చేవారు. అలాగే ప్రతి ఇంటికి వేసవిలో నీళ్లు తడిపిన వెదురు చాపలను అమర్చేవారు. కాలక్రమంలో ఇవన్నీ తెరమరుగయ్యాయి. అయితే ఈ పల్లె పర్యావరణానికి పెద్దపీట వేస్తూ ప్రస్థానం సాగిస్తోంది. గ్రామ జనాభా 1550. కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్మల్ పురస్కారం కూడా పొందింది. సందన వనాన్ని తలపించే పార్కు ఇక్కడి ప్రత్యేకత. శివాలయం, వేణుగోపాలస్వామి ఉన్నాయి. విజ్ఞాన కేంద్రాలు, ఉన్నత పాఠశాల తదితరమైనవి ఉన్నాయి.

పొన్నవరం

పొన్నవరం గ్రామం వీరులపాడు మండలంలోని ఓ ప్రగతి శీల గ్రామం. ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే .... ఇక్కడ పొన్న (పున్నాగ) చెట్లు అధికంగా ఉన్నందున పొన్నవరం అనే పేరు వచ్చింది. కీళ్లవాత నివారణకుగానూ పొన్న నూనెను ఎక్కువగా వాడతారు. ఇది గ్రామానికి వరం లాంటిది. ఇప్పటికీ ఈ గ్రామంలోని చెరువు వద్ద పొన్న చెట్లు కనిపిస్తాయి. 2021 ఏప్రిల్ 24న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ నూతలపాటి వెంకటరమణ

స్వగ్రామం ఇదే కావడం విశేషం. ఈ గ్రామ జనాభా 2023. గ్రామంలో అన్నీ సి.సి రోడ్లు కనిపిస్తాయి. ప్రతీ ఇంటికి కుళాయి ఉంటుంది. పెద్ద వర్మీ కంపోస్టు కేంద్రం ఉంది. ఉచిత వైఫై సౌకర్యం కూడా ఉండడం మరో విశేషం. ఎ.న్టీ.ఆర్ సుజల నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. 2015లో ఈ పల్లెను కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఎం.పి నిధుల నుంచి రూ. 15కోట్ల మేరకు వెచ్చించారు.

మొగల్తూరు

మొగల్తూరు అనగానే జ్ఞానపీఠ్ పురస్కార్ గ్రహీత రావూరి భరద్వాజ గుర్తుకు వస్తారు. ఆయన జన్మ స్థలం ఇదే. ఈ గ్రామం కృష్ణా జిల్లా కంచికచర్ల మండలంలో ఉంది. మొగలి పూలు పూసే పొదచెట్ల పేరుతో ఏర్పాటైంది. తొలుత మొగలూరు అయింది. జనవ్యవహారంలో మొగల్తూరుగా మారింది. ఇది సంస్కృత పండిత గ్రామంగా విరాజిల్లుతోంది. గార్లపాటి, కూచిభట్ల వంశీయులు అవధానులుగా, సంస్కృత పండితులుగా ఎంతో గుర్తింపు పొందారు. వీరిలో గార్లపాటి లక్ష్మీనారాయణ అవధాని చిరకాలం ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారు. గ్రామ జనాభా 6 వేలు.

కాజ

కాజ మొవ్వ మండలంలోనే ఓ పంచాయితీ కేంద్రం. ఇక్కడ అన్ని సామాజిక వర్గాల వారు ఒకే కుటుంబంగా ఐక్యతతో వ్యవహరిస్తుటారు. ఉన్నత విద్యావంతులు ఉన్న గ్రామం. జనాభా 9వేలు. క్రీ.శ 19వ శతాబ్దంలో ఓ పొలంలో కాజమ్మ గ్రామ దేవత విగ్రహం దొరికినందున

, ఆ పేరుతో ఈ గ్రామానికి కాజ అనే పేరు వచ్చింది. మరో కథనం ప్రకారం 'కాజ' అనే రకం గడ్డి మొక్కలు అప్పట్లో ఎక్కువగా ఉన్నందున కాజ అనే పేరు వచ్చినట్టు గ్రామీణులు పేర్కొన్నారు. ప్రముఖ కథా, నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి స్వగ్రామం ఇదే. ఆమె రాసిన మీనా, జీవనతరంగాలు, బంగారు కలలు తదితర నవలలు సినిమాలుగా విడుదలయ్యాయి.

ఈడుపుగల్లు

ఈడుపుగల్లు కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని ఓ గ్రామం. దీనితొలి పేరు వరహపట్నం. అయితే క్రీ.శ 19వ శతాబ్దంలో విష జ్వరాలు తాకిడి వల్ల ఈ పల్లెలో లెక్కలేనన్ని మరణాలు సంభవించాయి. మృతదేహాలను ఈడ్చుకుంటూ రుద్రభూమికి తీసుకొని వెళ్లిన భయంకరమైన సందర్భం దృష్ట్యా ఈ పల్లెకు ఈడుపుగల్లు అనే పేరు వచ్చిందని పేర్కొంటారు. ఇక్కడ గల కొలను (చెరువు) కొల్లుగా మారింది. ఇలా ఈడుపుగల్లు అనే పేరు వచ్చింది. ఈ సందర్భంలో కళ్ శబ్దం శిలా సంబంధంగా భావించకూడదు. క్రీ.శ 1835లో ఇక్కడ ఏర్పాటు చేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి స్థంభం ఎంతో ప్రసిద్ధి చెందింది.

కోడూరు

కోడూరు మండల కేంద్రం. కోడు అంటే జల సూచి. ఊరు అనేది జానపద సూచి. హంసలదీవికి సమీపంలో ఉన్నందున జలసూచి అయింది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఉంది. ఇక్కడ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, గంగా భవానీ అమ్మవారు

ఆలయం, కనకదుర్గమ్మ, షిరిడీ, అయ్యప్ప స్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. కాగా ఇదే జిల్లాలో ముదినేపల్లి మండలంలో కోడూరు అనే పేరుతో మరో గ్రామం ఉంది.

యార్లగడ్డ

యార్లగడ్డ చల్లపల్లి మండలంలో యార్లగడ్డ, నిమ్మగడ్డ గ్రామాలు ఇంటి పేర్లతో ఏర్పడ్డాయి. యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దర్, అలాగే నామ విజ్ఞానవేత్త ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర్‌రావు, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు, హిందీ అకాడమీ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌ల ఇంటి పేర్ల ఇవేనని వేరేగా చెప్పనక్కర్లేదు. ఇక నిమ్మగడ్డ ఇంటి పేరుతో ప్రసిద్ధులైన ప్రముఖ పారిశ్రామిక వేత్త నిమ్మగడ్డ ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ వంటి ప్రముఖులున్న సంగతి తెలిసిందే.

కాకులపాడు

కాకుల పేరుతో కూడా కొన్ని గ్రామాలు ఏర్పాటయ్యాయి. పితృ దేవతలకు వారధిగా భావించే కాకులంటే ప్రజలకు ఎంతో ప్రీతి. ఇలా ఏర్పాటైన గ్రామాల్లో కృష్ణా జిల్లాలోని బావులపాడు మండలంలోని కాకులపాడును పేర్కొనవచ్చు. పాడు అంటే ఒకప్పుడు పాడు పడిన గ్రామం తిరిగి పూర్వ వైభవం పొందే సందర్భాలల్లో గ్రామాలకు చివరి పదంగా పాడు చేరుతుంది. అలాగే జైనులు లేదా బౌద్ధులు ఆవాసంగా ఉండే గ్రామాలకు ఉత్తర పదంగా పాడు చేరుతుంది.

కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం పేరుతో అనేక గ్రామాలున్నాయి. అందులో ఒకటైన కపిలేశ్వరపురం పమిడి ముక్కల మండలంలో ఉంది. విజయవాడ ప్రాంతం క్రీ.శ 1434 నుంచి క్రీ.శ 1538 వరకూ గజపతి రాజుల పాలనలోకి వచ్చింది. ఈ పాలకుల్లో కపిలేశ్వర గజపతి, పురుషోత్తమ గజపతి, ప్రతాపరుద్ర గజపతి ప్రసిద్ధులు. గజపతి రాజ్యాన్ని పాలించిన కపిలేశ్వర గజపతి పేరుతో కపిలేశ్వరపురం ఏర్పాటైంది.

కపిలేశ్వర గజపతి కుమారుడైన పురుషోత్తమ గజపతి పేరుతో గన్నవరం మండలంలో పురుషోత్తపట్నం ఏర్పాటైంది. ఆయన మనుమడైన ప్రతాప రుద్ర గజపతికి విద్యాధరుడనే మరో పేరు ఉంది. ఆయన పేరిట నిర్మించిన దే విద్యాధరపురం, ఈయన భార్య భవానమ్మ, కుమార్తెలు ముత్యాలమ్మ , పైడమ్మల పేరిట నిర్మించిన ఈ గ్రామానికి భవానీ పురం, ముత్యాలపాడు, పైడూరుపాడు విజయవాడ నగర రక్షణ కోసం ఉత్తర హిందుస్తాన్ నుంచి వచ్చిన పఠానులు నివశించిన ప్రాంతమే పఠానులపేట. కాగా లబ్బీపేటకు ఆ పేరు ఎలా వచ్చిందంటే 'లబ్బె' అంటే తోళ్ళు అని అర్థం. ఈ పరిశ్రమ అభివృద్ధితో లబ్బీపేట ఏర్పాటైంది.

నాగాయలంక

నాగయ్య అనే మోతుబారి పేరుతో నాగాయలంకకు ఈ పేరు వచ్చింది. ఇది లంక గ్రామం. పులిగెడ్డ వద్ద వంతెన నిర్మించినందున నాగాయలంకకు కమ్యూనికేషన్ సౌకర్యాలు ఏర్పడ్డాయి. అవనిగడ్డ నుంచి నాగాయలంకకు 8 కి.మీ దూరం ఉంటుంది. ప్రముఖ సాహితీవేత్త,

అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ జన్మస్థలం ఇదే. ఈ గ్రామం మత్స్య పరిశ్రమకు ప్రసిద్ధి. చేపల వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. ఇక్కడి గంగానమ్మ తల్లి దేవాలయం, ఎల్లారమ్మ గ్రామ దేవత గుడి, వెంకటేశ్వరాలయం, పోతురాజు స్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ ప్రాచీనమైన దీప స్థంభం ఉంది.

వానపాముల

వానపాముల కృష్ణా జిల్లాలోని ఓ మండల కేంద్రం. 1214 జనాభా ఉన్న ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... తొలుత ఈ ప్రాంతానికి వానమాను ఇంటి పేరు కలిగిన నాయీ బ్రాహ్మణ వ్యక్తి కుటుంబంతో సహా ఇక్కడికి వచ్చి గ్రామం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తరువాత మరికొన్ని కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయి. వానపాముల అని ఈ గ్రామానికి పేరు పెట్టారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధుడు అట్లూరి రాజమోహనరావు తెలిపారు. కాకతీయ ప్రభువులు శ్రీకాకుళం క్షేత్రాన్ని సందర్శించేందుకు వచ్చిన అనేక సందర్భాల్లో పూర్ణ మధ్యంలో వానపాములలో మజిలీ చేసినట్లు డా॥సి.నా.రె అప్పట్లో పేర్కొన్నారు. ఈ పల్లెలో కాకతీయులు ఓ పెద్ద బావిని కూడా తవ్వించారు. ఈ జానపదం ఒకప్పుడు ఉయ్యూరు జమీందారీలో ఉండేది. ఈ పల్లెలో స్థిరపడిన దండమూడి రాజగోపాలరావు 3వ జాతీయ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. ఈ గ్రామం గూర్చి కానూరి వెంకట రంగదీసు 'వానపాముల గ్రామ చరిత్ర' అనే పుస్తకం రాశారు.

దీనదయాళపురం

దీనదయాళపురం నాగాయలంక మండలంలో ఉన్నది. 1977 నవంబరు 19న వచ్చిన భయంకర తుఫాను దివిసీమను ముంచి వేసింది. గ్రామాలకు గ్రామాలే తుడిచి పెట్టుకు పోయాయి. ఆ తరువాత పునర్నిర్మాణ కార్యక్రమంలో కొన్ని గ్రామాలు ఏర్పడ్డాయి. అందులో ఓ గ్రామం దీనదయాళపురం. ఈ గ్రామాన్ని ఆర్.ఎస్.ఎస్ 99 రోజుల్లో 99 ఇళ్లు కట్టి ఒక తుఫాను షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆర్.ఎస్.ఎస్ మాజీ అధ్యక్షుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ పేరుతో నామకరణం చేశారు. కాగా దీనదయాళపురం ప్రస్తుతం పర్ర పంచాయితీ పరిధిలో ఉంది.

తలగడ దీవి

తలగడదీవి కృష్ణాజిల్లా నాగాయలంక మండలంలో ఉంది. దీని పూర్వనామం పెద్దదీవిపురం. ఈ ప్రాంతంలో ఈ ఊరు అతిపెద్ద దీవి కావడంతో దీనికి తలగడ దీవి అనే పేరు వచ్చినట్లు సాహితీవేత్త డా॥ గుడిసేత కృష్ణాప్రసాద్ ఈ రచయితకు తెలిపారు. తలగడ దీవి కేంద్రంగా అయా వంశరాజులు కొన్నాళ్లు పరిపాలించారు.

పెండ్యాల

పెండ్యాల ఇదో ఆదర్శ గ్రామం. 90 శాతం మంది ముస్లింలు ఉన్న ఊరు ఇది. ఈ గ్రామం కృష్ణా జిల్లా కంచికచర్ల మండలంలో ఉంది. గ్రామ జనాభా 12వేలు. అన్ని కులాలు, మతాలు, సోదర భావంతో ఉంటారు. పండ్ల వ్యాపారమే ప్రజల జీవనోపాధి. పండ్ల వ్యాపారం కలిసొచ్చే విధంగా పండ్యాల అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో పెండ్యాలగా మారింది.

ఉమ్మడి గుంటూరు జిల్లా

కొల్లిపర (గుంటూరు జిల్లా)

కొల్లిపర గ్రామం గుంటూరు జిల్లాలోని ఓ మండల కేంద్రం. తెనాలి అసెంబ్లీ, పరిధిలో ఉంది. విజయనగర సామ్రాజ్య పాలకుడైన సదాశివరాయులు (1543 - 1567) ఈ జానపదాన్ని బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. దీంతో ఈ గ్రామం సదాశివమహారాయపురంతో వెలసింది. అయితే కాలగమనంలో ఈ గ్రామం కొల్లిపర అనే పేరును సంతరించుకొంది. కొల్లిపర గ్రామం పేరు వెనుక గల చరిత్ర ఇలా ..... తొలుత కొల్లిపర్రు అని ఉండేది. సాధారణంగా గ్రామానికి కొంచెం ఎక్కువ దూరంలో జల ప్రవాహం ఉంటే 'పర్రు' అనే మాట ఉత్తరపదంగా చేరుతుంది. ఒకవేళ ప్రవాహం ఒడ్డునే ఉన్నా వరద తాకిడికి తగలనంత ఎత్తులో ఉన్నా సరే 'పర్రు' పదం చేరుతుంది. జన వ్యవహారంలో పర్రు అనే మాట 'పర'గా మారింది. ఈ ప్రాచీన గ్రామం కృష్ణవేణి నది గుండేరు, పెరకేరు, పేడేరు అనే మూడు పాయలుగా విడిపోయే చోట్ల నెలకొని ఉంది. ఇక కొల్లి విషయానికి వస్తే 'కొల్లి' అనే పదం ఒడియా సంప్రదాయం నుంచి వచ్చింది. ఒడియాలో కొల్లి అంటే విస్తరాకులు అని అర్థం. ఈ పల్లెలో ఆ రోజుల్లో అరిటాకులను ఎక్కువగా భోజనం కోసం వాడేవారు. ఇందుకు నిదర్శనంగా ఇప్పటికీ ఇక్కడ అరటితోటలు ఎక్కువగా ఉన్నాయి.

గతంలో వేంగీ చాళుక్యులు కాలంలో నిర్మించిన గంగా, పార్వతీ సమేత శ్రీ ముక్తేశ్వర స్వామి ఎంతో ప్రసిద్ధి చెందాయి. గ్రామం మధ్యలో ఉన్న బోడ్రాయి వద్ద ప్రతిష్టతమైన శివ లింగానికి అభిషేకం చేస్తే కుండపోతగా వర్షం కురుస్తోంది. వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు అభిషేకాలు జరుపుతారు. ఇది ఎంతో గొప్ప విశేషమని ఎ.ఆర్.ఆర్. ఎయిడెడ్ జూనియర్ కళాశాల లెక్చరర్ ఈమని వెంకట సాయి ఫణీంద్ర రెడ్డి పేర్కొన్నారు.

బ్రాహ్మణకోడూరు

బ్రాహ్మణకోడూరు ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన విశిష్ట జానపద గ్రామం. గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలో ఉంది. బ్రాహ్మణకోడూరు తొలి పేరు గొల్లల కోడూరు. గొల్లలకు ఆవాసమైనందున గొల్లల కోడూరు అయింది. కాలగమనంలో కొండ వీటి పాలకుడు అనవేమారెడ్డి క్రీ.శ 1622లో తన ఆస్థాన పండితుడు మాధవపెద్ది నాగేశ్వరశాస్త్రికి అగ్రహారంగా ఇచ్చాడు. అప్పటి నుంచి గొల్లలకోడూరు కాలక్రమంలో బ్రాహ్మణకోడూరుగా మారింది. అయితే కోడూరు ఉత్తర పదంగా ఎలా చేరిందంటే గ్రామానికి సమీపంలో నీటి కాలువ ఉండే అలాంటి గ్రామాలకు చివర కోడు చేరుతుందని నిఘంటువులు పేర్కొంటున్నాయి. ఈ విధంగా బ్రాహ్మణకోడూరు అయిందని గ్రహించాలి. ఈ గ్రామం పక్కనే కొనుమూరు కాలువ ఉంది. నాటక, సినీ కళా రంగాల్లో ఈ గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మాధవపెద్ది సత్యం, ప్రఖ్యాత చిత్రకారుడు మాధవపెద్ది గోఖలే (మా గోఖలే), అంతర్జాతీయ నాట్యాచార్యుడు మాధవపెద్ది వెంకటరామయ్య, గాయనీమణి ఎం.ఎస్ సుబ్బలక్ష్మి మాధవపెద్ది రామప్రసాద్ వంటి వారు ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారు. నాగరూపమ్మ అమ్మవారు ఇక్కడి గ్రామదేవత కార్తీక పౌర్ణమి రోజున అమ్మవారి ఆలయంలో భారీ ఎత్తున వేడుకలు జరుగుతాయి. రాష్ట్రం నలుమూలలు నుంచి అసంఖ్యాంకంగా భక్తులు తరలివస్తారు. వర్తమానంలో గొర్రపాటి శ్రీనివాసాచార్యులు, సోపాటి ప్రభాకర్ వంటి ప్రసిద్ధ రచయితలు ఈ గ్రామంలో జన్మించడం తమ పూర్వజన్మ ఫలమని వీరు పేర్కొన్నారు.

బుద్ధాం

బుద్ధాం గ్రామం గుంటూరు జిల్లా కర్లపాలెం మండలంలో ఉంది. బాపట్ల లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ గ్రామానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కర్లపాలెం బుద్ధాం గ్రామాల మధ్య జరిపిన తవ్వకాల్లో బుద్ధుని విగ్రహాలు అవశేషాలెన్నో బయటపడ్డాయి. ఇవన్నీ ఎనిమిదో శతాబ్దం నాటివని స్పష్టమౌతోంది. బుద్ధునికి సంబంధించిన అవశేషాలు ఈ ప్రాంతంలో బయటపడడంతో తమ గ్రామానికి బుద్ధుని పేరు కలిసొచ్చే విధంగా బుద్ధాం అని నామకరణం చేశారని గ్రామానికి చెందిన మిద్దిబోయిన నాగరాజు తదితరులు ఈ రచయితతో మాట్లడుతూ అన్నారు. కాగా ఇక్కడ లభించిన శిల్పాలు బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నాయి. ఈ అవశేషాలను అమరావతి, హైదరాబాదు మ్యూజియంలో భద్రపరిచారు. ఈ గ్రామానికి మరింత ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో క్షత్రియ సేవా సంఘం వారు స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయం పక్కనే అందమైన బుద్ధుని విగ్రహాన్ని రెండేళ్ల క్రితం నిర్మించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సత్తెనపల్లి

సత్తెనపల్లి గుంటూరు జిల్లాలోని శాసన సభ నియోజకవర్గ కేంద్రం, పురపాలిక కేంద్రం కూడా. పట్టణ జనాభా 56,721. సత్తెనపల్లి పేరు వెనుక గల కథ ఇది. సత్తెన్న పేరు గల వ్యక్తి కుటుంబ సమేతంగా ఈ ప్రాంతానికి వలస వచ్చి చిన్న ఇల్లును ఏర్పాటు చేసుకున్నారు. క్రమేపీ అనేక గృహ సముదాయాలు వెలిసాయి. సత్తెన్న పేరుతో ఓ పల్లె ఏర్పాటైంది. సత్తెన్నపల్లె జన వ్యవహారంలో సత్తెనపల్లిగా మారింది. నాటి ఈ పల్లె నేడు పట్నంగా దినదిన ప్రవర్ధమానమవుతోంది. రైలు నిలయం, వ్యవసాయ మార్కెట్టు యార్డు, వివిధ విద్య సంస్థలతో సత్తెనపల్లి రూపురేఖలే మారిపోయాయి. సాంఘిక, రాజకీయ చైతన్యానికి మారుపేరుగా మారిపోయాయి. సాంఘిక, రాజకీయ చైతన్యానికి మారుపేరుగా ఈ పట్టణం నిలిచింది. ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఈ ప్రాంతం వారే. 1952 -72 మధ్య కాలంలో నాలుగు సార్లు శాసనసభ సభ్యునిగా, 1976 - 78 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షునిగా వ్యవహరించారు.

నరకుళ్లపాడు

నరకుళ్లపాడు గుంటూరు జిల్లా అమరావతి మండలంలో ఉంది. గ్రామ జనాభా 2335. ఈ పల్లె నుంచే కొండవీటి వాగు ప్రవహిస్తుంది. ఇంతకీ ఈ గ్రామానికి ఈ పేరు ఎలా వచ్చిందంటే చరిత్ర తిరగేయాల్సిందే... 1783 - 1816 మధ్యకాలంలో ఈ ప్రాంతంలో గిరిజన తెగకు చెందిన చెంచులు దారి దోపిడీలను ఎక్కువగా చేసేవారు.

ఈ నేపథ్యంలో పరిపాలకుడైన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తన మంత్రి వర్గీయులను విందుకు ఆహ్వానిస్తాడు. భోజన కార్యక్రమం అనంతరం చెంచులందరినీ సామూహికంగా వధిస్తాడు. ఈ సంఘటన జరిగిన ప్రాంతమే నరకుళ్లపాడు అయింది. (నరకడం పేరుతో) పాడు అంటే పాటి నేల ప్రాంతమని గ్రహించాలి. ఇదీ ఈ పల్లె వెనుక గల చరిత్ర.

నంబూరు

నంబూరు పెదకాకాని మండలంలో ఉంది. కొండవీటి రెడ్డి రాజుల కాలం నుంచి ఇక్కడ గల వేణుగోపాలస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో పూజలకై ప్రత్యేకంగా నంబులను (విష్ణు పూజలు చేసే వాళ్లు) వారికి ఉచిత నివాస సౌకర్యాలను కల్పించారు. ఆ విధంగా నంబుల ఊరుగా పేరు మొదలైంది. కాలగమనంలో నంబూరుగా మారింది. ఒకప్పుడు బౌద్ధ కేంద్రంగా విలసిల్లినట్లు చరిత్ర చెబుతోంది.

నీరుకొండ

నీరుకొండ గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో ఉంది. ఈ గ్రామంలో ఓ కొండ ఉంది. చాలా అందంగా కనిపిస్తుంది. చిన్న పాటి వానకు సైతం కొండ చుట్టూ నీరు చేరుతుంది. అలాగే దీనికి సమీపంలో కొండ వాగు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న ఈ గ్రామానికి నీరుకొండ అని పేరు పెట్టుకున్నారు. ఈ కొండ వాగు వెంబడి మెరక ప్రాంతంలో కాలక్రమేణా గ్రామం విస్తరించింది.

నగరం

నగరం గుంటూరు జిల్లాలో ఉంది. నగరం అనే పేరు చూసి భ్రమ పడకండి. అది నగరం కాదు ఓ గ్రామం మాత్రమే. గ్రామ జనాభా 5వేలు మాత్రమే. అయితే దీనికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ... ఆంధ్ర కేరుక్షేత్రంగా పేరొందిన పల్నాటి యద్ధం (క్రీ.శ 1182)లో వాడిన నగారా (పెద్ద ధంకా)ను ఇక్కడే పటిష్టంగా తయారు చేసారు. దీంతో ఈ జనావాసానికి 'నగారా' అనే పేరు వచ్చింది. అయితే జనవ్యవహారంలో నగారా కాస్త నగరంగా మారింది. నగరం అంటే ఓ రకం గడ్డి జాతి మొక్క. దీని వల్ల నగరం అనే పేరు వచ్చినట్టు కూడా ప్రచారంలో ఉంది.

దండమూడి

దండమూడి చిలకలూరిపేట మండలంలో ఉంది. దండ అంటే ఇక్కడ సమీపం లేదా ఒడ్డు అని గ్రహించాలి. ఈ పల్లెకు సమీపంలో జలప్రవాహం ఉంది. అంచేత ఉత్తర పదంగా పూడి చేరింది. పూడి రూపాంతరం చెంది మూడి అయింది. జలప్రవాహాలకు సమీపంలో ఉన్న గ్రామాలకు పూడి లేదా మూడి చేరడం కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఈ పల్లెకు సమీపంలోనే ఓలేరు, కుప్పగంజి వాగులున్నాయి. ఈ పల్లె పచ్చదనంతో, సాగు నీటి సౌకర్యంతో నిండి ఉంది. వరి, పత్తి, పొగాకు ముఖ్యమైన పంటలు. ఈ పల్లెకు చెందిన పలువురు ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. జాతీయ వెయిట్ లిఫ్టర్ మిస్టర్ ఆసియాగా పేరొందిన దండమూడి రాజగోపాలరావు ఇంటి పేరు కూడా ఇదే. దండమూడి పేరుతోనే ఇదే జిల్లాలోని పొన్నూరు మండలంలో ఓ గ్రామం ఉంది.

ఈతేరు

ఈతేరు బాపట్ల మండలంలో ఉంది. ప్రముఖ సాహితీవేత్త డా॥ కత్తి పద్మారావు స్వగ్రామం ఇది. అప్పికట్ల నుంచి ఊరేగింపుగా వచ్చిన రథం ఈ ప్రాంతంలోకి వచ్చే సరికి కదలకుండా, మెదలకుండా నిలిచిపోయింది. దీంతో ఇక్కడి ప్రజలు తమ జనావాసాలకు ఈతేరు అని పేరు పెట్టారు. తేరు అంటే రథం. ఇదే విషయాన్ని కత్తి పద్మారావు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. గ్రామ జనాభా 3433.

కురగల్లు

కురగల్లు మంగళగిరి మండలంలో ఉంది. కురు అంటే చిన్న, గల్లు అంటే కొండ రాయి అని అర్థం. ఈ ప్రాంతంలో చిన్న కొండ రాయి ఉండడంతో, ఆ రాయి చుట్టూ ఊరు విస్తరించింది. దీంతో ఆ ఊరికి ప్రజల్లో కురుగల్లు అని నామకరణం చేసారు. ఆంగ్లేయ అధికారి మెటన్ కాఫ్ తాను రాసిన మద్రాసు ప్రెసిడెన్సీ చరిత్రలో ఈ ఊరి పేరును ప్రస్తావించారు. గ్రామ జనాభా 4340.

బెల్లంకొండ

బెల్లంకొండ ఓ మండల కేంద్రం. దీని తొలి పేరు బిలంకొండ. ఈ కొండపై అనేకమైన బిలాలు (రంధ్రాలు) ఉన్నాయి. దీంతో దీనికి బిలంకొండ అనే పేరు వచ్చింది. కాలక్రమంలో బెల్లంకొండగా మారింది. ఈ కొండ పక్కనే పెద్ద గ్రామం వెలసింది. అంచేత గ్రామీణులు దీనికి బెల్లంకొండ అనే పేరు పెట్టారు. ఈ గ్రామ జనాభా 12 వేలు. అన్నింటికి మించి బెల్లంకొండపై వెలసిన కోట ఎంతో ప్రసిద్ధి చెందింది. క్రీ.శ14వ

శతాబ్దంలో దీన్ని రెడ్డి రాజులు నిర్మించారు. ఈ కొండను ఎక్కడానికి 800 మెట్లు ఉన్నాయి. ఆ తరువాత రాళ్ల దారి పై నుండి కొండను ఎక్కాల్సి ఉంటుంది. శిథిలమైన కోట దర్శనమిస్తుంది. ఒడిశా గజపతుల పాలన కాలంలో కోటను జయించడానికి శ్రీ కృష్ణ దేవరాయలకు 6 నెలలు పట్టింది.

కొలనుకొండ

కొలనుకొండ తాడేపల్లి మండలంలో ఉంది. కొలను, కొండ ప్రక్క ప్రక్కలనే ఉండడంతో కొలను కొండ అనే పేరు వచ్చింది. కొలను పేరు మల్లమ్మ చెరువు, కొండ పేరు మనుగోడు తిప్ప, మనుగోడు తిప్పపై 20వ శతాబ్దంలో దోర్బల శేషాద్రి శాస్త్రి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ గల కోదండ రామ స్వామి ఆలయం, షిరీడీ సాయి ఆలయం ప్రసిద్ధి చెందాయి. ప్రముఖ సీనియర్ పాత్రికేయులు డి.వి.ఆర్. భాస్కర్ ఈ గ్రామానికి చెందిన వారే.

అగ్నిగుండాల

అగ్నిగుండాల పేరు విచిత్రంగా ఉంది కదూ. ఈ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ఎంతో ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. ఈ గ్రామం గుంటూరు జిల్లా ఈపుర మండలంలో ఉంది. గ్రామ జనాభా 3వేల మేరకు ఉంటుంది. ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న కొండల వెనుక గల బొల్లాపల్లి మండలంలో సీసపు గనులు ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఈ గనుల్లో జరిగిన ఘోర ప్రమాదంలో సుమారు 200 మంది కార్మికులు చనిపోయారు. విగత జీవులైన వీరి భార్యలు ఈ దారుణాన్ని తట్టుకోలేక సామూహికంగా పెద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసుకున్నారు.

ఒక్కసారి దేవుణ్ణి తలచుకుంటూ వీరంతా గుండంలో దూకి దుర్మరణం చెందారు. దీంతో ఆ గ్రామానికి అగ్నిగుండాల అనే పేరు వచ్చిందని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడుగు ప్రతాప్ పేర్కొన్నారు. అయితే గుండాలకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కానరావడం లేదని వివరించారు.

వడ్డేశ్వరం

వడ్డేశ్వరం తాడేపల్లి మండలంలో ఉంది. కృష్ణా నదికి 5 కి.మీ దూరంలో నెలకొని ఉంది. వడ్డ, ఈశ్వరం కలయికతో వడ్డేశ్వరం ఏర్పడింది. ఇక్కడ వెలసిన ఈశ్వరుడు వడ్డేశ్వరుడు. ఈ ఆలయాన్ని బట్టి దీనికి వడ్డేశ్వరం అనే పేరు ఏర్పడిందని పేర్కొనవచ్చు. కృష్ణా నదికి 5 కి.మీ దూరంలో ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 6275గా ఉంది. కె.ఎల్.విశ్వవిద్యాలయం వడ్డేశ్వరంలో ఉంది.

వేజెండ్ల

వేజెండ్ల చేబ్రోలు మండలంలో ఉంది. లోగడ ఈ ప్రాంతంలో ఓ శివాలయం ఉండేది. ప్రతి మహా శివరాత్రికి భారీ ఎత్తున ఉత్సవాలు జరిగేవి. అయితే రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు (1783-1816) గారి కుటుంబం విష్ణు ఆలయాన్ని ఇక్కడ నిర్మిస్తే బాగుంటుందని ఆలోచించి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని చక్కగా నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయం సమీపంలో వేయి జెండాలను కట్టారు. ఆ వేయి జెండాల పేరు జనవ్యవహారంలో వేజెండ్లగా మారింది. ఆ పేరునే ఈ గ్రామానికి వేజెండ్లగా పెట్టినట్లు స్థానికుల కథనం.

కొలకలూరు

కొలకలూరు తెనాలి మండలంలో ఉంది. 'కొలకు' అంటే కొలను అని అర్థం. ఈ ప్రాంతంలో కొలనులు ఎక్కువగా ఉన్నందున 'కొలనులూరు' అయింది. జనవ్యవహారంలో కొలకులూరుగా మారింది. కొలకలూరు ఇంటి పేరుగా ఉన్నవారెందరో కనిపిస్తారు. గ్రామ జనాభా 18వేలు. కాగా క్రీ.శ 13, 14వ శతాబ్దం నాటి చోళ రాజవంశానికి చెందిన శాసనాలు ఉన్నాయి. గ్రామం చుట్టూ ఉన్న ప్రాంతం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది.

రెంటచింతల

రెంటచింతల గ్రామం గుంటూరు జిల్లాలోని ఓ మండల కేంద్రం. గ్రామ జనాభా 16,523. తొలుత ఈ గ్రామం రెండు చింతచెట్లు హద్దులుగా, వీటికి మధ్య ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ గ్రామానికి నాటి పెద్దలు రెంటచింతలగా పేరు పెట్టుకొన్నట్లు స్థానికుల కథనం. జనాభాలో హెచ్చు భాగం హిందువులు, ఆ తరువాత కేథలిక్ క్రైస్తవులు ఉన్నారు. ఈ గ్రామంలోని కేథలిక్కులు ఏసు ప్రదర్శన విందును గత రెండు శతాబ్దాల నుంచి జరుపుకుంటున్నారు. అలాగే వినాయక చవితిని ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తారు. సంగీత, నృత్యప్రదర్శనలను, కోలాటం కార్యక్రమాలను హెచ్చుగా ఏర్పాటుచేసి ఆనందిస్తుంటారు. వేసవికాలంలో తీవ్ర ఉష్ణోగ్రత ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీలుగా ఉంటుంది. అయితే శీతాకాలంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఉప్పలపాడు

ఉప్పలపాడు గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో ఉంది. గ్రామ జనాభా 8వేలు. ఉప్పలపాడు తొలిపేరు ఉత్పలపాడు. ఇక్కడ గల పెద్ద చెరువులో గతంలో కలువ పూలు ఎక్కువగా ఉండేవి. కలువ అనే పదానికి పర్యాయ పదం ఉత్పల అని గ్రహించాలి. పాడు అంటే పాటి నేలలు అని అర్థం. ఈ ప్రాంతమంతా పాటి నేలలే. ఫలితంగా ఉత్పలపాడు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఉప్పలపాడుగా మారింది. ఇక్కడి చెరువులో చేపలు విపరీతంగా ఉన్నాయి. ప్రతిఏటా 20,000 వలస పక్షులు చైనా, నేపాల్, సైబీరియా ప్రాంతాల నుంచి వస్తుంటాయి. చెరువులోని చేపలను ఆహారంగా తీసుకుంటాయి. ఈ తటాకంలోని మట్టి దిన్నెల పై గల చెట్లపై నివాసం ఉంటాయి. ఈ చెరువు పక్షుల కిలకిలరావాలతో ప్రతిధ్వనిస్తుంటాయి. ఏటా 2 లక్షల మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.

స్తువర్టుపురం (సువార్తపురం)

వానలో తడవని వాళ్లు స్తువర్టుపురం పేరు వినని వారు ఉండరు. ఈ గ్రామం గుంటూరు జిల్లా బాపట్ల మండలంలో నెలకొని ఉంది. బాపట్ల చీరాల మధ్య ఈ గ్రామం ఉంది. అంతరరాష్ట్ర దొంగతనాల్లో ఆరితేరిన చోరులు ఉండేవారు. భాగ్యవంతుల ఇళ్లను, బ్యాంకులను, పెద్దపెద్ద బంగాళాలను కన్నం వేసేవారు. చోరీలకు పాల్పడినప్పుడు హత్యలు, అత్యాచారాలకు, పాల్పడేవారు కాదు. ఈ దొంగలు 1978 నవంబరు 10న సింహాచలం దేవాలయంలో ప్రవేశించి 8.60 కిలోల బంగారం, 11.14 వెండి దొంగిలించారు. చోటా ప్రసాద్, గజ్జెల

మల్లేష్ ఈ చోరీలకు పాల్పడ్డారు. చోరీలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఈ గ్రామంలో సంస్కరణలను తెచ్చేందుకు కృషి చేసిన ఆంగ్లేయ దొర స్టువర్డు పేరు కలిసొచ్చే విధంగా స్టూవర్డుపురం అనే పేరు వచ్చింది. ఆంగ్లేయుల పాలనలోనే నేర జాతుల చట్టానికి అనుగుణంగా ఏర్పాటు చేసిన సెటిల్‌మెంట్లలో ఇది ఒకటి. గ్రామ జనాభా 3280. వీరిలో 99 శాతం మంది ఎరుకల సామాజిక వర్గంవారే. పలు క్రైస్తవ సంస్థలు సంస్కరణలకు శ్రీకారం చుట్టినందున ఈ గ్రామానికి సువార్తపురం అని కూడా పిలుస్తారు. సాల్వేషన్ అనే క్రైస్తవ సంస్థ ఎన్నో సంస్కరణలు చేపట్టింది. హేమలతా లవణం కూడా వారిలో మార్పుకు కృషి చేశారు. మొత్తం మీద నేడు చోరీలు లేని గ్రామంగా సరికొత్త చరిత్ర సృష్టించడం అశ్చర్యకరం. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల ఈ పల్లెలో 50 శాతం మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. నాటి ఎస్.పి కోటీశ్వరరావు ఈ గ్రామానికి చెందిన వారే.

గురజాల

గురజాల గుంటూరు జిల్లాలోని ఓ రెవెన్యూ డివిజన్ కేంద్రం. చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్నాటి గ్రామం ఇది. దీని తొలిపేరు మాధవీపట్నం. దీనికి శాసనాధారం కూడా ఉంది. గురజ అంటే ఓ జాతి మొక్క. ఈ మొక్క పేరుతోనే దీనికి గురజాల అనే పేరు వచ్చింది. కాగా ఇక్కడి గురజాలమ్మ పేరుతో దీనికి ఆ పేరు వచ్చి ఉండవచ్చని కూడా పేర్కొంటారు. హైహయ వంశపు రాజు అలుగు రాజు గురజాలను రాజధానిగా చేసుకొని పల్నాడును పాలించాడు. అతని వారసుడు నలగాముడు కూడా ఇదే పట్టణాన్ని రాజధానిగా చేసుకొని పాలించాడు. ఈ దాయాదుల మధ్య జరిగిన పోరు పల్నాటి యుద్ధంగా పేరు గాంచింది.

ఇక్కడి గల పాత పాడేశ్వరి అమ్మవారి ఆలయం ప్రసిద్ధి చెందింది. నాటి ప్రముఖ సినీ నటుల నిమ్మకాయల కృష్ణమూర్తి స్వగ్రామం ఇదే.

వట్టి చెరుకూరు

వట్టి చెరుకూరు ఓ మండల కేంద్రం. గుంటూరు నుంచి 16 కి.మీ దూరంలో ఉంది. గ్రామం ఏర్పాటైన తొలినాళ్లలో రుచీపచీ లేని వెర్రి చెరుకు ఉండేది. దీంతో ఈ పల్లెకు వట్టి చెరుకూరు అనే పేరు వచ్చిందని స్థానికుల కథనం. ఇక్కడి గంగా భ్రమరాంబ సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయం, వేణు గోపాలస్వామి ఆలయం, పొతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, నాగేంద్రస్వామి, ఆంజనేయస్వామి , పోలేరమ్మ, ముప్పాదేవరమ్మ ఆలయాలు ప్రసిద్ధి చెందాయి.

గరికపాడు

గరికపాడు పేరు కలిసొచ్చే విధంగా అనేక పల్లెలున్న సంగతి తెలిసిందే. గడ్డి జాతికి చెందిన గరిక పేరుతో కొన్ని గ్రామాలున్నాయి. ఉదాహరణకు గరికపాడు. ఈ గ్రామం పేరుతో గుంటూరు జిల్లా క్రోసూరు మండలం, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం, శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలాల్లో ఉన్నాయి. గరిక మొక్కలను ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. హిందూ ధర్మంలో ముఖ్యంగా అనేక పండగల సందర్భంగా గరిక , పసుపు కలిపి నివేదిస్తారు.

జొన్నలగడ్డ

మొక్కలు, వృక్షాలు పేర్లతో అనేక గ్రామాలు కనిపిస్తాయి. జొన్నలగడ్డ గ్రామం గుంటూరు గ్రామీణ మండలంలో ఉంది. గ్రామం

ఏర్పాటైన తొలినాళ్లలో జొన్న, సజ్జ పంటలను ఎక్కువగా పండిరచేవారు. దీంతో ఈ గ్రామానికి జొన్నలగడ్డ అని పేరు వచ్చింది. గడ్డ అంటే నేల అని అర్థం. అయితే ప్రస్తుతం కొండవీటి వాగు ద్వారా నీటి పారుదల సౌకర్యం అందుబాటులో వచ్చినందున ఆ పంటలకు స్వస్తి చెప్పారు. ప్రస్తుతం వరి , మిర్చి, శనగ పంటలను పండిస్తున్నారు. స్థానిక ఆదర్శ రైతు ఆళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. ఈ గ్రామంలో జొన్నలగడ్డ ఇంటి పేరుతో కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయి. గ్రామ జనాభా ఆరు వేలు.

లాం

లాం గ్రామం గుంటూరు జిల్లా తాడికొండ మండలంలో ఉంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసుకుందాం. ''లామా'' అనే బౌద్ధ సన్యాసి 25 కి.మీ దూరంలో ఉన్న అమరావతి నుంచి ఈ ప్రాంతానికి వచ్చి బుద్ధుని పంచశీల గురించి ప్రచారం చేశారు. దీంతో ఈ గ్రామానికి లామా అని పేరు పెట్టారు. జనవ్యవహారంలో లాము గా తరువాత లాం గా స్థిరపడిరది. ఇక్కడి పశు సంవర్ధక శాఖ పరిశోధన కేంద్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. కాగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పక్కనే ఉన్న గోరంట్ల పంచాయితీలో లాం ఫారమ్ పేరుతో ఉంది.



ఉమ్మడి ప్రకాశం (ఒంగోలు) జిల్లా

గిద్దలూరు

గిద్దలూరు ప్రకాశం జిల్లాలో అతి ముఖ్యమైన కేంద్రాల్లో ఒకటి. శాసనసభ నియోజకవర్గ కేంద్రం. గిద్దలూరు తొలి పేరు సిద్ధలూరు. సగిలేరు నది ఒడ్డున ఉంది. సిద్ధలూరులోని పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం అత్యంత పురాతనమైనది. ఇందులో సిద్ధులు ఉండేవారు. వారి పేరులోనే సిద్ధలూరు గ్రామం ఏర్పాటైంది. ఇది ఓ అగ్రహార గ్రామం. కాలగమనంలో సిద్ధలూరు గ్రామం గిద్దలూరుగా మారింది. గిద్దలూరు పేరు వెనుక గల నేపథ్యాన్ని పరిశీలిస్తే ఇక్కడ ఆ రోజుల్లో గిత్తల (ఎద్దుల) సంఖ్య ఎక్కువగా ఉండేది. క్రయ విక్రయాలు జరిగేది. దీంతో గిత్తలూరు అనే పేరు కొత్తగా పెట్టారు. జన వ్యవహారంలో గిత్తలూరు క్రమంగా గిద్దలూరుగా స్థిరపడిరది. ఇది నగర పంచాయితీ కూడా. గ్రామ జనాభా 35,110. ఇక్కడి పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం గూర్చి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో ప్రస్తావించడం విశేషం. ఈ దేవాలయంలో పెళ్ళిళ్ళు అపరిమితంగా జరుగుతుంటాయి. ఇక్కడ వివాహం చేసుకుంటే వారి జీవిత మంతా సుఖ సంతోషమయమవుతుందనే భక్తుల విశ్వాసమని ఈ గ్రామానికి చెందిన యోగా ప్రచారకురాలు టి.వి. కళాకారిణి బుర్రా శ్రీ తులసి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

కొత్తపట్నం

కొత్తపట్నం ఓ మండల కేంద్రం. సముద్రతీర ప్రాంతంలో ఉంది. గ్రామ జనాభా 21,729. కొత్తపట్నం తొలిపేరు రాజపట్నం. సమీపంలోని మోటుమాల గ్రామానికి చెందిన ప్రజల్లో ఎక్కువ మంది కొత్తగా ఏర్పాటు చేసుకున్న ఈ గ్రామానికి కొత్తపట్నం అని పేరు పెట్టారు. అయితే ఈ గ్రామం తొలి పేరు రాజపట్నం. నాటి దీప స్థంబం గత చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తుందని స్థానిక రంగస్థల నటులు, రచయిత నంది పురస్కార గ్రహీత రావినూతల భరద్వాజ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. ఇక్కడ గల ఓంకార, శారద తపోవనం, బ్రహ్మకుమారి ఆశ్రమం ఎంతో ప్రసిద్ధి.

చల్లగిరిగిల

చల్లగిరిగిల కనిగిరి మండంలో నెలకొని ఉన్న గ్రామం. కాటమరాజుకు, మనుమసిద్ధికి క్రీ.శ 1260లో కనిగిరి ప్రాంతంలో భీకర పోరాటం జరిగింది. ఈ యుద్ధంలో ఉభయ పక్షాలకు చెందిన ఎందరో సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఈ ప్రాంతంలో అలా గాయపడిన వారికి కొందరు మానవతా దృక్పథంతో సేవలందించారు. అక్కడ తాటాకులు ఈత ఆకులు పరచి వాటిపై పెద్ద బానలు (పెద్ద కుండలు) పెట్టి పెరుగు వేసి కవ్వాలతో గిరగిరా చిలికి చల్ల (మజ్జిగ) చేసేవారు. ఇలా ఆ ప్రాంతంలో ఏర్పాటైన గ్రామానికి చల్లగిరిగిల అనే పేరు పెట్టారు. ఈ పల్లె పేరు వెనుక గల నేపథ్యం ఇది.

ఔరంగాబాద్

ఔరంగాబాదు కంభం మండలంలో ఓ గ్రామం. ఒకప్పుడు ఈ గ్రామాన్ని కొన్ని ముస్లిం కుటుంబాలు ప్రారంభించాయి. వీరంతా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ పట్టణం నుండి వలస వచ్చి ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామానికి ఔరంగాబాద్ అని పేరు పెట్టారు. అయితే ఇక్కడి ముస్లిం కుటుంబాలన్నీ ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వలస పోయారు. అయినప్పటికీ ఔరంగాబాద్ పేరు నిలిచిపోయింది.

ఇంకొల్లు

ఇంకొల్లు ఓ మండల కేంద్రం. దీని తొలి పేరు ఇంకిన కొలను. జనవ్యవహారంలో ఇంకొల్లుగా పరిణమించింది. ఈ ప్రాంతంలో ఓ చోట పెద్ద ఇంకిన కొలను ఉండడంతో తమ గ్రామానికి ఇంకిన కొలను అని తొలుత పేరు పెట్టారు. క్రమంగా ఇంకొల్లుగా మారిందని స్థానికులు కథనం.

వల్లూరు

వల్లూరు టంగుటూరు మండలంలో నెలకొని ఉంది. ఈ గ్రామంలో వల్లూరమ్మ ఆలయం అత్యంత ప్రాచీనమైనది. ఈ ఆలయం పేరుతోనే వల్లూరు గ్రామం ఏర్పాటైంది. యజ్ఞగుండం నుంచి ఆవిర్భవించిన అమ్మవారు ఉల్కాముఖిగా వల్లూరమ్మగా వాసికెక్కింది. అమ్మవారు ఆరోగ్య ప్రదాతగా, అభయ ప్రదాతగా, భక్తుల కోరికలను తీర్చే కృపామయిగా పేర్కొంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఈ ఆలయం ఉంది. వల్లూరు గ్రామం సమీపంలో సముద్రం ఉంది.

మరో కూచిపూడి

కూచిపూడి అనగానే నృత్య కళా కేంద్రంగా ప్రసిద్ధికెక్కిన కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కూచిపూడి గుర్తుకువస్తుంది. అయితే ప్రకాశం జిల్లాలోని మర్రిపూడి మండలంలో కూడా కూచిపూడి పేరుతో ఓ గ్రామం ఉంది. ఈ గ్రామం జనాభా 2700. కృష్ణా జిల్లా కూచిపూడి నుంచి కొందరు ఇక్కడకు వలస వచ్చి జనావాసం ఏర్పాటు చేసుకున్నారు. తాము తొలుత నివసించిన గ్రామం పేరుతోనే ఈ గ్రామానికి అదే పేరు పెట్టుకున్నారు. ఈ గ్రామానికి సాగర్ కాలువ నుంచి సాగునీరు వస్తుంది. దీంతో గ్రామం సుభిక్షంగా ఉంది. కూచిపూడి పేరుతోనే ఒంగోలులో ఓ కాలనీ ఏర్పడిరది. ఇక్కడి వారే అక్కడకు వెళ్లి ఈ కాలనీ ఏర్పాటు చేసుకున్నట్టు రెవెన్యూ శాఖకు చెందిన చిరుదుల సందీప్‌కుమార్ ఈ రచయితకు తెలిపారు. ఇంకో కూచిపూడి గ్రామం గుంటూరు జిల్లా అమృతలూరు మండలంలో ఉంది.

మాణికేశ్వరం

మాణికేశ్వరం అద్దంకి మండలంలో ఉంది. గ్రామ జనాభా 1785. ఇది గుండ్లకమ్మ నదీ తీరంలో ఉన్నది. ఇక్కడ వెలసిన మణికేశ్వర ఆలయం పేరుతోనే ఈ గ్రామం వెలసి ఉంది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. ప్రతీరోజూ వందలాది మంది భక్తులు ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు.

రామతీర్థం

రామతీర్థం చీమకుర్తి మండలంలో ఉంది. రావణ సంహారం తరువాత శ్రీరాముడు ఈ ప్రాంతానికి వచ్చి మోక్ష రామలింగేశ్వరస్వామి వారిని ప్రతిష్ఠించినట్టు స్థలపురాణం పేర్కొంటోంది. రాముని పేరు కలిసొచ్చే విధంగా ఈ గ్రామానికి స్థానికులు రామతీర్థం అని పేరు పెట్టారు. అక్కడ శ్రీరాముడే ఓ కోనేరును నిర్మించినట్టు గ్రామీణుల ఉవాచ. రెడ్డి రాజులు, విజయనగర రాజులు ఈ క్షేత్ర అభివృద్ధికి కృషి చేశారు.

టంగుటూరు

టంగుటూరు ఇంటి పేరుతో ఏర్పాటైన గ్రామం. ఈ పేరుతో ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రం, కడప జిల్లాలోని రాజుపేట మండలంలోని అలాగే కర్నూలు జిల్లాలోని బనగానపల్లె మండలంలో ఇదే పేరుతో ఉన్నాయి. వీటిలో కడప జిల్లాలోని టంగుటూరు కుందునది సమీపంలో ఉంది. వలసల వల్ల ఒకే పేరుతో వివిధ గ్రామాలు ఏర్పాటయ్యాయి. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు, సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏడవ ముఖ్యమంత్రి అంజయ్య ఇంటి పేరు టంగుటూరి కావడం విశేషం. మరో విషయం ఏమిటంటే... గుర్రం మీద జీను జారిపోకుండా కట్టేపట్టెడను 'టంగు' అంటారు. ఈ పట్టెడను తయారు చేసేవారు. ఇక్కడ ఉండేవారు. దీంతో ఈ ఊరికి టంగుటూరు అనే పేరు వచ్చిందని స్థానికుల ఉవాచ.

మరో కూచిపూడి

కూచిపూడి అనగానే నృత్య కళా కేంద్రంగా ప్రసిద్ధికెక్కిన కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కూచిపూడి గుర్తుకువస్తుంది. అయితే ప్రకాశం జిల్లాలోని మర్రిపూడి మండలంలో కూడా కూచిపూడి పేరుతో ఓ గ్రామం ఉంది. ఈ గ్రామం జనాభా 2700. కృష్ణా జిల్లా కూచిపూడి నుంచి కొందరు ఇక్కడకు వలస వచ్చి జనావాసం ఏర్పాటు చేసుకున్నారు. తాము తొలుత నివసించిన గ్రామం పేరుతోనే ఈ గ్రామానికి అదే పేరు పెట్టుకున్నారు. ఈ గ్రామానికి సాగర్ కాలువ నుంచి సాగునీరు వస్తుంది. దీంతో గ్రామం సుభిక్షంగా ఉంది. కూచిపూడి పేరుతోనే ఒంగోలులో ఓ కాలనీ ఏర్పడిరది. ఇక్కడి వారే అక్కడకు వెళ్లి ఈ కాలనీ ఏర్పాటు చేసుకున్నట్టు రెవెన్యూ శాఖకు చెందిన చిరుదుల సందీప్‌కుమార్ ఈ రచయితకు తెలిపారు. ఇంకో కూచిపూడి గ్రామం గుంటూరు జిల్లా అమృతలూరు మండలంలో ఉంది.

మాణికేశ్వరం

మాణికేశ్వరం అద్దంకి మండలంలో ఉంది. గ్రామ జనాభా 1785. ఇది గుండ్లకమ్మ నదీ తీరంలో ఉన్నది. ఇక్కడ వెలసిన మణికేశ్వర ఆలయం పేరుతోనే ఈ గ్రామం వెలసి ఉంది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. ప్రతీరోజూ వందలాది మంది భక్తులు ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు.

రామతీర్థం

రామతీర్థం చీమకుర్తి మండలంలో ఉంది. రావణ సంహారం తరువాత శ్రీరాముడు ఈ ప్రాంతానికి వచ్చి మోక్ష రామలింగేశ్వరస్వామి వారిని ప్రతిష్ఠించినట్టు స్థలపురాణం పేర్కొంటోంది. రాముని పేరు కలిసొచ్చే విధంగా ఈ గ్రామానికి స్థానికులు రామతీర్థం అని పేరు పెట్టారు. అక్కడ శ్రీరాముడే ఓ కోనేరును నిర్మించినట్టు గ్రామీణుల ఉవాచ. రెడ్డి రాజులు, విజయనగర రాజులు ఈ క్షేత్ర అభివృద్ధికి కృషి చేశారు.

టంగుటూరు

టంగుటూరు ఇంటి పేరుతో ఏర్పాటైన గ్రామం. ఈ పేరుతో ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రం, కడప జిల్లాలోని రాజుపేట మండలంలోని అలాగే కర్నూలు జిల్లాలోని బనగానపల్లె మండలంలో ఇదే పేరుతో ఉన్నాయి. వీటిలో కడప జిల్లాలోని టంగుటూరు కుందునది సమీపంలో ఉంది. వలసల వల్ల ఒకే పేరుతో వివిధ గ్రామాలు ఏర్పాటయ్యాయి. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు, సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏడవ ముఖ్యమంత్రి అంజయ్య ఇంటి పేరు టంగుటూరి కావడం విశేషం. మరో విషయం ఏమిటంటే... గుర్రం మీద జీను జారిపోకుండా కట్టేపట్టెడను 'టంగు' అంటారు. ఈ పట్టెడను తయారు చేసేవారు. ఇక్కడ ఉండేవారు. దీంతో ఈ ఊరికి టంగుటూరు అనే పేరు వచ్చిందని స్థానికుల ఉవాచ.

కనపర్తి

ఇది గొప్ప చారిత్రక ప్రదేశం. కనపర్తి సీమగా వర్ధిల్లిన ప్రాంతమిది. కనపర్తి తొలుత కనకాపురి, కనకభంజనపురి, కనకాంబుజపురిగా పిలిచేవారు. ఇది బంగారం పండేపురిగా వర్థిల్లాలని కోరుకొంటారు. ఈ పేరు పెట్టినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇది ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో ఉంది. జనాభా 6 వేలు. బ్రహ్మకుండి అని పిలిచే గుండ్లకమ్మనది, అనంత సాగరంలో కలసిపోయే ప్రాంతంలో వెలిసింది. ఇది గొప్ప బౌద్ధ ఆవాస కేంద్రం. ఒంగోలు నుంచి 35 కి.మీ దూరంలో ఉంది. గ్రామం పక్క నుంచి ప్రవహిస్తున్న బకింగ్ హం కాలువ ద్వారా ఆంగ్లేయులు కాలంలో విజయవాడ నుంచి చెన్నై వరకూ నాటు పడవల ద్వారా సరుకు రవాణా జరిగేది. మార్గ మధ్యంలో విడిది కోసం ఇక్కడ బంగాళాను ఏర్పాటు చేశారు. బౌద్ధ శిల్పాలలకు, స్థూపాలకు ఆనవాలంగా ఉంది. శాతవాహనులు, చాళుక్యులు, గజపతులు, విజయనగర రాజులు పాలించారు. చోళరాజుల కాలంనాటి కులదేవత చౌళమ్మగుడి ఉంది. ఆంధ్రకేసరి టుంగుటూరి ప్రకాశం పంతులు మ్యూజియం ఇక్కడ ఉంది. ప్రముఖ జ్యోతిష శాస్త్రవేత్త గోనుగోండ కోటిలింగ ఇక్కడి వారే.

వినోదరాయునిపాలెం

వినోదరాయునిపాలెం నాగులుప్పలపాడు మండలంలోని ఓ ప్రసిద్ధ గ్రామం. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జన్మస్థలం ఇది. దీని తొలి పేరు ఇరుఎద్దులవారిపాలెం. కాలక్రమంలో వినోదరాయుడనే వ్యక్తి ప్రాబల్యంవ్లల ఈ పేరు

వచ్చినట్లు పేర్కొంటున్నారు. గ్రామంలో ఆంధ్రకేసరి టంగుటూరి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన చదువుకున్న ఉన్నత పాఠశాల మంచి విద్యాప్రమాణాలతో ముందుకు సాగుతోంది. ఈ పల్లెలో తాను జన్మించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రముఖ రంగ స్థలనటుడు భైరపునేని సుబ్బారావు తెలిపారు.

చందవరం

చందవరం దొనకొండ మండలంలోని బౌద్ధ కేత్రం వెలసిన గ్రామం. గుండ్లకమ్మ నదీతీరంలో ఉంది. క్రీ.పూ 2వ శతాబ్దం నాటి రెండు బ్రహ్మీలిపి శాసనాల్లో ''చందమఘు పుత్రుడు బౌద్ధ సంఘానికి, బుద్ధ భగవానునికి దానం చేయడమైనది.'' అని రాసి ఉంది. చందమఘపుత్రుని పేరుతో ఈ గ్రామానికి చందవరం అనే పేరు వచ్చింది. క్రీ.పూ2వ శతాబ్దంలో బౌద్ధ భిక్షువులు ఇక్కడ ఆరామాలు నిర్మించుకున్నారు. ఈ ప్రాంతం హీనయాన బౌద్దక్షేత్రంగా వర్థిల్లింది. 1972లో పురావస్తు శాఖ ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని తవ్వకాలు జరిపింది. బౌద్ద స్థూపం, మహా చైత్యం లభించాయి. కొన్నాళ్ల కితం గుండ్లకమ్మ నదిలో ఇసుక తీస్తుండగా రెండు పాలరాతి విగ్రహాలు బయల్పడ్డాయి. ఈ ప్రాంతంలో లభించిన అవశేషంలో మ్యూజియంను కూడా ఏర్పాటు చేశారు. క్రీ.పూ2 శతాబ్దం నుంచి క్రీ.శ9 వ శతాబ్దం వరకూ అతి వైభవంగా ఈ క్షేత్రం వర్థిల్లింది.

కందుకూరు

కందుకూరు రెవెన్యూ డివిజన్ కేంద్రం. ఈ పట్టణం పేరు వెనుక గల చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది. పల్లవ రాజైన శివస్కందవర్మ

(క్రీ.శ 275 - 300) పేరుతో స్కందపురం ఏర్పాటైంది. స్కందపురం కాలాంతరంలో కందుకూరుగా మారింది. చాళుక్యులు, పల్లవులు, కాకతీయులు, రెడ్డిరాజులు, గోల్కొండ నవాబులు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఇక్కడ ప్రసిద్ధి చెందిన జగన్నాథస్వామి ఉంది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన జనార్దన స్వామి ఆలయం ఉంది. ఈ స్వామిని కీర్తిస్తూ కందుకూరి రుద్రకవి జనార్దనాష్టకాన్ని రాశారు. ''ఉదయగిరి రాజ్యలక్ష్మి... సదనము నెల్లూరు, ఇట్టి సాద్ధిమినికిన్ .... వదనంబు కందుకూరు'' అని ప్రశంసించారు. ఇక్కడ ఓ కోట ఉండేది. ఈ నాటికి ఆ శిథిలాలు ఉన్నాయి. స్కందపురి సోమేశ్వర దేవస్థానం ఉంది. స్కందుడు 'కుమారస్వామి' దీన్ని ప్రతిష్ఠించారు. ఇక విజయ యాత్రలో భాగంగా శ్రీ కృష్ణ దేవరాయల స్కందారావాలు (సైనికులు) ఇక్కడ విడిది చేశారు. అంచేత ఇది స్కందపురం అయిందని కాలక్రమంలో కందుకూరుగా మారిందని మరో కథనం. పూర్వం కందుకూరు నెల్లూరు జిల్లాలో ఉండేది. ఇప్పుడు ప్రకాశం జిల్లాలో ఉంది. కవులకు, కళాకారులకు ఇది ఓ నిలయం.

కొండపి

కొండపి ఓ మండల కేంద్రం. ఇంటి పేర్ల ప్రాతిపదికపై ఏర్పడిన గ్రామం ఇది. కొండపి రాధాకృష్ణమూర్తి కొండపి రాము తదితరులు ఈ ఇంటి పేరుతో పలు కుటుంబాలున్నాయి. అయితే కొన్ని కుటుంబాలు ఇక్కడ నుంచి వలస వెళ్లినట్టు ఈ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, పద్య రచయిత తంగెళ్ల చంద్రశేఖరరావు తదితరులు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. ఈ జానపదంలోని గ్రామదేవత పేరు కొండెపమ్మ ఈ దేవత పేరుతో ఏర్పాటైన ఆలయాన్ని 2004లో గుర్రం వెంకట

సుబ్బయ్య నిర్మించారు. ఇక్కడ గల షిరిడి సాయి ఆలయం ఎంతో అందంగా ఉంటుంది.

దైవాలరావూరు

దైవాలరావూరు గ్రామం కొరిశపాడు మండలంలో ఉంది. ఈ గ్రామ నేపథ్యాన్ని పరిశీలిస్తే..... ఇక్కడ అన్ని సామాజిక వర్గాల వారు ఉన్నారు. అందరూ పరస్పరం గౌరవించుకుంటూ ప్రేమతోనే జీవించేవారు. ఆ రోజుల్లో వీరంతా ధర్మ బద్ధంగా నీతి, నియమాలతో బతికేవారు. దీంతో వీరిని మిగతా ప్రాంతీయులు సైతం దైవ స్వరూపులుగా భావించేవారు. అందరూ దైవ స్వభావులు కాబట్టి దీనికి దైవాలరావూరుగా ఖ్యాతి వచ్చింది. అయితే జనవ్యవహారంలో దెయ్యాలరావూరుగా పిలుస్తుంటారు. అయితే అన్ని ప్రభుత్వ శాఖల్లో దైవాలరావూరుగానే నమోదయ్యింది. ఈ విషయాన్ని ప్రముఖ సాహిత్యవేత్త విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పింగళి పాండురంగారావు ఈ రచయితకు తెలిపారు.

మల్లారెడ్డిపల్లి

మల్లారెడ్డిపల్లి కొమరోలు మండలంలోని అతి చిన్న గ్రామం. సుమారు వందేళ్ల క్రితం మల్లారెడ్డి అనే రైతు ఈ ప్రాంతానికి వలస వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కొన్నాళ్లు అక్కడ కుటుంబంతో ఉన్నాడు. దీంతో ఆ జనావాసం మల్లారెడ్డిగా స్థిరపడిరదని స్థానికులు పేర్కొన్నారు. ఈ గ్రామంలో మొత్తం 86 కుటుంబాలు న్నాయి. అందులో 130 మంది సైనికులు, మాజీ సైనికులే కావడం విశేషం. వీరంతా ముస్లింలే కావడం మరో ప్రత్యేకత. 1970 నుంచి వీరంతా దేశ సేవలోనే ఉన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరో ఇద్దరో సైనికులుండడం గొప్ప

విశేషం. మాతృభాషాభివృద్ధికై గ్రామంలో ప్రైవేటు మదర్సా ఏర్పాటు చేసుకున్నారు. తమ పిల్లలను ఇందులో చేర్పిస్తున్నారు.

దగ్గుబాడు

దగ్గుబాడు ఇంకొల్లు మండలంలోని ఓ గ్రామం. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన దగ్గుపాటి వంశీయులు ఈ జనపదాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇంటి పేర్లతో ఏర్పాటు చేసుకున్న గ్రామాల్లో ఇది ఒకటి. ముస్లింలో హెచ్చు సంఖ్యలో ఉన్నారు. జాతీయ ప్రసిద్ధి చెందిన వేటపాలెం సారస్వతనికేతనము గ్రంథపాలకులకురాలు శ్రీవల్లి స్వగ్రామం ఇదే.

పొదిలి

పొదిలి ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రం. చరిత్ర ప్రసిద్ధి చెందిన బస్తీ కందుకూరు రెవెన్యూ డివిజనులో ముఖ్య కేంద్రం. జనాభా 60వేలు. సాళువ వంశస్థులు పొదిలిని రాజధానిగా చేసుకొని క్రీ.శ15వ శతాబ్దంలో పరిపాలించారు. పొదిలిని సాళువ వంశస్థుల పాలనలో తెలుగురాయునితో అంతమైంది. ఆ తరువాత స్వాతంత్ర్యం వచ్చే వరకూ వెంకటగిరి సంస్థానంలో ఉండేది.

పొదిలిని ఆ రోజుల్లో పండితులు సంస్కృతీకరించి 'పృదులాపురి' అని పేరు పెట్టారు. అయితే దీనికి ఆ పేరు ఎలా వచ్చిందనే అంశంపై ఓ కథనం ఎంతో ప్రాచుర్యంలో ఉంది. ఇక్కడ గల నిర్మమహేశ్వరస్వామి ఆలయాన్ని సాళువ వంశ రాజయిన యల్లంరాజు పెదకొండమరాజు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. కాగా ఇతిహాసం ప్రకారం ప్రస్తుతం

నిర్మమహేశ్వర ఆలయం వెలసిన చోట ఓ ఆవుల దొడ్డి, పుట్ట ఉండేవి. అక్కడ ఆవుల పాలన్నంటినీ వాటి యజమాని గోవిందుడు దూడలకే వదిలేసేవాడు. నందిని అనే పేరుగల ఆవును మాత్రం నిత్యం పొదుగులో పాలు లేకుండా ఉండేది. దీన్ని గమనించిన గోవిందుడు, ఒక రోజు రాత్రి కర్ర పట్టుకొని ఆవు దగ్గరే కాపలా ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో ఆ ఆవు పుట్టపై నిలబడి పాలను ధారగా కారుస్తోంది. ఇది గమనించిన గోవిందుడు కర్రను బలంగా విసరగా పుట్టపై ఉన్న పెచ్చు ఊడి, కింద గల శివలింగం బయటపడింది. ఈ ఉదంతం విన్న గ్రామీణులు ఇక్కడ ఓ ఆలయాన్ని నిర్మించారు. ఆవు పొదుగు పేరు కలిసొచ్చే విధంగా పొదలిగా ఈ గ్రామానికి నామకరణం చేశారు. ఇక్కడ గల శ్రీ కృష్ణ గోసంరక్షణ కేంద్రం కూడా ఉంది. ఇక్కడ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, భగవాన్ వెంకయ్య స్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. తాళితరం తెలుగు భావకవి, స్వాతంత్ర్య సమరయోధుడు నాయని సుబ్బారావు స్వగ్రామం ఇది. ఈయన కుమార్తె నాయని కృష్ణకుమారి తెలుగు జానపద సాహిత్యంలో విశిష్ట కృషి చేశారు.

దర్శి

దర్శి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం. దర్శి అనే చెట్టు పేరుతో ఈ పట్టణం ఏర్పడినట్టు పేర్కొంటారు. దిరిసున రకం వృక్షం రూపాంతరం చెంది దర్శిగా మారింది. అప్పట్లో ఈ ప్రాంతంలో ఈ చెట్లు ఎక్కువగా ఉండడంతో దీనికి ఆ పేరు వచ్చింది. ఇక్కడి గడియార స్థంభం దర్శి చూపరులను ఆకట్టుకుంది. నాగార్జున సాగర్ కుడి కాలువ ఈ ప్రాంతం మీదుగానే ప్రవహిస్తున్నది. ఇక్కడకు సమీపంలోని ఎన్.ఎ.పి చెరువు ప్రసిద్ధి చెందింది.

తిమ్మ సముద్రం

తిమ్మ సముద్రం వేటపాలెం మండలంలో ఉంది. దీని తొలి పేరు గుండ్ల మడుగు. విజయనగర సామ్రాజ్యాధీశులు పరిపాలనా కాలంలో తిమ్మ సముద్రం పేరుతో ఏర్పడిరది. ఇదే పేరు స్థిరపడింది. తిమ్మి అంటే కోతి అని అర్థం. అయితే ఈ ప్రస్తావన దీనిలో రాదు. తిమ్మి వంశీయుల పేరుతో ఈ పేరు వచ్చినట్టు స్థానికులు భావిస్తున్నారు. కాగా పెద్ద చెరువులున్న గ్రామాల్లో చివరి పదంగా సముద్రం చేరడం కనిపిస్తోందని స్థానిక గోరంట్ల వెంకన్న సంస్కృతాంధ్ర కళాశాల విశ్రాంత రీడర్ అన్నదానం చిదంబరశాస్త్రి తెలిపారు. సముద్రం ఉత్తర పదంగా ఉన్న గ్రామాల్లో రామ సముద్రం (చిత్తూరు), లింగ సముద్రం (ప్రకాశం) ఉన్నాయి.

వీరన్నపాలెం


వీరన్నపాలెం పర్చూరు మండలంలో ఉంది. క్రీ.శ 17వ శతాబ్దం ప్రారంభంలో వీరన్న అనే రైతు ఈ ప్రాంతంలోని నిర్జన ప్రదేశంలో కుటుంబంతో స్థిరపడ్డారు. అతని పేరు మీదుగానే ఈ పల్లెకు వీరన్న పాలెం అనే పేరు వచ్చింది. ఇక్కడ రెండు పెద్ద చెరువులు ఉన్నాయి. ఓ చెరువు మధ్యలో ఉన్న చెట్టు మీదకు సైబీరియా నుంచి పెలికాన్ పక్షులు వస్తుంటాయి. ఈ పక్షులు ప్రతిఏటా డిసెంబరులో ఇక్కడికి వచ్చి ఆవాసం ఇక్కడ ఏర్పరచుకుంటాయి. వేసవిలో తిరిగి స్వదేశానికి వెళ్లి ఓ నెల రోజులు గడిపి వస్తుంటాయి. దీంతో ఇది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.

మొగిలిచర్ల

మొగిలిచర్ల లింగసముద్రం మండలంలో ఉంది. మొగిలి పొదలు విస్తారంగా ఈ ప్రాంతంలో ఉండేవి. ఈ కారణంగా మొగిలిచర్ల పేరు వచ్చింది. చర్ల అంటే జల సూచి అని గ్రహించాలి.

దోర్నాల

దోర్నాల ప్రకాశం జిల్లాలోని ఓ మండల కేంద్రం. మార్కాపురం డివిజన్ పరిధిలో ఉన్నది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిదంటే.... ఇది శ్రీశైల మహాక్షేత్రానికి ముఖద్వారంలో ఉండడం వల్ల ఈ ఊరికి తోరణాల అని పేరు పెట్టారు. జనవ్యవహారంలో దోర్నాలగా కూపాంతరం చెందింది. ఇక్కడి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, శ్రీ అయ్యప్పస్వామి ఆలయం, శ్రీనరసింహస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. ■



ఉమ్మడి నెల్లూరు జిల్లా

దుత్తలూరు (నెల్లూరు జిల్లా)

అత్త మీద కోపం నత్త మీద చూపించడం అనే సామెత ఎంతో ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. వెనుకటికి ఓ కోడలు అత్త మీద కోపంతో దుత్తను పగలగొట్టింది. దుత్త అంటే చిన్న మూతి గల కడవ అని అర్థం. ఈ ఊరు నెల్లూరు జిల్లాలోని ఓ మండల కేంద్రం. కుండలు తయారు చేసే వృత్తిగా గలిగిన కుమ్మరి సామాజిక వర్గం వారు వేరే ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి కుండలు (దుత్తలు) పేరు కలిసొచ్చే విధంగా దుత్తలూరు అని తమ పల్లెకు నామకరణం చేశారు. ఒకప్పుడు ఈ గ్రామం నాణ్యమైన కుండల తయారీకి మాత్రమే ఇది ప్రసిద్ధి. ప్రస్తుతం 10 కుమ్మరి కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ వృత్తి ఏ మాత్రం గిట్టుబాటు లేకపోవడంతో వారంతా ఈ పనులకు దూరమయ్యారు. వేరే పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి నజిముల్లా ఈ రచయితతో మాట్లడుతూ అన్నారు. ఈ గ్రామ జనాభా 7500. వివిధ మతాల సంగమంగా ఈ ఊరు కనిపిస్తుంది. రామాలయం, శ్రీ కృష్ణాలయం, మసీదు, చర్చి ఉన్నాయి.

చాకలకొండ

చాకలకొండ విజమూరు మండలంలో ఉంది. ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. గ్రామ జనాభా 3061. చాకల కొండను చాకలికొండ అని కూడా పిలుస్తారు. ఈ ఊరి పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ... ఈ ఊరి వెనుక 3 కొండలున్నాయి. మధ్యలో ఉన్న నల్ల కొండపై చాగనారు చెట్లు ఎక్కువగా ఉండేవి. దీంతో ఆ పల్లెకు చాగలకొండ అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో చాకల కొండగా స్థిరపడిరది. ఈ గ్రామం బుచ్చిరెడ్డిపాలెంలోని దొడ్ల ఇంటి పేరు గల రెడ్డి వంశీకుల జమీనులో ఉండేది. అయితే ఈ ఊరిలో రజక కుటుంబాలు ఉన్నాయి. ఇలా ఆ సామాజిక వర్గం పేరు కలిసొచ్చే విధంగా చాకలకొండ అనే పేరు వచ్చినట్టు మరికొందరు స్థానికులు చెబుతున్నారు. విశ్రాంత ప్రభుత్వ ప్రధానాచార్యులు, సాహితీవేత్త డా॥ అప్పజోడు వెంకట సుబ్బయ్య ఈ గ్రామానికి చెందిన వారే.

ఉదయగిరి

ఉదయగిరి ఓ గొప్ప చారిత్రక కేంద్రం. ఇది నెల్లూరు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గం, మండల కేంద్రంగా ఉంది. సూర్యుని తొలి లేత కిరణాలు కొండ మీద ప్రసరిస్తాయి. అంచేతనే దీనికి ఉదయగిరి అనే పేరు వచ్చింది. దీనిపై 150 రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. ఉదయగిరి దుర్గం ఓ భూతల స్వర్గం. గజపతుల పాలనకు ముందు విజయనగర పాలకుల స్వాధీనంలో ఉండేది. పల్లవులు, కాకతీయులు, చోళులు, గోల్కొండ, ఆర్కాటు నవాబులతో పాటు, ఆంగ్లేయుల పాలనను కూడా చవి చూసింది. చోళ సంస్కృతికి ప్రతీకగా రంగనాథ మండపం, పల్లవుల నిర్మాణ శైలికి ప్రతిబింబంగా బాలకృష్ణ మందిరం, విజయనగర

రాజులు నిర్మించిన పారువేట మండపం ఉన్నాయి. ఇక మసీదులు, అద్దాల మహలులు ఉన్నాయి. గజపతుల నుంచి తిరిగి ఈ కోటను స్వాధీనం చేసుకోడానికి శ్రీకృష్ణ దేవరాయలకు 18 నెలల కాలం పట్టింది. ఉదయగిరికి కొండాయపాలెం అని కూడా పిలుస్తారు. ఉదయగిరిపై గల వల్లభ నారాయణ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఉదయగిరి జనాభా 15,870.

మర్రిపాడు

మర్రిపాడు ఓ మండల కేంద్రం. బొగ్గేరు నదీ తీరంలో ఉంది. నెల్లూరు జిల్లా సరిహద్దు గ్రామాల్లో ఇదొకటి. ఈ ప్రాంతంలో పొగాకు ఎక్కువగా పండిస్తారు. గ్రామ జనాభా 3,155. జైనమత వ్యాప్తి ఎక్కువగా ఉన్న రోజుల్లో ఈ గ్రామం ఏర్పాటైంది. జైనులు మర్రి చెట్లను పవిత్రంగా, ప్రేమ పూర్వకంగా చూస్తారు. పాడు అంటే జైనుల ఆవాస కేంద్రం. దీంతో ఈ పల్లెకు మర్రిపాడు అని పేరు పెట్టారు. ఇదే గ్రామం పేరుతో చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలంలో మరొక గ్రామం ఉంది.

కోట

కోట నెల్లూరు జిల్లాలోని ఓ మండల కేంద్రం.ఈ పట్టణానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... ఇక్కడి కోటమ్మతల్లి గ్రామ దేవత. ఈ ఆలయ అత్యంత ప్రాచీనమైంది. ఆ దేవతపై ఉన్న భక్తి ప్రవత్తులతో తమ గ్రామానికి కోట అని పేరు పెట్టుకున్నారు. జనాభా సుమారు 20 వేలు. నెల్లూరుకు 51 కి.మీ దూరంలో ఉంది. ఎన్.కె.బి.ఆర్ సైన్స్,ఆర్ట్ కళాశాల ప్రసిద్ధిగాంచాయి. ఆక్వా ఎగుమతులకు ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందింది. నాటి ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి నల్లపురెడ్డి

శ్రీనివాసరెడ్డి స్వగ్రామం కోట. వారి కుమారుడు ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు శాసన సభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు.

సర్వేపల్లి

సర్వేపల్లి గ్రామం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో ఉంది. నాటి భారత రాష్ట్రపతి డా|| సర్వేపల్లి రాధాకృష్ణ తాత ముత్తాతల గ్రామం ఇది. సర్వేపల్లి పేరుతో అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రం ఉంది. సర్వేపల్లి వంశీయులు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామ జనాభా 3300. రాధాకృష్ణన్ పేరుతో ఎన్.ఆర్.కె హైస్కూలు ఉంది. ఇక్కడ నాలుగు పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. కృష్ణపట్నం రేవు ఇక్కడకు సుమారు 15కి.మీ దూరంలో ఉంది. రాధాకృష్ణన్ వంశానికి చెందిన శేషగిరిరావు విశ్రాంత గ్రామ పరిపాలనాధాకారిగా ఉన్నారు. అలాగే వెంకటేశ్వరరావు హైదరాబాదులో సి.పిగా పనిచేస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రగతికి అన్ని విధాల తోడ్పడుతున్నారు. ఇందుకోసం రూ. 1.35 లక్షల మొత్తాన్ని వెచ్చించారు.

తడఖండ్రిగ

తడఖండ్రిగ నెల్లూరు జిల్లా తడ మండల కేంద్రానికి ఆనుకొని ఉంది. తడ, తడ ఖండ్రిక జంట పంచాయితీ కేంద్రాలు. ఖండ్రిక అనేది ప్రకృతి కాగా, ఖండ్రిగ వికృతి రూపం. ఖండ్రిగ అంటే భూమిలో కొంత భాగం, పూర్వం సంస్థానాధీశులు తమను ఆశ్రయించేవారికి కొంత భూమిని ఇచ్చేవారు. దీన్నే ఖండ్రిగ అని అంటారు. తమిళనాడు సరిహద్దు గ్రామమైన తడ. సరిహద్దు గ్రామమైనందున 'తడ' అని పేరు వచ్చింది. తీర ప్రాంతం చివరి గ్రామం ఇది. ఈ గ్రామానికి ఆనుకొని

ఉన్న గ్రామం తడ ఖండ్రిగ. ఖండ్రిగలో నిప్పో బ్యాటరీల ఫ్యాక్టరీ, ఉప్పు వ్యవసాయం ఎక్కువగా ఉంది. శ్రీ సిటీ సమీపంలో ఉండడంతో వలస కార్మికుల జనాభా ఎక్కువగా ఉంది. ఈ గ్రామం ఉత్తమ పంచాయితీగా కేంద్ర ప్రభుత్వ పురస్కారాన్ని 2021 ఏప్రిల్ 24న ప్రదానం చేశారు. ఇక్కడ తెలుగు, తమిళం, హిందీ భాషలు మాట్లాడేవారు ఎక్కువగా ఉన్నారు. అయితే ఒకరి భాష మరొకరికి తెలియక తడబడుతుంటారు.

పుట్టమరాజు కండ్రిగ

పుట్టమరాజు కండ్రిగ గూడూరు మండలంలో ఉంది. పుట్టమ రాజు అనే మోతుబరి పేరుతో ఈ గ్రామం ఏర్పాటైంది. కండ్రిగ అంటే భూమిలో కొంత భాగమని, చిన్న భాగమని అర్థం చేసుకోవాలి. ఇది అగ్రహారంలాంటిదే. ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఈ గ్రామాన్ని దతత్త తీసుకోవడంతో దీని రూపు రేఖలు మారిపోయాయి. కాంక్రీటు గోడలతో ఓ మినీ పట్టణాన్ని తలపించే విధంగా ఉంటుంది. కమ్యూనిటీ హాలు, 24 గంటలు తాగునీటి వ్యవస్థ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఉంది.

సిద్ధిరాజు కండ్రిగ

సిద్ధిరాజు కండ్రిగ పిచ్చుటూరు మండలంలో ఉంది. గ్రామ జనాభా 1800. సిద్ధిరాజు అనే వ్యక్తి పేరుతో ఈ గ్రామానికి సిద్ధిరాజు కండ్రిగ పేరు వచ్చింది.

మంగా నెల్లూరు

మంగా నెల్లూరు గ్రామం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలంలో ఉంది. ఈ పల్లె ఏర్పాటైనప్పటి నుంచి కొన్నాళ్లపాటు

మంగమ్మ దేవతను ఆరాధించేవారు. ఆమె పేరుతోనే మంగా నెల్లూరు అనే గ్రామం ఏర్పాటైంది. నెల్లూరు నుంచి ఈ ప్రాంతానికి కొందరు తరలివచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. వారి తొలి ప్రస్థానమైన నెల్లూరుపై ఉన్న మమకారంతో మంగా నెల్లూరు అని నామకరణం చేసుకున్నారు. కాలగమనంలో మంగమ్మ దేవత కనుమరుగైంది. ప్రస్తుతం వాలివేటమ్మ, అంకమ్మ దేవతలను కొలుస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఉపాధ్యాయులు యర్రాబత్తుని మునీంద్ర ఈ రచయితకు తెలిపారు.

కోటి తీర్థం

కోటి తీర్థం గ్రామం చేజెర్ల మండలంలో ఉంది. ఈ గ్రామానికి ఆపేరెలా వచ్చిందంటే ఇక్కడ గల ప్రసిద్ధి చెందిన శ్రీ కోటేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతనమైనది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ వారు ఆలయ అభివృద్ధి చేపట్టారు. ఈ పవిత్ర క్షేత్రం కోట తీర్థం పేరుతోనే గ్రామీణులు తమ ఊరికి పేరుపెట్టుకున్నారు. ఈ గ్రామం పెన్నానదీ తీరాన ఉంది. గ్రామ జనాభా 2422.

తెలుగురాయపురం

తెలుగుదనం గుబాళించే తెలుగురాయపురం నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఉంది. పెన్నా నదీ తీరంలో ఉంది. క్రీ. శ15వ శతాబ్దానికి చెందిన పొదిలి(ప్రకాశ జిల్లా) సాళువ రాజులలో చివరి వాడైన తెలుగు రాయుడు ఓ సారి కార్యార్థమై ఈ పల్లెలో బస చేశారు. దీంతో ఈ పల్లెకు తెలుగురాయపురం అనే పేరు వచ్చిందని ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ఇంగ్లీషు, ఫారిన్ లాంగ్వేజస్

విశ్వవిద్యాలయం భాషా శాస్త్రవేత్త విశ్రాంత ఆచార్యులు వెన్నెలకంటి ప్రకాశరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వడ్డిబోయిన సంజీవరెడ్డి తెలిపారు. ఈ పల్లె జనాభా 2వేలు. ప్రముఖ శివాలయం, చింతాలమ్మ గ్రామ దేవత ఆలయం ఉన్నాయి.

తిమ్మినపట్నం

తిమ్మినపట్నం నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలోని ఓ పెద్ద గ్రామాల్లో ఒకటి. సముద్రతీరానికి సమీపంలో ఉంది. వ్యక్తి నామధేయంగా ఏర్పాటైన గ్రామం ఇది. తమ్మిరాజా అనే వ్యక్తి ప్రాబల్యంతో నిర్మించిన జానపదం ఇది. సాగర తీరం చెంతన ఉన్న గ్రామాలకు సాధారణంగా చివరి పదం పట్నంగా చేరుతుంది. ఇక్కడ మత్స్యకారుల సంఖ్య గణనీయంగా ఉంది. జనాభా 4540. తమ్మిన పట్నం, కోట ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ జరుగుతుంది.

పొదలకూరు

పొదలకూరు ఓ మండల కేంద్రం. జనాభా 16,662. ఈ ఊరి పేరు వెనుక గల చరిత్రను గమనిస్తే..ఈ జనావాసం ఏర్పాటయ్యేటప్పుడు పెద్ద పెద్ద పొదలు ఉండేవి. వీటిని నరికి జనావాసం ఏర్పాటు కోసం ఎంతో కష్టపడాల్సి వచ్చింది. దీంతో ఈ పల్లెకు పొదలకూరు అనే పేరు పెట్టారు. పొదరిల్లుగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ కూడా ఈ పేరును సుస్థిరం చేసినట్టు స్థానికుల ఉవాచ. ఇక్కడ క్రీ.శ16వ శతాబ్దంలో చోళ రాజుల కాలంలో నిర్మించిన శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. స్థానిక శివాలయం, వెంకయ్యస్వామి

మందిరం, అయ్యప్ప, పాకలేరమ్మ సిద్ధేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. దీంతో ఈ గ్రామం ఆధ్యాత్మిక శోభతో వర్ధిల్లుతోంది.

నేలపట్టు

నేలపట్టు గ్రామం దొరవారి సత్రం మండలంలో ఉంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఇందులో నేల అనేది పూర్వ పదం. పట్టు అనేది ఉత్తర పదం కలయికతో ఏర్పడింది. వీటిలో నేల అన్నది భూసూచి. పట్టు అనే పదానికి చిన్నపల్లె అని అర్థం. ఈ గ్రామం విదేశీ వలస పక్షుల కేంద్రంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా నవంబరు నెలలో ఇక్కడికి విదేశీ విహంగాలు వస్తాయి. విదేశీ వలస పక్షుల్లో రారాజుగా ప్రసిద్ధి చెందిన గూడ బాతులు (పెలికాన్ పక్షులు) సందడి చేస్తుంటాయి. ఇక్కడ 200కి పైగా గూడ బాతులు విడిది చేస్తున్నాయి. ఇంకా వివిధ జాతుల పక్షులు ఇక్కడి చెరువుల్లోకి వచ్చి విడిది చేస్తుంటాయి. ఆహారం, సంతానోత్పత్తి కోసం వస్తుంటాయి.

అందలమాల

అందలమాల ఎంత అందమైన పేరు ఇది. ఈ పల్లె నెల్లూరు జిల్లా వాకాడు మండలంలో ఓ పల్లె. కొండూరు పంచాయితీ పరిధిలో ఉంది. ఈ పల్లె పేరు వెనుక గల నేపథ్యాన్ని పరిశీలిస్తే... గతంలో ఇక్కడ మల్లెసాగు చేసేవారు. ఈ పూలతో మాలలను కట్టి వేరే ప్రాంతాల్లో సైతం విక్రయించేవారు. దీంతో ఈ పల్లెకు అందాలమాల అనే పేరు పెట్టారు. జనవ్యవహారంలో అందాలమాలగా మారింది. రికార్డుల్లో అయితే అందలమాలగా ఉంది. ఇక్కడ రొయ్యలగుంటలు ఎక్కువగా ఉన్నాయి. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని స్థానిక మహిళ శిరసంభేటి

భూదేవమ్మ నిర్మింపజేసారు. చుట్టూ ఉన్న పొలాల మధ్య ఈ పల్లె ఎంతో అందంగా కనిపిస్తుంది.

నెమళ్లపూడి

నెమళ్లపూడి గ్రామం నెల్లూరు జిల్లా ఓజాలి మండలంలోని ఓ పల్లె. అప్పట్లో ఈ ప్రాంతంలో నెమళ్లు ఎక్కువగా సంచరించేవి. దీంతో ఇక్కడ ఏర్పాటైన గ్రామానికి నెమళ్లపూడి అనే పేరు వచ్చింది. పూడి అంటే జలసూచి. నెమళ్ల పూడి పేరుతోనే ఇక్కడ పెద్ద చెరువు, మామిడి కాలువ ఉంది. ఇలా నెమళ్ల పూడికి ఆ పేరు వచ్చింది. అయితే ప్రస్తుతం నెమళ్ల జాడ ఇక్కడ లేదు. పోతురాజు స్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, రామాలయం మసీదు, పోలేరమ్మ గుడి, శివాలయం ఉన్నాయి.

పూలతోట

పూలతోట గ్రామం నెల్లూరు జిల్లా దొరవారిసత్రం మండలంలో ఉంది. ఈ గ్రామం తొలిపేరు ఫ్యూల్స్‌తోట. కాలక్రమంలో పూలతోటగా మారింది. ఆరేడు దశాబ్దాల కితం ఇక్కడ ఊరంతా దట్టంగా మల్లె తోటలుండేవి. పూల వ్యాపారానికి పెట్టింది పేరుగా ఉండేది. అయితే కాలగమనంలో ఈ తోటలన్నీ కనుమరుగయ్యాయి. అయితే ఊరిపేరు పూలతోటగానే స్థిరపడిందని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.కృష్ణయ్య తెలిపారు. ఇక్కడి పడమటి అంకమ్మ ఆలయం ప్రసిద్ధి చెందింది. ■

ఉమ్మడి చిత్తూరు జిల్లా

నాగులాపురం

నాగులాపురం ఓ మండల కేంద్రం. చిత్తూరు జిల్లాలో తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. శ్రీ కృష్ణ దేవరాయులు తన తల్లి నాగులాంబిక అంటే అపరిమితమైన ప్రేమానురాగాలు. అందుకే ఆమె పేరుతో 'నాగులాపురం' అనే మూడు పట్టణాలను నిర్మించారు. చిత్తూరు జిల్లాలో ఒకటి అనంతపురం జిల్లాలో మరొకటి, కర్నూలు జిల్లాలో వేరొకటి ఏర్పాటు చేశారు. అయితే కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రామం అప్పట్లో కన్నడ ప్రాంతంలో ఉండేది. రాయలు తన తల్లి మాటనే శాసనంగా భావించేవారు. ఏ ముఖ్యమైన పనినైనా తల్లిని సంప్రదించకుండా చేసే అలవాటు లేదు. ప్రతి రోజు ఉషోదయాన శిరసువంచి పాదాభివందనం చేసి ఆమె దీవెనలు పొందేవాడని చరిత్రకారులు పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లాలోని నాగులాపురం జలపాతాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి స్వామి ఆలయం అత్యంత ప్రాచీనమైంది. స్వామి మత్స్యావతారంలో దర్శనమిస్తాడు. మత్స్యావతారానికి ఇరువైపులా శ్రీదేవి, భూదేవి విగ్రహాలున్నాయి. ఈ ఆలయ ప్రాకారాలను రాయలు నిర్మింపజేశాడని చరిత్ర చెబుతోంది. తిరుపతి పట్టణానికి 70కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయాన్ని చూసి తీరాల్సిందే.

గంగాధర నెల్లూరు

గంగాధర నెల్లూరు మండల కేంద్రం. గంగాధర అనే వ్యక్తి కుటుంబ సమేతంగా వచ్చి ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెల్లూరుతో పాటు తన పేరు కలిసొచ్చే విధంగా గంగాధర నెల్లూరు అని ఆ గ్రామానికి పేరు పెట్టినట్టు స్థానికులు కథనం. గ్రామ జనాభా 4800.

పరమేశ్వర మంగళం

పరమేశ్వర మంగళం పుత్తూరు మండలంలో ఉంది. గ్రామ జనాభా 2453. చిత్తూరు, తమిళనాడు సరిహద్దుల్లో ఉంది. పరమేశ్వరుడు తమ గ్రామానికి అన్ని విధాల శుభాలు చేకూరుస్తాడనే భావంతో పరమేశ్వర మంగళం అనే పేరు పెట్టినట్టు స్థానికుల కథనం వల్ల తెలుస్తోంది. ఇందుకు నిదర్శనంగా గ్రామానికి తూర్పున అగస్తేశ్వరాలయం, ఉత్తరాన పుత్తూరులోని పార్వతీ పరమేశ్వరాలయం ఉన్నాయి. ఈ గ్రామం పొలాల చివరన గల నగరి ముక్కు కొండ జిల్లాలోని అత్యంత ఎత్తులో ఉంది. పరమేశ్వర మంగళం పేరుతో చెన్నైలో ఓ స్టీలు కంపెనీ ఉంది.

వెంకట నరసింహరాజు వారి పేట

మనదేశంలోఅతిపొడవైనపేరుగలగ్రామంవెంకటనరసింహరాజు వారిపేట. దీంతోఈపల్లెప్రపంచగిన్నీసురికార్డుల్లోనమోదుచేసుకుంది. ఈ గ్రామం చిత్తూరు జిల్లా నగరి మండలంలో ఉంది. తమిళనాడు సరిహద్దు గ్రామం ఇది. గతంలో ఈ ప్రాంత సంస్థానాధీశుడు వెంకట నరసింహరాజు బహదూర్ పేరుతో ఈ పల్లె ఏర్పాటైంది. రేణిగుంట-

అరక్కోణం రైలు మార్గంలో ఉంది. కేవలం ప్యాసింజరు రైళ్ళు మాత్రమే ఇక్కడ ఆగుతాయి. రెవెన్యూ, రైల్వే, పంచాయితీ రికార్డుల్లో వెంకటనరసింహరాజువారిపేటగా ఉండగా, విద్యా శాఖ, తపాలా శాఖ రికార్డుల్లో తడుకుపేటగా ఉంది. వెంకటనరసింహరాజువారిపేట అనే పెద్దపేరు పలకలేక తడుకుపేటగా పిలుస్తుంటారు. ఈ విషయాన్ని నగరి జర్నలిస్టు కోనేరి చంద్రమోహన్ తెలిపారు. జనాభా 2 వేలు. తడుకుపేట పేరు పెట్టడానికి గల కారణం కూడా ఉంది. తడుకు అంటే ఇంటి చుట్టూ వేసే కంచె అని భావం. అప్పట్లో ఈ పద్ధతి ఇక్కడ హెచ్చుగా ఉండేది. దీని వల్లనే పెద్దలు తడుకుపేటగా నామకరణం చేశారు. ఇలా రెండుపేర్లు ఆ గ్రామానికి ఉండడం విశేషం. తెలుగు, తమిళ భాషలు ఇక్కడ ఎక్కువగా మాట్లాడుతుంటారని చంద్ర మోహన్, కిరణ్, మణికంఠ పేర్కొన్నారు.

తవనంపల్లి

తవనంపల్లి ఓ మండల కేంద్రం. తొలుత దవనంపల్లి అనే పేరుండేది. కాలక్రమంలో వాడుకలో తవనంపల్లిగా మారింది. ఆ రోజుల్లో దవనం మొక్కలు ఈ ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా ఉండేవి. దీంతో ఇక్కడ స్థిరపడిన గ్రామీణులు తమ ఊరికి తవనంపల్లి అనే పేరును పెట్టుకున్నారు. గ్రామ జనాభా 5000.

కుక్కలపల్లి

కుక్కలపల్లి పాకాల మండలంలోని ఓ పల్లె. ఆంగ్లేయుల పాలనాకాలంలో తెల్లదొరలు ఈ కుగ్రామానికి వచ్చినపుడు కుక్కలు వెంబడించాయి. దీంతో వారు అసహనంతో ఇదో కుక్కలపల్లి అని వ్యాఖ్యానించారు. అంచేత దీనికి కుక్కలపల్లి అనే పేరు వచ్చింది. ఈ

పల్లె తొలిపేరు లింగనపల్లి. లింగన పేరుతోనే ఇక్కడ ఓ చెరువు ఉంది. ప్రముఖ రచయిత పత్తిపాటి రమేష్ నాయుడు స్వగ్రామంం ఇదే. గ్రామ జనాభా 200 మాత్రమే. దామల చెరువు పంచాయితీ పరిధిలో ఉన్నది.

గోవిందరెడ్డిపల్లి

గోవిందరెడ్డిపల్లి గ్రామం తవనంపల్లి మండలంలో ఉంది. తిరుపతి ప్రాంతానికి చెందిన గోవిందరెడ్డి తన కుటుంబంలో ఈ ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ ఓ గ్రామాన్ని తొలుత ఏర్పాటు చేసుకున్నారు. గోవిందరెడ్డి పేరుతోనే ఈ పల్లెకు ఈ పేరు వచ్చింది. ఇక్కడ మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. ఈ గ్రామంలో ఆవుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ గ్రామానికి దక్షిణ దిశ నుండి బాహుదా నది ప్రవహిస్తోంది.

అత్తిమాకుపల్లి

అత్తిమాకుపల్లి తవనంపల్లి మండలంలో ఓ గ్రామం. అత్తి చెట్లు విస్తారంగా ఉన్నందున దీనికి అత్తిమాకుపల్లి అనే పేరు వచ్చింది. ఈ గ్రామ జానాభా 1200 మాత్రమే. ప్రముఖ శతావధాని, అవధాన కళానిధి ఆముదాల మురళి ఈ పల్లెకు చెందిన వారే కావడం గర్వకారణం.

ఎర్రతివారిపల్లి

ఎర్రతివారిపల్లి నిమ్మనపల్లి మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయితీలోని చిన్న గ్రామం. జనాభా 500 మాత్రమే. దీని తొలి పేరు సత్రం. కాలక్రమంలో ఎర్రతివారిపల్లిగా మారింది. తివారీ అంటే వేద ప్రవీణుడని అర్థం. వేద పరిజ్ఞానం కలిగిన బ్రాహ్మణులచే ఈ గ్రామ నిర్మాణం జరిగింది. వారు ఎర్రని ఛాయలో ఉండేవారు.

ఇలా ఆ గ్రామానికి ఆ పేరు వచ్చింది. ఈ గ్రామం చెంతనే హార్సలీ కొండలున్నాయి. అప్పటి జిల్లా కలెక్టరు హార్సలీ ఈ కొండల పై భాగంలో వేసవి రిసార్టుగా ఎంపిక చేసాడు. రెండు బంగాళాలను నిర్మించాడు.

అనంతపురం

చిత్తూరు జిల్లాలోని అనంతపురం పేరుతో ఓ గ్రామం ఉంది. ఈ గ్రామ జనాభా 1205. విద్యాధికులు హెచ్చు మంది ఈ గ్రామంలో ఉన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న అనంతపురం పట్టణం నుంచి కొన్ని కుటుంబాల వారు ఈ ప్రాంతానికి వలస వచ్చి గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాస ప్రాంతంపై ఉన్న అభిమానంతో ఈ పల్లెకు అనంతపురం అని పేరు పెట్టుకున్నట్టు స్థానికంగా ఉన్న వృద్ధులు తెలిపారు. కాగా నెల్లూరు జిల్లా తోటపల్లి గూడురు, కలిగిరి మండలాల్లో కూడా అనంతపురం పేరుతోనే రెండు గ్రామాలు వెలిసాయి.

మబ్బువాళ్లపేట

మబ్బువాళ్లపేట పల్లె చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో ఉంది. ఈ గ్రామ నేపథ్యం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తుంది. పలమనేరు - మదనపల్లె జాతీయ రహదారికి 3 కి.మి దూరంలో ఈ గ్రామం ఉంది. నాడు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన పాళేగాళ్లు, రక్షక భటులు నల్లని రంగులో భయంకరంగా, వికారంగా ఉండేవారు. అయితే వీరు ధృడకాయాలు ఆ ప్రాంతంలోని ఇరుగు పొరుగు పల్లె ప్రజలు వారిని మబ్బువాళ్లని పిలిచేవారు. ఆ గ్రామము మబ్బువాళ్లపేటగా మారింది. గ్రామంలోని అతి ప్రాచీనమైన వినాయక ఆలయాన్ని స్థానికుల సహకారంతో పునర్నిర్మాణం చేసారు. ఈ సందర్భంగా జరిపిన

తవ్వకాలలో 30 విలువైన వెండి నాణేలు లభించాయి. ఈ విషయాన్ని సీనియర్ పాత్రికేయుడు దాసరి కృష్ణారెడ్డి ఈ రచయితకు తెలిపారు.

చలమంగళం

చలమంగళం గ్రామం చిత్తూరు జిల్లా పెద్దపంజాని మండలంలో ఉంది. పుంగనూరు, పలన రోడ్డులో ఉంది. ఈ ప్రాంతాన్ని చోళ రాజులు పాలిస్తున్న కాలంలో సోమేశ్వరాలయాన్ని నిర్మించారు. చోళ రాజుల నిర్యాణం తరువాత చోళ మంగళంగా ప్రసిద్ధి చెందింది. క్రమేపీ జనవాక్యంగా చలమంగళంగా మారింది.

సాంబయ్య కండ్రిగ

సాంబయ్య కండ్రిగ చిత్తూరు మండలంలోని ఓ పల్లె. సాంబయ్య అనే మోతుబారి పేరు మీదుగా వచ్చింది. కండ్రిగ అంటే భూమిలో కొంత భాగమని అర్థం. ఆ రోజుల్లో సంస్థానాధీశులు తమను ఆశ్రయించిన వారికి కొంత భూమిని దానంగా ఇచ్చేవారు. దీన్ని కండ్రిగ అంటారు. ఇలాంటి గ్రామాలకు ఉత్తర పదంగా కండ్రిగ చేరుతుంది. దీని తొలి రూపం ఖండ్రిగ.

నారాయణవనం

నారాయణవనం ఓ మండల కేంద్రం, ఓ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం. తిరుమల క్షేత్రాన్ని దర్శించుకున్న వారు తప్పనిసరిగా నారాయణ వన క్షేత్రాన్ని సందర్శిస్తారు. తిరుపతి నుంచి నారాయణవనానికి 36 కి.మీ దూరంలో ఉంటుంది. నారాయణవనం వెంకటేశ్వరస్వామి పద్మావతిని వరించిన ప్రాంతం కాబట్టి నారాయణవనంగా పిలుస్తున్నారు. దీన్ని

నాన్నారంగా కూడా పేర్కొంటారు. ఇక్కడి కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ గోపురం చూసి తీరాల్సిందే. ఏడంతస్తులతో నిర్మించారు. క్రీ.శ 1541లో దీన్ని నిర్మించారు. నారాయణవనం చేనేత పరిశ్రమ కూడా ప్రసిద్ధి చెందిందే. నారాయణ వనం పట్టణ జనాభా 12 వేలు.

యడమరి

యడమరి ఓ మండల కేంద్రం. మండలంలోని అతి పెద్దగ్రామాల్లో ఒకటి. గ్రామ జనాభా 10 వేలు. చిత్తూరుకు నైరుతి మూలన ఉంది. ఈ ఊరిని వేదమూరు, యాదమూరు, ఇంద్రపురి, యోధులమర్రి అని కూడా పిలుస్తారు. ఒకే గ్రామానికి ఇన్ని పేర్లు ఉండడం విశేషమే. ప్రసిద్ధి చెందిన వరదరాజ స్వామి ఆలయం ఉంది. ఆ ఆలయ ప్రాంతంలో జనావాసాలుండేవి. ఈ ప్రాంతానికి కాసింత దూరం నుంచి ఓ భక్తురాలు స్వామి దర్శనానికి క్రమం తప్పకుండా వచ్చేది. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు మార్గ మధ్యంలో యాచ పొదలలోనే ప్రసవించింది. దీంతో ఈ జనావాసాలకు యాచపురి అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో యడమరిగా స్థిరపడింది. రాజుల కాలంలో ప్రత్యర్థి సైనికులు ఓటమి చెందారు. బందీలైన సైనికులను ఓ మర్రిచెట్టు దగ్గర ఉరితీసారు. దీంతో ఇదే పల్లెకు యోధులమర్రి అని కూడా పిలుస్తారని స్థానికుల కథనం. ఇక్కడ గంగమ్మ తల్లి గ్రామ దేవత ప్రతి ఏటా భారీ ఎత్తున జాతర జరుపుతారు.

చదళ్ల

చదళ్ల పుంగనూరు మండలంలోని ఓ గ్రామమిది. ఒకప్పుడు పుంగనూరు జమీందారులు ఇక్కడ పెద్ద బంగళా, బురుజును

నిర్మించారు. అయితే ఏ కారణం చేతనో చెదపురుగులు మితిమీరి ఆ బంగళాను, బురుజును పుట్టలమయం చేసాయి. ఫలితంగా శిథిలమై, నేల మట్టమయ్యాయి. దీంతో చెదలు పడే ఊరుగా చదళ్ల పేరు వచ్చింది. తొలుత ఈ ఊరిని చెన్నరాయుని పల్లెగా పిలిచేవారు. ఈ విషయాన్ని సీనియర్ జర్నలిస్టు దాసరి కృష్ణారెడ్డి తెలిపారు.

కుక్కరాజుపల్లె

కుక్కరాజుపల్లె చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె మండలంలో ఉంది. కుక్కరాజుపల్లెను సంస్కృతీకరించి శునకరేడు పురంగా పిలుస్తారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలోని సంస్థానాధీశుడొకరు తాను ఎంతో ప్రీతితో పెంచుకున్న కుక్కను పొరపాటున చంపేసాడు. ఆ తరువాత అతను కూడా మనస్థాపంతో మరణించాడు. దీంతో గ్రామీణులు కుక్క పేరు కలిసొచ్చే విధంగా కుక్కరాజుపల్లె అని నామకరణం చేసినట్టు స్థానికులు పేర్కొన్నారు. ఈ గ్రామ జనాభా 3వేలు.

పాండురాజపురం

పాండురాజపురం చిత్తూరు జిల్లా నగరి మండలం గుండ్రాజు కుప్పం పంచాయితీలో ఉంది. ఈ పల్లెకు ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ పేరు కేవలం ఇతిహాసంపై ఉన్న అపార విశ్వాసంతోనే స్థానికులు ఈ పేరు పెట్టారు. పాండురాజుల పారకొండ ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందింది. వనవాస కాలంలో పాండవులు కొన్నాళ్లు గుహలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఆనవాళ్లు దర్శనమిస్తాయి. ఇదో పర్యాటక కేంద్రంగా వాసికెక్కింది. పాండురాజుల కొండ పేరుతోనే పాండురాజపురం గ్రామం ఏర్పాటైందని జర్నలిస్టు కోనేరి చంద్రమోహన్

ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. పల్లెను ఆనుకొని ఉన్న ఈ కొండ పైనే వివిధ సినిమాల చిత్రీకరణ జరిగింది. గ్రామ జనాభా 200 మేరకు ఉంటుంది.

పుట్టాపర్తి

పుట్టాపర్తి అంటే ఎంతో ప్రాచుర్యం పొందిన పవిత్ర స్థలం. అయితే ఇది పుట్టాపర్తి. ఈ పల్లె చిత్తూరు జిల్లా పెద్ద తిప్ప సముద్రం మండలంలో ఉంది. ఒకప్పుడు ప్రజలతో కళకళలాడిన ఈ ఊరు ప్రస్తుతం జనాభా లేక వెలవెలపోయింది. త్రాగునీరు, సాగునీటి సమస్యల వల్ల. వలసల వలన పల్లె కన్నీరు కారుస్తోంది. జనాభా వలస వెళ్లిపోగా ఓ వృద్ధుడు బక్కోళ్ల కిట్టున్న మాత్రం పగలంతా ఇక్కడి వ్యవసాయ భూముల్లో ఉన్న పారబడిన ఇంట్లో పగలంతా ఉంటారు. పొద్దుపోయాక తాను నివాసం ఉంటున్న టి.సదుం పల్లెకు చేరుకునేవాడు. పుట్టిన ఊరిపై ఉన్న మమకారంతో ఇలా చేస్తున్నాడని స్పష్టమైంది. ఇంతకీ ఆ ఊరికి ఈ పేరు వచ్చిందంటే...

టి.సదుంలో ఒకప్పుడు కలరా వ్యాధి ప్రబలింది. దీంతో స్థానికులు ప్రాణ భయంతో పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న ప్రాంతంలో స్థిరపడేందుకు వచ్చారు. ఖాళీ స్థలంలో గుడిసెలు, మిద్దె ఇళ్లు నిర్మించుకున్నారు. అక్కడ పాముల పుట్టలు, చెదల పుట్టలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో తమ పల్లెకు పుట్టాపర్తిగా పేరు పెట్టారు. ఇదీ ఈ గ్రామ చరిత్ర. కొసమెరుపు ఏమిటంటే ప్రస్తుతం వయసు మీద పడడంతో ఆ వృద్ధుడు కూడా ఇక్కడకు రావడం మానేశాడు. టి.సదుంలోనే ఉంటున్నాడు.

కోతిగుట్ట

కోతిగుట్ట పలమనేరు మండలంలో ఓ గ్రామం. కౌండిన్య అభయారణ్యం సమీపంలో విచ్చలవిడిగా వస్తుంటాయి. అయితే రామాయణంలో కోతి (వానర) పాత్రను ఆదర్శంగా తీసుకొని కోతి పేరు కలిసొచ్చే విధంగా కోతిగట్టు అని తమ పల్లెకు పేరు పెట్టుకున్నారు. గుట్ట అంటే రాతితిప్ప (మెట్ట) ప్రాంతంలో ఉన్నందున ఉత్తర పదంగా గుట్ట చేరింది. జిల్లా కేంద్రానికి 46కి.మీ దూరంలో ఉంది.

కుప్పం పేరుతో

కుప్పం పేరు కలిసొచ్చే విధంగా ఎన్నో గ్రామాలు చిత్తూరు జిల్లాలో కనిపిస్తాయి. అలాగే వై.ఎస్.ఆర్. కడప జిల్లాలో కూడా ఉన్నాయి. కుప్పం అంటే గ్రామం. మట్టి దిబ్బలు ఎక్కువగా పెరిగిన ప్రాంతాల్లో వెలసిన గ్రామాలకు ఈ పేరు పెడుతున్నట్టు స్పష్టమైనంది. చిత్తూరు జిల్లాలో కుప్పం మున్సిపాలిటీ కేంద్రంగా, అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంగా ఉంది. గ్రానైట్, క్వారీలు, పరిశ్రమలున్నాయి. రామకుప్పం పేరుతో ఓ మండల కేంద్రం ఉంది. ఇదే మండలంలో అట్టి కుప్పం, కేశిన కుప్పం గ్రామాలున్నాయి. అలాగే వెదురు కుప్పం పేరుతో ఓ మండల కేంద్రం నెలకొని ఉంది. ఇదే మండలంలో కురివి కుప్పం అనే పల్లె ఉంది. కాగా కడప జిల్లా చక్రాయపేట మండలంలో కూడా కుప్పం పేరుతో మరో గ్రామం ఉంది.

పుత్తూరు

పుత్తూరు అనగానే గుర్తుకు వచ్చేది పుత్తూరు ఆయుర్వేద ఎముకల వైద్యం. ఇది మండల కేంద్రం. పుత్తూరుకు ఆ పేరు ఎలా వచ్చిందంటే

పుత్తు + ఊరు = పుత్తూరు. పుత్తు అంటే కొత్త, ఊరు అంటే గ్రామం. ఇలా పుత్తూరు అయిందని పేర్కొంటారు. కాగా ఇదే ఊరికి నామకరణం గురించి మరికొంతమంది చెప్పేదేమిటంటే ..... పుట్టలు (పాముల పుట్టలు) అప్పట్లో ఎక్కువ ఉన్నందున పుట్టూరు అయింది, కాలక్రమంలో పుత్తూరుగా మారింది. 1880 నుంచి ఇక్కడి రాచపాళెం ప్రాంతంలో ఎముకల చికిత్స ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. నాటి రాష్ట్రపతి వి.వి.గిరి, అప్పటి ఎ.పి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఇక్కడే ఎముకల చికిత్స చేయించుకోవడం విశేషం. 1830 - 31లో కాశీయాత్ర చేసిన ఈ గ్రామం మీదుగానే ప్రయాణించేవారు. 1830 నాటికే ఇక్కడ మునియపిల్ల సత్రం ఉన్నట్టు తాను రాసిన చరిత్రలో వివరించారు. అప్పటికీ పుత్తూరు చిన్న జానపదమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఇది మున్సిపాలిటీ కేంద్రంగా ఉంది. కాగా విజయనగరం జిల్లా పార్వతీపురం మండలంలో పుత్తూరు పేరుతోనే ఓ పల్లె ఉంది.

పానగల్లు

పానగల్లు శ్రీకాళహస్తి తాలూకాలో ఉంది. గతంలో శ్రీకాళహస్తి మండలంలో ఉండేది. సువర్ణముఖి నదికి ఒక ప్రక్క పానగల్లు, మరో ప్రక్క శ్రీకాళహస్తి ఉన్నాయి. పానగల్లు జమీందారుల ఇంటి పేరయిన పానగంటి పేరుతో పానగల్లు ఏర్పడింది. పానగంటి సంస్థానాధీశుడైన రాజా సర్ పానగంటి రాయన్‌గర్ (1866-1928) గా సుసిద్ధులు. జస్టిస్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మద్రాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆధునిక రచయిత్రి ఆవలకొండ అన్నపూర్ణ స్వగ్రామం ఇదే.

మల్లెల

ఆ పల్లెలో అడుగుపెట్టిన చాలు మల్లెల పరిమళాలతో పరవశించి పోతాం. అది పేరుకి తగ్గ ఊరు. ఆ గ్రామ పేరు మల్లెల. ఇది చిత్తూరు జిల్లా పెదతిప్ప సముద్రం (పి.టి.ఎం) మండలంలో ఉంది. ఈ ఊరిలో ప్రతి ఇంటి పెరట్లో కూడా మల్లె పూలను పండిస్తారు. దీంతో ఈ గ్రామానికి మల్లెల అనే పేరు వచ్చింది. జనాభా 3 వేలు. ఇక్కడి చెన్నకేశవస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. రామాలయం, గంగమ్మ గుడి ఇక్కడ ఉన్నాయి.

వేటగిరిపాలెం

వేటగిరిపాలెం దొరవారిసత్రం మండలంలోని ఓ కుగ్రామం. తనియాలి పంచాయితీ పరిధిలో ఉంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... ఇక్కడకు 25 కి.మి దూరంలోని శ్రీకాళహస్తి గిరి (కొండ) ప్రాంతం నుంచి వచ్చిన సంచార జీవులైన వేటగాళ్లు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. ఈ ప్రాంతంలోని అడవుల్లో వన్యమృగాలను వేటాడేవారు. అయితే కాలక్రమంలో అడవులన్నీ నరికివేతకు గురయ్యాయి. ప్రస్తుతం జీడిమామిడి తోటలు మాత్రమే ఉన్నాయి. ఈ పల్లెలో తెలుగు, తమిళం మాట్లాడేవారు ఉన్నారు. స్వర్ణముఖీ నది కాలువ సమీపంలో ఈ పల్లె ఉన్నది.

పాల సముద్రం

ఇది క్షీర సాగర మథనం జరిగిన పాల సముద్రం కాదు. పాల సముద్రం గ్రామం చిత్తూరు జిల్లాలోని ఓ మండల కేంద్రం. పేరుకు తగిన ఊరు ఇది. ఇది చిత్తూరు పట్టణానికి 36 కి.మీ దూరంలో ఉంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ గ్రామం పాడి పరిశ్రమతో తులతూగుతోంది. పాడి పశువుల పెంపకంతోనే హెచ్చు మంది జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ మొత్తం అయిదు పెద్ద చెరువులున్నాయి. రాయలసీమ ప్రాంతంలో పెద్ద పెద్ద చెరువులను సముద్రంగా పేర్కొంటారు. ఇలా ఆ గ్రామానికి ఈ పేరు వచ్చింది. ఈ గ్రామానికి నామకరణం చేసిన ఘనత కార్వేటినగరం జమీందారులది కావడం విశేషమని పాత్రికయుడు కనగరాజు తెలిపారు. గ్రామ జనాభా 5వేలు. ఇక్కడి గుప్తకనికలను దేవతకు ఓ చెట్టు కింద చిన్న ఆలయాన్ని నిర్మించారు. భక్తులు ఈ దేవతను తరచూ వేడుకుంటారు.

కన్నెమడుగు

ఈ పల్లె తంబళ్లపల్లి మండలంలో ఉంది. ఇక్కడ ఓ చిన్న మడుగు ఉన్నది.ఈ పల్లె పక్కనే ఓ వాగు ఉన్నది. ఇతిహాసాల ప్రకారం ఈ మడుగుల గంధర్వ కన్యలు జలకాలాడే వారు. ఈ ఇతిహాసంపై నమ్మకంతో తమ పల్లెకు కన్నెమడుగు అనే అందమైన పేరు పెట్టారు. జనాభా1500.

■

ఉమ్మడి కర్నూలు జిల్లా

ఆళ్లగడ్డ (కర్నూలు జిల్లా)

వానలో తడవని వారు, ఆళ్లగడ్డ పేరు విననివారు ఉండరు. ఫ్యాక్షన్ విష సంస్కృతి ఆటపట్టుగా ఉన్న ప్రాంతమిది. బాంబులు గడ్డగా దీన్ని పేర్కొంటారు. కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ శానస సభా నియోజకవర్గ కేంద్రంగా, మున్సిపాలిటీ కేంద్రంగా, మండల కేంద్రంగా ఉంది. ఈ ఊరి తొలి పేరు 'ఆవులగడ్డ'. ఆవులకు స్థావరమని గ్రహించాలి. కుందునది ప్రవాహం ఒడ్డున ఈ గ్రామం వెలసినందున 'గడ్డ' అనే పదం చేరింది. ఇలా ఆవుల గడ్డ అయింద. ప్రవాహాల ఒడ్డున గల భూభాగాన్ని గడ్డ అని పిలుస్తారు. అయితే జనవ్యవహారంలో ఆళ్లగడ్డగా స్థిరపడింది. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో ప్రతి ఇంట్లో కనీసం రెండు, మూడు ఆవులుండేవి. పాడి పోషణలో అగ్రగామిగా ఉండేది. అయితే ప్రజల జీవన విధానంలో, శైలిలో అనేక అవాంఛనీయ మార్పులు రావడంతో ఆవుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. పశు సంవర్థక శాఖ తాజాగా అందించిన వివరాల మేరకు ప్రస్తుతం ఆళ్లగడ్డలో 226 ఆవులు మాత్రమే ఉన్నాయి. ఈ విషయాన్ని పశు సంరక్షక శాఖ ఉప సంచాలకులు డా॥ లక్ష్మీ ప్రసాద్, మండల పశు వైద్యాధికారి రామ సుబ్బారెడ్డి ధ్రువీకరించారు.

జూపాడు బంగ్లా

ఈ ఊరి పేరు ఎంతో విచిత్రంగా ఉంది కదండీ. ఇదో మండల కేంద్రం కూడా కావడం విశేషం. కర్నూలు జిల్లాలో ఉన్న జూపాడు బంగ్లా గ్రామం పేరు వెనుక గల చరిత్రను ఇక పరిశీలిద్దాం. ప్రస్తుతం జూపాడు బంగ్లా గా పిలుస్తున్న ఈ గ్రామ చరిత్ర పుటల్లోకి వెళితే తాటపాడు, బన్నూరు గ్రామాల మధ్య ఓ చిన్న గ్రామం ఉండేది. అదే జూపాడుగా పిలువబడేది. అదిప్పుడు కనిపించకుండా నామరూపాలు లేకుండా పోయింది. సుమారు 150 సంవత్సరాల క్రితం ఆంగ్లేయులు నిర్మించిన కర్నూలు - కడప కాలువ (కె.సి.కెనాల్) నేటికీ మనం చూస్తున్నాం. నాటి కాలంలో కనీస రహదారులుండేవి కావు. ప్రయాణ సాధనాలు అసలుండేవి కావు. నాటి తెల్ల దొరలు కర్నూలు - కడప కాలువ ప్రవాహంపై తెప్పల మీద ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించేవారు. తెప్పలను లాగడానికి అవతల గట్టున ఒకరు, ఇవతల ఒకరు తాళ్లతో తెప్పలను లాగేవారు. ఆంగ్లేయాధికారులు హాయిగా తెప్పల్లో కూర్చొని ప్రయాణించేవారు. ఈ కాలువ పక్కనే తెల్లదొరలు మజిలీ చేయడానికి తమ పాలన నిర్వహించేందుకు ఒక బంగ్లా నిర్మించారు. అక్కడే విశ్రాంతి తీసుకునేవారు. ఈ బంగ్లా నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. కృష్ణా నదీ జలాలు కొన్ని పల్లెలను ముంచివేయడంతో చాలా మంది తమ గ్రామాలను వదలి బంగ్లా సమీపంలో 1980 సంవత్సరం నుంచి శాశ్వత నివాసాలు ఏర్పరుచుకుని స్థిరపడ్డారు. కాలగమనంలో అదే జూపాడు బంగ్లాగా రూపాంతరం చెందింది. బ్రిటీష్ మహారాణి విక్టోరియా హయాంలో 1886 జూపాడు వద్ద బంగ్లాను నిర్మించారు. కాలక్రమంలో ఇది ఓ పెద్ద గ్రామంగా తయారైంది. సమితుల వ్యవస్థ అంతరించి మండలాలు ఏర్పడ్డాయి. 1985లో జూపాడు బంగ్లా మండల కేంద్రమైంది.

లద్దగిరి

లద్దగిరి కోడూమూరు మండలంలోని ఓ వైవిధ్యమైన గ్రామం. హంద్రీనదీ తీరంలో ఉంది. ఇక్కడి కొండ (గిరి)పై రత్నాలు ఉండేవని భావించి గుర్రాలకు లద్దెలు వేసి పైకి ఎక్కించేవారు. ఆంగ్లేయుల పాలనా కాలంలో ఇలా జరిగింది. రత్నాల మేక గుర్రాలకు (రత్నాల వేటకు) లద్దెల సాయంతో ఎక్కించిన నేపథ్యంలో ఈ ప్రాంత గ్రామానికి లద్దగిరి అనే పేరు వచ్చింది. తొలుత దీని పేరు రత్నగిరి. యాదవుల పాలనలో ఉండేది. కొండ మీద శివాలయం ఉంది. ప్రస్తుతం ఈ కొండపైకి వెళ్లేందుకు రోడ్డు మార్గాన్ని కూడా నిర్మించారు. రామదాసు తాత అనే ప్రవక్త ఇక్కడికి వలస వచ్చి ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్య పరిచారు. అయన పేరుతోనే ఓ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా డిసెంబరు నెలలో పెద్ద ఎత్తున తిరునాళ్లు జరుగుతాయి. నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి అతని కుమారుడు సూర్యప్రకాశరెడ్డి ఈ గ్రామానికి చెందినవారే. రామదాసు తాత ఆశీస్సులతోనే వారు ఉన్నత స్థాయికి ఎదిగినట్టు స్థానికులు పేర్కొన్నారు. కాగా లద్దగిరి గ్రీనరీ పార్కుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మిగనూరు

కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండల, పురపాలిక కేంద్రం. పట్టణ జనాభా 95,149. చేనేత పరిశ్రమలో ఎంతో ప్రసిద్ధి చెందింది. సమీపంలో కర్ణాటక రాష్ట్రం ఉండడంతో కన్నడ భాష ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ ఊరు పేరు వెనుక గల చరిత్ర విలక్షణంగా ఉంటుంది. కన్నడ భాషలో 'ఎమ్మే' అంటే ఎనుము (గేదె) అని అర్థం. నూరు అంటే వంద అని వేరేగా చెప్పనక్కర్లేదు. ఈ ప్రాంతం ఊరు పేరు లేని, జనావసం లేని

రోజుల్లో పశువుల సంత ప్రతి ఆదివారం జరిగేది. రైతులు, దళారులు ఇక్కడికి పశువులను తెచ్చి క్రయ విక్రయాలను జరిపేవారు. ముఖ్యంగా కన్నడ ప్రాంతం నుంచి ఎక్కువగా పశువులను తెచ్చేవారు. ఈ సంతలో ఒక్కో ఎనుమును నూరు రూపాయలకే అమ్మేవారు. ఈ విధంగా 'ఎమ్మిగనూరు' (గేదెకు వంద రూపాయలు తీసుకొనే ఊరు)గా ఈ ప్రాంతం ఎమ్మేగనూరు, ఎమ్మోగనూరుగానూ, చివరకు ఎమ్మిగనూరుగా స్థిరపడిరది. ఇక్కడి నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. అలాగే చెన్నకేశవస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం, చౌడీశ్వరి ఆలయాలు కూడా ఉన్నాయి.

కోడుమూరు

కోడుమూరు ఓ మండల కేంద్రం. కోడు అంటే జల సూచిక. సమీప ప్రాంతంలో పెద్ద జల ప్రవాహం లేదా నది ఉండే ఈ ప్రాంతానికి పూర్వ పదంగానో లేదా ఉత్తర పతంగానో కోడు చేరుతుంది. కోడుమూరు అంటే ఈ గ్రామానికి సమీపంలో హంద్రీ నది ఉంది. ఇలా ఆ పట్టణానికి కోడుమూరు అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతంలో పత్తి, ఆముదం, మిర్చి కూరగాయలను హెచ్చుగా పండిస్తారు. పట్టణ జనాభా 2,03,954. కోడుమురు చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. గద్వాల శైలిలో ఇక్కడ చీరలను నేస్తారు.

వెంకటగిరి

నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి అనగానే చీరలు తదితర వస్త్రాలు గుర్తుకువస్తాయి. కర్నూలు జిల్లాలో కోడుమూరు మండలం వెంకటగిరి

గ్రామం అంటే గుర్తుకు వచ్చేది గిడ్డ ఆంజనేయస్వామి ఆలయం. ఈ పల్లెలోనే 'గిరి' (కొండ) ఉంది. దీన్ని సైతం పవిత్రంగా భావిస్తారు. తొలి పదంగా వెంకట ఉంది. వెంకట అంటే పాపాలను హరించేది అని అర్థం. అంచేతనే వెంకట తొలి పదంగా చేరింది. ఇలా వెంకట గిరి ఏర్పడిరది. ఇక్కడ గల గిడ్డ ఆంజనేయస్వామి ఆలయానికి ప్రతి శనివారం భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. ఆంజనేయుని పేరు కలిసొచ్చే విధంగా 70 శాతం మంది తమ పిల్లలకు గిడ్డయ్య. గిడ్డమ్మ, గిడ్డమ్మరెడ్డి , గీత అనే పేర్లు పెట్టుకోవడం ఆచారంగా కొనసాగుతోంది. దూదేకుల సామాజిక వర్గం వారు కూడా ఆంజనేయున్ని కొలుస్తుంటారు. కర్నూలు గ్రామీణ మండలానికి చెందిన పొంతల పాడు గ్రామీణులు ఇక్కడకు మూడేళ్ల కొక్కసారి నాటు బండ్లపై వచ్చి ఆంజనేయునికి మొక్కుబడులు తీర్చుకుంటారు.

భోజనం

భోజనం గ్రామం బండి ఆత్మకూరు మండలంలో ఉంది. బండి ఆత్మకూరుకు పదకొండు కిలో మీటర్లు నంద్యాల నుంచి 26కి.మీ దూరంలో ఈ పల్లె నెలకొని ఉంది. గ్రామ జనాభా 2 వేలు. అన్నం పరబ్రహ్మ స్వరూపం కదా. అన్నం పేరు స్ఫురించే విధంగా ఈ పల్లెకు భోజనం అనే పేరు పెట్టారు. పైగా తెలుగు వారు భోజన ప్రియులు కదా. అప్పటి సంస్థానాధీశులు ఈ ప్రాంతంలో ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టి ఆదుకొనేవారు. స్వయంగా వారే వడ్డించే వారని స్థానికులు పేర్కొన్నారు. ఇక్కడ శివాలయం, రామాలయం, చర్చి మసీదు ఉన్నాయి.

కప్పట్రాళ్ల

కప్పట్రాళ్ల దేవనకొండ మండలంలోని ఓ ముఠా కక్షల గ్రామం. ఒకప్పుడు ఫ్యాక్షనిజానికి పెట్టింది పేరు. అయితే ప్రస్తుతం ఈ గ్రామం శాంతి మంత్రం జపించడం గొప్ప పరిణామం. కప్పట్రాళ్లకు ఈ పేరు ఎలా వచ్చిందంటే ... దీని తొలి పేరు 'సిరిమల్లె'. అయితే ఆంగ్లేయుల హయాంలో ఇక్కడ రైతుల నుంచి కప్పం (శిస్తు) వసూలు చేసేవారు. రైతుల చుట్టూ ప్రక్కల ఉన్న అనేక గ్రామాల రైతులు ఇక్కడే కప్పం కట్టేవారు. అయితే నాణేలు రాళ్ల కుప్పలు మాదిరిగా ఈ కేంద్రానికి చేరేవి. అంచేత ఈ పల్లెలో కప్పట్రాళ్ల అనే పేరు వచ్చింది. తొలుత నాణేలు రాళ్ల కుప్పల్లా చేరినా ఆ తరువాత కరువు కాటకాల వల్ల రైతులు శిస్తు మొత్తాలను చెల్లించలేక పోయారు. ఈ గ్రామానికి జనవ్యవహారంలో 'కప్పం కప్పట్రాళ్ల' అని కూడా పిలుస్తుంటారు. ఈ గ్రామం రక్త చరిత్ర గూర్చి కాస్త ప్రస్తావన అవసరం. ఒకప్పుడు హత్యలు, ప్రతి హత్యలతో ఈ గ్రామం అట్టుడికి పోయేది. 40ఏళ్ల రక్తసిక్త చరిత్రకిది చిరునామాగా మారింది. వెంకటప్పనాయుడు అతని ప్రత్యర్థి వర్గం వారి పరస్పర దారుల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అప్పటి కర్నూలు ఎస్.పి ఎ.కె.ఇ.రవికృష్ణ ఈ పల్లెను దత్తత తీసుకొని ఓ ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దారు. ఆర్థికాభివృద్ధి వివిధ శాఖలు , స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉత్తమ గ్రామంగా మార్పు చెందేందుకు కృషి చేశారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతోంది,

సిమ్మెంటునగర్

సిమ్మెంటునగర్ చర్ల మండలంలో ఉంది. దీని తొలిపేరు సుధానగర్. సిమ్మెంటు నగర్ పేరు ఎలా వచ్చిందంటే... 1950లో ఇక్కడ పాణ్యం సిమ్మెంటు కర్మాగారం ఏర్పాటైంది. దక్షిణ భారతదేశంలో సిమ్మెంటు ఫ్యాక్టరీ ఇది. ఇందులో పనిచేస్తున్న వేలాది కార్మికులు గ్రామానికి సిమ్మెంటునగర్‌గా పేరు మార్చుకున్నారు. జనాభా 5వేలు. ఇక్కడ సీతారామాలయం గుండంలో శివాలయం, కొండపై ఆంజనేయస్వామి ఆలయం ఉన్నాయి.

దేవరగట్టు

దేవరగట్టు కర్నూలు జిల్లా హోళగుండ మండలంలోని ఓ విశిష్ట గ్రామం. ఈ గ్రామం సమీపంలోని ఓ కొండపై మాళమల్లేశ్వరస్వామి (దేవర) వెలసిన గట్టు పేరుతోనే దేవరగట్టు అనే గ్రామం అవతరించింది. ప్రతి ఏటా విజయదశమి రోజు రాత్రి జరిగే మాళమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవానికి (కర్రల సమరం) కర్నాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తులు పాల్గొంటారు. ఈ ఉత్సవంలో ముఖ్యంగా స్థానికులతో పాటలు నెరణికి, నెరణికి తండా కొత్తపేట గ్రామీణులు కీలక పాత్ర పోషిస్తుటారు. ఉత్సవాలకు ముందు వచ్చే అమవాస్య నుంచి దీక్ష చేపట్టి కంకణ ధారణ మొదలు అన్ని ఉత్సవాలు ముగిసే వరకు నిష్ఠతో ఉంటారు. పూజారి ఇంట్లో ఉండే ఉత్సవ విగ్రహానికి నెరణికి గ్రామానికి తెచ్చి ఊరేగింపు జరుపుతారు. భవిష్య వాణి కార్యక్రమం కూడా ఉంటుంది. దివిటీ కాంతుల కర్రల సమరం సందర్భంగా కొంత మేరకు రక్తపాతం జరుగుతుంది. క్రీ.శ11వ శతాబ్దం నుంచి ఈ ఉత్సవం జరుగుతూనే ఉంది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్నప్పటికీ బన్ని ఉత్సవానికి ఎనలేని ప్రాధాన్యత ఉంది.

గొట్లూరు

గొట్లూరు చాగలమర్రి మండలంలోని ఓ పల్లె. ఈ గ్రామం ఓ ఎత్తయిన గుట్టపై వెలిసింది. గుట్టులూరు అని తొలుత పిలిచేవారు. లోకవ్యవహారంలో క్రమంగా గొట్టూరుగా మారింది. గేదెలు, మేకలు హెచ్చు సంఖ్యలో ఉన్నాయి. పాడి పరిశ్రమపై గ్రామీణుల మొగ్గుచూపడం విశేషం. జొన్న, శనగ పంటలను పండిస్తారు. కాగా అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలో కూడా గొట్టూరు పేరుతో ఓ గ్రామం ఉంది.

కొండమీదిపల్లి

ఈ గ్రామం కొలిమిగుండ్ల మండలంలో ఉన్నది. ఈ పల్లె గొరివిమానుపల్లి పంచాయితీలో ఉనెది. రెండు శతాబ్దాల క్రితం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు వలసవచ్చి కొండపై శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కొండపై నల్లరేగడి భూములున్నాయి. పత్తి, మినుము, శనగ, కంది, జొన్న, గోధుమ పంటలు పండిస్తున్నారు. వీరికి సాపరాతి గనులు మంచి ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ గ్రామంలో గాలి మరలను ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని సీనియర్ పాత్రికేయులు పల్లోలి శేఖర్ బాబు తెలిపారు.

ఊటకొండ

ఊటకొండ ప్యాపిలి మండలంలోని ఓ జానపదం. ఈ ఊరి తొలి పేరు ఉమామహేశ్వరం. ఈ పల్లెలో పుష్కలంగా తాగునీళ్లు లభిస్తాయి. గ్రామం చుట్టూ కొండలు ఉంటాయి. వాటి మధ్యలో ఈ ఊరు ఉండడం ఓ ప్రత్యేకతగా భావించవచ్చు. ఈ కొండల నుంచి నీళ్లు నిత్యం పారుతుంటాయి. తాగునీరు, సాగునీరు అవసరాలకు ఎంతగానో

తోడ్పడుతున్నాయి. ప్రభుత్వం ఇక్కడ చెక్‌డ్యాంలను ఏర్పాటు చేసింది. గ్రామానికి సమీపంలో ఓ పెద్ద కొండపై ఓ శివలింగం ఉంది. శివునికి ఎలాంటి నీడలేదు. అయితే ప్రతీరోజూ అతి కొద్ది మంది భక్తులు అక్కడ దీప, ధూప, నైవేద్యాలను పెడుతుంటారని గ్రామానికి చెందిన హిందీ పండిట్, రచయిత ఆర్. దస్తగిరి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

సంగపట్నం

సంగపట్నం కర్నూలు జిల్లా అవుకు మండలంలో ఉంది. సముద్రతీరం లేదా నదీ ప్రాంతాల్లో ఉన్న పల్లెలకు, బస్తీలకు చివరి పదంగా పట్నం చేరుకుంది. సంగపట్నం కూడా అలానే అయింది. ఈ గ్రామానికి అత్యంత చేరువలో కృష్ణానది కాలువలున్నాయి. అయితే సంగ అనే పదం ఎలా వచ్చిందంటే.... దీని తొలి రూపం 'సంఘు' అని గ్రహించాలి. గ్రామం ప్రారంభనప్పుడు కొంతమంది ఓ సంఘాన్ని ఏర్పరిచారు. వారంతా కలిసి సంగపట్నం అని తమ ఊరికి పేరు పెట్టుకున్నారు. సంఘు అనే రూపం సంగ గా రూపాంతరం చెందింది. గ్రామ జనాభా 2191. గ్రామంలోని పెద్దమ్మతల్లి, అంకాలమ్మ తల్లి, చౌడీశ్వరీ దేవి, అమ్మవార్లను ప్రజలు కొలుస్తారు. మసీదు, చర్చి కూడా ఉన్నాయి.

బేతంచర్ల

బేతంచర్ల ఓ మండల కేంద్రం. నాపరాళ్ళ గనులకు ప్రసిద్ధి. విదేశాలకు సైతం వీటిని ఎగుమతి చేస్తుంటారు. ఈ గ్రామానికి పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే... ఇతిహాసం ప్రకారం ఇక్కడ భేతాళుడనే ప్రభువు కొన్ని శతాబ్దాల క్రితం పాలించే వారు. అతని పేరుతోనే బేతంచర్లకు ఆ పేరు వచ్చింది. చర్ల తొలి పేరు చరియ. చరియ

అంటే కొండ దగ్గరి నేల అని అర్థం. చరియ అనేది జనవ్యవహారంలో చర్లగా రూపాంతరం చెందింది. ఈ గ్రామం చుట్టూ కొండలు నెలకొని ఉన్నాయి.

తేర్నెకల్లు

తేర్నెకల్లు కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని ఓ గ్రామం. దీనిలోని తొలిపేరు గొర్లగుండ్లు. మాదవ నాయకుడైన గొర్లెనాయుడు పేరుతో ఈ పల్లె ఏర్పాటైంది. పెద్ద గ్రానైట్ గుండ్లు ఉన్నందున ఉత్తర పదంగా గుండ్లు చేరింది. కాలక్రమంలో గొర్లెనాయుడి కుమార్తె తైరుణికి ఈ పల్లె సమీపంలోని ఓ గుండు రూపంలో మాధవస్వామి ప్రత్యక్షమయ్యాడు. అప్పటి నుంచి మహిళ తైరుణి ఈ మాధవస్వామికి ఆరాధన చేస్తూ కొండమీదనే నివసించింది. మరికొందరిని రప్పించి వారికి కూడా ఇళ్లను నిర్మించి అక్కడే ఉండేది. తైరుణి పేరు మీదుగా ఈ పల్లెకు తైరుణికల్లు అనే పేరు వచ్చింది. కల్లు అనే పదానికి రాయి లేదా కొండ అని, జనవ్యవహారంలో నాటి తైరుణికల్లుయే తెర్నేకల్లుగా మారింది. ముతుకూరి గౌడప్ప తొలితరం స్వాతంత్ర్య సమర యోధుడు. క్రీ.శ 1801లో తెర్నేకల్లు ప్రజలు ఆంగ్లేయులపై జరిపిన తిరుగుబాటు చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది.

కన్నమడకల

కన్నమడకల గ్రామం ఓర్వకల్ మండలంలో ఉంది. గ్రామ జనాభా 2376. పేరు వెనుక గల నేపథ్యాన్ని పరిశీలిస్తే... కణ్వుని పేరుతో అప్పట్లో మఠం ఉన్నందున కణ్వమఠం అనే పేరు వచ్చింది. అయితే జనవ్యవహారంలో కన్నమడకలగా మారింది. ఆ పేరు స్థిరపడిరది.

గార్గేయపురం

గర్గ్యముని పేరుతో వెలసిన గ్రామం గార్గేయపురం. కర్నూలు గ్రామీణ మండలంలో ఉంది. కర్నూలు శివార్లలో ఈ ప్రాంతం ఉంది. గార్గేయపురంలోని అతిపెద్ద మడుగు ఆహ్లాదాన్ని నింపుతుంది. ఇందులో విహరించడానికి బోట్లు ఏర్పాటు చేసారు. పర్యాటక శాఖ దీన్ని అభివృద్ధి చేస్తోంది. ఇక్కడే నగర వనం ఉంది.

హాలహర్వి

హాలహర్వి కర్నూలు జిల్లాలోని ఓ మండల కేంద్రం. ఇది కన్నడ భాషా ప్రభావం వల్ల ఏర్పడిన పలు గ్రామాల్లో ఒకటి. కన్నడ భాషలో హాలు అనగా పాలు అని అర్థం. కాలక్రమంలో హర్వి అనే పదం చేరింది. హర్వి అంటే కుండ అని అర్థం. విజయనగర సామ్రాజ్యాధీశుల కాలంలో పాడికి, పాలు కుండలో పోసి మరీ విక్రయించేవారు. మొత్తం మీద హాలహర్వి అంటే పాలకుండ అని గ్రహించాలి. ఇక్కడి చెన్నకేశవ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ పల్లెకు సమీపంలో పశ్చిమ దిశలో క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయం ఉంది.

మరో హాలహర్వి

ఈ జిలాల్లలో హాలహర్వి పేరుతోనే మరో గ్రామం కూడా ఉంది. ఈ పల్లె సందవరం మండలంలోనే ఉంది. మండల కేంద్రమైన హాలహర్వి నుంచి కొన్ని కుటుంబాల ఇక్కడకు వలస వచ్చాయి. సొంత ఊరిపై ఉన్న మమకారంతో ఇదే పేరు పెట్టుకోవడం కొసమెరుపు.

ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ పేరుతో కర్నూలు జిల్లాలో రెండు గ్రామాలున్నాయి. ఇందులో మండల కేంద్రమైన ఉయ్యాలవాడ కాగా మరొకటి ఓర్వకల్లు మండలంలో ఉంది. మండల కేంద్రమైన ఉయ్యాలవాడకు ఆ పేరు ఎలా వచ్చిందంటే అప్పట్లో ఈ జానపదంలో హెచ్చు సంఖ్యలో ఆబాలగోపాలం ఊయలలు ఊగేవారు. దీంతో ఆ పల్లెకు ఊయలవాడ అనే పేరు వచ్చింది. చివరకు జనం నోళ్లలో ఉయ్యాలవాడగా పేరు వచ్చింది. అయితే ఈ పేరు స్ఫురణకు రాగానే ప్రఖ్యాత పాలెగాళ్ల నాయకుడు, ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గుర్తుకు వస్తారు. నిజానికి ఆయన పుట్టిన ఊరు రూపనగుడి అయినప్పటికీ బాల్యం నుంచి పెద్దయ్యే వరకూ ఉయ్యాలవాడలోనే ఉండేవారు. ఆయన ఇంటిపేరు మజ్జిరి అయితే ఉయ్యాలవాడగానే ప్రాచుర్యం పొందడం విశేషం. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ గ్రామ జనాభా 4199. ఈ పల్లె కుందు నది ఒడ్డున ఉంది.

జిల్కెల

జిల్కెల బనగానపల్లె మండలంలో ఉంది. జిల్లేడు మొక్కలు ఎక్కువగా ఉండడంతో దీనికి జిల్లెల అనే పేరు వచ్చింది. వృక్ష సంబంధమైన పేర్లతో రాష్ట్రంలో వందలాది గ్రామాలున్నాయి. గ్రామ జనాభా 1171.

ఆలూరు

ఆలూరు ఓ మండల కేంద్రం. దీని తొలిపేరు హాలూరు. కన్నడ భాషలు హాలు అంటే పాలు అని అర్థం. దీంతో హాలూరు అని ఈ

గ్రామానికి పేరు వచ్చింది. లోకవ్యవహారంలో హాలూరు ఆలూరుగా మారింది. అదే పేరు స్థిరపడిరది. ఇక్కడి పాడి సమృద్ధిగా లభించడంతో విజయనగర సామ్రాజ్యాధీశుల కాలంలో ఈ పేరు వచ్చిందని స్థానికుల కథనం. గ్రామ జనాభా 15 వేలు. ఇక్కడ గల నవనేపట్టయ్య స్వామి, సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి.

గుళ్లదర్తి

గుళ్లదర్తి కర్నూలు జిల్లా కోవెలకుంట్ల - జమ్మలమడుగు ప్రధాన రహదారిలో పట్టణానికి 10 కి.మీ దూరంలో ఉంది. అనేక గుళ్ల సముదాయంతో ఉన్న ందున దీనికి గుళ్లదుర్తి అనే పేరు వచ్చింది. ఒకప్పుడు 101 గుళ్లు, 101 బావులుండేవి. అయితే కాలక్రమంలో కొన్ని ఆలయాలు కనుమరుగయ్యాయి. జనమేజయుడు తన తండ్రి చేసిన సర్పయాగదోష నివారణకు 101 బ్రాహ్మణ గడపలు కలిగిన గ్రామాల్లో ఒకే రోజు శివాలయాలు ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా గుళ్లదర్తిలో జంబుకేశ్వరాలయం నిర్మితమైంది. 5 ఆలయాలకు నిలయమైన చిన్న ఆశ్రమం, సీతారామాలయం, కృష్ణమందిరం, వీరబ్రహ్మేంద్రస్వామి పేర్లు, మౌలాలిస్వామి దర్గాలున్నాయి. ఇక్కడ మత సామరస్యం విరాజిల్లుతోంది. తొలుత ఈ గ్రామానికి మాంపురి, బ్రాహ్మణ అగ్రహారం అనే పేర్లు కూడా ఉండేవి. గ్రామ జనాభా 3626.

దేవనకొండ

దేవనకొండ ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇది పంచ పాళేలలో ఒకటి. ఇక్కడ గల కొండలపై శివాలయాలు, వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరం, పీర్లచావిడి ఉన్నాయి. దీంతో

ఈ గ్రామానికి దేవుని కొండ అనే పేరు వచ్చింది. కాలగమనంలో దేవనకొండగా మారింది. మొహరం పండుగ సందర్భంగా కొండపై గల పీర్ల చావిడిని సందర్శించేందుకు ముస్లిం కుటుంబీకులు పిల్లలతో సహా అతి కష్టం మీద వెళ్తుంటారు. కాగా అయ్యప్ప స్వామి ఆలయం రామ ఆంజనేయ స్వామి ఆలయం ఉన్నాయి. ఇక్కడ కొండపై పాళెగాళ్లు నిర్మించిన రాతికోట శిథిలావస్థలో ఉంది. పాళెగాళ్ల పాలనకు తెరపడింది. అయితే పాళెగాడు రెహమాన్ నాయక బీజాపూర్ ప్రభుత్వం ఆధీనంలో వంద మంది సేవకులను నిర్వహించేవారు. అయితే నాసిరే జంగన్ పాలనాకాలంలో ఈయన కుమారుడు ఎన్నో అల్లర్లు సృష్టించగా బంధించి తీసుకొని వెళ్లి సున్తీ చేసి మతం మార్చి పంపించారు. ఈ తరువాత తిరుగుబాటు చేయగా క్రీ.శ1768 నుంచి 1786 వరకు బందీగా ఉన్నట్టు చరిత్ర చెబుతోంది. ఈ గ్రామం సమీప పట్టణమైన ఎమ్మిగనూరు నుంచి 28 కి.మీ దూరంలో ఉంది.

బూరుగుల

బూరుగుల ప్యాపిలి మండలంలో ఉంది. జనాభా 4085. ప్యాపిలి నుంచి 18 కి.మీ దూరంలో ఉంది. బూరుగు (పత్తిని ఉత్పత్తి చేసే చెట్టు) వృక్షాల వల్ల ఈ గ్రామానికి బూరుగు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో బూరుగుల అనే పేరు స్థిరపడిరది. వివిధ గ్రామాలకు అక్కడి పరిస్థితి అనుసరించి తొలి పదంగా వృక్షాల పేర్లు చేరుతాయి.

గూడూరు

గూడూరు కర్నూలు జిల్లాలో మండల కేంద్రం. ఎమ్మిగనూరు - కర్నూలు రహదారిలో ఉంది. జనాభా 25 వేలు. ఈ గ్రామానికి బడేఖాన్

గూడమియ్య అనే ఓ ముస్లిం సన్యాసి పేరుతో ఏర్పాటైంది. ఆయుదం గింజలు, పొద్దుతిరుగుడు , వేరుశనగ పంటను పండిస్తారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెండు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

ఓర్వకల్లు

ఓర్వకల్లు కర్నూలు జిల్లాలో సహజ సిద్ధమైన రాతి కట్టడాల సముదాయం ఉన్న ఓ మండల కేంద్రం. దీన్ని రాక్ గార్డెన్ అని అంటారు. ఇంతకీ ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే వేయి ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ రాతి సముదాయం ఆకట్టుకుంటుంది. 'ఓర్వ' శబ్దం ఓరు నుంచి వచ్చింది. 'ఓరు' అంటే ఎర్రమట్టి. ఈ రాతి సముదాయ ప్రాంతంలో ఎక్కడ తవ్వినా ఎర్రమట్టి మాత్రమే వస్తుంది. కల్ అంటే తమిళంలో రాయి. ఓర్వకల్ క్రమంగా ఓర్వకల్లుగా మారింది. ఈ రాతి సముదాయం మధ్యలో పెద్దపెద్ద అందమైన చెట్లు, లోయలు దర్శనమిస్తాయి. పర్యాటకుల కోసం టూరిజం శాఖ అతిథి గృహాలను నిర్మించింది. ఈ రాక్ గార్డెన్‌ను హరితవనంగా తీర్చిదిద్దారు. ఇందులోనే బాహుబలి వంటి సినిమాలను నిర్మించారు. మన రాష్ట్రంలో తిరుమల - తిరుపతి క్షేత్రం ఎలా సహజ సిద్ధమైందో ఓర్వకల్ కూడా అలాంటిదేనని రాయలసీయ రచయిత, బంధకవి టి. చక్రపాణి పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయం ఓర్వకల్లు పరిధిలోనే ఉంది. ఈ గ్రామ జనాభా 4869. ఇక్కడి చౌడేశ్వరి ఆలయం కూడా ప్రసిద్ధి చెందిందే. ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిన ప్రాంతమిది.

హోళగుంద

హోళగుంద కర్నాటక సరిహద్దు గ్రామం. దీని తొలి పేరు వన్నినగుండు. వన్ని అంటే బంగారం, గుండు అంటే రాయి. ఈ

పల్లెలోని సుప్రసిద్ధ సిద్దేశ్వరస్వామి ఆలయంలో బంగారపు రాయిపై సిద్దేశ్వరుణ్ణి ప్రతిష్ట చేశారు. వన్నిన గుండు కాలక్రమంలో హోళల గుండుగా మారింది. జనవ్యవహారంలో హోళగుండగా స్థిరపడిరది. హోళ అంటే లోపలి లేదా లోతట్టు ప్రాంతం (కన్నడంలో) అని అర్థం. ఇక్కడ తెలుగు, కన్నడ, ఉర్దూ భాషలు మాట్లాడే ప్రజలున్నారు. సమీపంలో ఉన్న వేదావతి నది ఆంధ్ర, కర్నాటక విభజన రేఖగా ఇక్కడే కనిపిస్తుంది. గ్రామ జనాభా 12 వేలు. హిందూ ముస్లిం, క్రైస్తవ ప్రార్థనా మందిరాలతో హోళగుంద త్రివేణీ సంగమంగా విరాజిల్లుతోందని స్థానిక విద్యాశాఖకు చెందిన సాయి బేసు రచయితకు తెలిపారు.

కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల కర్నూలు జిల్లాలోని ఓ మండల కేంద్రం. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... బాదామి చాళుక్యుల కాలంలో శివుడు, పార్వతి, వినాయక, వీరభద్రస్వామి ఆలయాలను ఒకే చోట నిర్మించారు. ఈ ఆలయాలు ఎదురెదురుగా ఉంటాయి. మధ్యలో నాగులకట్ట ఉంది. పునాదులు లేకుండా ఆలయాలను నిర్మించారు. వీటిని కలిమిగుండ్లు (సంపదనిచ్చే ఆలయాలు) అని అప్పట్లో పిలిచేవారు. వాడుకలో కలిమి గుళ్లు కలిమిగుండ్లగా మారింది. ఈ ఆలయాల్లో ప్రస్తుతం విగ్రహాలు లేవు. ఈ గ్రామం సమీపంలోనే ఓ కొండ ఉన్నది. ఈ కొండపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నెలకొని ఉంది. ఎదురుగా భైరవస్వామి ఆలయం ఉన్నది. నాపరాళ్ల పరిశ్రమ ఇక్కడ విస్తరిస్తోంది. రామ్కో సిమెంటు పరిశ్రమతో గ్రామం అభివృద్ధి చెందుతోంది.

గుళ్యం

గుళ్యం కర్నూలు జిల్లా హాలహర్వి మండలంలో ఉంది. ఆంధ్ర, కర్నాటక సరిహద్దుల్లో వెలసి ఉంది. ఒకప్పుడు గుళ్యం గ్రామం కర్నాటక బళ్లారి జిల్లాలో ఉండేది. 1956 రాష్ట్రాల పునర్విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారు. గుళ్యం గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిదంటే ''గూళి'' అనే కన్నడ పదానికి ''ఎద్దు'' అని అర్థం. వేదావతి నదికి వరదలు వచ్చినపుడు ఒక ఎద్దు నదిలోని బండరాయిని సాహసంతో బయటకు తెచ్చింది. దీంతో స్థానికులు తమ పల్లెకు గూళి (ఎద్దు) అని నామకరణం చేశారు. కాలక్రమంలో గూళి కాస్త గుళ్యంగా మారింది. అదే పేరు స్థిరపడిందని స్థానిక విద్యావేత్త కె.ఎం.శివలింగయ్య స్వామి తెలిపారు. ఇది వేదావతి నదీ తీరంలో ఉన్నది. తొలుత ఈ నదికి కొంత దూరంలో 'పాత ఊరు' ఉండేది. అయితే వేదావతి వరదలకు గురయి ప్రజలంతా సమీపంలో 'గుళ్యం' పేరుతో కొత్త ఊరును ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలోని బుడగ జంగం సామాజిక వర్గం వారు వందలాది ఎద్దులను పెంచేవారు. అన్నింటికీ మించి ఇక్కడ గల గాదిలింగేశ్వర స్వామి అనే అవధూత ఆలయం, అతని గురువైన సిద్దలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. మహాశివరాత్రి తరువాతి పంచమి రోజున ఈ ఆలయాలకు సంబంధించి జోడు రథాల ఉత్సవం భారీ ఎత్తున జరుగుతుంది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా కన్నడం మాట్లాడుతారు. తెలుగు మాట్లాడేవారు కూడా ఉన్నారు. ■

ఉమ్మడి కడప జిల్లా

వేముల

వేముల ఓ మండల కేంద్రం. వేము అంటే వేప అని అర్థం. వేప చెట్లు ఈ ప్రాంతంలో హెచ్చుగా ఉండడంతో ఇక్కడ స్థిరపడిన వారు తమ పల్లెకు వేముల అని పేరు పెట్టారు. ఈ గ్రామ జనాభా 4437. వేముల ఇంటి పేరు ఉన్నవారు దళిత సామాజిక వర్గంలో ఉన్నారు. కాగా వేములవలస పేరుతో ఓ గ్రామం విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల వేములవాడను కూడ ఈ సందర్భంగా ఉదహరించవచ్చు.

కొత్తపల్లి

కొత్తపల్లి గ్రామం కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో ఉంది. మట్టరాజులు సిద్ధవటం కేంద్రంగా క్రీ.శ 1600 ప్రాంతం నుంచి అయిదు దశాబ్దాలు రాజ్యమేలారు. క్రీ.శ 1356లో బుక్కరాయల కాలంలో నిర్మించిన ఒంటిమిట్ట రామాలయాన్ని అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో సిద్ధవటం నుంచి రాజులు, రాణులు, రాజోద్యోగులు ఆలయాన్ని దర్శించుకునేవారు. వారికి రక్షణగా బలిజ సామాజిక వర్గానికి చెందిన సైనికులు మట్ల రాజుల వద్ద పని చేశారు. ఒంటిమిట్ట సిద్ధవటం మార్గంలో బలిజలు నిర్మించుకున్న ఈ గ్రామమే కొత్తపల్లి. ఈ పల్లె పొలిమేర హద్దులు కారణంగా పెద్ద, చిన్న కొత్తపల్లెలుగా

విడిపోయాయి. ఈ బలిజలకు చెందిన వారే ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ కట్టా నరసింహులు. తెలుగు పండితునిగా, కడపలోని సి.పి. బ్రౌన్, భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా టి.టి.డి ప్రచురణలు విభాగంలో సలహాదారునిగా పనిచేశారు. బ్రౌన్ గ్రంథాలయంలో 200 తాళపత్రాలు, రాగి నాణేలు ఉన్నాయి.

సురభి

ఎంతో అందమైన పేరు గల సురభి గ్రామం వై.ఎస్.ఆర్.కడప జిల్లా చక్రాయపేట మండలంలో ఉంది. ఈ గ్రామం తొలి పేరు సొరుగు. కాలక్రమంలో సురభి అనే నామకరణం చేయడం వెనుక గల విశేషాన్ని పరిశీలిస్తే... 1885లో ఈ గ్రామంలో జరిగిన ఓ పెళ్లి సందర్భంగా సురభి నాటక సమాజాన్ని ఆహ్వానించారు. తోలు బొమ్మలను ఉపయోగించి ప్రదర్శించే ఈ బృందం ప్రజల కోరిక మేరకు ప్రత్యక్ష నాటకంగా కీచక వధను ప్రదర్శించారు. సురభి థియేటర్స్ పక్షాన వనారస గోవిందరావు అధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శనను ప్రేక్షకాదరణ లభించింది. ఇదే గ్రామంలో స్థానిక ప్రముఖులు రామిరెడ్డి, చెన్నారెడ్డి ఈ బృందానికి మరింత ప్రాపీణ్యం లభించేందుకు అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి ప్రముఖ శిక్షకుడు రాప్తాటి సుబ్బదాసును రప్పించి సేవలందించారు. ఈ బృందానికి రెండతస్తుల మేడను ఉచితంగా సమకూర్చారు. ఈ గ్రామాల వల్లనే సురభి కీర్తి మరింత ఇనుమడించింది. కేవలం మూడేళ్ల పాటు వారు ఈ పల్లెలో నివాసం ఉన్నారు. దీంతో గ్రామీణుల ఆనందంలో తమ పల్లెకు సురభి అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని థియేటర్ డైరెక్టర్ జయచంద్రవర్మ తెలిపారు. ప్రస్తుతం ఈ గ్రామంలోని సురభి కళాకారులు ఎవ్వరూ లేరు.

వీరంతా తెలంగాణలోని శేరిలింగంపల్లి, నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో స్థిరపడ్డారు. ఈ గ్రామ జనాభా 6804.

గోపవరం

గోపవరం ప్రొద్దుటూరు మండలంలోని పంచాయితీ కేంద్రం. ఆ రోజుల్లో గోవుల సంఖ్య గణనీయంగా ఉండేది. అంచేత గ్రామీణులు ఈ గ్రామానికి గోపవరం అని పేరు పెట్టారు. గోవుల నుంచి వచ్చే వెన్న, నేతిని ఇక్కడ నుంచి మిలిటరీకి ఎగుమతి చేసేవారు. అయితే ప్రస్తుతం గోవ్యుల సంఖ్య బాగా తగ్గిపోయింది. గేదెల పెంపకం ఎక్కువైంది. మొత్తం మీద నాటి నుంచి నేటి వరకూ పాడి పరిశ్రమ విస్తరించడం ఈ గ్రామం ప్రత్యేకత.

నరసింహపురం

నరసింహపురం కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలో ఉంది. ఇది పెన్నా నది ఒడ్డున ఉంది. ఈ ప్రాంతంలో లభ్యమైన లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి 4 శతాబ్దాల చరిత్ర ఉంది. నరసింహస్వామి పేరు మీదుగా నరసింహపురం ఏర్పాటైంది. ఇక్కడ గల ఆంజనేయస్వామి సన్నిధిలో ఆంజనేయునికి ఎదురుగా అతని వాహనమైన ఒంటె దర్శనమిస్తుంది. ఇక ఈ పల్లెలో తొగట వీర క్షత్రియ సామాజిక దర్గం వారు చేనేత వస్త్రాలను ఎంతో నైపుణ్యంతో తీర్చిదిద్దారు.

దొరసానిపల్లె

దొరసానిపల్లె ప్రొద్దుటూరు మండలంలోని ఓ విశిష్ట గ్రామం. పెన్నా నది ఒడ్డున ఉంది. క్రీ.శ 1880 - 1890 కాలంలో ఓ మహిళా అధికారిణి ఆంగ్లేయుల పక్షాన జనరంజక పాలనను అందించారు. ఆమెను అందరూ దొరసానమ్మగా పిలిచేవారు. పెన్నానదికి వరదలు సంభవించడంతో ప్రజలు నిర్వాసితులయ్యారు. దీంతో దొరసానమ్మ ఆంగ్లేయ ప్రభువులకు ప్రాతినిధ్యం జరిపి సుమారు 30 ఇళ్లు నిర్మింపజేసారు. ఆమె పదవీ విరమణ చేసిన తరువాత ఇక్కడే స్థిరపడ్డారు. ఆమె మృతి చెందిన తరువాత ప్రజలు సమాధిని ఏర్పాటు చేశారు. ఆయితే కాలగమనంలో సమాధి అంతరించిపోయింది. తొలుత ఈ గ్రామానికి మునియ్య అనే చేనేత కార్మికుడు కుటుంబంతో సహా ఈ గ్రామానికి నరసింహపురం నుంచి వలస వచ్చారు. ఈ తరువాత అనేక చేనేత కుటుంబాలు, రెడ్డి సామాజిక వర్గం వారు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన పల్లె ఇది. 1970 ప్రాంతంలో చీరలకు రంగులు, అద్దకం వేసే చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. అయితే ప్రస్తుతం రెండు మూడు పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. ఈ పల్లెలో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నట్టు వృద్ధ చేనేత కార్మికుడు వరదయ్య, ప్రముఖ వాణిజ్యవేత్త గంగుల వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు.

కాకులవరం

కాకులు తొలి పదంగా ఉన్న గ్రామాల్లో కడప జిల్లాలోని లక్ష్మీ రెడ్డి పాలెం మండలంలోని కాకుల వరం అనే గ్రామం ఉంది. సేవా భావానికి ప్రతీకగా ఉన్న కాకులను వరంగా భావించి ఈ పల్లెకు ఆ పేరు పెట్టారు.

చౌడూరు

చౌడూరు ప్రొద్దుటూరు మండలంలో ఉంది. చౌడు భూములు ఎక్కువగా ఉన్నందున చౌడు, ఊరు అని పేరు పెట్టారు. జనవ్యవహారంలో చౌడూరుగా మారింది. ఇదే పేరు స్థిరపడింది. చౌడు భూములైనందున వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతం విద్యాపరంగా గణనీయమైన ప్రగతి సాధిస్తోంది.

చినఓరంపాడు

చినఓరంపాడు గ్రామం ఓబులవారిపల్లి మండలంలో ఉంది. తొలుత ఓరంపాడుగా ఉండేది. కాలక్రమంలో పెదఓరంపాడు, చినఓరంపాడు గ్రామాలుగా విడిపోయాయి. పెదఓరంపాడు కన్నా చినంఓరంపాడు గ్రామం జనాభాలో పెద్దది. ఓరంపాడుకు ఆ పేరు ఎలా వచ్చిందంటే గ్రామం ఏర్పాటు చేసినపుడు ఓంపాడుగా పెట్టారు. అయితే జనవ్యవహారంలో ఓరంపాడుగా రూపాంతరం చెందింది. ఉత్తర పదంగా పాడు ఎలా వచ్చిందంటే జైనులు ఈ ప్రాంతంలో కొన్నాళ్లు గడిపినందున 'పాడు'అనే పదం చేరింది. జైన సంచార ప్రదేశాలలో చివరి పదంగా చేరడం సాధారణమే. చిన ఓరంపాడులో డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

దేవగుడి

దేవగుడి కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని ఓ గ్రామం. జమ్మల మడుగు నుంచి 11 కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామంలో అత్యంత పురాతన తలకంటమ్మ దేవి గుడి ఉంది. దేవి గుడి ఉన్న

స్థలం కావడంతో ఈ గ్రామానికి దేవిగుడి అని పేరు పెట్టారు. జన వ్యవహారంలో జనవ్యవహారంలో దేవగుడిగా స్థిరపడిరది. కాగా ఈ ఆలయ ప్రాంగణంలో క్రీ.శ 13వ శతాబ్దానికి చెందిన కొన్ని శాసనాలు ఉన్నాయి. పురాతన తెలుగు లిపిలో ఉన్న ఓ శాసనంలో రామరాజు కుమారుడు చినతిమ్మయ్య దేవ చెన్నూరు ప్రాంతంలోని బంగల గ్రామానికి చెందిన ఓ బ్రాహ్మణునికిచ్చిన భూదాన ప్రస్తావన ఉంది. శాసనం పై భాగంలోని చక్రం, దానికి ఇరువైపుల సూర్య, చంద్రులు చెక్కిన దృశ్యాలున్నాయి.

సిద్ధారెడ్డిపల్లి

సిద్ధారెడ్డిపల్లి చక్రాయపేట మండలంలో ఉంది. ఇది ఎర్రబొమ్మపల్లి పంచాయితీలో ఉంది. ఇది పాపాఘ్ని నది ఒడ్డున ఉంది. సిద్ధారెడ్డి అనే మోతుబారి పేరుతో ఈ పల్లెకు ఆ పేరు వచ్చింది. వేంపల్లె పట్టణానికి 18 కి.మీ దూరంలో ఉంది.

ఇనగలూరు

ఇనగలూరు తొండూరు మండలంలో ఓ గ్రామం. నాడు రాజరిక పాలనలో ఉండడంతో దీనికి ఎంతో కొంత చారిత్రక పరిస్థితి ఉండేది. ఇక్కడ ఏనుగులను ఉంచేందుకు గాదెను, ఓ స్థలాన్ని కేటాయించారు. దీంతో ఈ ప్రాంత జనావాసానికి తొలుత ఏనుగులూరు అని పేరు పెట్టారు. ఇది కాలక్రమంలో ఇనగలూరు అయింది. గ్రామ జనాభా 1997.

గాలివీడు

గాలివీడు ఓ మండల కేంద్రం. ఈ ప్రాంతంలో కొండలు ఎక్కువగా ఉండడంతో గాలి బాగా వీస్తుంది. కాగా వీడు అంటే పట్టణం అని అర్థం. ఈ విధంగా గాలివీడు పేరు వచ్చింది. ఈ మండల కేంద్రానికి పాపాఘ్ని నదిపై వెలిగల్లు ప్రాజెక్టు నిర్మించారు. గాలివీడు జనాభా 14వేలు.

ఆరవీడు

ఆరవీడు గ్రామం గాలివీడు మండలంలో ఉంది. విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన ఆరవీడు వంశీయులు (క్రీ.శ 1542 - 1646) పేరుతోనే ఈ గ్రామం ఏర్పాటైంది. వీరిపై ఉన్న గౌరవాభిమానాలతో తమ గ్రామానికి ఆరవీడు అని నామకరణం చేసుకున్నారు. ఈ పాలకుల్లో కొందరు తమ రాజ్య వ్యవహారాల కోసం ఈ గ్రామాన్ని అడపాదడపా సందర్శించేవారు. కాగా ఆరవీడు ఇంటి పేరుతో పలు కుటుంబాలు ఇక్కడ ఉండటం విశేషం.

కందులవారి పల్లి

కందులవారిపల్లి కడప జిల్లా చిట్వేలు మండలంలోని ఓ గ్రామం. కమ్మ సామాజిక వర్గానికి చెందిన 'కందుల రామానాయుడు' అనే వ్యక్తి ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశాడు.

చక్రాయపేట

చక్రాయపేట ఓ మండల కేంద్రం. ఇది వ్యక్తి నామ సూచి. చక్రయ్య అనే వ్యక్తి పేరుతో ఏర్పాటైంది. ఇక ఇదే జిల్లాలోని రాజంపేట

మండలంలోని చలంపాలెం పల్లె కూడా వ్యక్తి నామధేయ సూచిగా గ్రహించవచ్చు.

పెద్దనపాడు

పెద్దనపాడు గ్రామం ఎర్రగుంట్ల మండలంలో ఉంది. క్రీ.శ 16వ శతాబ్దానికి చెందిన మను చరిత్ర ప్రబంధకర్త అల్లసాని పెద్దన స్వగ్రామం ఇది. పెద్దన పేరుతోనే ఈ గ్రామం ఏర్పడిరదని స్థానికులు వివరిస్తున్నారు. కృష్ణదేవరాయలు అష్ట దిగ్గజ కవుల్లో అగ్రతాంబూలం పొందిన పెద్దన కోకట గ్రామాలను పొందాడు. కోకట గ్రామం ప్రక్కనే పెద్దనపాడు ఉంది. కాగా అల్లసాని పెద్దన స్వగ్రామం చౌడూరు అని కొందరు చెబుతారు. అయినప్పటికీ పెద్దనపాడు గ్రామమే ఆయన స్వస్థలమనే వాదనను పరిశోధకులు పేర్కొంటున్నారు.

రామిరెడ్డిపల్లి

రామిరెడ్డిపల్లి జమ్మలమడుగు మండలంలో ఉంది. రామిరెడ్డి అనే భూస్వామి ప్రాబల్యంతో ఈ గ్రామానికి రామిరెడ్డిపల్లి అనే పేరు వచ్చింది.

భీమగుండం

భీమగుండం గ్రామం ఇతిహాసంలో ముడిపడి ఉంది. ఇది కడప జిల్లా పెద్దముడియం మండలంలో ఉంది. పాండవులు వనవాసంలో ఉండగా ద్రౌపది భీముణ్ణి నీళ్లు తీసుకొని రమ్మని చెబుతుంది. రాతిమయమైన ఆ ప్రదేశంలో నీరెక్కడా లభించలేదు. అప్పుడు భీముడు తన గదతో ఓ ఏకశిలను 101 ముక్కలుగా చేసి భూమి నుండి నీరు

తెప్పించాడు. ఆ నూటొక్క పగుళ్లు 101 గుండాలుగా మారాయని ఐతిహ్యం. అంచేత ఈ ఊరికి భీమగుండం అనే పేరు వచ్చింది. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆయన సంస్మరణార్థం ప్రజలు ఓ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి శివరాత్రికి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు.

బలిజపల్లి

బలిజపల్లి కలశపాడు మండలంలో ఉంది. ఓ మారుమూల పల్లె. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఈ ప్రాంతంలో ఓ కొండను ఆనుకొని పాత ఊరు ఒకటి ఉండేది. అక్కడ పలు అంటు వ్యాధులు ప్రబలి అనేక మంది చనిపోయేవారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఆ జానపదంలోని బలిజ సామాజిక దర్గంలోని కొందరు కొద్ది కిలోమీటర్ల దూరంలో ఓ పల్లెను నిర్మించుకున్నారు. బలిజలు తమ సామాజిక వర్గం పేరు కలిసొచ్చే విధంగా బలిజపల్లి అని తమ గ్రామానికి పేరు పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం బలిజ సామాజిక వర్గానికి చెందిన ఇళ్లు మూడు, నాలుగు మాత్రమే ఉన్నాయి. బోయ సామాజిక వర్గం వారు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. ఈ పల్లె శంఖవరం పంచాయితీలో ఉంది. ప్రముఖ శతక రచయిత, తెలుగు పండితుడు కుందారపు గురుమూర్తి ఈ పల్లెకు చెందినవారే.

మక్కావారిపల్లి

మక్కావారిపల్లి ఓబులవారిపల్లి మండలంలో ఉంది. ఇంటి పేర్లతో వచ్చిన గ్రామాల్లో ఇదొకటి. ముక్క అనే ఇంటి పేరుతో ఉన్న కుటుంబాల వారు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. ఆ కుటుంబాల వారే తొలుత గ్రామాన్ని

ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దీనికి ముక్కవారిపల్లి అనే పేరు వచ్చింది. ఇక్కడ తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం ఉంది. దీనికి అవసరమైన స్థలాన్ని డాక్టర్ రంపా బలరామశెట్టి ఉదారంగా ఇచ్చారు. ఈ పల్లె తిరుపతి - కడప రహదారిలో ఉంది.

నారాయణవారి నెల్లూరు

నారాయణ వారి నెల్లూరు కడప జిల్లాలో పెనగలూరు మండలంలో ఉంది. వ్యక్తి నామ ధేయంగా నారాయణ అనే పేరు వచ్చింది. అయితే నెల్లూరు అనే పేరు చివరి పదంగా రావడానికి గల కారణం ఇది. నెల్లూరు రకం వరి ఇక్కడ పండిస్తారు. దీంతో నెల్లూరు ఉత్తర పదంగా చేరింది. పుల్లంపేట వద్ద గల పుల్లంగి ఏరు నుంచి ఇక్కడ గల అచ్చిరాల మడుగుకు నీళ్లు వస్తాయి. ఈ సాగు నీటితో వరి పంట ఇక్కడ పుష్కలంగా పండుతోంది.

పెద్ద చెప్పలి, చిన్న చెప్పలి

పెద్ద చెప్పలి, చిన్న చెప్పలి గ్రామాలు కడప జిల్లా కమలాపురం మండలంలో ఉన్నాయి. కమలాపురానికి దక్షిణాన కనుచూపు మేరలో ఉన్నాయి. అన్నదమ్ముల పేర్లతో ఈ పల్లెలు ఏర్పాటయ్యాయి. ఉత్తర భారతం నుంచి పోకనాటి కాపులైన ముగ్గురు అన్నదమ్ములు ఈ ప్రాంతానికి వచ్చి అడవి నరికి ఇళ్లు నిర్మించుకున్నారు. క్రమేపీ మిగతా ప్రాంతాల నుంచి మరికొంత మంది వచ్చి ఇళ్లు ఏర్పాటు చేశారు. ఇలా చెప్పలి పల్లె ఏర్పాటైంది. చెప్పలి గ్రామం నిర్మాతలైన అన్నదమ్ముల్లో రెండోవాడు విడిపోయి పక్కనే మరో గ్రామం నిర్మించుకున్నారు. ఇది చిన్న చెప్పలి అయింది.

చెప్పలి గ్రామం నిర్మిస్తున్నప్పుడే, చెట్లు నరికేటప్పుడు అక్కడ పుట్టను తవ్వుతున్న సమయంలో పానపట్టం, శివలింగం కనిపించాయి. ఈ విషయం తెలుసుకున్న వడ్డిరాజు స్పందించాడు. వెంటనే ఇక్కడ గుడి కట్టించాడు. బ్రాహ్మణులను అర్చకులుగా నియమించాడు. ఈ స్థలాన్ని అగస్త్యాశ్రమమని అంటారు. అంచేత శివున్ని అగస్తేశ్వరస్వామి అని పిలుస్తారు. చోళరాజు ఈ ప్రాంతాన్ని సందర్శించి శివాలయానికి దక్షిణంగా చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించాడని మెకంజీ కైఫీయత్తు వల్ల తెలుస్తోంది. పెద్ద చెప్పలి జనాభా 5368. చిన్న చెప్పలి జనాభా 4046.

నందిమండలం

నందిమండలం అనే పల్లె నందీశ్వర స్వరూపంగా పేర్కొంటారు. గ్రామం ఏర్పాటైన తొలినాళ్లలో నందులు (ఎద్దులు) ఎక్కువగా ఉండేవి. వీటిని నందీశ్వర ప్రతిరూపంగా భావించి ప్రజలు వాటి నుదుట పసుపు, కుంకుమ పెట్టి పూజించే వారు. ఈ ప్రభావంతో తమ పల్లెకు నందిమండలం అని పేరు. అలాగే ఇక్కడకు 5కి.మీ దూరంలో ఉన్న సంగమేశ్వరాలయంలోని నందిని దృష్టిలో ఉంచుకొని కూడా ఈ పేరు పెట్టి ఉండవచ్చునని సీనియర్ గణాంకాధికారి ఎం.వి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ గ్రామం పాపాఘ్ని నది తీరంలో ఉంది. గ్రామ జనాభా 9574.

రాయచోటి

రాయచోటి కడప జిల్లాలో పెద్ద పట్టణాలలో ఒకటి. ఈ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే... దీని తొలి పేరు 'రాచవీడు'. కాలక్రమంలో

రాయచోటిగా మారింది. గ్రామీణులు రసీదు అని పిలుస్తారు. మాండవ్య నదీ తీరంలో కడప - చిత్తూరు రహదారిలో నెలకొని ఉంది. ఇక్కడ తెలుగు, ఉర్దూ మాట్లాడుతారు. పట్టణంలోని పురాతన వీరభద్రస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతీ ఏటా మార్చి నెలలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుపుతారు. రాజరాజ చోళుడు, కాకతీయ గణపతి దేవుడు, శ్రీ కృష్ణ దేవరాయలు ఈ ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులు నిర్వహించినట్టు శాసనాలు పేర్కొంటున్నాయి. గ్రామ దేవత ఎల్లమ్మ దర్శించిన తరువాత వీరభద్రునికి పూజలు జరుపుతారు. రాయచోటిని అనేక రాజులు, సుల్తానులు పాలించారు.

దేవతాపురం

దేవతాపురం సింహాద్రిపురం మండలంలో ఉంది. గ్రామ జనాభా 150 మాత్రమే. దేవుళ్లపై ఉన్న అపారమైన భక్తితో తమ పల్లెకు దేవతాపురం అని నామకరణం చేశారు. ఇక్కడ రామాలయం, ఆంజనేయ ఆలయాలున్నాయి.

లేటపల్లి

లేటపల్లి కడప జిల్లా కమలాపురం మండలంలోని ఓ గ్రామం. దీని తొలి పేరు వేటపల్లి. లోకవ్యవహారంలో లేటపల్లిగా మారింది. గ్రామం పేరు నేపథ్యాన్ని పరిశీలిస్తే.... కమలాపురానికి నైరుతి భాగంలో అత్యంత సమీపంలో పాపాఘ్ని నదికి ఉత్తరంగా వేటగాళ్లు అడవిని నరికారు. వేట కోసం ఓ ఊరు నిర్మించుకున్నారు. దీంతో ఆ పల్లెకు వేటపల్లె అనే పేరు వచ్చింది. జనం నోళ్లలో లేటపల్లి అయింది. మెంకజీ కైఫీయత్తులో ఈ విషయం స్పష్టమైంది.

ముక్కావారిపల్లి

ముక్కావారి పల్లి కడప జిల్లాలోని ఓబులవారిపల్లి మండలంలో ఉంది. ఇంటి పేర్లతో వచ్చిన గ్రామాల్లో ఇదొకటి. ముక్క అనే ఇంటి పేరుతో ఉన్న కుటుంబాల వారు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. ఆ కుటుంబాల వారే తొలుత గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దీనికి ముక్కవారిపల్లి అనే పేరు వచ్చింది.

ఎర్రగుంట్ల

యర్రగుంట్ల కడప జిల్లాలోని నగర పంచాయితీ కేంద్రం. పారిశ్రామిక పట్టణంగా అభివృద్ధి చెందుతోంది. ఇంతకీ ఆ బస్తీకి ఆ పేరు ఎలా వచ్చిందంటే... యర్రగుంట్ల అంటే ఎర్రని రంగులో ఉన్న నేల అని అర్థం. అంచేత దీనికి యర్రగుంట్ల అనే పేరు వచ్చింది. ఇక్కడ బావులు తవ్వితే ముందుగా ఎర్రమట్టి, ఆ తరువాత సుద్ద వస్తాయని గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త కోనేటి జయరామయ్య పేర్కొన్నారు. ఇక్కడ నాపరాళ్ల గనులు, వీటిని పాలిష్ చేసే యంత్రాలు ఉన్నాయి.

సింహాద్రిపురం

సింహాద్రిపురం పులివెందుల అసెంబ్లీ నియోజకరవర్గంలో ఓ మండలలో ని గ్రామం. తొలుత జగన్నాథపురం, విశ్వనాథపురం అనే రెండు జంట గ్రామాలు విలీనమై సింహాద్రిపురంగా రూపుదాల్చింది. నాటి ఆంగ్లేయ కలెక్టర్ మన్రో చొరవతో ఏకీకృతమైనట్టు స్థానిక ప్రముఖులు, వై.సి.పి రైతు విభాగం ప్రధాన కార్యదర్శి వెన్నపూస అరవిందనాథరెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం పేరు రావడానికి కాస్త చరిత్ర ఉంది. అప్పట్లో జగన్నాథపురం వైష్ణవులకు కాణాచి.

కాగా విశ్వనాథపురం శైవులకు ఆటపట్టు. ఇరుగుపొరుగు ఉన్న ఈ గ్రామాలవారు తరచూ కోట్లాడు కొనేవారు. అయితే జగన్నాథపురంలో ఉన్న గ్రామ కరణం సింహాద్రి బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప సిద్ధాంతి. జ్యోతిష శాస్త్ర నిష్ణాతుడు ఆయుర్వేదంలో అందెవేసిన చేయి. దీంతో ఆయన వద్దకు ఎందరో ప్రముఖులు గుర్రాలపై అతని ఇంటికి వచ్చేవారు. అయితే ఇరుగు, పొరుగు గ్రామాలైన ప్రజలు తరచూ వివాదాలతో, ద్వేషాలతో ఉండడం చూసి సింహాద్రి చలించిపోయారు. ఐక్యతకు ఎంతో కృషి చేశారు. ఆయన ప్రతిపాదనలకు పరిగణలోకి తీసుకొని నాటి కలెక్టరు రెండు గ్రామాలను విలీనం చేశారు. సింహాద్రిపురం ఇలా అవతరించింది. ఇక్కడ వేణుగోపాలస్వామి ఆలయం, మల్లేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.

నగరిపాడు

నగరిపాడు గ్రామం చిట్వేలు మండలంలో ఉంది. నగరి అంటే సాధారణంగా పట్టణాలని పేర్కొనడం సహజం. అయితే ఈ గ్రామ ప్రస్తావనలో మాత్రం నగరి అంటే ఓ రకమైన గడ్డి మొక్కగా భావించాలి. పాడు అంటే పాటి నేలగా గ్రహించాలి. అలాగే ఒకప్పుడు ఉండి పాడయిపోయిన తరువాత మళ్లీ నిర్మాణం చేసిన గ్రామానికి చివర పాడు అని చేరడం కద్దు. నగరి పాడు ప్రజలు శాంతియుతంగా వ్యవహరిస్తుంటారు. గ్రామ జనాభా 6వేలు. ఇక్కడ రంగనాథస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. రంగనాయకుల స్వామిని వీరబ్రహ్మేంద్రస్వామి వరప్రసాదంగా పేర్కొంటారు. ఈ ఆలయ చరిత్రను పరిశీలిస్తే క్రీ.శ 17వ శతాబ్దంలో జగ్గరాజు సతీమణి జగ్గమ్మలు ఈ నగరి పాడును పాలించారు. వీరికి జన్మించిన వారే రంగరాజు

ఇడుపులపాయ

ఇడుపులపాయ వేంపల్లె మండలంలో ఉంది. పాపాఘ్ని నది తీరంలో ఉంది. ఈ నది శేషాచలం కొండలను చీలుస్తూ పాయగా ఇక్కడ ప్రవహిస్తోంది. ఇక్కడి గండి ఆంజనేయస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఘాట్, రాజీవ్ గాంధీ ట్రిపుల్ ఐ.టి, నెమళ్లు జింకల సంరక్షణ కేంద్రం ఉన్నాయి. ఇక్కడ రామ కృష్ణానందస్వామి స్థాపించిన ఆశ్రమం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఈ ఆశ్రమాన్ని మాతృశ్రీ మాతాజీ సమర్థంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రముఖులు పోతిరెడ్డి నరసింహులు తెలిపారు.

అగ్రహారం

అగ్రహారం గ్రామం సింహాద్రిపురం మండలంలో ఉంది. వైదిక బ్రాహ్మణులకు నాటి జమీందారులు, సంపన్నులు దానమిచ్చిన ప్రాంతమిది. అంచేతనే ఈ పల్లెకు అగ్రహారం అనే పేరు వచ్చింది. గ్రామ జనాభా వెయ్యి. రామాలయం, సాయిబాబా మందిరం ఉన్నాయి. నారింజ, పల్లీలు, కుసుమలు ఇక్కడ పండిస్తారు.

కొండూరు

కొండూరు గ్రామం పెండ్లిమర్రి మండలలంలోని ఓ గ్రామం. ఈ గ్రామం చుట్టూ కొండలున్నాయి. దీంతో ఈ పల్లెకు కొండూరు అనే పేరు వచ్చింది. ఈ పల్లె పాపాఘ్ని నదికి సమీపంలో ఉంది.

అంకాలమ్మ గూడూరు

అంకాలమ్మ గూడూరు సింహాద్రిపురం మండలంలోని ఓ ముఖ్య గ్రామం. అంకాలమ్మ గ్రామ దేవత పేరుతో ఈ ఊరికి ఆ పేరు వచ్చింది. అంకాలమ్మకు గూడు నిర్మించిన ఊరు కావడంతో చివరి పదంగా గూడూరు చేరింది. ప్రతి ఏటా శ్రీరామనవమి ముగిసిన తరువాత 3 వారాల పాటు ఆది, గురు వారాల్లో అంకాలమ్మ జాతర అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. ఎడ్ల పందేలు భారీ ఎత్తున జరుపుతారు.

వేంపల్లె

వేంపల్లె పులివెందుల అసెంబ్లీ నియోకవర్గంలో ఉంది. ఈ గ్రామానికి ఆ రోజుల్లో భాస్కర క్షేత్రమని పిలిచేవారు. ఇంతకీ వేంపల్లె ఆ పేరు ఎలా వచ్చిందంటే వేము అంటే వేప చెట్లు. ఇక్కడ వేపచెట్లు అధికంగా ఉండడంతో వేంపల్లె పేరు వచ్చింది. ఇది పాపాఘ్ని నది సమీపంలో ఉంది. ఈ గ్రామాన్ని గతంలో కబీర్ అహ్మద్ పాలించారు.

పోరుమామిళ్ల

పోరుమామిళ్ల కడప జిల్లాలోని అతిపెద్ద మండల కేంద్రం. యుద్ధాలకు (పోరు) వెళ్లేటప్పుడు ఈ ప్రాంతంలోని మామిడి తోటల్లో విజయనగర వంశీయులైన రాజులు బసచేసేవారు. అంచేతనే పోరుమామిళ్ల అని ఈ గ్రామానికి పేరు వచ్చింది. ఈ ప్రాంతంలోని పోరు మామిళ్ల చెరువుకు చరిత్రలో అనంత రాజ సాగరమని పేరు. క్రీ.శ 1369 అక్టోబరు 15న విజయనగర ప్రభువులైన మొదటి బుక్కరాయలు కుమారుడు భాస్కరుడు వేయించిన పోరుమామిళ్ల శాసనంలో ఈ చెరువు ప్రత్యేకతలను వివరించి ఉంది. ఈ చెరువు కట్ట 11 కి.మీ పొడవు, 13

కి.మీ వెడల్పు, 12 మీటర్ల ఎత్తు కలిగి ఉంది. ఈ చెరువు సముద్రాన్ని తలపిస్తోంది. పోరుమామిళ్ల లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం విజయనగర రాజుల కాలంలో నిర్మించారు.

గారాల మడుగు

గారాలమడుగు పుల్లంపేట మండలంలోని ఓ గ్రామం. గార అంటే ఒక చెట్టు. నల్లరేగడి నేలల్లో ఎత్తుగా పెరిగే మొక్క. మడుగు అంటే చెరువు అని అర్థం. ఈ రెండు పదాలతో గారాల మడుగు అనే గ్రామం ఏర్పాటైంది.

అత్తిరాల

అత్తిరాల రాజంపేట మండలంలో ఉంది. రాజంపేటకు 5 కి.మీ దూరంలో ఉంది. ఇతిహాసాల ప్రకారం పరశురాముడు తన తండ్రి జమదగ్ని మాట ప్రకారం తల్లిని హత్య చేశాడు. అందుకే హత్యరాల అయింది. క్రమంగా అత్తిరాలగా మారింది. తల్లిని చంపిన పాపానికి ప్రాయశ్చిత్తంగా పరశురాముడు బాహుదా నదిలో స్నానం చేసి ఇక్కడ ఉన్న త్రేతేశ్వర స్వామిని సేవించాడు. తన చేతి కంటిన పాపం పోగొట్టిన ఈ నదికి చెయ్యేరు అని పేరు వచ్చింది. ఇక్కడి పరశురామాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం గోడలపై చోళ రాజుల కాలం నాటి తమిళ శిలాశాసనం కూడా ఉంది.

అల్లాడుపల్లి

అల్లాడుపల్లి చాపాడు మండలంలో ఉంది. మైదుకూరుకు 6, ప్రొద్దుటూరుకు 14 కి.మీ దూరంలో కుందునది తీరంలో ఉంది.

ఈ నదికి తరచూ వరదలు వచ్చేవి. దీంతో ప్రజలు కష్ట, నష్టాలలో అల్లల్లాడుతుంటే గ్రామానికి అల్లాడుపల్లి అనే పేరు వచ్చింది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన వీరభద్రస్వామి ఆలయాన్ని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి స్వయంగా శిల్పించి ప్రతిష్టించిన గొప్ప ఆలయం ఇది.

పోలి

పోలి అనే త్యాగధనురాలు పేరుతో ఏర్పాటైన గ్రామం ఇది. ఈ గ్రామం కడప జిల్లా రాజంపేట మండలంలో ఉన్నది. ఈ పేరు వెనుక చరిత్రను పరిశీలిస్తే.... పన్నెండో శతాబ్దంలో ఈ ప్రాంతంలో ఉడుమూరు, కొండూరు అనే పల్లెలు ఉండేవి. కొండూరు గ్రామం కాటమరెడ్డి పాలనలో ఉండేది. కొండూరు గ్రామీణులు ఒకసారి బండిపై ఉడుమూరు మీదుగా వెళ్తుంటే అక్కడ ఉడుమూరుకు చెందిన వృద్ధురాలు బండి కింద పడి మరణిస్తుంది. దీంతో ఉడుమూరు వారు కొండూరు మీద దాడి చేసి, ఆ గ్రామాన్ని ధ్వంసం చేస్తారు. కాటమరెడ్డిని, ఆయన భార్యను చంపి వారి కొడుకు కోసం వెతుకుతారు. వారింటిలోని వంటమనిషి, చంకల్లో ఇద్దరు బిడ్డలు కనిపిస్తారు. వారు ఆమెను గద్దిస్తే ఒక చంకపై ఉన్న బిడ్డనిచ్చి వీడు కాటమరెడ్డి కొడుకంటుంది. వారు ఆ బిడ్డను నరికి వెళ్లిపోతారు. తన బిడ్డను పోగొట్టుకొని, దొరబిడ్డను కాపాడిన వంట మనిషి పేరు పోలి. బిడ్డను యుక్త వయసు వచ్చే వరకు పెంచి మేనమామలకు అప్పగిస్తుంది. పోలి త్యాగ ఫలంగా పెరిగిన ఆ యువకుని పేరు వెంకటరెడ్డి. మేనమామలు ఉడుమూరు మీద దాడి చేసి ప్రతీకారం తీర్చుకుంటారు. పోలి సూచన మేరకు కాటమరెడ్డి ఇంట్లో పాతిపెట్టిన ధనాన్ని తెచ్చుకుంటారు. త్యాగమయిగా చరిత్రలో నిలిచిన పోలి పేరుతో తమ గ్రామానికి అప్పట్లో నామకరణం చేసినట్లు

స్థానికుడైన పోలి శివరామిరెడ్డి తెలిపారు. పోలి పేరు కలిసొచ్చే విధంగా తమ వంశీకులంతా తమ ఇంటి పేరును పోలిగా మార్చుకున్నారు. ఈ పల్లెలో హాలాహల నందీశ్వరాలయం, వరదరాజస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి.

శెట్టిగుంట

శెట్టిగుంట రైల్వేకోడూరు మండలంలోని ఓ గ్రామం. ఈ పల్లె క్రీ.శ16వ శతాబ్దంలో ఏర్పాటైనట్లు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. సిద్ధవటానికి చెందిన చేరిశెట్టి అనే యాత్రికుడు తిరుమల - తిరుపతికి కాలినడకన వెళ్లే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ ఓ కుంటను తవ్వించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని శెట్టికుంట అని పిలవ సాగారు. అక్కడే నాలుగు కుటుంబాల వారు బాటసారులను అవసరమైన దినుసులు విక్రయించకుంటూ జీవించేవారు. క్రమంగా జనావాసాలు పెరిగాయి. లోకవ్యవహారంలో శెట్టెకుంట, శెట్టిగుంటగా మారింది. ప్రస్తుతం గ్రామ సమీపంలో ఆకుంట చెరువుగా విస్తరించింది.

కలమల్ల

కలమల్ల ఎర్రగుంట్ల మండలంలోని ఓ గ్రామం. చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్లె ఇది. క్రీ.శ. 575లో రేనాటి పాలకులైన ధనుంజయుడు వేయించిన తొలి శాసనం ఈ పల్లెలో లభించింది. అయితే అది నకలు మాత్రమే. దీనికి మూలమైన శాసనం గల బండను ఇక్కడి చెన్నకేశవస్వామి ఆలయంలో 2022 జనవరి8న గుర్తించి భారత పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఇంతటి ప్రశస్తి ఉన్న ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే కల్ అంటే రాయి అని అర్థం. పల్లె

ఈ నదికి తరచూ వరదలు వచ్చేవి. దీంతో ప్రజలు కష్ట, నష్టాలలో అల్లల్లాడుతుంటే గ్రామానికి అల్లాడుపల్లి అనే పేరు వచ్చింది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన వీరభద్రస్వామి ఆలయాన్ని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి స్వయంగా శిల్పించి ప్రతిష్టించిన గొప్ప ఆలయం ఇది.

పోలి

పోలి అనే త్యాగధనురాలు పేరుతో ఏర్పాటైన గ్రామం ఇది. ఈ గ్రామం కడప జిల్లా రాజంపేట మండలంలో ఉన్నది. ఈ పేరు వెనుక చరిత్రను పరిశీలిస్తే.... పన్నెండో శతాబ్దంలో ఈ ప్రాంతంలో ఉడుమూరు, కొండూరు అనే పల్లెలు ఉండేవి. కొండూరు గ్రామం కాటమరెడ్డి పాలనలో ఉండేది. కొండూరు గ్రామీణులు ఒకసారి బండిపై ఉడుమూరు మీదుగా వెళ్తుంటే అక్కడ ఉడుమూరుకు చెందిన వృద్ధురాలు బండి కింద పడి మరణిస్తుంది. దీంతో ఉడుమూరు వారు కొండూరు మీద దాడి చేసి, ఆ గ్రామాన్ని ధ్వంసం చేస్తారు. కాటమరెడ్డిని, ఆయన భార్యను చంపి వారి కొడుకు కోసం వెతుకుతారు. వారింటిలోని వంటమనిషి, చంకల్లో ఇద్దరు బిడ్డలు కనిపిస్తారు. వారు ఆమెను గద్దిస్తే ఒక చంకపై ఉన్న బిడ్డనిచ్చి వీడు కాటమరెడ్డి కొడుకంటుంది. వారు ఆ బిడ్డను నరికి వెళ్లిపోతారు. తన బిడ్డను పోగొట్టుకొని, దొరబిడ్డను కాపాడిన వంట మనిషి పేరు పోలి. బిడ్డను యుక్త వయసు వచ్చే వరకు పెంచి మేనమామలకు అప్పగిస్తుంది. పోలి త్యాగ ఫలంగా పెరిగిన ఆ యువకుని పేరు వెంకటరెడ్డి. మేనమామలు ఉడుమూరు మీద దాడి చేసి ప్రతీకారం తీర్చుకుంటారు. పోలి సూచన మేరకు కాటమరెడ్డి ఇంట్లో పాతిపెట్టిన ధనాన్ని తెచ్చుకుంటారు. త్యాగమయిగా చరిత్రలో నిలిచిన పోలి పేరుతో తమ గ్రామానికి అప్పట్లో నామకరణం చేసినట్టు

స్థానికుడైన పోలి శివరామిరెడ్డి తెలిపారు. పోలి పేరు కలిసొచ్చే విధంగా తమ వంశీకులంతా తమ ఇంటి పేరును పోలిగా మార్చుకున్నారు. ఈ పల్లెలో హోలాహల నందీశ్వరాలయం, వరదరాజస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి.

శెట్టిగుంట

శెట్టిగుంట రైల్వేకోడూరు మండలంలోని ఓ గ్రామం. ఈ పల్లె క్రీ.శ16వ శతాబ్దంలో ఏర్పాటైనట్టు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. సిద్ధవటానికి చెందిన చేరిశెట్టి అనే యాత్రికుడు తిరుమల - తిరుపతికి కాలినడకన వెళ్లే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ ఓ కుంటను తవ్వించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని శెట్టికుంట అని పిలవ సాగారు. అక్కడే నాలుగు కుటుంబాల వారు బాటసారులను అవసరమైన దినుసులు విక్రయించకుంటూ జీవించేవారు. క్రమంగా జనావాసాలు పెరిగాయి. లోకవ్యవహారంలో శెట్టెకుంట, శెట్టిగుంటగా మారింది. ప్రస్తుతం గ్రామ సమీపంలో ఆకుంట చెరువుగా విస్తరించింది.

కలమల్ల

కలమల్ల ఎర్రగుంట్ల మండలంలోని ఓ గ్రామం. చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్లె ఇది. క్రీ.శ. 575లో రేనాటి పాలకులైన ధనుంజయుడు వేయించిన తొలి శాసనం ఈ పల్లెలో లభించింది. అయితే అది నకలు మాత్రమే. దీనికి మూలమైన శాసనం గల బండను ఇక్కడి చెన్నకేశవస్వామి ఆలయంలో 2022 జనవరి8న గుర్తించి భారత పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఇంతటి ప్రశస్తి ఉన్న ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే కల్ అంటే రాయి అని అర్థం. మలై

అనే తమిళ శబ్దం నుంచి మల వచ్చిందని జనవ్యవహారంలో మల్ల గా మారింది. అంటే ఇక్కడ రాళ్లు, రప్పలు కొండలున్న ప్రాంతమైనందున కలమల్ల గా పేరు వచ్చింది. ఇది కొండ పోరంబోకు ప్రాంతమని వి.ఆర్. వో రామాంజనేయులు తెలిపారు. గ్రామానికి పశ్చిమ దిశలో ఓ పెద్ద కొండ ఉంది. శ్రీశైలం థర్మల్ ప్రాజెక్టు కేంద్రం కూడా ఇదే.

ముత్తులూరు

ముత్తులూరుపాడు కడప జిల్లా ప్రాచీన గ్రామం. ఇది తొలుత ఒక అగ్రహారంగా ఉండేది. ఖాజీపేట చెంత ఉన్న నాగేశుని కొండపై ఆశ్రమ వాసం చేస్తున్న భరద్వాజునికి విజయనగర చక్రవర్తి బుక్కరాయలు ఈ ప్రదేశాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ప్రస్తుతం అగ్రహారంగా ఇచ్చాడు. ప్రస్తుతం గ్రామం ఉన్న ప్రదేశానికి తూర్పున మూడు గంగ మూర్తులను భరద్వాజుడు ప్రతిష్ట చేశాడు. అంచేత ఈ ప్రదేశానికి గంగ 'మూర్తుల అగ్రహారం' అన పేరు వచ్చింది. జనవ్యవహారంలో గంగలమూర్తులూరు చివరకు మూర్తలూరు పాడుగా స్థిరపడింది. క్రీ.శ 1365 నాటి శాసనం ఈ విషయాన్ని రుజువు చేస్తోంది. భరద్వాజుడు ఇక్కడ చెన్నకేశవ, ఆంజనేయ ఆలయాలను నిర్మించాడు. ■



ఉమ్మడి అనంతపురం జిల్లా

వజ్రకరూర్

పేరులోనే ఉన్నది పెన్నిధి అనే సూక్తి అక్షరాలా వర్తిస్తుంది ఈ ఊరికి. ఆ ఊరే వజ్రకరూర్. ఇది అనంతపురం జిల్లాలోని ఓ మండల కేంద్రం. సార్థక నామధేయంగా వర్ధిల్లుతోంది. దీని తొలి పేరు వజ్రాలూరు. అయితే కాలప్రవాహంలో జనవ్యవహారంలో వజ్ర కరూర్ గా మారింది. ఈ గ్రామ జనాభా ఎనిమిది వేలకు పైగా ఉంటుంది. ఈ ఊరి చరిత్రను మరో సిరాతో లిఖించాల్సిందే. ఇంతకీ ఆ మరో చరిత్ర ఏమిటో తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారా... ఇక తెలుసుకుందాం. తొలకరి వానలు కురిసేటప్పుడు జూన్, జులై నెలల్లో ఈ గ్రామానికి సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వచ్చి ఇసుకతో కూడిన ఎర్ర నేలలో లక్షల రూపాయలు విలువ చేసే రంగురాళ్లు, వజ్రాలు దొరుకుతుంటాయి. పొలాల్లో అడుగడుగునా అన్వేషణ జరుపుతుంటారు. ఏటా 20 నుంచి 25 వజ్రాలు లభిస్తుంటాయని స్థానికులు పేర్కొన్నారు. వజ్రాల వేటకు రాయలసీమ ప్రాంతం నుంచే కాకుండా బళ్లారి, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి వస్తుంటారు. రాయలసీమ ఒకప్పటి రతనాల సీమనే విషయాన్ని వజ్రకరూర్ గుర్తు చేస్తుంది. 1982లో కేంద్ర ప్రభుత్వం ఇక్కడ వజ్రాల కార్ఖానాను ఏర్పాటు చేసింది. మరో విశేషమేమిటంటే భారతీయ భూ వైజ్ఞానిక సర్వేక్షణ కేంద్రం కూడా ఇక్కడ నెలకొని ఉంది. ఇదిలా ఉండగా కర్నూలు జిల్లాలోని జొన్నగిరి,

పత్తికొండ, తుగ్గవి ప్రాంతాల్లో కూడా అక్కడి ఎర్రమట్టి నేల్లో ఈ వేట కొనసాగుతోంది.

కోమలి

కోమలి అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో ఉంది. గ్రామ నాభా 827. ఈ గ్రామాన్ని మహిళలే బాధ్యత తీసుకొని ఏర్పాటు చేసుకున్నారు. తమ ఆధిక్యతను చాటుకొనేందుకు గ్రామానికి కోమలి అని పేరు పెట్టుకున్నారు. తమ గ్రామానికి కోమలి అనే అందమైన పేరు ఉండడం గర్వకారణంగా ఉందని స్థానిక వస్త్ర వ్యాపారి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం. ఉన్నాయి. గుంటూరు జిల్లా పిట్లవానిపేట మండలంలో కూడా కోమలి పేరుతో ఓ గ్రామం ఉంది.

కడవకల్లు (కడవ కొలను)

కడవకల్లు గ్రామం అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో ఉంది. ద్విసహస్రావధాని, అవధాన సరస్వతి మాడుగుల నాగఫణిశర్మ స్వగ్రామం ఇదే కావడం విశేషం. ఈ పల్లె పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే అనేక విలక్షణాంశాలు కనిపిస్తాయి. 101 దిగుడు బావులు కడవ ఆకారంలో ఉండడంతో అప్పట్లో పెద్దలంతా సమావేశమై ఈ పల్లెకు కడవ కొలను అని నామకరణం చేసారు. అయితే ఆంగ్లేయుల పాలనా కాలంలో వారు కడవ కొలను పేరును సరిగా పలకలేక 'కడవకల్లు' గా పిలిచేవారు. చివరకు ఈ పేరే స్థిరపడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన మాడుగుల సుబ్రమణ్య శాస్త్రి ధృవీకరించారు. ఇక్కడి పెద్దమ్మ గుడికి ఎదురుగా ఉన్న దేవతల బావికి స్థానికులు పూజాదికాలను

జరుపుతుంటారని సి.ఆర్.వై. నారాయణస్వామి ఈ రచయితతో మాట్లడుతూ అన్నారు. కాగా ఇక్కడి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఓ శాసనం ఉంది. ఈ పల్లె ఆ రోజుల్లో మైసూరు సంస్థానంలో ఉండేది. అగ్రహారంగా ప్రసిద్ధి చెందింది. ఈ జానపదంలో ఓ కోట, బురుజు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. నాటి వైశ్య ప్రముఖుడు సుంకు రంగయ్య ఆధీనంలో ఈ కోట ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. అన్నింటికీ మించి నాగఫణి శర్మ తండ్రి నాగభూషణశర్మ 'రాయలసీమ రత్నం'గా పేరు గాంచారు. ఆయన గొప్ప పండిత దిగ్గజం. ఎందరినో హరికథకులుగా తీర్చిదిద్దారు. 64 కళల్లో కూడా ప్రవేశం ఉన్న వ్యక్తి.

కేశవరాయునిపేట

కేశవరాయునిపేట యాడికి మండలంలో ఉంది. కేశవనాయుడు అనే పెద్ద భూస్వామి ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. ఆయన పేరు మీదుగానే కేశవరాయునిపేట ఏర్పాటైంది. నాటి ప్రజలకు వేట ప్రధాన వృత్తిగా ఉండేది. ప్రస్తుతం వీరంతా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సుంకులమ్మ వీరి గ్రామ దేవత ప్రతి ఏటా మార్చి నెలలో సుంకులమ్మ జాతరను జరుపుతారు. ఇదే పేరుతో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలో మరో గ్రామం ఉంది.

దొరిగల్లు

దొరిగల్లు గ్రామం అనంతపురం జిల్లా ముడిగుబ్బ మండలంలో ఉంది. ఈ ప్రాంతాన్ని తొలుత రాజులు, ఆ తరువాత ఆంగ్లేయులు, అనంతరం దొరలు పరిపాలించేవారు. దీంతో ఈ గ్రామానికి దొరలు ఇల్లు అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో దొరిగల్లుగా స్థిరపడిరది.

గ్రామ జనాభా 5856. దొరిగల్లు బి.సి కాలనీ తండా, దొరిగల్లు తండా అని కూడా వ్యవహారంలో పిలుస్తారు. అనంతపురం, కడప జిల్లాల సరిహద్దుల్లో ఈ గ్రామం ఉంది.

ములకల చెరువు

ములకల చెరువు ఓ మండల కేంద్రం. ఈ గ్రామం తొలి పేరు నాడమరెడ్డిగారిపల్లి. 1927 ప్రాంతంలో అక్కడి శాఖా తపాలా కార్యాలయానికి తనిఖీకు వచ్చే అధికారి ఒకరు అనే మాటే గ్రామమైంది. ఎవరో ఆయన్ని అడిగారట ఎక్కడికి వెళ్తున్నారని అందుకు ఆయన ఈ ప్రాంతంలో చెరువు ఉంది. ఆ చెరువు ఓ విధమైన నారతో, నాచుతో మొలకల తరహాలో ఉంటుంది. ఆ మొలకల చెరువు దాటిన వెంబడే ఉండేదే పోస్టాఫీసు. అక్కడికి వెళ్తున్నానీ సుదీర్ఘమైన జవాబు ఇచ్చాడు ఆ అధికారి. నాటి నుంచి వచ్చిన మొలకల చెరువు అనే ప్రయోగమే ఆ ఊరికి గ్రామ నామంగా సిద్ధించింది. ఈ విషయాన్ని ఈ గ్రామానికి చెందిన అర్చకులు బీచుగానిపల్లి రవికుమార్‌శాస్త్రి పేర్కొన్నారు. ఈ గ్రామానికి చెందిన ఉమ్మడి వెంకటరమణ మంచి పద్య రచయిత, ఉపాధ్యాయుడు కూడా.

సోంపాళ్యం

సోంపాళ్యం ములకలచెరువు మండలంలోని అతి ముఖ్య దర్శనీయ స్థలం. ఇక్కడ గల చెన్నకేశవస్వామి ఆలయం రాష్ట్రంలోని అత్యుత్తమ దేవాలయాల్లో ఒకటి. సోంపాళ్యం గ్రామం పేరు వెనుకగల చరిత్రను పరిశీలిస్తే సోంపాళ్యంలో పాళెగాళ్లు ఉండేవారు. వారిని దొరవారు అని పిలిచేవారు. వారిలో సోమరాజు అనే పాళెగాని పేరుతో

ఆ గ్రామానికి సోంపాళ్యం అనే పేరు వచ్చినట్లు స్థానికుల మనో గతం. ఇక్కడ చెన్నకేశవస్వామి ఆలయానికి ప్రాచీనమైన చరిత్ర ఉంది. శ్రీ మహా విష్ణువు లక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన దివ్య క్షేత్రం. క్రీ.శ16వ శతాబ్దంలో విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం చక్కని శిలాకృతులతో విరాజిల్లుతోంది. ఆలయానికి ఎదురుగా ఉన్న ఏకశిలా స్థంభం ఆకర్షణీయంగా ఉంటుంది. గ్రామ జనాభా 7 వేలు.

జలదుర్గం

జలదుర్గం ప్యాపిలి మండలంలో ఉంది. కొండల నడుమ కొలనొకటుంది, కోలను లోపల వెలిసెను బంగారు దుర్గమ్మ అని గురజాడ పూర్ణమ్మ సుందరంగా దర్శనమిస్తుంది. ఈ గ్రామానికి గల పేరు నేపథ్యాన్ని పరిశీలిస్తే గతంలో హనుమంతరాయుడు అనే రాజు జలదుర్గం గ్రామాన్ని పాలించేవాడు. దుర్గం అంటే కోట. అలాగే నీటితో పారే వంకలు, వాగులు ఉన్నందున జల అని, నాడు కోట వెలసి ఉన్నందున జలదుర్గం అనే పేరు మీదుగానే హనుమంతుని ఆలయాన్ని నిర్మించారు. తదనంతర కాలంలో జలదుర్గం పరిపాలనంతా ప్యాపిలి మండలంలో జరిగింది. గ్రామ జనాభా 10 వేలు. నాటి రాజులు కాలంలో ఊరికి నడిబొడ్డున నిర్మించిన శివాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామానికి చెందిన కోలంట్ల రామకృష్ణ ప్రముఖ రచయితగా ఉన్నారు.

తపోవనం

తపోవనం ప్రాంతం అనంతపురం గ్రామీణ మండలంలోని నారాయణపురం పంచాయితీ పరిధిలో ఉంది. ప్రఖ్యాత ధార్మిక ప్రబోధనుడు తపోవన మహారాజ్ (1889-1957) దేశమంతటా

పాదయాత్ర చేస్తూ ఈ ప్రదేశాన్ని సందర్శించారు. పచ్చని చెట్లు, ప్రశాంత వాతావరణం, పరిమిత జనసంచారం అతన్ని ముగ్ధుడ్ని చేశాయి. ఇదే అనువైన స్థలంగా భావించి తపస్సు చేశారు. తరువాత విశ్వ విఖ్యాతి గాంచిన చిన్మయ మిషన్ సౌజన్యంతో ప్రజలు అతి తక్కువ ధరలో కాలనీ నిర్మించారు. దీంతో ఈ ప్రాంతానికి తపోవన్ మహారాజ్ పేరు గుర్తుండిపోయే విధంగా తపోవన్ అని పేరు పెట్టారు. ఈ విషయాన్ని స్థానిక ప్రముఖ కవి, గ్రంథ కర్త వెల్లాల ఉమామహేశ్వరావు ఈ రచయితకు తెలిపారు.

గుండుమల

గుండుమల మడకశిర మండలంలో ఉంది. చుట్టూ ఎత్తయిన కొండలు, అడవుల మధ్య నెలకొని ఉంది. గుండు ఆకారంలో కొండలు ఉన్నందున గుండుమల అనే పేరు వచ్చింది. జనాభా 3097. శాంతి భద్రతలకు పెట్టింది పేరు ఈ ఊరు.

గుండుగల్లు

గుండుగల్లు గంగవరం మండలంలో ఉంది. ఇక్కడ గుండ్రటి బలమైన రాళ్లతో కోటను, వలయాకారంలో బురుజులు నిర్మించినందున గుండుగల్లు అనే పేరు ఈ గ్రామానికి వచ్చింది. గల్లు అంటే రాళ్లు, కళే అనే శబ్దం నుంచి గల్లు వచ్చింది. ఇలా ఆ పేరు వచ్చిందని గ్రహించాలి. కాగా గుండుగల్లు సంస్థానంలోని ఆస్తులను చోరీ చేసేందుకు మరాఠీ దివిటీ దొంగలు కోటను చుట్టుముట్టారు. ఈ ముఠాను ప్రతిఘటించేందుకు స్థానిక మహిళలు ముందుకు వచ్చి గుండ్రటి రాళ్లతో దొంగలపై దాడి చేశారు. దీంతో వారంతా పలాయనం చిత్తగించారు. ఆ రాళ్లు

ఇప్పటికీ కనిపిస్తాయి. కోటలోని రామాలయంలో ఓ కోట శిలాశాసనం ఉంది. ఇందులో సుబేదారు బండి వెంకటరాముడు పలు నిర్మాణాలు గావించినట్టు పేర్కొని ఉంది. గ్రామ జనాభా 3112.

పూజగానిపల్లె

పుంగనూరు-మదనపల్లె జాతీయ రహదారికి 4కి.మీ దూరంలో ఉంది. నాటి రాజులచే నియమితులైన పాళెగాళ్లు ఈ ప్రాంతంలో పలు ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయాల్లోని పూజార్ల కోసం ఓ గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చారు. అదే పూజారులపల్లె. కాలగమనంలో పూజార్లు ఇక్కడ నుంచి వలసపోయారు. దీంతో మిగిలిన సామాజిక వర్గాల వారు ఇళ్లు కట్టుకొని ఉంటున్నారు. ఈ పూజార్లపల్లె జనవ్యవహారంలో పూజగానిపల్లెగా స్థిరపడిరది.

తెల్లనీళ్లపల్లె

ఈ పల్లె చౌడేపల్లి మండలంలో ఉంది. ఈ ప్రాంతంలోని నీళ్లు అత్యంత పలుచగా స్వచ్ఛంగా తెల్లగా ఉంటుంది. బాగా లోతులో ఉన్న బావిలో నుంచి బయటకు వచ్చే నీరు తెల్లగానే ఉంటుంది. అంచేత ఈ పల్లెకు తెల్లనీళ్లపల్లె అనే పేరు వచ్చినట్టు సీనియర్ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

రోటరీపురం

రోటరీపురం గ్రామం బుక్కరాయ సముద్రం మండలంలో ఉంది. దీని తొలి పేరు బోడిగాని దొడ్డి. ఈ పేరు బాగులేకపోవడంతో కాలక్రమంలో రోటరీపురంగా మారింది. అనంతపురం రోటరీ క్లబ్‌కు

బోడిగానిదొడ్డికి అనుసరించి కొంత భూమి ఉండేది. ఈ పల్లెలోని పేదలకు ఆ భూమిని ఇళ్ల స్థలాలుగా ఉదారంగా అందజేసింది. కృతజ్ఞతగా గ్రామీణులు బోడిగాని దొడ్డిగా ఉన్న తమ గ్రామాన్ని రోటరీపురంగా మార్పుచేశారు. రికార్డులలో అదే పేరును నమోదు చేసారు. జనాభా 2వేలు. శ్రీరామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జడ్పీ ఉన్నత పాఠశాల, 2 ప్రాథమిక పాఠశాలలు, సచివాలయం ఉన్నాయి. జొన్నరామయ్య కుమారులు లక్ష్మీ నారాయణ, సత్యన్నారాయణ స్థానికులు సహకారంతో 12దేవాలయాల సముదాయాన్ని నిర్మించారు. పెద్దమ్మ గుడి ఇక్కడి గ్రామ దేవత, గ్రామ జానాభా 2వేలు.

కాకి

పితృకార్యాలలో సమర్పించే పిండాలను పైలోకాలకు చేరవేయడం ద్వారా మానవులకు పితృ లోకానికి వారధిలా పని చేస్తుంది కాకి. దేవునికి తొలి అర్చన జరగ్గానే ధ్వజస్తంభం వద్ద అన్న ప్రసాదాన్ని వేస్తారు. వీటిని ఎక్కువగా కాకులే తింటాయి. ఒక కాకికి ఆహారం దొరికితే కావు కావు మని అరుస్తూ మిగిలిన కాకులను ఆహ్వానిస్తుంది. సామాజిక ధృక్పథానికి సంకేతంగా కాకినే ఉదహరిస్తారు.

కాకి పేరుతో ఓ గ్రామం అనంతపురం జిల్లా రోళ్ల మండలంలో ఉంది. ఇంతకీ ఈ పల్లె వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.... తొలుత ఈ పల్లెకు 'కాంచన కిరీటం' అని పేరు పెట్టారు. రత్నగిరి రాజులు తమ రాజ్యంలో గ్రామ పాలనకు ప్రాముఖ్యతనిచ్చేవారు. గ్రామ పాలకులకు కొంత భూమినిచ్చేవారు. ఆ భూమిపై వచ్చే ఆదాయంతో కొంత సైన్యాన్ని ఏర్పాటు చేసి వారికి శిక్షణ, పోషణ కల్పించేవారు. యుద్ధ సమయాల్లో రాజులకు బలంగా ఈ సైన్యాన్ని పంపేవారు. ఈ సైనికుల ప్రతిభను

పరీక్షించేందుకు ఆయా సందర్భాల్లో పోటీలు జరిపేవారు. ఈ పోటీల్లో ఈ గ్రామ సైనికులే అత్యంత ప్రతిభను కనబరచినందుకు 'కాంచన కిరీటం' అనే బిరుదును ప్రధానం చేశారు. దీంతో ఈ పల్లెకు కాంచన కిరీటం అని పేరు పెట్టారు. దీన్ని పలకలేక సంక్షిప్తంగా 'కాకి' అని పిలవసాగారు. ఆ పేరే స్థిరపడింది. ఈ పల్లె జనాభా 2వేలు. ఇక్కడి శ్రీమల్లికార్జునస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పురాతన రాతి కోట, మహాద్వారం ఉన్నాయి.

గిరినాయకుని పాళ్యం

ఇది రోళ్ల మండలంలోని ఓ చిన్న గ్రామం. రత్నగిరి కూతవేటు దూరంలోని ఉంది. చారిత్రక రత్నగిరి కూతవేటు దూరంలోని ఉంది. చారిత్రక రత్నగిరి చుట్టూ పక్కల ఏడుకొండలున్నాయి. ఈ కొండలన్నింటిపై రాతి కోటలున్నాయి. ఈ ఏడు కోటలకు ఒక్కొక్క నాయకుణ్ణి నియమించారు. అలా ఈ రత్నగిరి పాలకులకు ఏడు కొండల నాయకుడనే పేరుండేది. ఈ గిరి నాయకులందరికీ ప్రధాన నాయకుడుగా ఉన్న ఈ ఊరికి గిరినాయకుని పాళ్యంగా పేరొచ్చింది. ఈ ప్రాంతంలో పాళెగాళ్ల ప్రభావం కూడా ఉండడంతో పాళ్యం అని ఉత్తర పదంగా చేరింది. ఈ పల్లె జనాభా 500 మాత్రమే.

రత్నగిరి

రత్నగిరి కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని రాళ్ల మడకశిర ప్రాంతంలో గొప్ప చారిత్రక ప్రదేశం. ఇది రత్నగిరిని పశ్చిమ చాళుక్యులు, నాళంబ పల్లవులు, హోయసలు, చోళులు, పాలెగాండ్లు పాలించారు. క్రీ.శ13వ శతాబ్దంలో నళ ప్రభువులు రత్నగిరిని రాజధానిగా చేసుకొని

అనంతపురం జిల్లా భూభాగాన్ని పరిపాలించినట్టు చరిత్ర చెబుతోంది. హోయసల సామంతరాజైన మూడవ వీర బల్లాలుడు క్రీ.శ 12వ శతాబ్దంలో పంచగిరులను పటిష్టమైన దుర్గాలుగా పునర్నిర్మించారు. అందులో రత్నగిరి ఒకటి. ఈ రత్నగిరి ఏకశిల కొండ. దీన్ని తవ్వితే రత్నాలు బయటపడ్డాయి. దీంతో దీనికి రత్నగిరి అనే పేరు వచ్చింది. ఈ విషయాన్ని చారిత్రక అధ్యయన ఎస్.పరమేశు తెలిపారు. రత్నగిరి సంస్థానాన్ని తొలుత తిమ్మప్ప నాయక పాలించారు. 1799లో మైసూరు పాలకుడైన టిప్పు సుల్తాను కర్నాటకలోని తమకూరు జిల్లా శిరమధుగిరి, రత్నగిరి కోటలను ఒకేసారి ఆక్రమించారు. ఆ తరువాత రత్నగిరికి ముస్తాఫాబాదు అని పేరు పెట్టారు. ఆ పిమ్మట మరల రత్నగిరిగా మార్పుచెందింది. ఇక్కడి గ్రామ దేవత కొల్లాపురి మహాలక్ష్మి. గ్రామ జానాభా 3,500.

గలగల

గలగల అనే అందమైన గ్రామం అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలంలో ఉంది. గాజుల గలగలలు, సెలయేటి గలగలలు అనే చరణాలతో గల పాటలు ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే. మల్లె పువ్వు సిన్మాలో ''గాజుల గలగల వలపు వీణ'' వచ్చిన జానపద గీతం ఈ సందర్భంగా గుర్తుకు వస్తాయి.

ఈ గ్రామానికి ''గలగల'' అనే పేరు రావడానికి గల కారణం ఏమిటంటే గతంలో ఇక్కడ గాజుల వ్యాపారాల కుటుంబాలు చాలా ఎక్కువగా ఉండేవి. గాజుల తయారీ యూనిట్లు కూడా ఉండేవి. ప్రస్తుతం ఇక్కడ గాజులమ్మే వ్యాపారుల కుటుంబాలు నాలుగు ఉన్నాయి. గాజులు చేసే శబ్దం 'గలగలలే' కదా అంచేత 'గలగల'

అనే పేరును తమ ఊరికి పెట్టుకున్నారు. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ గ్రామం నెలకొన్న వన్నూరు స్వామి ఉత్సవాలు (పీర్ల పండుగ) ఆగష్టు, సెప్టెంబరు నెలల్లో జరుగుతుంటాయి. హిందూ, ముస్లింలు ఇందులో పాల్గొంటారు. ఇక్కడ సచివాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, 3 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వేరుశనగ, ఉల్లి, రాగులు పండిస్తుంటారు.

పెన్న అహోబిలం

పెన్న అహోబిలం ఉరవకొండ మండలంలో ఉంది. పెన్నా నదీ తీరాన వెలసి ఉంది. ఉరవకొండకు 12కి.మీ దూరంలో సమీప పట్టణమైన గుంతకల్లుకు 31 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ గల లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఎంతో ప్రాచీనమైంది. స్వామి వారి పాదముద్ర వద్ద ఓ బిలం (రంధ్ర) ఉంది. ఆ దేవునికి అభిషేకం చేసిన నీరు ఈ బిలం ద్వారా వెళ్లి పెన్నా నదిలో కలుస్తుంది. అంచేత దీనికి పెన్న అహోబిలం అనే పేరు వచ్చింది. క్రీ.శ 16వ శతాబ్దంలో విజయనగర చక్రవర్తి సదాశివరాయలు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ క్షేత్ర నేపథ్యంలోనే ఇక్కడ వెలసిన గ్రామానికి పెన్న అహోబిలం అనే పేరు వచ్చింది. స్థానిక వంతెన సమీపంలో ప్రతి ఏటా మాఘ మాసంలో గంగమ్మ జాతర జరుపుతారు. గ్రామ జనాభా 500.

మొహమ్మద్‌బాద్

మొహమ్మద్‌బాద్ అమడుగురు మండలంలోని ఓ గ్రామం. ఈ గ్రామం తొలి పేరు పిచ్చలపట్నం కాలగమనంలో మొహమ్మద్‌బాద్‌గా మారింది. ముస్లింలు ప్రాబల్యం వల్ల ఈ గ్రామానికి ఈ పేరు వచ్చినట్టు

స్పష్టమైంది. షేక్ మహమ్మద్‌ఖాజీ అనే వ్యక్తి పేరుతో ఈ గ్రామానికి మొహమ్మద్ బాద్ అని ఆ రోజుల్లో నామకరణం చేశారు.

సంగీతంపల్లి

సంగీతంపల్లి అమడుగురు మండలం మొహమ్మదాబాద్ పంచాయితీ పరిధిలో పల్లె ఇది. కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. ఈ పల్లె ఏర్పాటు సమయంలో సంగీత ప్రియులైన పెద్దలు సంగీతంపల్లి అని నామకరణం చేశారు. తమ గ్రామానికి అందమైన పేరు పెట్టినందుకు ప్రజలు మురిసి పోతుంటారు.

బూదగవి

బూదగవి ఉరవకొండ మండలంలో ఉంది. తథాగతుడైన బుద్ధుడు ధర్మ ప్రబోధం చేస్తూ ఈ ప్రాంతాన్ని సందర్శించాడు. ఓ కొండ గుహలో విశ్రాంతి తీసుకున్నట్టు పేర్కొంటారు. గుహ పర్యాయ పదం గవి. ఇలా బూదగవి అని పేరు వచ్చింది. జనవ్యవహారంలో బూదగవిగా మారింది. కాగా బౌద్ధమతం క్షీణించిన తరువాత సనాతన ధర్మం వర్ధిల్లింది. ఈ క్రమంలోనే క్రీ.శ 13వ శతాబ్దంలో చోళలు నిర్మించిన సూర్య దేవాలయం ఇక్కడ ఉంది. ఎత్తయిన కొండలు , చెట్లు, నడుమ ఈ క్షేత్రం ఉంది.

నీలకంఠాపురం

నీలకంఠాపురం అనంతపురం మండల కేంద్రంలో ఓ గ్రామం. ఈ గ్రామం తొలిపేరు పూతగుండు. అయితే పూర్తిగా శిథిలం కావడంతో గ్రామీణులు మరికాస్త దూరంలో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. క్రీ.శ 12వ శతాబ్దం క్రితం ఈ పల్లె ఏర్పాటైంది. ఇక్కడి

మహాశివుణ్ణి భక్తులు నీలకంఠేశ్వరునిగా కొలవడం వల్ల ఈ ఊరికి నీలకంఠాపురం అని పేరు వచ్చింది. భక్త కన్నప్ప స్ఫూర్తితోనే స్వామికి మాంసాన్ని నివేదించే సంప్రదాయం కొనసాగుతోంది. రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి వంశీయులు నీలకంఠాపురం ఆలయ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఓరుగల్లు తరహాలో ఈ ఆలయాన్ని 167 స్తంభాలతో పునర్నిర్మించారు. మరో విశేషమేమిటంటే గ్రామంలోని పొలాల్లో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో క్రీ.శ 8వ శతాబ్దం నాటి మహిషాసురమర్దిని విగ్రహం, నల్ల రాతి విగ్రహం 12వ శతాబ్దం నాటి శివలింగం కల్యాణి విగ్రహం లభించాయి. క్రీ.పూ 3700 నాటి అతి పెద్ద బండరాయి కూడా ఇక్కడ లభించింది.

జక్క సముద్రం

జక్క సముద్రం గోరంట్ల మండలంలో ఉంది. అనంతపురం నుంచి 116 కి.మీ దూరంలో ఉంది. వ్యక్తి నామ ధేయంతో ఇది ఏర్పడిరది. జక్కయ్య అనే వ్యక్తి పేరు మీదుగా వచ్చిందని స్థానికుల కథనం. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో చెరువులను సముద్రాలుగా వ్యవహరిస్తుంటారు. ఈ పల్లె జనాభా 800 వరకూ ఉంది.

నేమకల్లు

నేమకల్లు బొమ్మనహళ్లి మండలంలో ఉంది. ఈ గ్రామ సరిహద్దుల్లో అయిదు కొండలు (రాక్షస గుళ్లు) ఉన్నాయి. ఆదిమానవులకు ఆవాసాలుగా ఉండేవి. ఇందులో రెండు నిలువు గళ్లు అకర్షణీయంగా ఉంటాయి. నిలువు గల్లు అని స్థానికంగా పిలుస్తుంటారు. జన వ్యవహారంలో నేమగల్లుగా మారింది. ఇదే పేరుతో గ్రామం ఏర్పడిరది.

ఇక్కడ వ్యాస రాయలు ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది.

రోళ్ల

రోళ్ల అనంతపురం జిల్లాలోని ఓ మండల కేంద్రం. ఆంగ్లేయ అధికారులు ఈ ప్రాంతానికి పర్యటనకు వచ్చినపుడు ఓ బంగళాలో విడిది చేశారు. అయితే అప్పట్లో ఈ గ్రామం రెళ్ళగా అపరిశుభ్రంగా ఉందని పెదవి విరిచే వారని పేర్కొంటారు. రెళ్ల పదమే జనవ్యవహారంలో రోళ్లగా మారిందని స్థానిక ఉపాధ్యాయుడు ఆర్.సి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇక్కడి శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని వెయ్యేళ్ల క్రితం నిర్మించారు. స్థానికంగా ఉన్న నరసింహస్వామి దేవాలయం కూడా ప్రసిద్ధి చెందింది. గ్రామ జనాభా 5 వేల మంది.

కొడిగనహళ్లి

కొడిగెనహళ్లి కన్నడ భాషా ప్రభావంతో ఏర్పడిన గ్రామం ఇది. ఇది ఓ రకమైన జనాభు పంటిది. హళ్లి అంటే పల్లె అని అర్థం. ఈ గ్రామం అనంతపురం జిల్లా-లోని పరిగి మండలంలో ఉంది. తెలుగు, కన్నడ భాషలు మాట్లాడుతుంటారు.

రాకెట్ల

రాకెట్ల ఉరవకొండ మండలంలోని ఓ పల్లె. ప్రముఖ భాషా శాస్త్రవేత్త , తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి ఆచార్య తూమాటి దొణప్ప జన్మస్థలం ఇది. రాకెట్ల తొలిపేరు రాకట్ల. 1930 ప్రాంతంలోని దస్తావేజుల్లో రాకెట్ల (ఊరు వాకిలి) అని రాసి ఉన్నట్లు

రెవెన్యూ వర్గాలు ధృవీకరించాయి. అప్పట్లో గ్రామం వాకిలి తరహాలో ఉండేది. గ్రామంలో ప్రవేశించేందుకు , బయటకు వెళ్లేందుకు ఒకే మార్గం ఉండేది. పెన్నానదీ పరీవాహక ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. ఇక్కడి గ్రామ దేవత సుంకలమ్మ తిరునాళ్ల సందర్భంగా రథయాత్ర జరుగుతుంది. చెన్నకేశవస్వామి, పోతప్పస్వామి , రామలింగేశ్వర, భోగేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. గ్రామ జనాభా 4 వేలు.

చందన

చందన ఎంతో అందమైన ఊరి పేరు. ఈ గ్రామం అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఉంది. ఈ గ్రామం పేరు వెనుక గల నేపథ్యాన్ని పరిశీలిస్తే ఇక్కడి కొండపై ఓ శివాలయం ఉంది. ఈ శివాలయం చెంతనే గుహ నెలకొని ఉంది. ఈ గుహలో ఎల్లప్పుడూ నీళ్లుంటాయి. ఈ నీళ్లు గుత్తి కోట వరకు 3 సొరంగ మార్గాలలో వెళ్తుంటాయని స్థానికుల విశ్వాసం. ఈ గుహ నుంచి వెళ్ళే నీటిని ధ్వన (చిన్న శబ్దం) అంటారు. ఈ చిన్న ధ్వన శబ్దం జన వ్యవహారంలో 'చిన్న దోనగా', చివరకు చందనగా మారిందని స్థానిక విద్యాశాఖ ఉద్యోగి విశ్వనాథం వివరించారు. ఈ పల్లెలో శివాలయం, ఆంజనేయ, చౌడమ్మ, గంగమ్మ, సుంకలమ్మ ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. ఈ పల్లెకు సమీపంలో డాలమైట్ రాళ్ల గనులున్నాయి. ■

పరిశీలించిన గ్రంథాలు

కైఫియత్తులు	: కల్నల్ మెంకజీ
కైఫియత్ కతలు	: విద్వాన్ కట్టా నరసింహులు
పరిశోధన పద్ధతులు	: ఆచార్య గంధం అప్పారావు
తెలుగులో కొత్త వెలుగులు	: ఆచార్య తూమాటి దొణప్ప
తెలుగు మాండలిక శబ్ద కోశం	: ఆచార్య తూమాటి దొణప్ప
ఒక ఊరి కథ	: ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
నామ విజ్ఞానం	: ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
అమరావతి నేడు - నాడు - రేపు	: దాసరి ఆళ్వార స్వామి
తెలుగు నాట ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు	: డా॥ వీపూరి సుదర్శన్
భారత ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు	: గాజుల సత్యన్నారాయణ

రచయిత పరిచయం



వాండ్రంగి కొండలరావు

విద్యార్హత : ఎం.ఏ, తెలుగు, బి.యిడి .
తల్లిదండ్రులు : రాధాకాంతమ్మ, చినగురుమూర్తి
సతీమణి : రమాదేవి
వృత్తి : విశ్రాంత గ్రేడ్ 1 తెలుగు పండిట్
ప్రవృత్తి : నామవిజ్ఞానవేత్త, రచయిత, పుస్తక రచయిత, స్వతంత్ర పాత్రికేయుడు (జర్నలిస్టు)
పుట్టిన ఊరు : వాండ్రంగి
శాశ్వత నివాసం : పొందూరు (శ్రీకాకుళం జిల్లా)

రచనలు :

ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్), 2017 ఎ.పి భాషా సాంస్కృతిక శాఖ వారి ఆర్థిక సౌజన్యంతో, వ్యక్తినామ విజ్ఞానం (2019) పేపర్ ప్రజంటేషన్, మా దేవుడు మీరే మాష్టారు (2016) పొందూరు మరో పోరుబందర్ (2011), గురమ్మ పేరంటాలు (2010), సాయి శరణు (2008).

సాహిత్య వ్యాసాలు :

సాక్షి దినపత్రిక, తెలుగు వెలుగు మాస పత్రిక, ఆంధ్రభూమి దిన పత్రిక, విశాఖ సంస్కృతి మాసపత్రిక, భక్తి సమాచారం మాసపత్రిక, బాలబాట మాసపత్రిక లలో 250కి పైగా వ్యాసాలు ప్రచురణ.

ఆకాశవాణి (ఎ.ఐ.ఆర్.)లో ప్రసంగాలు :

ఆకాశవాణి విశాఖపట్నం, హైదరాబాదు, ఆదిలాబాద్ కేంద్రాల్లో 15కి పైగా సాహిత్య, సాహిత్యేతర ప్రసంగాలు చేసారు.

ఇంటర్వ్యూలు :

నాటి సినీదిగ్గజం నట అక్కినేని నాగేశ్వరరావుతో ఆడియో ఇంటర్వ్యూ, గాంధీ మనుమరాలు తారాభట్టా ఛార్జి, ప్రముఖ రంగస్థల నటులు విజయరాజు, ఎ.వెంకటేశ్వరరావు వంటి వారితో ఇంటర్వ్యూలు ఇవన్నీ పత్రికలో ప్రచురితమయ్యాయి.

బిరుదులు :

2016 డిశంబరు కాశీబుగ్గ జన జాగృతి సాహితీ సమాఖ్యచే ''వ్యాస బ్రహ్మ'' బిరుదు ప్రదానం. భారతీ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ వారిచే ''సాహితీ రత్నం'' బిరుదు ప్రదానం.


పురస్కారాలు :

2018 ఉగాది సంవత్సరం జిల్లా సాంస్కృతిక మండలిచే సన్మానం, 2016 నవంబరు 16న డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) వారిచే అవార్డు, జాతీయ తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తేదీ 21.06.2015న అమరావతి పురస్కారం. తేదీ 19.07.2015న విజయనగరం జెడ్పీహాలులో తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోదావరి మహా పుష్కర పురస్కారం.


2016 తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెడ్పీహాలులో తెలుగు సాహితీ పురస్కారం. 2016 లో అమరావతి విశ్వసాహితీ వారిచే ఉగాది పురస్కారం.మాతృభాషా పరిరక్షణకు విశేష ప్రచారం చేసినందుకు 2006లో అప్పటి జిల్లా కలెక్టరుచే సత్కారం.1991 మార్చి 20న ఈనాడు ఛైర్మన్ రామోజీరావుచే పురస్కార ప్రదానం (విశాఖపట్నం).2015 మార్చి 30న తెలుగు రచయితల వేదిక పక్షాన సన్మానం ప్రెస్ క్లబ్, శ్రీకాకుళం.2019 సెప్టెంబరు ఎ.పి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయనగరంలో గురజాడ జయంతి సందర్భంగా పురస్కారం. 2019 అక్టోబరులో ఎ.పి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయనగరం ఉత్సవాల్లో స్వీయ కవితా పఠనంలో ప్రకంసాపత్రం, సన్మానం. ■


















గ్రామనామాలు :: వాండ్రంగి కొండలరావు













ISBN 978-93-5578-788-0